వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 19 సంచిక : 8 హైదరాబాద్ 237 ఆగస్ట్ 2021 పేజీలు : 68 రు. 25

- ఫాదర్ స్టాన్ స్వామి ఉజ్వల వ్యక్తిత్వం
- మాటల్లోనే దళితుల సాధికారత
- ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగుల ఆందోళన
- పెగాసస్, ఆర్సెనాల్ తర్వాత భీమా కోరేగాం?
- ఉపశమనం లేని ఉద్దీపన ప్యాకేజీలు
- ప్రతిపక్షాల ఐక్యతా ప్రయత్నాలు ఎందుకోసం?
- కొలంబియాలో ప్రజాందోళనలు

237 ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాస పత్రిక

ఆగస్టు 2021
సంపుటి : 19
సంచిక : 8

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫోన్ : 7330795849
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : నవ్య ప్రింటర్స్
అంబర్‌పేట్, హైదరాబాద్.

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై **'VEEKSHANAM'** అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ **– 013911011002175** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **UBIN0801399** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ వీక్షణంను నిలబెట్టుకోవాలనే తపనతో ఆర్థిక సహాయం అందించిన నరహరి, హైదరాబాద్ - రు. 4,000; మాడభూషి శ్రీధర్, హైదరాబాద్ - రు. 10,000; శ్రేయోభిలాషి, హైదరాబాద్ - రు. 20,000; డా. ఎస్. రామకృష్ణ, విజయవాడ - రు. 25,000; బి. రంజిత్, హైదరాబాద్ - రు. 20,000; డా. వసుంధర, విజయవాడ - రు. 25,000; చిగురుపాటి ఆకాశ్-కీర్తి, ఖమ్మం - రు. 8,500; డా. మలయశ్రీ, కరీంనగర్ - 250. మిత్రులకు కృతజ్ఞతలు - సం.

వీక్షణంలో వ్యాసాలు, విశ్లేషణలు బాగుంటున్నాయి గాని, యువకులకు పత్రిక ఇచ్చి చదివించడానికి ప్రయత్నించినప్పుడు ఒక సమస్య ఎదుర్కొంటున్నాను. వ్యాసాలు చాల పెద్దగా ఉన్నాయని, విషయంలో ఆసక్తి ఉన్నా అంత పెద్ద వ్యాసాలు చదివే ఓపిక లేదని అంటున్నారు. అదే విషయాన్ని రెండు పేజీల్లో, తప్పకపోతే మూడు పేజీల్లో వివరించమని వ్యాస రచయితలను అడిగితే బాగుంటుంది. లేదా ఒకే విషయాన్ని రెండు మూడు భాగాలుగా విభజించే అవకాశం ఉంటే అలాగైనా ఒక్కో భాగం ఒకటి రెండు పేజీల్లో ఉంటే సరిపోతుంది. అలాగే, తెలుగు సమాజంలో ప్రజల కోసం పనిచేసి అమరులైన కవులు, రచయితలు, మేధావులు, కార్యకర్తల జీవిత విశేషాలు ప్రతి సంచికలోనూ ఒకరి గురించి ఒక పేజీ రాస్తే పాఠకులకు స్ఫూర్తి దాయకంగా ఉంటుంది.

- యాది రెడ్డి
మోత్కూరు

జూన్ - జులై 2021 వీక్షణంలోని అన్ని వ్యాసాలు బాగున్నాయి. ఎన్. వేణుగోపాల్ గారి వ్యాసం 'ప్రజా సంఘాల నిషేధ లక్ష్యం స్మశాన శాంతి స్థాపన' వ్యాసం మాకు ఎన్నో తెలియని విషయాలను తెలియజేసింది. రాజ్యాంగాన్ని అమలుజేస్తామని ప్రమాణం చేసి గద్దెనెక్కిన కెసిఆర్ ప్రభుత్వం, ఆ రాజ్యాంగానికే తూట్లు పొడుస్తూ 16 ప్రజా సంఘాలపై అక్రమంగా నిషేధం విధించటం కెసిఆర్ మూర్ఖత్వానికి పరాకాష్టగా భావించాలి. ప్రభుత్వం చెప్పిన 5 రకాల హింసా చర్యల గురించి, అవి ఏ విధంగా చట్టానికి వ్యతిరేకమో వేణుగోపాల్ గారు ఒక్కొక్కటి మాకు అర్థమయ్యేలా వివరించి చెప్పటం బావుంది. నిషేధానికి వ్యతిరేకంగా ప్రజల్లో పెల్లుబికిన ఆగ్రహానికి తలవంచి ఇప్పటికైనా నిషేధాన్ని ఎత్తివేయడం ముదావహం.

ఇకపోతే 'ఆంధ్రప్రదేశ్‌లో ఆస్తి పన్ను పెంపు భారం' వ్యాసంలో రచయిత చెప్పినట్లు రాజ్యాంగబద్ధంగా ఎన్నుకోబడిన ఈ ప్రభుత్వాలు ప్రజలను కేవలం బిచ్చగాళ్లుగా, వస్తువులుగా మాత్రమే చూస్తున్నది అనేది నిజం. మేం అధికారంలో ఉన్నాం కాబట్టి మేం ఏం చేసినా చెల్లుతుందనేదానికి నిదర్శనం ఆంధ్రప్రదేశ్‌లో చెత్త సేకరణకు ప్రజల నుండి డబ్బు వసూలు చేయడం. ఒకపక్క కేంద్ర ప్రభుత్వం, మరోప్రక్క రాష్ట్ర ప్రభుత్వం ప్రజల మీద పన్నుల మీద పన్నులు విధిస్తూ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

జాతీయ మానవ హక్కుల సంఘం, మహిళా హక్కుల కమిషన్, మైనారిటీల హక్కుల కమిషన్, జాతీయ ఎస్‌సి, ఎస్‌టి హక్కుల కమిషన్ ఇటువంటి వాచ్ డాగ్స్ ఉన్నట్టు ఈ దేశంలో 50 శాతం ప్రజలకు, ముఖ్యంగా పల్లెటూరి ప్రజలకు తెలియదని అనుకుంటున్నాను. పౌరుల ప్రాథమిక హక్కుల పరిరక్షణా సంస్థల గురించి ఈ ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పించడం మాట అటుంచి, ప్రజలకు ఉపయోగపడే ఈ సంస్థలను నిష్క్రియాపరం చేస్తూ, అవి తమ చెప్పు చేతల్లో ఉండాలని పాలకులు కోరుకుంటున్నారు. ఛత్తిస్‌గఢ్‌లోని సిల్గేర్‌లో తమపై పోలీసులు కాల్పులు జరిపినా, ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు తలపెట్టినా, 6 వారాలకు పైగా సిఆర్‌పి క్యాంపుకు వ్యతిరేకంగా వేలాది మంది ఆదివాసీలు జరుపుతున్న పోరాటానికి హాట్సాఫ్ తెలియజేస్తున్నాను. ఇది ఒక్క ఆదివాసీల సమస్యే కాదు, దేశ ప్రజలందరి సమస్య. మనమందరం కూడా వారికి సంఘీభావం తెలుపుదాం.

2021 మార్చ్‌లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి తోమర్ లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా, దేశంలో వ్యవసాయ కుటుంబాల తాజా ఆర్థిక స్థితిగతులపై ప్రభుత్వానికి అంచనా లేదని చెప్పడం ప్రభుత్వానికి సిగ్గుచేటు. కేంద్ర ప్రభుత్వానికి రైతుల మీద ఎంత శ్రద్ధ ఉందో దీన్నిబట్టి బాగా అర్థం అవుతోంది. రైతుల ఆర్థిక స్థితిగతులపై అంచనా లేనపుడు రైతుల సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తుంది ఈ ప్రభుత్వం? రైతుల ఆదాయాలు ఎందుకు పెరగడం లేదు అనే వ్యాసంలో రచయితలు చాలా కూలంకుషంగా రైతు సమస్యలను చర్చించారు. ఇటువంటి వ్యాసాలను అయినా చదివి ఈ ప్రభుత్వాలు పాఠాలు నేర్చుకుంటాయని ఆశిస్తాను. రచయితలకు, వీక్షణం సంపాదక వర్గానికి నా ధన్యవాదాలు.

- మద్రి సూర్యనారాయణ
నరసింహనగర్, విశాఖపట్నం

వీక్షణం జూలై 2021 సంచికలో కొండూరి వీరయ్య గారు రాసిన 'బెంగాల్‌లో వామపక్ష పరాజయాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?' అనే ఆసక్తికరమైన శీర్షికతో వచ్చిన వ్యాసాన్ని శ్రద్ధగా చదివి ఎంతో నిరాశకు గురయ్యాను. ఆ శీర్షికలో ఉన్న విషయం వ్యాసంలో రాలేదనేది ఒక సంగతి అయితే, వ్యాసంలో ఎన్నో అవాస్తవాలు, చరిత్ర వక్రీకరణలు, తప్పుడు సూత్రీకరణలు ఉన్నాయి. ఆ వ్యాసం మీద మళ్లీ ఒక వ్యాసమే రాయవలసినన్ని తప్పులతో ఆ వ్యాసం నిండి ఉంది. అసలు మొట్టమొదటనే, "విచ్ఛిన్నకర శక్తులు... బెంగాల్ గత మూడున్నర దశాబ్దాలుగా సాధించిన రాజకీయ సుస్థిరతనూ, ప్రజాతంత్ర చైతన్యాన్నీ, ఆర్థిక ఫలాలనూ ధ్వంసం చేస్తున్నాయి" అనే అబద్ధపు కుప్పతో ప్రారంభించారు. వీరయ్యగారు చెపుతున్న విచ్ఛిన్నకర శక్తుల సంగతి అలా ఉంచి, గత మూడున్నర దశాబ్దాలలో సిపిఎం పాలన సాధించిన రాజకీయ సుస్థిరత అంటే ప్రతి గ్రామంలోనూ పార్టీ నాయకత్వపు మాఫియా శక్తులను తయారు చేయడమని అర్థం చేసుకోవాలా? సాధించిన ప్రజాతంత్ర చైతన్యం అంటే అన్ని పార్టీలూ సమానంగా జరుపుతున్న హింసా రాజకీయాలు, వేలాది మంది అమాయక ప్రజలు బలి అయిపోవడమని అర్థం చేసుకోవాలా? సాధించిన ఆర్థిక ఫలాలు అంటే, మూడున్నర దశాబ్దాల పాలన తర్వాత కూడ మనుషులు లాగే రిక్షాల వంటి అమానుష పద్ధతిని రద్దు చేయలేకపోవడమా? రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర జాబితాలో ఉండి, పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం ఉన్న విద్య, వైద్యం, రవాణా వంటి రంగాలలో కూడ ఇవాళ్టికీ బెంగాల్‌లో కనబడుతున్న దారుణ స్థితిని ఆర్థిక ఫలాలు అంటారా? టాటాల పెట్టుబడుల కోసం సాగిలపడి ప్రజల మీద మారణకాండ సాగించడం రాజకీయ సుస్థిరతా, ప్రజాతంత్ర చైతన్యమా, ఆర్థిక ఫలాలా? లేక పార్టీ నాయకుల ఆర్థిక ఫలాలా? ముందే చెప్పినట్టు వీరయ్యగారు

(మిగతా 8వ పేజీలో)

కోవిడ్ వల్ల పత్రికలలో సాధారణ వార్తలు రావడం లేదు గనుక అసహజ మరణాల సూచి సమగ్రంగా తయారు చేయడం సాధ్యం కావడం లేదు. కొద్దికాలంగా అసహజ మరణాల సూచి వేయలేకపోతున్నందుకు చింతిస్తున్నాం. సం.

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ - సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం - సి.ఎచ్. గిరిజ; మెదక్ - ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ - మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ - ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ - కె. నాగేశ్వరాచారి; చిత్తూరు - పలమనేరు బాలాజి; కడప - కొండ్రాయుడు; కర్నూలు - జి.వి. సుధాకర్ రెడ్డి;

ప్రతి మనిషి జేబులో పోలీసు!

ఒక హిందుత్వ బ్రాహ్మణీయ ఫాసిస్టు రాజ్యం ఎంత దుర్మార్గంగా ఉండడానికి అవకాశం ఉందో, నరేంద్ర మోడీ – అమిత్ షా ప్రభుత్వం ఆ అవకాశాల చిట్టచివరి పరిధిని తాకదలచుకున్నట్టుందని తాజాగా బైటపడిన పెగాసస్ స్పైవేర్ ఉదంతం బైటపెడుతున్నది. స్పైవేర్ అంటే వ్యక్తుల ఎలక్ట్రానిక్ పరికరాల్లోకి వారికి తెలియకుండా జొరబడి, వారి సమాచారన్నంతా సంగ్రహించే, వారి మీద నిరంతర నిఘా ఉంచే సాంకేతిక పరిజ్ఞానం. సాధారణంగా నిఘా పోలీసులు చేసే పని ఈ పరిజ్ఞానం చేస్తుంది. అంటే మీ జేబులో ఉన్న ఫోన్ మీ మీద నిరంతర నిఘా ఉంచే పోలీసుగా పనిచేస్తుంది. ఈ దేశంలో ప్రజల మీద ప్రజా ఉద్యమకారులమీద ప్రభుత్వాల నిఘా, అక్రమ గూఢచార కార్యకలాపాలు కొత్తవేమీ కాదు. వలస పాలనాకాలంలో అటువంటి నిఘా ప్రయత్నాలు మొదలయ్యాయి. స్వాతంత్ర్యోద్యమకారుల జీవితాల మీద, వారి కార్యాచరణల మీద, వారు సమాజంతో పెట్టుకుంటున్న సంబంధాల మీద, వారి ఉత్తర ప్రత్యుత్తరాల మీద, టెలిఫోన్ సంభాషణల మీద నిరంతర నిఘా పెట్టి, విరివిగా సమాచారం సేకరించడమే హోం శాఖ పనిగా ఉండింది. వలసానంతర భారత ప్రభుత్వాలన్నీ కూడ చట్టబద్ధంగానూ, చట్టవ్యతిరేకంగానూ కూడ ఆ అక్రమ గూఢచార కార్యక్రమాన్ని యథావిధిగా కొనసాగిస్తున్నాయి. వలస పాలకులు ఇండియన్ టెలిగ్రాఫ్ ఆక్ట్ 1885 తెచ్చి గూఢచారానికి చట్టబద్ధ అనుమతి ఇచ్చుకున్ననాటి నుంచి, కొత్త సమాచార వినిమయ సాధనాల కోసం భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆక్ట్ 2000 నుంచి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ప్రొసీజర్ ఫర్ సేఫ్‌గార్డ్స్ ఫర్ ఇంటర్సెప్షన్, మానిటరింగ్ అండ్ డిక్రిప్షన్ ఆఫ్ ఇన్ఫర్మేషన్) రూల్స్ 2009 దాకా ప్రభుత్వాలు ప్రజల వ్యక్తిగత, గోప్య సమాచారాన్ని రాబట్టడానికి, దొంగిలించడానికి, చొరబడడానికి చట్టబద్ధ మార్గాలు తెరిచిపెట్టుకున్నాయి. మొదట పాలక – పాలిత ఘర్షణ, పాలితుల తిరుగుబాటు పట్ల పాలకుల భయం మాత్రమే ఈ గూఢచర్యానికి పునాదిగా ఉండేవి.

ఈ స్థితిలో సంఘ్ పరివార్ ప్రభుత్వాధికారాన్ని చేపట్టింది. హిందుత్వ బ్రాహ్మణీయ శక్తులకు పాలకవర్గ స్వభావంతో పాటు, అదనంగా అంతరాలను, అసమానతను పోషించే, ప్రతి ఒక్కరినీ అనుమానించి, అణచివేయాలని చూసే మానసిక స్థితి ఉంటుంది. తమవారు కాకపోతే శత్రువులే అనే విద్వేష భావన ఉంటుంది. దేశభక్తి, సాంస్కృతిక జాతీయవాదం అనే పదాల మాటున ఆధిపత్యకులాల, పాలకవర్గాల ప్రయోజనాన్ని కాపాడే స్వయంసేవక మనస్తత్వం అది. ఈ భావజాలాన్ని నరనరానా జీర్ణించుకున్న నరేంద్ర మోడీ – అమిత్ షా అప్పటిదాకా సాగుతున్న అక్రమ గూఢచర్యానికి తమ వికృత, అమానుష మానసిక స్థితిని జోడించారు. వారికి సరిగ్గా వారిలాగనే ఆలోచించే దుష్టరాజ్యం ఇజ్రాయిల్ యూదు పాలకవర్గాలు తోడయ్యాయి. నిజానికి హిట్లర్ ముస్సోలినీల నాజీజాన్ని, ఫాసిజాన్ని అభిమానించే సంఘ పరివార్ కు, నాజీజం దుర్మార్గాలకు లక్షలాది మంది బలి అయిన యూదుల ఇజ్రాయెల్ కు చుక్కెదురు కావాలి. కాని ఇద్దరిలోనూ ఉన్న ముస్లిం వ్యతిరేకత వారిని ఒక్కదగ్గరికి తెచ్చింది. ఏడు దశాబ్దాలలో మొట్టమొదటిసారి భారత ప్రధాని ఇజ్రాయెల్ పర్యటన 2017లో జరిగింది. ఇజ్రాయెలీ పాలక వర్గాల ప్రయోజనాలు కాపాడుతూ వారి కనుసన్నలలో నడిచే ఎన్ఎస్ఒ గ్రూప్ అనే కార్పొరేట్ సంస్థ తయారుచేసిన పెగాసస్ అనే అక్రమ గూఢచర్యపు సాఫ్ట్‌వేర్ సంపాదించడానికి బహుశా మోడీ అప్పుడే ఒప్పందం కుదుర్చుకుని ఉంటారు. తాము చట్టబద్ధమైన ప్రభుత్వాలకు మాత్రమే తమ స్పైవేర్ ను అమ్ముతామని ఎన్ఎస్ఒ చెపుతున్నది. ఆ స్పైవేర్‌ను భారతదేశంలో కనీసం 300 మొబైల్ ఫోన్ల మీద ఉపయోగించారని ఇప్పుడు బైటపడింది.

ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, ఫ్రాన్స్‌కు చెందిన ఫర్బిడెన్ స్టోరీస్ అనే స్వచ్ఛంద సంస్థ కలిసి ప్రారంభించిన ఈ స్పైవేర్ బాధితుల పరిశోధనలో వేరువేరు దేశాలలో యాభై వేల ఫోన్లు ఈ స్పైవేర్ బారిన పడ్డాయని తేలింది. భారతదేశంలో ఇప్పటికి బైటపడిన పేర్లలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి, ఎన్నికల కమిషన్ మాజీ అధినేత, ప్రతిపక్ష రాజకీయ నేతలు, జర్నలిస్టులు, ఉద్యమ కార్యకర్తలు వంటి ఎందరో ఉన్నారు. భారతీయ జనతా పార్టీ కూల్చిన రాష్ట్ర ప్రభుత్వాధినేతల, వారి సన్నిహితుల ఫోన్లు ఆ కూల్చివేతల సమయంలో అక్రమ గూఢచర్యానికి గురయ్యాయి. భీమా కోరేగాం కేసు నిందితుల, వారి కుటుంబ సభ్యుల ఫోన్లు కూడ ఆ జాబితాలో ఉన్నాయి. చివరికి తమ మంత్రివర్గంలోనే మోడీ–షా లు అనుమానానికి గురైన సహమంత్రుల ఫోన్లు కూడ ఈ నిఘా బారిన పడ్డాయి. ఒక్కమాటలో చెప్పాలంటే, మోడీ, షా లు తమకు గిట్టని వారందరి ఫోన్లు, తమకు ఎప్పుడైనా ప్రమాదం తేగలరని అనుకుంటున్న వారందరి ఫోన్ సంభాషణలు రహస్యంగా వింటున్నారన్నమాట.

సామ్రాజ్యవాద, భూస్వామ్య వర్గాలకు ఊడిగం చేస్తున్న తమ పాలనను సుస్థిరం చేసుకోవడం కోసం, ప్రజలను, ప్రజల తరఫున మాట్లాడుతున్న, రాస్తున్న, పోరాడుతున్న వారిని అణచివేయడం కోసం మోడీ, షాలు పన్నిన మహా షడ్యంత్రం ఇది. ప్రజల భావప్రకటనా స్వేచ్ఛకూ, వ్యక్తిగత గోప్యతా హక్కుకూ, ప్రజాస్వామిక పాలనా సంప్రదాయాలకూ గొడ్డలిపెట్టు వంటి రాజ్యాంగ వ్యతిరేక, అప్రజాస్వామిక, అనైతిక చర్య ఇది. ఇవాళ ఇది ఏ మూడు వందల మంది మీదనో ప్రయోగించారని, అక్కడితో ఆగిపోతారని అనుకోవడానికి వీలులేదు. ఒకసారి ఆ రహస్య చొరబాటు సాధనం తమ చేతిలోకి వచ్చాక ప్రతి ఒక్కరి వ్యక్తిగత జీవితంలోకి రహస్యంగా తొంగిచూసే అవకాశం ప్రభుత్వానికి వచ్చినట్టే. కేవలం దేశ సమగ్రత, సార్వభౌమత్వానికి విచ్ఛిన్నకరంగా ఉన్నవారి మీద మాత్రమే, చట్టబద్ధంగా మాత్రమే అది వాడుతున్నామని ఎంత చెప్పినా, ఆ వినియోగంలో భాగస్వాములైన వారు దాన్ని వ్యక్తిగత, వ్యాపార ప్రయోజనాల కోసం వాడకుండా ఉంటారని హామీ లేదు. ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న పత్రికా సంస్థల మీద మాత్రమే కాదు, అమిత్ షా కొడుకు అక్రమ వ్యాపార లావాదేవీల మీద వార్త రాసిన జర్నలిస్టు మీద, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై లైంగికవేధింపుల ఆరోపణ చేసిన మహిళ మీద, ఆమె కుటుంబ సభ్యుల మీద అది ఉపయోగించారంటే, ఇప్పటికే అది ఎంత చట్టవ్యతిరేక, అనైతిక వినియోగానికి గురవుతున్నదో అర్థమవుతుంది. పాలకుల అక్రమ ప్రవర్తనను నగ్నంగా బైటపెట్టిన ఈ పెగాసస్ ఉదంతాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి, పాలకుల దుర్నీతికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి, పోరాటాలకు సమాయత్తం చేయడం ప్రజాశక్తుల ముందున్న తక్షణ కర్తవ్యం.

వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

మత్పరిచ్చనీకి మల్లొక సుట్టరికం!

గారడంటె గారడి గాదు, దొరవారి కతలు తీరొక్కతీర్గ జెప్పినా ఒడిశిపోవు. అరె గిట్లయితదా అని అఫ్సోసు గావాలె. పరెశాన్ గావాలె. మరియమ్మ సావు కాణ్నించి, ఉజురబాదల మల్ల ఓట్ల పండుగ వస్తదన్న కాణ్నించి, ఏందో ఎటమటమైనట్టు గొట్టబట్టె. అడ్డమొచ్చిన ముండ్ల కంపను పంగల కట్టె బెట్టి ఆవల బారేశినట్టు దొరవారు కొత్త కొత్త ఎత్తులు ఏయబట్టిరి. ఇగ గా సిల్సిలలనె దొరవారికి మాల మాదిగల మీద ఎకాయెకిన వశపడని పావురం బుట్టు కొచ్చింది. ఏడేండ్లుగ ఏం జేశినవు మారాజ, ఎన్ని మాటలు నిలబెట్టుకుంటివి, ఎన్నిసార్లు తల్కాయె గోస్కుంటివి అని మనం అడుగొద్దు. టుపాకి ఎంకట్రామడు ఎన్నిసార్లు గదే ముచ్చెట జెప్పిన గాని గప్పుడే శిమాంట ఇన్నట్టు మనం నవ్వుతమా లేదా, నమ్ముతమా లేదా? గిది గుడ గంతే అన్నట్టు. రైతుబంధు అన్న మాట దొరవారికి శాన కలిశొచ్చింది గద, మొన్నటి ఓట్ల పండుగల దొరవారికి పప్పులు పరమాన్నాలు బెట్టిందిగా రైతు బంధే గద. గది మూడ్నాలు గేండ్లు గాలే? ఎప్పటికి పాత సుట్టమేనా? కొత్త సుట్టరికం కలుపుకుందామని దొరవారు మస్తు కోషీష్ చెయ్యబట్టిరి. దళిత బంధు అని కొత్త యేషం గట్టిరి. ఎహె, ఏషమంటే టుపాకి ఎంకట్రామనిది గాదు. జాంబ పురాణం ఏషం. శిందు బాగోతం ఏషం. కన్నమదాసు ఏషం. ఇగ గీ కొత్త ఏషంల దొరవారు ఒక్కొక్క మాల, మాదిగ కుటుంబానికి పది లచ్చలు ఇత్తరట. గీ కత ఉజురబాదల మునుం బెడ్తాండ్రంటె ఓట్ల కోత పని మస్తుగ జరుగుత దన్నట్టు. దొరవారి గుమ్మిల మస్తుగ ఓట్లు పడ్తయన్నట్టు. 'లచ్చ కోట్లయిన ఇస్త. నా మాల మాదిగ సోదరులు పైకి రావాలె. ఒక్కొక్క మాల, మాదిగ పల్లెల నా అసుంటోడు ఒగడు పుట్టాలె. గీ పైసలు పప్పులు పుట్నాలు జెయ్యొద్దు' అని బుదుగరిచ్చె మాటలు మస్తు జెప్పిండ్రు. ఇనుటానికి బాగున్నది గని బాంచెన్, గిది అయ్యేదా పొయ్యేదా? ఊదు గాలది, పీరిలేవది. మాలమాదిగలు పైకి రావాల్నంటె కిరస్తానల్ల గల్వాల్ననిరి, తురకల్ల గల్వాల్ననిరి, సదువుకోవాల్ల నిరి, బూమి రావాల్ననిరి, తెల్లబట్టలు దొడుక్కో వాల్ననిరి, ఇంగిలిపీసు మాట్లాడాల్ననిరి. గద్దె ఎక్కాల్ననిరి. ఇగో నా నెత్తిమీద ఎంటికలన్ని మాటలింటి. నూరేండ్లో ఇన్నూరేండ్లో ఆయె. ఏడి గొంగడి ఆడ్నే ఉన్నది. ఇంకింత శినిగి పోయింది గుడ. గది మార్సుడు కల్ల. శాన పెద్దపని. బూమి తలకిందులు కావాలె. నీ నించి గాని పని. ఇయాల నీకేదో పని ఉన్నది, మత్పరిస్తానవు. గంతే. సూటిగ గది జెప్పరాదు. గిట్ల మత్పరిచ్చుడు, పని ఎల్లదీసుకునుడు నీకు అల్వాటేనాయె. ఓడ దిగినాక బోడ మల్లన్న అని ఎన్నిసార్లు మాట దప్పితివి. కాదు పోదంటె గీ దళిత బంధు తోటి ఊరికొగణ్ని నీ జేబులో పెట్టుకుంటవు గావచ్చు, నువు పది లచ్చలిచ్చినవని ఒగ ఇల్లు బాగుపడ్తది గావచ్చు, నీకు జీ హుజూర్ అంటది గావచ్చు, మాదండి దొర అని ఊళ్లె డప్పుగొడ్తది గావచ్చు, ఇంగ నూరిండ్లో, ఇన్నూరిండ్లో, వెయ్యిండ్లో, లచ్చ ఇండ్లో ఉన్నయి బాంచెన్. ఆళ్లు ఎట్ల బాగుపడాలె, ఎట్ల పైకి బోవాలె? ఏమన్న ఇక్మతున్నదా? బూమి గావాలె, ఇయ్యక పోతివి. కొలువులు గావాలె, ఇయ్యకపోతివి. సదువు గావాలె, బడే బందు పెడ్తివి. గవి జేస్తవా జెప్పు. దండి మాటలు వద్దు, వచ్చిన పనిజెప్పు. సీదాగ ఓట్లడుక్కో. ఓటుకు నోటు ఇయ్యి. గంతె. సాఫ్ సీదా.

వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటాలా?

దేశంలో అన్ని రాష్ట్రాలలోలాగే ఆంధ్రప్రదేశ్‌లో కూడ నిరుద్యోగ సమస్య భయానక స్థాయికి విస్తరిస్తున్నది. ఐదున్నర కోట్ల జనాభాలో ఉద్యోగం చేసే వయసులో ఉన్నవారు రెండున్నర–మూడు కోట్లు ఉంటారనుకుంటే అందులో నలభై లక్షల నిరుద్యోగ విద్యావంతులున్నారని ఒక అంచనా. అంటే ప్రతి ఐదుగురిలో ఒకరు నిరుద్యోగులన్నమాట. ఇంత భారీ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం స్వయంగా ఉద్యోగ కల్పన చేయాలి, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షిస్తున్నప్పుడు ఉద్యోగకల్పన షరతుగా పెట్టాలి. ఇతోధికంగా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలి. అధికారంలోకి రాగానే రాష్ట్ర ప్రభుత్వోద్యోగాలలోని రెండు లక్షల పైగా ఖాళీలను నింపుతామని వాగ్దానం చేసిన వైఎస్ ఆర్‌సిపి పాలన రెండు సంవత్సరాలు గడిచినా అందులో పదో వంతు ఉద్యోగ కల్పన కూడ చేయలేదు. ఉన్న ఉద్యోగాలు నింపకపోవడం, నిరుద్యోగులకు సురక్షితమైన ఉద్యోగాలు కల్పించకపోవడం ఒక ఎత్తయితే, వాగ్దానం చెయ్యని కొత్త ఉద్యోగాలు కల్పించి, వాటిని తమ పార్టీ ప్రచారకర్తల స్థాయికి కుదించడం, ఉన్న ఖాళీలను ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులతో నింపడం మరొక ఎత్తు. ఈ స్థితిలో విద్యార్థి, యువజన సంఘాలు ఉద్యోగ కాలెండర్ విడుదల చేయమని ప్రభుత్వాన్ని అడగడం ప్రారంభించాయి. అసలే బలహీనంగా ఉన్న ప్రతిపక్షాలకు నామమాత్రంగానైనా ఈ ఉద్యమానికి మద్దతు ఇవ్వక తప్పలేదు. ప్రభుత్వం పేరుకు ఒక జాబ్ కాలెండర్ ప్రకటించినప్పటికీ, అది ఉన్న ఖాళీలకు, తామే గతంలో చేసిన వాగ్దానాలకు ఎంతమాత్రం సరిపోయేది కాదు. జాబ్ కాలెండర్ అనే తూతూమంత్రపు ప్రకటనతో మరింత ఆగ్రహించిన విద్యార్థి యువజనులు కనీస నిరసన, ఆందోళన మార్గాలు చేపడితే, వారి మీద దారుణమైన నిర్బంధం ప్రయోగించి, ఎక్కడివారినక్కడ అరెస్టు చేయడం, లాఠీ చార్జిలు చేయడం సాగించారు. సమాజంలో దళిత, ఆదివాసి, వెనుకబడిన వర్గాల నుంచి మొదటి రెండవ తరాల విద్యావంతులు లక్షలాదిగా తయారవుతున్న సందర్భమూ, నిరుద్యోగం పెరిగిపోతున్న సందర్భమూ ఒకటే కావడం యాదృచ్ఛికం కాదు. ఏ రాజకీయార్థిక విధానాలు ప్రజా వ్యతిరేకమైన అభివృద్ధి నమూనా చేపట్టి, ప్రజల వనరులను కొల్లగొడుతున్నాయో, అవే విధానాలు ఆ ప్రజలకు కనీస ఉద్యోగ కల్పన అనే ఉపశమనం కూడ లేకుండా చేస్తున్నాయి. ప్రభుత్వ రంగమే సకల ఉద్యోగాలనూ కల్పించలేకపోయినా, సహకార, స్వయం ఉపాధి రంగాలకు ఇతోధిక ప్రోత్సాహం ఇవ్వడం, ప్రైవేట్ రంగానికి ఇబ్బడి ముబ్బడిగా రాయితీలు ఇస్తున్నప్పుడు, కనీస ఉద్యోగకల్పన షరతుగా పెట్టడం వంటి పనులైనా చేయడం లేదు. అసలు ప్రభుత్వ వ్యయం మీద సమీక్ష, ఆర్థిక వ్యవస్థను మెరుగు పరిచే ఆలోచనలు జరుగుతున్నాయో లేదో తెలియడం లేదు. ఒకవైపు ఆర్థిక వ్యవస్థ సంక్షోభంతో, కొవిడ్ లాక్ డౌన్లతో వ్యాపార, పారిశ్రామిక సంస్థలు మూతపడుతూ, అంతకంతకూ నిరుద్యోగ సైన్యం పెరిగిపోతున్న స్థితిలో, స్వయంగా రాష్ట్ర ప్రభుత్వమే ప్రభుత్వ రంగ సంస్థల మూసివేతతో, అమ్మకాలతో మరింతమందిని నిరుద్యోగులను చేస్తున్నది. నిరుద్యోగాన్ని తగ్గించవలసిన, నిరుద్యోగులకు ఉద్యోగకల్పన చేయవలసిన, కనీసం నిరుద్యోగ భృతి కల్పించవలసిన తన బాధ్యతలను విస్మరిస్తున్నది. విద్యార్థి యువజనులు ప్రారంభించిన ఉద్యమం కేవలం వారి ఉద్యోగాల కోసం మాత్రమే కాదు, అది మొత్తంగా ఆర్థిక వ్యవస్థ పురోభివృద్ధికీ, సామాజిక సంక్షేమానికీ అవసరమైనది. ఆ ఉద్యమాన్ని అన్ని రకాలుగా సమర్థించడం ప్రజలందరి బాధ్యత.

వీ

ఆఫ్ఘనిస్తాన్‌లో పుంజుకుంటున్న తాలిబనిజం

– ఎ. నర్సింహారెడ్డి

ఆఫ్ఘన్ ప్రభుత్వం, తాలిబన్‌లతో కూడిన సంకీర్ణ ప్రభుత్వం ద్వారా శాంతి ఏర్పాటుపై చర్చలు అంతిమదశకు చేరి, ఒప్పందంగా ఫలించకముందే 20 ఏళ్ల దురాక్రమణ కార్యక్షేత్రం నుండి అమెరికా సైన్యాల ఉపసంహరణను అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించడంతో తాలిబన్ సాయుధులు స్వైరవిహారం చేస్తున్నారు. ఆఫ్ఘన్‌లో ఇస్లామిక్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నది తాలిబన్ల లక్ష్యం. ఇప్పటికే దేశంలో 85 శాతం తమ ఆధీనంలో ఉందని వారు ప్రకటించారు. ఉజ్బెకిస్తాన్, తజకిస్తాన్, ఇరాన్, పాకిస్తాన్ సరిహద్దు క్రాసింగ్ పాయింట్లు స్వాధీనం చేసుకున్నామంటున్నారు. ఆఫ్ఘన్ ప్రభుత్వానికి సహకారం అందకుండా చేయడమే వీరి లక్ష్యం. అమెరికా శిక్షణ ఇచ్చిన ప్రభుత్వ సైనికులు తాలిబన్ దాడికి పరారవుతున్నారు, లొంగిపోతున్నారు. పట్టణాలను చుట్టుముడితే ప్రతిఘటన తీవ్రంగా ఉంటుందని వారికి తెలుసు. నాటో దేశాల సైనికుల ఉపసంహరణ పూర్తి అయింది. అమెరికా ఒక్కొక్క స్థావరాన్ని ఖాళీ చేస్తున్నది. సెప్టెంబర్ 1 నాటికి పూర్తిగా వైదొలగనున్నట్లు అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు. అమెరికా ప్రతిష్టించిన ఆఫ్ఘన్ ప్రభుత్వం పరిస్థితి ఏమిటి? తాలిబన్ కాబూల్‌ను స్వాధీనం చేసుకుంటుందా? ఇదీ భారత్ సహా ఇరుగుపొరుగు దేశాలను ఇప్పుడు వేధిస్తున్న ప్రశ్న. గతంలోకి వెళితే అమెరికన్ సామ్రాజ్యవాదులు సృష్టించిన ఛాందస భూతం తాలిబన్‌లు. 1980వ దశకంలో సోవియట్ మద్దతుగల ఆఫ్ఘన్ ప్రభుత్వాన్ని కూలదోయ డానికి ముజాహిదీన్‌లకు అమెరికా ఆర్థిక, సాయుధ సరఫరాలు చేసింది. ఆ జిహాద్‌లో చేరినవారిలో ఒసామా బిన్‌లాడెన్ లాంటి వాళ్లున్నారు. పాకిస్తాన్ లాంచింగ్ ప్యాడ్. ఆ ముజాహిదీన్‌ల వారసులే తాలిబన్‌లు. సోవియట్ సైన్యాలు నిష్క్రమించాక తాలిబన్‌లు అధికారం చేజిక్కించుకున్నారు.

2001 సెప్టెంబర్ 11న న్యూయార్క్‌లో జంటగోపురాల వాణిజ్య కేంద్రం, పెంటగాన్‌లపై తాలిబన్ల దాడి తదుపరి అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జి డబ్ల్యు బుష్ 'టెర్రరిజంపై యుద్ధం' ప్రకటించి ఆఫ్ఘనిస్తాన్‌పై దండయాత్ర చేశాడు. అంతర్జాతీయ కొయలిషన్ పేరుతో నాటో దేశాల సైన్యాలు కూడా దిగాయి. అయితే రెండు దశాబ్దాల పాటు వైమానిక దాడులు, ప్రత్యేక దళాల చర్యలు తాలిబన్‌లను అణచలేకపోయాయి. కానీ ఆఫ్ఘనిస్తాన్‌ను సర్వనాశనం చేసి వల్లకాడుగా మార్చాయి. అమెరికన్ సైన్యాలు వియత్నాంలో దశాబ్దం పాటు యుద్ధంచేసి పరాభవంతో వెనుదిరిగినట్లే, ఇప్పుడు రెండు దశాబ్దాల యుద్ధం తదుపరి ఆఫ్ఘనిస్తాన్ నుండి అవమానంతో నిష్క్రమిస్తున్నాయి. ట్రంప్ ప్రభుత్వం దోహాలో తాలిబన్ ప్రతినిధులతో చర్చలు జరిపి శాంతి ఒప్పందం ప్రకటించింది. అయితే పరివర్తనాకాల ప్రభుత్వంపై ఆఫ్ఘన్ ప్రభుత్వం, తాలిబన్ మధ్య చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. తర్వాత మాస్కో, ఇస్తాంబుల్‌లో జరిగిన చర్చలు ఫలించలేదు. తజకిస్తాన్ రాజధాని దుషన్‌బేలో మొన్న 8 దేశాల షాంఘై సహకార సంస్థ "కాంట్రాక్టు గ్రూపు" ఆఫ్ఘన్ సమస్యను చర్చించింది. ఆఫ్ఘనిస్థాన్‌లో పరిస్థితి క్షీణిస్తే చిల్లరమల్లర జిహాద్ గ్రూపుల పునరుద్ధరణ, కాందిశీకుల ప్రవాహం తమ దేశాలపై ప్రభావం చూపుతాయని మధ్య ఆసియా దేశాలు ఆందోళన చెందుతున్నాయి. పాకిస్తాన్‌కూ ఈ ఉపద్రవం ఉంది. మనదేశం ఆఫ్ఘన్ సమస్యపై అమెరికాకు ఇంతకాలం వంతపాడుతూ వచ్చింది. అభివృద్ధి ప్రాజెక్టులపై 300 కోట్ల డాలర్లు వెచ్చించింది. కాందహార్‌లో పరిస్థితులు క్షీణించడంతో భారత్ తన దౌత్యవేత్తలను స్వదేశానికి తీసుకొచ్చింది. అందువల్ల ఆఫ్ఘనిస్థాన్‌లో శాంతి–సుస్థిరత ఆఫ్ఘన్‌లకే కాక ఇరుగుపొరుగు దేశాలకూ అవసరం. వీ





వి. హనుమంత రావు

(ఆగస్ట్ 30, 1925 - డిసెంబర్ 13, 2016)

అలుపెరగని అక్షరయోధుడు, ఆరున్నర దశాబ్దాల ప్రజాపక్ష పాత్రికేయుడు, వీక్షణం రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక వ్యవస్థాపక సంపాదకుడు **వి. హనుమంత రావు** తొంబై ఆరవ జయంతి ఆగస్ట్ 30 సందర్భంగా సవినయ సంస్మరణ

రాసిన ప్రతి వాక్యాన్నీ తప్పుపట్టడానికి అవకాశం ఉంది. ఒక పరిశీలకుడిగా నాకు మాత్రమే కాదు, అసలు చారిత్రక వాస్తవాలే వీరయ్యగారి వ్యాసంలోని ప్రతి వాక్యాన్నీ ఖండిస్తాయి. వీక్షణం సంపాదకులు అనుమతిస్తే అటువంటి పెద్ద వ్యాసం రాస్తాను గాని, ప్రస్తుతానికి ఈ ఉత్తరం రాస్తున్నాను. వీరయ్య గారికి సిపిఎం ను పొగుడుకోవడానికి అన్ని హక్కులూ ఉన్నాయి. కాని చరిత్రను పరిమార్చడానికి, మసిపూసి మారేడుకాయ చేయడానికి హక్కు లేదు. అవకాశవాద కూటమిలో మరింత అవకాశవాదంతో హోం మంత్రిగా చేరిన జ్యోతి బసు నక్సల్బరీ ఉద్యమాన్ని రక్తపుటేర్లలో ముంచిన చరిత్రను, వందలాది మందిని చంపిన, వేలాది మందిని జైలుపాలు చేసిన చరిత్రను తుడిచివేస్తూ, "జాతీయ స్థాయిలో రాజ్యాంగ యంత్రం వర్గ ఉద్యమాల పట్ల అణచివేత వైఖరి అనుసరిస్తూ ఉండగా ఒక నిర్దిష్ట ప్రాంతంలో మాత్రం రాజ్యాంగ యంత్రం వర్గపోరాటాల పట్ల తటస్థ ధోరణి అనుసరించేలా చేయగలగడం ఆ ప్రాంత వామపక్ష ఉద్యమం సాధించిన ప్రత్యేక విజయంగా చెప్పుకోవాలి" అని వీరయ్యగారు రాయడం సిపిఎం ప్రచారానికి చెల్లుతుంది గాని వాస్తవ, నిష్పాక్షిక చరిత్ర రచన మాత్రం కాదు. ఇక నక్సలైట్ల గురించి వీరయ్యగారు చేసిన రెండు మూడు వ్యాఖ్యలు చరిత్ర పట్ల ఆయన అజ్ఞానానికీ, సిపిఎం అధికార అబద్ధచరిత్రకూ అద్దం పడుతున్నాయి. ఇటువంటి అబద్ధ, పాక్షిక, వక్రీకరించిన చరిత్రకు వీక్షణంలో చోటు దొరకడమే ఆశ్చర్యం. సంపాదకులు, సంపాదకవర్గం వీరయ్యగారి వ్యాసాన్ని మరొకసారి చదవాలని కోరుతున్నాను.

- జన్ను చిన్నాలు
వరంగల్

వీక్షణం జూన్ - జూలై సంచికలోని అన్ని వ్యాసాలు బాగున్నాయి. ముఖ్యంగా మోడీ ఏడేళ్ల పాలన గురించి, ఏడేళ్ల తెలంగాణ పాలన గురించి వచ్చిన వ్యాసాలు చాలా వివరణాత్మకంగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు కెసిఆర్ ఎన్నికల వాగ్దానాలలో ఎన్నో హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఆ హామీలను నేరవేర్చకపోవడమే కాకుండా రెండు సార్లు అధికారంలోకి వచ్చి ఏడు సంవత్సరాలు కావస్తున్నా తన హామీలను ఏమాత్రం నేరవేర్చకుండా, దళితులకు మూడు ఎకరాల భూ పంపిణీ, టిఆర్ఎస్‌ను గెలిపిస్తే దళితుడ్ని సిఎం చేస్తాం అన్న ఏ ఒక్క వాగ్దానాన్ని కూడా నిలబెట్టుకోలేదు. టిఆర్ఎస్‌ను గెలిపిస్తే ఉద్యోగ సమస్య తీరుతుందనే ఆశతో నిరుద్యోగులు ఎదురు చూశారు. కాని ఇప్పటికీ ఎంతో మందికి ఉద్యోగాలు రాకపోగా, తమ హక్కుల కోసం కోట్లాడితే, నిరసనలు తెలిపితే వారిని అరెస్ట్ చేయడం జరుగుతుంది. టిఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఏ ఒక్కరు మాట్లాడినా, ప్రశ్నించినా వారిపై అనేక నిర్బాంధాలు, కేసులు మోపి జైల్లో పెట్టడం జరిగింది. ఇంకా అనేక విషయాలను 'ఏడేళ్ల తెలంగాణ ముఖచిత్రం' వ్యాసంలో రాజేంద్రబాబు గారు చాలా లోతుగా వివరించారు. ఇంకా 'రైతుల ఆదాయాలు ఎందుకు పెరగడం లేదు' వ్యాసంలో రచయితలు ఇప్పుడు రైతులు పడుతున్న బాధలు, ఇబ్బందులు, రైతుల ఆదాయాలు పెరగకపోవడానికి గల కారణాలను, వ్యవసార రంగంపై అనేక విషయాలను ఎంతో లోతుగా వివరించారు. అలాగే కేంద్రంలో కొత్త కొత్త వాగ్దానాలతో దేశ ప్రజలను ప్రలోభాలకు గురిచేసి అధికారంలోకి వచ్చిన మోడీ ఈ ఏడేళ్ల తన పాలనలో దేశ ప్రజలను అనేక ఆటుపోట్లకు గురిచేశారు. పాతనోట్ల రద్దు పేరుతో బ్లాక్ మనీని బయటకు తీసుకొచ్చి ప్రతి పేదవారి అకౌంట్లలో వేస్తానని చెప్పి, బ్లాక్ మనీని తీసుకురాకపోవడమే గాక సామాన్య ప్రజలను మరింత ఆర్థికంగా కృంగిపోయేలా చేశారు. ఇలా కేంద్రం అవలంభిస్తున్న అనేక విషయాలను 'ఏడేళ్ల మోడీ పాలనలో దేశం అధోగతి' వ్యాసంలో నర్సింహారెడ్డి గారు ఎంతో వివరణాత్మకంగా రాశారు. ఆలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆస్తి పన్ను పెంచుతూ సామాన్య ప్రజలపై భారాన్ని మోపడం విచారకరం. పాలకులు అనుసరిస్తున్న తప్పుడు విధానాలను, మోసాలను ఎప్పటికప్పుడు వ్యాసాల రూపంలో తెస్తున్నందుకు వీక్షణం ఎడిటోరియల్ కలెక్టివ్ వారికి ధన్యవాదాలు.

- కృష్ణహరి
మహబూబ్‌నగర్

ఫాదర్ స్టాన్ స్వామి ఉజ్వల వ్యక్తిత్వం

***దర్యాప్తు సంస్థల, జైలు అధికార వర్గాల, న్యాయస్థానాల దుర్మార్గానికి, నిర్లక్ష్యానికి బలి అయిపోయిన ఫాదర్ స్టాన్ స్వామి కేసు గురించి, ఆయన వ్యక్తిత్వం గురించి వివరిస్తున్నారు* సూసన్ ఎబ్రహాం**

మృత్యువుతో మన ముఖాముఖీకి కరోనా మహావిపత్తు ఎన్ని రకాల అవకాశాలు కల్పించిందంటే ఇప్పుడిక మృత్యువు మనకొక 'కొత్త సాధారణ స్థితి'గా మారింది. మన కళ్లముందర న్యాయమూర్తి జస్టిస్ హొస్బెట్ సురేశ్, కమ్యూనిస్టు యోధురాలు గౌరి అమ్మ, పర్యావరణవేత్తలు సుందర్ లాల్ బహుగుణ, మహావీర్ నర్వాల్, ఇంకా ఇటీవల న్యాయమూర్తి జస్టిస్ పి బి సావంత్, ఒకరి తర్వాత ఒకరు వెళ్లిపోయారు. వారూ, గత సంవత్సరంలో మరణించిన మరెందరో అణగారిన వర్గాల హక్కుల కోసం, అన్యాయంగా చెరసాలలలో చిక్కినవారి స్వేచ్ఛ కోసం పోరాడారు. కాని ఆదివాసి, మూలనివాసి సముదాయాల కోసమే తన జీవితమంతా అంకితం చేసిన ఫాదర్ స్టానిస్లాస్ లూర్దుస్వామి (ఆదివాసులకు సులభంగా ఉండడం కోసమే ఆయన తన పేరును స్టాన్ స్వామి అని కుదించుకున్నారు) ఈ సోమవారం మరణించడం, ఆ సముదాయాలలో మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా స్వేచ్ఛాప్రియులైన ప్రజలందరిలో ప్రతిధ్వనించింది, ప్రతి ఒక్కరి అంతరాత్మను కదిలించింది.

ఆయన మరణం మీద ప్రతిస్పందనల గురించి చాల రచనలు వచ్చాయి. పదహారు మంది భీమా కోరేగాం కేసు నిందితులలో అరెస్టయిన చిట్టచివరి వారాయన. ఆయన మరణం సహనిందితుల మీద ఎంత దిగ్భ్రాంతికరమైన ప్రభావం వేసి ఉంటుందో ఊహించండి. బహుశా ఆయన మరణవార్తను వారికి జైలు అధికారులు చెప్పి ఉంటారు. వారందరూ వేరువేరు బారక్ లలో ఉన్నారు. ఒకరితో ఒకరు కలవడానికి వీలు లేకుండా ఉన్నారు. కాని ఈ మరణవార్త తెలిశాక అందరూ కలిసి సమావేశం కావడానికి కొత్త జైలు సూపరింటెండెంట్ (అంతకు ముందరి కర్కోటకుడైన సూపరింటెండెంట్ బదిలీ అయి కొద్ది రోజుల ముందే కొత్త సూపరింటెండెంట్ వచ్చాడు) అనుమతి తీసుకున్నారు. వాళ్లందరినీ సూపరింటెండెంట్ కార్యాలయానికే పిలవగా, వాళ్లు అక్కడే ఒక సంస్మరణ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. స్టాన్ గురించి తమ అనుభవాలు, జ్ఞాపకాలు పంచుకున్నారు. ఆయన స్మృతిలో రెండు నిమిషాల మౌనం పాటించారు. ఇవాళ (జూలై 7) న కుటుంబ సభ్యులకు ఫోన్ చేయగలిగిన వారు, తాము ఈ రోజు స్టాన్ మరణానికి నిరసనగా నిరాహార దీక్ష పాటిస్తున్నామని చెప్పారు. ఈ నిరాహార దీక్ష సందర్భంగా వారు రెండు డిమాండ్లు చేశారు. 1. ఫాదర్ స్టాన్ స్వామి వ్యవస్థీకృత హత్య మీద న్యాయ విచారణ జరిపించాలి. 2. ఎన్ఐఎ అధికారుల మీద, తలోజా జైలు మాజీ సూపరింటెండెంట్ కె కుర్లేకర్ మీద భారత శిక్షా స్మృతి సెక్షన్ 302 కింద హత్యానేరం కేసు నమోదు చేయాలి. బైకుల్లా జైలులో ఉన్న మహిళా సహ నిందితులు షోమా సేన్, సుధా భరద్వాజ్, జ్యోతి జగతాప్ కూడ స్టాన్ మృతి మీద తమ విచారాన్నీ దిగ్భ్రాంతినీ వ్యక్తం చేశారు.

ఆ కేసులో రెండో విడత దాడులు, అరెస్టులలో భాగంగా, స్టాన్ ఎంతో ప్రియంగా చూసుకున్న బగేచా మీద 2018 ఆగస్ట్ 28న పుణె పోలీసులు మొట్టమొదటిసారి దాడి చేసినప్పుడు, ఈ భీమా కోరేగాం కేసు అనేదానికి ఉన్న విచిత్రమైన పరిణామాలు నమ్మశక్యం కాకుండా ఉండినాయి. ఆ కేసు అప్పటికే దేశమంతా ప్రయాణిస్తున్నది. మోడీ పాలన పట్ల అసమ్మతి తెల్పుతున్న సుప్రసిద్ధ వ్యక్తులందరినీ మావోయిస్టు సానుభూతిపరులు అని ముద్రవేసి జైళ్లలోకి నెట్టడానికి అదే ప్రధానమైన కేసు కాబోతున్నది. అది సరిగ్గా బ్రిటిష్ పాలనాకాలంలో స్వాతంత్ర్యోద్యమ నాయకులను నిర్బంధించడానికి పెట్టిన కుట్రకేసుల్లా తయారవుతున్నది.

2018 ఆగస్ట్ 28 నాటి రిమాండ్ పత్రాల్లో ఫాదర్ స్టాన్ స్వామి పేరును "అనుమానిత నిందితుడు" అని మాత్రమే రాశారు. దేశంలోని నేర స్మృతులలో ఈ మాటకు నిర్వచనం లేదు. ఆయన వెంటనే తనకు అప్పటికి రెండు దశాబ్దాలుగా స్నేహితుడైన ముంబైలోని సీనియర్ న్యాయవాది మిహిర్ దేశాయిని సంప్రదించారు. స్టాన్ మీద ఆరోపణలను కొట్టివేయాలని మిహిర్ దేశాయి బొంబాయి హైకోర్టులో ఒక రిట్ పిటిషన్ దాఖలు చేశారు. స్టాన్ ముద్దాయి కాదనీ, తమకు ఆయనను అరెస్టు చేసే ఉద్దేశమేమీ లేదని అప్పటికి ఈ కేసు దర్యాప్తు సంస్థగా ఉన్న పుణె పోలీసు శాఖకు చెందిన అడిషనల్ కమిషనర్ హైకోర్టుకు చెప్పాడు. దానితో కోర్టు రిట్ పిటిషన్‌ను కొట్టివేసింది. "దరఖాస్తుదారుకు వ్యతిరేకంగా ఏ చర్యలూ తీసుకుంటున్నట్టు కనిపించడం లేదు" అని హైకోర్టు ప్రకటించింది.

కాని స్టాన్ పొందిన ఆ ఊరట కొద్ది కాలానికి మాత్రమే అయింది. దాదాపు ఒక సంవత్సరం తర్వాత, 2019 జూన్‌లో పుణె పోలీసులు బగేచా మీద మరొకసారి దాడి చేశారు. మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం మారిపోయినతర్వాత, 2020 జనవరిలో కేంద్ర ప్రభుత్వ హోం మంత్రిత్వశాఖ ఈ కేసును ఎన్ఐఎ కు బదిలీ చేసింది. ఎన్ఐఎ ఆధ్వర్యంలో జూలై 2020 లో స్టాన్ నివాసం మీద మళ్లీ ఒకసారి దాడి జరిగింది. ఆయనను నిరంతరాయంగా 15 గంటల పాటు ప్రశ్నలతో వేధించారు. ఈ సమయానికి స్టాన్ కూడా ఇక తన అరెస్టు తప్పదనే నిర్ణయానికి వచ్చారు. తనకు ఈ కేసు గురించి ఏమీ తెలియదని, తనను అరెస్టు చేయడమంటూ జరిగితే అది మరణమేననీ ఆయన ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు.

బొంబాయి సిటీ సివిల్ అండ్ సెషన్స్ కోర్ట్ ప్రాంగణంలో 25 వ

నంబర్ గది ఎన్ఐఎ కోర్టులో ముంబైలోని భీమా కోరేగాం డిఫెన్స్ న్యాయవాదుల బృందం 2020 అక్టోబర్ 9న స్టాన్‌ను మొదటిసారి కలిసింది. ఆయనను అంతకు ముందు రోజు రాంచిలోని బగేచాలో ఎన్ఐఎ అరెస్టు చేసి తీసుకొచ్చింది. అలా రాంచి నుంచి ముంబాయికి ఒక వ్యక్తిని కదిలించాలంటే రాంచి కోర్టు నుంచి అవసరమైన చట్టబద్ధమైన ట్రాన్సిట్ వారంట్ లేకుండానే ఆయనను తీసుకువచ్చారు. రాంచి లోని న్యాయవాదులు అక్టోబర్ 8నే స్టాన్ ను భీమా కోరేగాం కేసులో అరెస్టు చేశారని ముంబై న్యాయవాదులకు తెలియజేశారు. అలా ఆయన బికె 16 అయ్యారు.

"పంజరంలో పక్షి పాడుతుంది..."

విజృంభిస్తున్న కరోనా మహమ్మారి సమయంలో బక్కపలచగా, అన్యమనస్కంగా ఉన్న స్టాన్ రాంచి నుంచి సుదీర్ఘ ప్రయాణంవల్ల అలసిపోయి ఉన్నారు. వకాలత్ నామాల మీద సంతకం పెట్టడానికి బల్ల సహాయం కావాలి గనుక న్యాయవాదులు కూచునే కుర్చీ మీద ఆయనను కూచోబెట్టాం. సంతకం స్థానంలో ఒక గీత గీయడానికి కూడా ఆయనకు శక్తి లేకపోయింది. అందువల్ల ఆయన వేలిముద్ర తీసుకోవలసి వచ్చింది. ఆయన మాకేదో చెప్పడానికి ప్రయత్నించారు గాని ఆ బలహీనమైన గొంతులోంచి మాటే బైటికి రాలేదు.

ఇక ఆ తర్వాత కోర్టుగది ప్రహసనం మొదలయింది. ఎన్ఐఎ ఆయనను పోలీసు కస్టడీకి ఇమ్మని అడుగుతుందని, దాన్ని వ్యతిరేకిస్తూ ఆయనను జుడిషియల్ కస్టడీకి పంపించాలని కోరుతూ దరఖాస్తు పెట్టాలని మేం అంతా సిద్ధం చేసుకుని కోర్టుగదిలోకి వెళ్లాం. కాని అలా జరగలేదు. పదివేల పేజీల అనుబంధ చార్జిషీటు ఆ రోజే కోర్టుకు సమర్పించడం వంటి ఇతర పనులతో ఎన్ఐఎ తలమునకలుగా ఉంది. స్టాన్‌ను పోలీసు కస్టడీకి ఇవ్వాలని తాము అడగడం లేదని, ఆయనను నేరుగా జుడిషియల్ కస్టడీకి పంపించవచ్చునని ఎన్ఐఎ కోర్టుకు చెప్పింది. స్టాన్ స్వామి తరఫున వాదించడానికి రాంచి న్యాయవాదులు నియమించిన ముంబై న్యాయవాది షరీఫ్ షేక్ ఆరోగ్య కారణాల మీద ఆయనకు బెయిల్ ఇవ్వాలని దరఖాస్తు పెట్టి, స్టాన్ వైద్యపరీక్షల నివేదికలన్నీ ఎన్ఐఎ జడ్జికి ఇచ్చారు. ఆయన పార్కిన్సన్ వ్యాధిగ్రస్తుడనీ, సహాయం లేకుండా నడవలేడనీ, వినికిడి శక్తి లేదనీ, తనంతట తానే తినడం, తాగడం వంటి పనుకు కూడ చేయలేడనీ చూపే పత్రాలు ఇచ్చారు. నిజానికి ఆ పత్రాలేవీ లేకున్నా కళ్లున్న ప్రతివారికీ కనబడుతున్న విషయాలు అవి. కాని చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం అనేది ఒక ఉక్కు చట్టం. ఎన్ఐఎ జైలుకు పంపించమని కోరిందంటే అది జరగవలసిందే. బెయిల్ కు అవకాశమే లేదు. అవతల ఉన్నది 84 సంవత్సరాల వృద్ధుడూ, బలహీనుడూ అయినా సరే.

ఇదంతా జరిగాక స్టాన్ స్వామి తనను మాట్లాడడానికి అనుమతించమని జడ్జిని అడిగారు. జడ్జి ఆయనను సాక్షి బోనులో నిలబడి మాట్లాడమన్నాడు. "నన్ను ఎల్గార్ పరిషద్ కేసులో అరెస్టు చేశామని చెపుతున్నారు... కాని నాకు ఆ కేసు గురించి ఏమీ తెలియదు. నాకూ ఆ సభకూ ఎటువంటి సంబంధమూ లేదు" అన్నారాయన. ఆయన గొంతు ఎంత బలహీనంగా ఉండిందంటే జడ్జికి ఆయన మాటలు వినబడలేదు. ఆయన అన్న ప్రతి మాటనూ న్యాయవాది షరీఫ్ తిరిగి బిగ్గరగా చెప్పవలసి వచ్చింది. అయినా సరే, ఆయనను తలోజా జైలుకు రవాణా చేశారు. ఎన్ఐఎ అధికారులు, సిబ్బంది కొత్తగా తాము అరెస్టు చేసిన ఏడుగురు నిందితుల మీద కట్టలు కట్టలు చార్జిషీట్లు కోర్టుకు సమర్పించడంలో మునిగిపోయి ఉన్నారు. కొత్తగా అరెస్టయిన ఆ ఏడుగురు – ఆనంద్ తేల్తుంబ్డే, గౌతమ్ నవ్లాఖా, హనీ బాబు, సాగర్ గోర్ఖే, రమేష్ గాయ్‌చోర్, జ్యోతి జగతాప్. మొత్తం నిందితులలో వయసులో అందరికన్నా చిన్నవారు జ్యోతి జగతాప్, అందరి కన్నా పెద్ద వారు ఫాదర్ స్టాన్.

కళ్లలో సదా వెలుగుతుండే మెరుపు ఆయన విశిష్టత. దానితోపాటు నిజాయితీపూర్వకమైన నిరాడంబరపు సరళత్వం. కనబడీ కనబడని హాస్యచతురత. నేను న్యాయవాదిననీ, నా సహచరుడు వర్నన్ గోన్సాల్వెస్ కూడా స్టాన్ వెళ్లబోతున్న తలోజా జైలులోనే ఉన్నాడనీ చెప్పాను. స్టాన్ దగ్గర ఉన్న వస్తువులన్నీ ఒక చిన్న మామూలు సంచీలో ఉన్నాయి. అందులో ఒకటి రెండు జతల బట్టలు, ఆశ్చర్యకరంగా ఆయన గుర్తింపు పత్రంగా ఎన్నికల కమిషన్ కార్డు ఉంది. స్ట్రాతో ఉన్న స్టీల్ సిప్పర్ ఒకటి ఉంది. ఆ సిప్పరే తలోజా జైలు అధికారుల నిరాకరణకు గురై జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి గడించింది.

అక్టోబర్ 8న ఆయన అరెస్టుకు కొద్ది ముందు ఆయన తన సహచర జెసూయిట్లతో, తాను జైలుకు వెళ్లగానే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని చెప్పారట. దాని గురించి వాళ్లు ఆందోళన పడడం ప్రారంభించారు. బహుశా ఆయన తలోజా జైలులో తన సహనిందితులను కలిసిన తర్వాత వారే ఆయనను ఆ ఆలోచన నుంచి విరమింప జేసినట్టున్నారు.

ఎందుకంటే, సరిగ్గా అప్పటికి, గత సంవత్సరం అక్టోబర్‌లో భీమా కోరేగాం కేసులో ఎనబయవ పడిలో ఉన్న మరొక నిందితులు, కవి వరవరరావు జైలులోనే ఉన్నారు. ఆగస్ట్ లో నానావటి ఆస్పత్రి నుంచి అర్ధాంతరంగా వెనక్కి జైలుకు పంపిన తర్వాత ఆయన పూర్తిగా మంచం మీదనే ఉన్నారు. హైకోర్టులో ఆయన ఆరోగ్య కారణాల బెయిల్ దరఖాస్తును దెబ్బతీయడానికే ఆయనను అలా అర్ధాంతరంగా వెనక్కి పంపారు. తన పాత రూపానికి ఒక నీడ లాగ మారిపోయిన వివి మంచానికి అంటుకుని ఉన్నారు. ఒంటి మీద మూత్రపు సంచీ మూడు నెలల పాటు అలాగే ఉండిపోయింది. జైలు ఆస్పత్రిలో అది తొలగించడానికి అవసరమైన వైద్య సిబ్బంది లేరు. ఆయనకు తన సహ నిందితుల లోంచే ఇద్దరిని – వర్నన్ గోన్సాల్వెస్, అరుణ్ ఫరేరాలను – ఇచ్చారు. ఆ ఇద్దరే స్టాన్‌కు కూడా సహాయకులుగా ఉన్నారు. జైలులో చేరినరోజే స్టాన్ బాత్ రూమ్‌లో పడిపోయారు. ఆయన జెసూయిట్ సహచరులు రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడిన తర్వాతనే ఆయనకు ఒక మంచం ఇచ్చారు. మొదటినెల అంతా స్టాన్ తన సహనిందితులలో నలుగురిని – వివి, వర్నన్, అరుణ్, ఆనంద్ తేల్తుంబ్డే లను – రోజూ కలవగలిగారు. ఆ నలుగురు కూడా అప్పుడు తలోజా జైలులోని ఆస్పత్రి వార్డులోనే ఉన్నారు.

"జీవితంలో ఎప్పుడూ వెలుగు ఉన్నవైపే చూడండి" అనే సూత్రం ఆధారంగానే తన కష్టభరితమైన జైలు జీవితం గడపడానికి స్టాన్

ప్రయత్నించారు. మొదటి రాత్రి బాత్‌రూమ్ పక్కన నేలమీద పడుకున్నందు వల్ల ఆయన ఒళ్లంతా చీమలు కుట్టాయి. మర్నాడు ఆయన ఆ గాట్లు ఒక సహ ఖైదీకి చూపినప్పుడు, ఆ ఖైదీ 'చీమలు కూడా బతకాలి గదా మరి' అన్నాడట. ఇక అప్పటి నుంచి స్టాన్ తన జైలు జీవితం సాగించడానికి అవసరమైన సూత్రంగా దాన్నే పెట్టుకున్నారని స్టాన్ మరణం తర్వాత నాతో ఫోన్‌లో మాట్లాడుతూ వర్నన్ చెప్పాడు. బైటి ప్రపంచానికి ఆయన తొలిరోజుల్లో రాసిన ఉత్తరాలు ధార్మిక సుభాషితాలు ప్రకటించాయి. "తలోజా జైలులో మానవత వెల్లివిరుస్తున్నది" అని ఆయన రాసిన ఉత్తరం ఇప్పటికే సుప్రసిద్ధమైంది. తన సన్నిహిత మిత్రుడు, సహ జెసూయిట్ ఫాదర్ జో గ్జేవియర్‌కు రాసిన ఆ ఉత్తరంలో "పంజరంలో పక్షి పాడుతుంది..." అని రాసినప్పుడు ఆయన బైటి ప్రపంచానికి తెలియజేయదలచుకున్నదదే.

స్టాన్‌కు పాటలంటే, పాడడమంటే చాలా ఇష్టమట. ప్రతిరోజూ ఇంగ్లిష్, హిందీ పాటలు, అప్పుడప్పుడు ఆదివాసీ భాష హో లో పాటలు పాడుతుండేవారట. గత సంవత్సరం నవంబర్ 3న వివి 81వ పుట్టినరోజున "ఉత్సవం" జరపాలని స్టాన్ నిర్ణయించారట. సహఖైదీ లందరినీ పాటలు పాడమన్నారట. వివి చిరకాలం జీవించాలని ఆకాంక్షిస్తూ తాను స్వయంగా పాడారట. ఆ సమయానికి స్టాన్ లేచి నిలబడగలుగుతున్నారు. వివి మాత్రం మంచం మీదనో, చక్రాల కుర్చీ మీదనో ఉన్నారు.

స్టాన్ లో హాస్య చతురత, పసి పిల్లలలో ఉండే కుతూహలం కూడా ఉండేవి. వర్నన్ కు నా ఉత్తరం ఒకటి చేరినప్పుడు, ఎవరి నుంచి ఆ ఉత్తరం అని అడిగారట. "అది బెటర్‌హాఫ్ నుంచి" అని అరుణ్ చెప్పాడట. "తనకు 'బెటర్' హాఫ్ ఎవరైనా కావచ్చు" అని స్టాన్ పరిహాసం ఆడారట.

తన కళ్ల ముందర వివి ఆరోగ్యం క్షీణిస్తుండడం కచ్చితంగా స్టాన్ మీద ప్రభావం చూపి ఉంటుంది. బొంబాయి హైకోర్టులో సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ జోక్యంతో వివిని మళ్లీ ఆస్పత్రికి (మూడోసారి) పంపారు. చివరికి ఈ సంవత్సరం ఫిబ్రవరిలో వివి ఆరోగ్య కారణాల బెయిల్ మీద విడుదలయ్యారు. స్టాన్ కూడా చివరి దాకా ఆ ఆశతో ఉన్నారట. ప్రతి సాయంత్రమూ తన కోసం జెసూయిట్ స్నేహితులో, న్యాయవాదులో వచ్చి విడిపించుకు పోతారని తయారై ఉండేవారని అరుణ్ ఫరేరా చెప్పాడు. స్టాన్ సాధారణ బెయిల్ దరఖాస్తు 2020 నవంబర్ 26న దాఖలయింది. ఆయన న్యాయవాది షరీఫ్ షేక్ తన వాదనలను నెల లోపలే ముగించాడు. తర్వాత ఏదో ఒక కారణం చెపుతూ నాలుగు నెలల పాటు సాగదీయడానికి ఎన్ఐఎ, ఎన్ఐఎ ప్రత్యేక కోర్టులు మాత్రమే పూర్తి బాధ్యత వహించాలి. స్టాన్ సాధారణ బెయిల్ దరఖాస్తును ఐదు నెలల తర్వాత మార్చ్ 24న ఎన్ఐఎ కోర్టు తిరస్కరించింది.

క్రమక్రమంగా క్షీణించిన ఆరోగ్యం

ఎన్ఐఎ కోర్టు బెయిల్ తిరస్కరించడంతో ఫాదర్ స్టాన్ ఆశావహ దృష్టి మెల్లమెల్లగా సన్నగిల్లడం ప్రారంభమయింది. కాని కొవిడ్–19 రెండో అల తర్వాత, తలోజా జైలులో సహఖైదీలకు కరోనా అంటుకోవడం మొదలయిన తర్వాత, వారిలో కొందరు చనిపోయిన తర్వాత, స్టాన్ ఆరోగ్యం ఒక్కసారిగా బాగా దెబ్బతిన్నది. అప్పుడు సహాయకుడుగా ఉన్న అరుణ్ ఫరేరా చెప్పినదాని ప్రకారం స్టాన్ క్రమంగా తాను ఎప్పటి కైనా స్వేచ్ఛ పొందుతాననే ఆశ కోల్పోయారు. అందువల్లనే మే 21న హైకోర్టు విచారణ సందర్భంగా ఆయన తన సందేహం వ్యక్తం చేశారు. తనను రాంచీకి పంపించమని, లేదంటే నిజమైన సత్యాగ్రహి లాగ తాను జైలులోనే చచ్చిపోవడానికి సిద్ధంగా ఉన్నానని హైకోర్టు జడ్జికి చెప్పారు.

జైలు అధికారుల నిర్లక్ష్యం మరొక భయానకమైన గాథ. స్టాన్‌ను జెజె హాస్పిటల్‌కు తీసుకుపోయిన రోజునే కొవిడ్–19 వ్యాధి లక్షణాలతో ఉన్నారు. అయినా ఆయనకు వాక్సినేషన్ చేశారు. ఆ వాక్సినేషన్ వల్ల మరణం కూడా సంభవించి ఉండవచ్చు. తలోజా జైలు నుంచి జెజె హాస్పిటల్ కు రానూ పోనూ 84 కిమీ ప్రయాణం రెండు మూడు సార్లు చేయడం కూడా ఆయన పరిస్థితిని దిగజార్చి ఉండవచ్చు. బొంబాయి హైకోర్టు అత్యవసర ఉత్తర్వుల ప్రకారం ఆయన మే 29న హోలీ ఫామిలీ హాస్పిటల్ లో చేర్చడం బహుశా తక్షణ మరణం నుంచి ఆయనను అప్పటికి కాపాడి ఉంటుంది. కాని ఆయన ప్రాణాలను, ఆరోగ్యాన్ని కాపాడడానికి అప్పటికే చాల ఆలస్యం జరిగిపోయింది. కొద్ది రోజుల్లోనే ఆయన కొవిడ్–19 పాజిటివ్ గా తేలి, ఐసియు కు తరలించారు. జూలై 5 సోమవారం మధ్యాహ్నం ఒకటిన్నరకు స్టాన్ తుదిశ్వాస విడిచారని రెండున్నరకు డా. ఇయాన్ డిసౌజా హైకోర్టును దిగ్భ్రాంతిపరిచే సమాచారం చెప్పారు. కొవిడ్–19 అనంతర పరిణామాలే మరణానికి కారణమన్నారు.

జైలు అధికారవర్గం, రాష్ట్ర ప్రభుత్వం, ఎన్ఐఎ, ఎన్ఐఎ ప్రత్యేక కోర్టు అందరికందరూ వరవరరావు పట్ల, హనీబాబు పట్ల, స్టాన్ పట్ల ఒక్కలాగనే స్పందించారు, ముగ్గురూ ఆరోగ్య సమస్యల వల్ల ఆస్పత్రిలో చేర్చిన తర్వాత పాజిటివ్‌గా నిర్ధారణ జరిగింది. భీమా కోరేగాం నిందితులు దాఖలు చేసిన బెయిల్ దరఖాస్తులన్నిటికీ ఎన్ఐఎ దగ్గర ఒకే ఒక్క జవాబు – నిందితులు కరోనా మహమ్మారిని అవకాశంగా తీసుకుంటున్నారనేదే. ఈ అర్థరహిత తర్కం ప్రకారం ఈ ముగ్గురూ మహమ్మారిని అవకాశంగా తీసుకోవడానికి తమంతట తామే కొవిడ్–19 అంటించుకున్నారనుకోవాలా? ఇక ఎన్ఐఎ కోర్టు ఈ కరోనా మహా విపత్తు సమయంలో కూడా అన్ని బెయిల్ దరఖాస్తులనూ తిరస్కరించింది. అలా తిరస్కరణకు గురైన వారిలో షోమా సేన్, సుధా భరద్వాజ్ కూడా ఉన్నారు. జైళ్లలో రద్దీని తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికార కమిటీ, హైకోర్టు రూపొందించిన నిబంధనలు యుఎపిఎ కేసుల్లో నిందితులకు వర్తించవని ఎన్ఐఎ కోర్టు ప్రకటించింది.

ఒక రకంగా చెప్పాలంటే స్టాన్ అంతిమ విజయం సాధించారు. ఆయన మరణం ఇవాళ భారత నేర విచారణా వ్యవస్థ ఎంత అక్రమంగా ఉన్నదో బట్టబయలు చేసింది. బహుశా మరణం ద్వారా స్టాన్ ఈ దేశంలో చట్టబద్ధ పాలన సాధించడానికి అవసరమైన సంస్కరణలు ఎంత అత్యవసరమో చెప్పారు. ఆయన తన జీవితం చివరివరకూ పోరాడినది అందుకోసమే.

(రచయిత ముంబైలో న్యాయవాది. భీమా కోరేగాం కేసు నిందితుడు వర్నన్ గోన్సాల్వెస్ సహచరి)

https://thewire.in/rights/father-stan-swamy-tribute-susan-abraham నుంచి అనువాదం. వీ

ఫాదర్ స్టాన్ స్వామి మావోయిస్టా?

***ఫాదర్ స్టాన్ స్వామి వ్యక్తిత్వం, ఆలోచనలు, ఆచరణలు వికసించిన తీరును, ఆయన వ్యక్తిత్వంలోని ప్రధానాంశాలను వివరిస్తున్నారు* ఫిలో వాకర్**

ఫాదర్ స్టాన్ అని ఆయన సన్నిహితులు పిలుచుకుంటారు. ఎల్గార్ పరిషత్ కుట్ర కేసులో చూపిన ప్రకారమైతే ఆ సంబోధనే మావోయిస్టు పరిభాషకు భిన్నమైనది. ఆయన జెసూయిట్ చర్చ్ క్రైస్తవ జీవితం ఎంచుకొని నవ యవ్వనంలోనే మద్రాస్ రాష్ట్రంలోని తిరుచినాపల్లి నుంచి జంషెడ్‌పూర్ పోయాడు. అప్పటికీ అది అవిభక్త బిహార్ రాష్ట్రంలో ఉంది. జంషెడ్‌పూర్ ప్రాంతమంతా ఆదివాసీ ఆవాసాలు. అక్కడి బొగ్గు బావుల్లో, ఉక్కు కర్మాగారంలో పనిచేసే వాళ్లయినా, పరిసర అడవుల్లో ఉన్నవాళ్లయినా ఆదివాసులు. నవయవ్వనంలో ఉండే ఆదర్శాల వల్ల ఆయన జీసస్ క్రీస్తుతో, క్రీస్తు బోధనలు, జీవితం, ఆచరణలతో ప్రభావితం అయ్యాడు. గాయపడిన గొర్రె పిల్లకు కట్టు కట్టడం క్రైస్తవ ధర్మం అనుకున్నాడు. అందరూ ఆరోపణలతో రాళ్లు వేసే అనాథలకు అండగా ఆ రాళ్లు, నిందలు భరించాలనుకున్నాడు. అంటే పాపిలోనూ, నేరస్తునిలోనూ పాపం, నేరం నుంచి మనిషిని వేరుచేసి మనిషిలోని మానవత్వాన్ని మేలుకొల్పాలనుకున్నాడు. అయితే ఆయన జీవకారుణ్యవాదం దగ్గర ఆగిపోలేదు. పీడితుల పక్షం, అభాగ్యుల పక్షం ఉండడమంటే జీసస్ వలెనే రాజ్య ధిక్కారం చేయడం, సిలువ ఎక్కే త్యాగానికైనా సిద్ధపడడం అని గ్రహించాడు.

జెసూయిట్ ఫాదర్ కావడానికి ముందు ఆయన ఫిలిప్పైన్స్ రాజధాని మనీలాకు వెళ్లి ఎంఎ సోషియాలజీ చేశాడు. ఫిలిప్పైన్స్ ఒక నయా వలస రాజ్యం. అక్కడి అప్పటి పాలకుడు అమెరికా తొత్తు మార్కోస్ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. అక్కడి విద్యాలయాలపై అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేక వియత్నాం పోరాట ప్రభావం ఉంది. ఆయన సామాజిక శాస్త్రంలో భాగంగా మార్క్సిజం అధ్యయనం చేశాడు. పురాతత్వ శాస్త్రం, మానుష శాస్త్రాల గురించి మార్క్స్, ఎంగెల్స్‌లు చేసిన అధ్యయనాలు, పరిశోధనలు, ప్రతిపాదనలు ఒంటబట్టించుకున్నాడు. సమాజాన్ని అర్థం చేసుకోవడానికి, మార్చడానికి గతితార్కిక చారిత్రక భౌతికవాదం ఒక ఆధునిక శాస్త్రీయ తత్వశాస్త్రం అని గ్రహించాడు. మార్క్స్ పెట్టుబడి మనిషిలోని మానుషత్వాన్ని పరాయీకరిస్తుంది అనే పరిశీలనలో ఆయనకు మనిషిని కేంద్రంగా చేయడం కనిపించింది.

తన అధ్యయనంలో భాగంగానే ఆయన విప్లవాల పుట్టిల్లయిన ఫ్రాన్స్‌కు పోయాడు. ఫ్రెంచి విప్లవం నుంచి ప్యారిస్ కమ్యూన్ దాకా అధ్యయనం చేశాడు. ఫ్రెంచి భాష నేర్చుకున్నాడు. ఈ పరిణామమంతా ఆయన జెసూయిట్ ఫాదర్ అయ్యే క్రమంలోనే జరిగింది.

అక్కడి నుండి ఆయన బెంగళూర్ ఇండియన్ సోషల్ ఇన్‌స్టిట్యూట్‌కు తిరిగి వచ్చాడు. మార్క్సిస్టు విశ్లేషణ పద్ధతిలో సమాజ శాస్త్ర పాఠాలు చెప్పడం ప్రారంభించాడు. కాని ఎక్కడా జార్గన్ వాడలేదు. స్టాన్ 2020 అక్టోబర్ 9న తలోజా జైలుకు వచ్చాక ఆసుపత్రిలో ఆయనను ఉంచిన బ్లాక్ ముందు కలిసినప్పుడు వర్నన్ గోన్సాల్వెస్ తాను మొట్టమొదటి సారి ఐఎస్ఐలో ఆయన ఉపన్యాసం విని ఉత్తేజం పొందానని చెప్పాడు. మార్క్సిజం వైపు ఆకర్షితుడనయ్యానని చెప్పాడు. ఐఎస్ఐ బోర్డు స్టాన్‌ను డైరెక్టర్ బాధ్యతలు తీసుకొమ్మని ప్రతిపాదించింది. అందుకు తనకీ శిక్షణ చాలదని మరింత అధ్యయనం, శిక్షణ కోసం బ్రెజిల్ పోయాడు. బ్రెజిల్ తదితర లాటిన్ అమెరికా దేశాల్లో మిలిటరీ నియంతృత్వాలకు జెసూయిట్ చర్చిలు శత్రువులుగా, కమ్యూనిస్టులుగా కనిస్తున్న కాలమది. ఒక ఫాదర్ ఒక పాలకుణ్ని అడిగిన ప్రశ్న, దానికి అతడు చేసిన వ్యాఖ్య స్టాన్ మనసు మీద ముద్ర వేసింది. 'ప్రజలు పేదరికంలో ఎందుకున్నారని నేను అధికారిని అడిగాను. నువ్వు కమ్యూనిస్టువా అని ఆయన ఎదురు ప్రశ్నించారు'.

బ్రెజిల్‌లో జెసూయిట్ చర్చిలు లిబరేషన్ థియాలజీ విశ్వసిస్తూ ప్రచారం చేస్తున్న రోజులవి. అంటే విముక్తి మతతత్వం అని అర్థం. పీడిత జన విముక్తిని మతం ద్వారా, చర్చి వేదికగా ప్రచారం చేయాలని. ఈ క్రమంలో సెయింట్ ఫ్రాన్సిస్ వంటి ఎందరో మిలిటరీ నియంతల తుపాకి గుండ్లకు ఎర అయ్యారు. మతం గాయానికి నిట్టూర్పు వంటిది అన్నది మార్క్సిజం. దానిని నిష్కృతిగా మనం పదును పెట్టగలమా అని ఆలోచించింది లిబరేషన్ థియాలజీ. ఇంక అధ్యయనం కాదు, ఆచరణలో దిగాలనే ఆలోచనతో పిఎచ్‌డి కూడా వదిలేసి బెంగళూరుకు తిరిగి వచ్చి 1974 నుంచి 86 దాకా ఐఎస్ఐలో పాఠాలు చెప్పడమే కాదు, బెంగళూరులో ఆ కాలంలో జరిగిన అన్ని సామాజిక ఉద్యమాల్లో, ముఖ్యంగా భూపోరాటాల్లో పాల్గొన్నాడు. అవి ఎక్కువగా దళితుల, బడుగు వర్గాల పోరాటాలు.

అయితే ఆయన మనస్సును ఆవరించి ఉన్నది మాత్రం ఆయన నవయవ్వనంలో చూసిన జంషెడ్‌పూర్ పరిసర ఆదివాసీ ప్రాంతం. ఇప్పటి చైబాసా జిల్లా ఆదివాసీ జీవితం. కనుక 1986లో చైబాసాకు వెళ్లిపోయి బుదర్ అనే గ్రామంలో ఆదివాసీ ఇళ్లలోనే ఉండిపోయి వాళ్ల జీవితమే తన జీవితంగా, వాళ్ల పోరాటమే తన పోరాటంగా ఎంచుకున్నాడు. ఆ జీవిత లక్ష్యానికి 1991లో వచ్చిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అభివృద్ధి నమూనా వ్యతిరేకించవలసిన నమూనా అయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహుళజాతి కంపెనీల దళారీగా మారిపోయాయి. ప్రపంచ వ్యాప్తంగా, ముఖ్యంగా అమెకాలో ఉన్న బహుళజాతి కంపెనీలకు దేశంలోని బడా కంపెనీలకు మధ్య భారతంలోని అడవి మీద, ఖనిజ

సంపదల మీద దృష్టి పడ్డది. ఈ ఖనిజ సంపద విస్తారంగా ఉన్న రాష్ట్రాలు అప్పటి మధ్యప్రదేశ్, బిహార్. 2000 తర్వాత ఛత్తీస్‌గడ్, జార్ఖండ్. 'వి షల్ స్పీక్' అనే స్టాన్ ప్రసంగంలో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు (మండేలా తర్వాత) టుటును కోట్ చేస్తూ ఈ 'మధ్య భారత విధ్వంసాన్ని ఆదివాసులు ప్రతిఘటిస్తున్నారు, వాళ్లు మాట్లాడుతున్నారు, మనం మాట్లాడాలి' అంటాడు స్టాన్.

ఒకవైపు భారత రాజ్యాంగంలో, అప్పటికి 200 సంవత్సరాలుగా దేశ వ్యాప్తంగా ఆదివాసులు చేసిన పోరాటాల ఫలితంగా (సంతాల్ కానూ, సిద్ధు పోరాటం మొదలు 1940ల కొమురం భీం పోరాటం దాకా మళ్లీ వివరంగా పేర్కొననక్కరలేదు. అన్నీ సాయుధ పోరాటాలే. సంప్రదాయ విల్లంబుల నుంచి ఆయుధాలు కావొచ్చు, తుపాకులు కావొచ్చు) 5వ షెడ్యూల్‌లో ఎస్‌టిలుగా గుర్తించిన ఆదివాసీ తెగలకు జల్ జంగల్ జమీన్‌ల మీద హక్కు కల్పించి ఉన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లోనే కాదు రాజకీయ రిజర్వేషన్‌లు కల్పించి ఉన్నారు. అక్కడి నుంచి మరెన్నో అడవి పరిరక్షణ చట్టాలు – పెసా వంటివి వచ్చాయి. అన్నిటి సారాంశం ఆదివాసీ ప్రాంతాలు, నోటిఫైడ్ ఏరియాల్లో భూమిని గాని, అడవి సంపదను గాని, భూగర్భ ఖనిజాలను గాని ఆదివాసేతరులు ఆక్రమించడానికి కాదు కదా, కొనడానికి, లీజుకు తీసుకోవడానికి కూడా వీలులేదు. కొన్ని సంవత్సరాల లీజు కూడా చెల్లదు. ఆదివాసేతరుల అమ్మకాలు, కొనుగోళ్లు చెల్లవు.

ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళ ఉద్యమ నేపథ్యంలో వచ్చిన 1/1970 చట్టం అటువంటిదే. సమతా జడ్జిమెంటుగా సుప్రసిద్ధమైన సుప్రీంకోర్టు తీర్పు దాన్నే పునరుల్లేఖించింది. ఈ చట్ట వివరణల్లో, వ్యాఖ్యానాల్లో ఇంకా స్పష్టత కోసం 1996లో పెసా చట్టం, పంచాయత్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్ ఏరియాస్ చట్టం ఈ ప్రాంతాలలో గ్రామ సభలు పంచాయితీగా ఏర్పడి చేసే నిర్ణయాలే జిల్లా కలెక్టర్‌కైనా శిరోధార్యం అని చెప్పింది. భూరియా కమిటీ రిపోర్టుగా పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్ని కన్నబిరాన్ గారు పార్లమెంట్‌లో ప్రవేశానికి ఒకటే ద్వారం ఉంది గాని బయటికి రావడానికి చాలా దారులున్నాయన్నారు. అమలు విషయంలో తప్పించుకునే దారులన్న మాట. బి.డి. శర్మ అయితే మన రిపబ్లిక్ చరిత్ర అంతా ఆదివాసీ చట్టాల, 5వ షెడ్యూల్ ఉల్లంఘనల చరిత్రే అని 'బ్రోకెన్ రిపబ్లిక్' అని పుస్తకమే రాశాడు.

1996లో వచ్చిన ఈ పెసా చట్టం ప్రకారం ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం స్టాన్ జార్ఖండ్ ఆర్గనైజేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ (జోహార్) అనే సంస్థను స్థాపించాడు. అప్పటికే ఆయన బిహార్ పియుసిఎల్‌లో కూడా ఉపాధ్యక్షుడిగా పనిచేశాడు. 2000 సంవత్సరంలో చిరకాల విశాల జార్ఖండ్ (సంతాలీ, ఆదివాసీ జన సమూహాలు ఉన్న బిహార్, బెంగాల్, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల భూ భాగాలు కలిపి) ఏర్పాటు చేయాలన్న ఆకాంక్షల మీద చన్నీళ్లు చల్లుతూ జార్ఖండ్ ఏర్పడింది. ఇక్కడ ప్రధానంగా ముడి ఇనుము, బొగ్గు విస్తారంగా దొరుకుతాయి. మరెన్నో విలువైన ఖనిజాలున్నాయి. వీటి మీద వేదాంత, మిట్టల్, జిందాల్ వంటి మరెందరో బహుళజాతి కంపెనీల కన్ను పడింది. స్టాన్ కార్యక్షేత్రం రాజధాని రాంచీకి తరలి రావాల్సి వచ్చింది.

అవిభక్త బిహార్‌లో విప్లవోద్యమం కూడా నక్సల్‌బరీ కాలం నుంచి అంటే 1960 నుంచే ఉన్నది. నక్సల్‌బరీ తర్వాత ఏర్పడిన సిపిఐ ఎంఎల్ (1969) లో చేరని దక్షిణ దేశ్ అనే విప్లవ సంస్థ మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ కూడా ప్రజల్లో పనిచేస్తున్నది. అయితే ఇది ఆరంభంలో మైదాన ప్రాంతాల్లో భూస్వాముల, భూమిహార్‌ల దౌర్జన్యాలను, వాళ్ల భూమిసేనల మారణకాండను ప్రతిఘటించేదిగా ఎక్కువగా దళితుల మధ్యన పనిచేసింది. అక్కడి నుంచి ఆదివాసులకు విస్తరించి వారి మధ్య క్షేత్ర స్థాయిలో సాంస్కృతిక, కళా ఉద్యమాలను కూడా నిర్మించింది. రాజీవ్ గాంధీ కాలం నుంచే దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకుపోవడమనే పేరుతో అటు బడా కంపెనీలకు ఆహ్వానాలు, ఇటు ఆదివాసీ ప్రాంతాల్లో అభియాన్‌లు, టాడా పోటా లాంటి చట్టాలు అమలు కావడం ప్రారంభమైంది.

1972లో విప్లవోద్యమం సెట్‌బ్యాక్‌కు గురైన తర్వాత ఏర్పడిన ఎంఎల్ పార్టీలలో ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత బిహార్‌లో సిపిఐ ఎంఎల పార్టీ యూనిటీ ప్రజా ఉద్యమాల పోరాటాల మీద కేంద్రీకరించింది. ఈ పార్టీ నిర్మాతల్లో ఒకరైన నారాయణ సన్యాల్ తెలుగు ప్రజలకు కూడా చిరపరిచితమైన పేరు. 8వ దశాబ్దం విప్లవోద్యమ ఐక్యతా కృషి సందర్భం. ఆ కృషిలో భాగంగా 1999లో పార్టీ యూనిటీ, పీపుల్స్ వార్ ఒకటయ్యాయి. 2004 సెప్టెంబర్‌లో ఈ రెండు ఒకటిగా ఏర్పడిన సిపిఐ ఎంఎల్ పీపుల్స్ వార్, ఎంసిసి కలిసి సిపిఐ మావోయిస్టు ఏర్పడింది. అజ్ఞాత జీవితంలో ఆదివాసుల మధ్యన మొదటి నుంచి ఉంటున్న విప్లవోద్యమం తన సామ్రాజ్యవాద భూస్వామ్య వ్యతిరేక ప్రత్యామ్నాయ పోరాటంలో భాగంగా నిర్ద్వంద్వంగా ప్రపంచీకరణ అభివృద్ధి నమూనాను ప్రతిఘటించింది. ఆదివాసులు సహజంగానే అభివృద్ధి పేరుతో తమ కన్నతల్లి వంటి అడవిలో ప్రవేశించి భూగర్భ ఖనిజాలను తవ్వుకుపోతున్న, అందుకోసం పెద్ద పెద్ద యంత్రాలతో ప్రవేశించి రోడ్లు, డ్యాములు, ప్రాజెక్టులు నిర్మాణం చేస్తున్న కంపెనీలను అడ్డుకున్నారు. అటువంటి వాటిలో నేత్ర ఘాట్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ ప్రాజెక్టును పలామూ – గుమ్లా జిల్లాలలో ఆదివాసులు, విప్లవ పార్టీలు ప్రతిఘటించినప్పుడు, కోయల్ కారో డ్యామును రాంచీ, పశ్చిమ సింగ్‌భూం జిల్లాల్లో వ్యతిరేకించినప్పుడు స్టాన్ స్వామి ఆదివాసుల మధ్యన పనిచేస్తున్నది ప్రముఖ వార్త అయింది.

అడవుల విధ్వంసానికి, ఆదివాసుల విస్థాపనకు వ్యతిరేకంగా స్టాన్ రాంచిలోని జెసూయిట్ ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో బగేచా అనే సంస్థను స్థాపించాడు. వారి నుంచే ఒక ఎకరం భూమి సేకరించి బగేచా ఆఫీస్ నెలకొల్పి అందులో ఒక గది తన కార్యకలాపాలకు పెట్టుకున్నాడు. అది 2004–05 ప్రాంతం. ఈ బగేజాలో స్టాన్‌ను ఎన్నో సార్లు కలిసిన, 30 ఏళ్లుగా ఆయనకు తెలిసిన న్యాయవాది మిహిర్ దేశాయ్ ఆ గది గురించి రాస్తూ 'అందులో ఆయనకు ఒక మంచం, ఒక కుర్చీ, ఒక టేబుల్ దానిపై ఒక కంప్యూటర్ ఉంటాయి. మిగతా స్థలమంతా బాధితులు, వేధింపులకు గురైనవారు, సమస్యలతో వచ్చే, పోరాట కేంద్రానికి వచ్చే ఆదివాసీలదేలి అంటాడు. కనుక ఆయన ఆఫీస్ మీద దాడి చేసి సోదా చేయడానికి రెండు గంటల కాలం కూడా ఎక్కువే అంటాడు. అటువంటి స్థితిలో బగేచాపై పోలీసులు 2018 ఆగస్టు 28న, 2019 జూన్‌లో రెండు సార్లు దాడిచేసి రోజంతా సర్చ్ చేసి కంప్యూటర్, పెన్‌డ్రైవ్‌లు, హార్డ్ డిస్క్‌లు అన్నీ ఎత్తుకు పోయారు. గమనించవలసిన

విషయమేమంటే పూణే పోలీసులు ఆయనను 2018 ఆగస్టు 28 నుంచి కూడా అనుమానితుడు (సస్పెక్టెడ్) గానే చూపారు గాని, ముద్దాయి (నిందితుడు – అక్యూజ్‌డ్) గా చూపలేదు. మహారాష్ట్రలో, జార్ఖండ్‌లో బిజెపి ప్రభుత్వాలు ఓడిపోయాక 2020 జనవరి ఆఖరున కేంద్ర ప్రభుత్వ ఎన్ఐఎ స్టాన్‌ను ముంబయిలోని ఎన్ఐఎ ఆఫీసుకు రమ్మని, ప్రశ్నించాల్సి ఉన్నదని నోటీసులు ఇచ్చింది. ఒత్తిడి పెట్టడం మొదలు పెట్టింది. ఆయన ఎప్పటికప్పుడు రాంచీలోని ఎన్ఐఎ ఆఫీసులో భీమా కోరేగాం సంఘటనతో తనకేమీ సంబంధం లేదని చెప్తున్నాడు. అయితే అప్పటికే ఆయన ఆదివాసులు చేపట్టిన మూడు పోరాటాల్లో క్రియాశీలంగా పాల్గొంటున్నాడు.

2008లో రాంచీలో ఏర్పడి రాంచీ డిక్లరేషన్ ప్రకటించిన విస్థాపన్ విరోధి మంచ్ దేశవ్యాప్త సంస్థగా ఒక దశాబ్దం పైగా ఆదివాసుల విస్థాపనకు వ్యతిరేకంగా పోరాడుతున్నది. ఈ పోరాటాల్లో పాల్గొంటున్న ఆదివాసులను మావోయిస్టుల పేరుతో అరెస్ట్ చేసి రాష్ట్రంలోని వివిధ జైళ్లలో పెడితే ఆ వివరాలన్నీ సేకరించి నాలుగు వేల మంది ఆదివాసులు అట్లా ఏండ్ల తరబడి జైళ్లలో మగ్గుతున్నారని హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. ఇట్లా వేధింపబడుతున్న ఆదివాసులు, రాజకీయ కార్యకర్తల కోసమే పర్‌సెక్యూటెడ్ ప్రిజనర్స్ సాలిడారిటీ కమిటీని ఏర్పాటు చేశాడు. విస్థాపన్ విరోధి మంచ్‌లో గడ్చిరోలి, మహారాష్ట్ర నుంచి క్రియాశీల కార్యకర్త అయిన మహేష్ రౌత్‌ను మావోయిస్టుగా ఎల్గార్ పరిషత్ కేసులో 2018 జూన్ 6ననే అరెస్ట్ చేశారు. విస్థాపన్ విరోధి మంచ్ ద్వారానే తెలుగు సమాజంతో కూడా ఆయనకు బలమైన అనుబంధం ఏర్పడింది. ఆ అనుబంధానికి మరొక సందర్భం 2009లో జన సాంస్కృతిక మంచ్ కళాకారులు జీతన్ మరాండీ, ఆయన మరో నలుగురు సహచరులకు ఉరిశిక్ష పడిన ఉదంతం. విస్థాపకు విరుద్ధంగా ముఖ్యమంత్రి క్యాంప్ ముందు పాటలు పాడుతూ ప్రదర్శనలు ఇస్తుండగా అరెస్ట్ చేసి ఈ ఐదుగురిపై ఒక ఇన్‌స్పెక్టర్‌ను చంపిన కేసు పెట్టారు. ఉరిశిక్షల రద్దుకు భూమయ్య, కిష్టాగౌడ్‌లు మొదలు చలపతి విజయవర్ధనరావుల వరకు విశాలమైన ఐక్య ప్రజా ఉద్యమాలు నిర్మించిన తెలుగు సమాజం దీనికి స్పందించింది.

రచయితలు, కళాకారులు, సాంస్కృతిక కార్యకర్తలు, ప్రజా సంఘాలు విరసం కన్వీనర్ గీతాంజలి కన్వీనర్‌గా ప్రజా కళామండలి, ఎపిసిఎల్‌సి, ప్రజానాట్య మండలి (కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి)ల నాయకత్వంలో హైదరాబాద్‌లో, తెలుగు నేల అంతటా సభలు, ప్రదర్శనలు చేపట్టారు. హైదరాబాద్ సభలో గద్దర్ కూడా పాల్గొన్నాడు. ఈ ప్రేరణతోనే రాంచీలో పియుసిఎల్, జోహార్‌ల చొరవతో స్టాన్ కేంద్రంగా ఒక రోజు సదస్సు జరిగింది. ఈ సదస్సుకు బినాయక్‌సేన్, వరవరరావు, సినీ దర్శకుడు ఆర్. నారాయణమూర్తిని కూడా ఆహ్వానించారు. విరసం, పియుసిఎల్, జోహార్‌ల కృషితో ఒక విశ్రాంత సెషన్స్ జడ్జీ, ఆయన కొడుకు వాదించి హైకోర్టులో కేసు కొట్టేశారు. జార్ఖండ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు పోయినా ఆ పిటిషన్‌ను అడ్మిషన్ దశలోనే తిరస్కరించింది.

2017లో రాంచీలో జరిగిన నక్సల్‌బరీ 50 ఏళ్ల సభలో వరవరరావుతో పాటు స్టాన్ కూడా పాల్గొని అది ఆదివాసులు భూమి, భుక్తి, విముక్తి కోసం చేసిన పోరాటమన్నాడు. అదే సంవత్సరం నవంబర్‌లో జరిగిన బోల్షివిక్ విప్లవ శతజయంతిలో కార్మికుల హక్కులు, పనిగంటలు, చట్టాల గురించి మాట్లాడి ఆ విప్లవంలో కార్మికులు సాధించిన విజయం, అమలు చేసిన కార్మిక చట్టాలు మనకు మార్గదర్శకాలు కావాలన్నాడు.

ఈ రెండు సభలు అయ్యాక ఈ సభలు నిర్వహించిన ఐక్య కార్మిక, ఆదివాసి సంఘం నాయకుడు దామోదర్, అధ్యక్షుడు బచ్చాసింగ్‌లను అరెస్ట్ చేశారు. ఆ సంఘాన్ని నిషేధించారు. స్టాన్ కృషి వల్లనే కొన్ని నెలల తర్వాత వాళ్లు విడుదలయ్యారు.

అరెస్ట్ కన్నా ముందు ఆయనపై రెండు ఆరోపణలు – ఒకటి ఆయన పతల్‌ఘడి పోరాటాన్ని బలపరుస్తున్నాడని. దాని వెనుక మావోయిస్టు పార్టీ ఉందని. ఆ పార్టీతో స్టాన్‌కు సంబంధాలు ఉన్నాయని. రెండవది సుధా భరద్వాజ్‌తో కలిసి ఏర్పాటు చేసిన పర్‌సెక్యూటెడ్ ప్రిజనర్స్ సాలిడారిటీ కమిటీ మావోయిస్టు పార్టీ అనుబంధ సంస్థ అని. ఈ ఇద్దరు ఇప్పుడు ఎల్గార్ పరిషత్‌లో ముద్దాయిలే.

రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్‌లోని హామీలను, పెసా గ్రామ సభ స్వయం పాలన గుర్తింపును గుర్తిస్తూ సంప్రదాయ ఆదివాసీ పోరాట పద్ధతిలో ప్రతి గ్రామ పొలిమేరలో రాతి పలకలపై అవి రాసి సంప్రదాయ వస్త్రాలతో, విల్లంబులతో ఆదివాసీ యువతీ యువకులు కుంతి జిల్లాలో ఆరంభించిన ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా ప్రచారం అయి సంచలనం అయింది. దీని వెనుక మావోయిస్టు పార్టీ, స్టాన్ ఉన్నారని బిజెపి రఘువర ప్రసాద్ ప్రభుత్వం ఆయన ఆఫీస్‌పై దాడిచేసి ఆఫీస్‌లోని వస్తువులను జప్తు చేసి నానా బీభత్సం సృష్టించి ఆయన మీద చాలా కేసులు పెట్టింది. చాల వేధించింది.

2014 నుంచి 17 వరకు బగేచా కేంద్రంగా ఉధృతమైన 5వ షెడ్యూల్ పరిరక్షణ పోరాటం, అందుకోసం పోరాడిన వారిలో నాలుగు వేల మంది ఆదివాసులను మావోయిస్టులుగా రాష్ట్రంలోని వివిధ జైళ్లలో అక్రమ కేసుల్లో ఇరికించి వేధించడానికి వ్యతిరేకంగా పిపిఎస్‌సి పోరాటం, బడా కంపెనీల ఖనిజ సంపద దోపిడీ కోసం ఆదివాసులను నిర్వాసితులను, విస్థాపితులను చేయడాన్ని ప్రతిఘటిస్తూ విస్థాపన్ విరోధి మంచ్ చేపట్టిన పోరాటం జార్ఖండ్‌లో అప్పుడున్న బ్రాహ్మణీయ హిందుత్వ బిజెపి రఘువర ప్రసాద్ కంట్లో కారం చల్లినట్లయింది. పతల్‌ఘడి ఉద్యమం సందర్భంగా స్టాన్‌తో కలిసి 20 మంది మీద పెట్టిన రాజద్రోహం వంటి కేసులు మరికొన్ని 2019 డిసెంబర్‌లో ఆ ప్రభుత్వం పడిపోయినా ఇంకా మిగిలే ఉన్నాయి. అయితే ఇప్పటి హేమంత్ సొరేన్ ప్రభుత్వం పతల్‌ఘడి పోరాటంలో ఆదివాసుల మీద కేసులన్నీ ఉపసంహరించుకున్నది. ముఖ్యమంత్రి స్వయంగా ఎన్ఐఎ స్టాన్ స్వామి యుఎపిఎ కింద అరెస్ట్ చేయడాన్ని ఖండించి, ఇప్పుడు మరణం కస్టోడియల్ మరణం అన్నాడు గనుక ఈ మధ్య కాలంలో స్టాన్ మీద కూడా గత ప్రభుత్వాలు పెట్టిన కేసులు లేనట్లే అనుకోవాలి. అటువంటి వెసులుబాటు ఆయనకు బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వం నుంచి కలుగకుండా చేయడానికే కేంద్ర ప్రభుత్వం అప్పటి దాకా మహారాష్ట్ర బిజెపి ప్రభుత్వం పూణే పోలీసులు అనుమానితుడుగా మాత్రమే చూస్తున్న ఆయనను అరెస్ట్ చేసి నిందితుడుగా చూపింది. కోర్టులో హాజరు పరిచి తలోజా జైలుకు పంపించింది. ఆ రోజే 10 వేల పేజీల చార్జిషీటు

మొదటి 2 దశలలో అరెస్టయిన వారు కాకుండా మిగిలిన అందరిపై సప్లిమెంటరీ చార్జిషీట్ పెట్టింది. ఇందులో స్టాన్ కన్నా ముందు అరెస్టయిన వారి తర్వాత మావోయిస్టు పార్టీ దేశవ్యాప్త కార్యకలాపాలన్నీ ఆ పార్టీ సంబంధాల్లో ఆయనే నిర్వహించినట్లు ఆరోపించింది. ప్రొ. జి.ఎన్. సాయిబాబా అరెస్ట్ తర్వాత ఢిల్లీ కేంద్రంగా మావోయిస్టు పార్టీ జాతీయ, అంతర్జాతీయ కార్యకలాపాలన్నీ ప్రొ. హనీబాబు నిర్వహించినట్లు ఆరోపించింది.

'నేను ఎల్గార్ పరిషత్‌కు పోలేదు. భీమా కోరేగాం సంఘటనలతో నాకు సంబంధం లేదు. కాని ఆ సాకుతో నేనిక్కడ ఆదివాసులతో పాటు వారి మధ్యన వారి కోసం చేస్తున్న పోరాటాల గురించి ప్రభుత్వం నన్ను నిర్బంధిస్తే అందుకు సిద్ధంగానే ఉన్నాను' అని షల్స్పీక్ అనే ప్రసంగాన్ని రికార్డు చేయించి మీడియాకు విడుదల చేసి ఆయన అరెస్ట్‌కు సిద్ధపడ్డాడు.

జైలులో ప్రవేశించగానే ఆసుపత్రి బ్లాకులో ఆయనను కలిసిన వర్నన్, అరుణ్, వివి, ఆనంద్ తేల్తుంబ్డేలకు ఆయన చెప్పిన మాట 'నాకు ఒకందుకు మీ మధ్యకు వచ్చినందుకు సంతోషంగా ఉంది. దళితుల, ఆదివాసుల, మైనారిటీల, మహిళల, పీడితుల హక్కుల కోసం పోరాడిన మీరందరూ ఇంత కాలంగా జైల్లో మగ్గుతూ ఉంటే బయట ఉండి నేను గిల్టీగా ఫీలవుతున్నాను. ఇప్పుడు అపరాధ భావం తొలగిపోయింది. పంజరంలో పక్షి పాడుతూనే ఉంటుంది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల గురించి పాడుతుంది.'

ఎల్గార్ పరిషత్ కేసులోని ముద్దాయిలకే కాదు జైల్లో ఖైదీలందరికీ ఆయన నిరాడంబర, నిజాయితీ జీవితం, సత్య సంధత, సూనృతం, నిర్భీతి, నిబద్ధత పట్ల ఆశ్చర్యం వేసింది. వివిని నవంబర్ 18న నానావతి ఆసుపత్రికి పంపించేవరకు స్టాన్ ఆయనతో, అరుణ్ లేదా వర్నన్‌లతో కలిసి జైలు కారిడార్‌లో వాకింగ్ చేసేవారు. వివి యూరినరీ ట్రాక్ పైపుతో నడక ప్రాక్టీసు చేస్తూ ఉంటే ఆయనను ఉత్సాహ పరుస్తూ ఆయన వెంట నడిచేవాడు. ఆయన వీల్ చేయిర్‌పై సూర్య స్నానానికి పోతే ఆయనతో పాటు అరుణ్ లేదా వర్నన్‌ల వెంట సూర్య స్నానానికి వెళ్లేవారు. తిరిగి వచ్చి ఆ ముగ్గురి సెల్‌లో మెరిసే కళ్లతో ప్రకాశించే వదనంతో హాస్యపూర్వకంగా, కాని దృఢమైన ధైర్య సాహసాలతో కబుర్లు చెబుతూ, పాటలు పాడుతూ కాఫీ తాగేవారు. బైటికి రాసిన ఉత్తరాల్లో తనకన్నా వివి అనారోగ్యంగా ఉన్నాడు గనుక తన జెసూయిట్ మిత్రులకు ఆయన కోసం ప్రార్థనలు చేయమని రాసేవాడు. లేదా తనకు సేవలు చేస్తున్న తోటి ఖైదీ చాల పేదవాడు కనుక ఒక చొక్కా పంపించమని చెప్పేవాడు. ఫోన్లు చేసినా ఇతర ఖైదీల ఆరోగ్యాలు, అవసరాలు చెపుతుండేవాడు. తనకు సిప్పర్ కోసమో, సౌకర్యాల కోసమో అడగలేదు. మొదటి సారి జెజె ఆసుపత్రికి పంపించినప్పుడు మాత్రమే తనకు ఆరోగ్యం బాగుండలేదని ఫోన్ దాకా వచ్చే ఓపిక లేదని జెసూయిట్ మిత్రులకు చెప్పాడు. రెండో సారి ఫోన్ దాకా కూడా వెళ్లలేకపోయాడు. కాని నిజానికి జైల్లోకి వచ్చిన మొదటి 40 రోజుల్లోనే ఒక రోజు ఆయనకు ఊపిరాడని స్థితి వస్తే దినమంతా ఆక్సిజన్ సిలిండర్ ఏర్పాటు చేయవలసి వచ్చింది. అనారోగ్యం వల్లనే 30 మంది ఉండే బ్లాక్ నుంచి వివి, వర్నన్, అరుణ్ ఉండే సెల్‌కు మార్చి మంచం ఇచ్చారు. కొన్నాళ్లు పోయాక వివితో పాటు ఆయనకు స్నానానికి వేడినీళ్లు ఇచ్చారు. మొదట్లో వివికి వచ్చే వేడి నీళ్లే వివికి స్నానం చేయించాక మిగిలినవి తీసుకువెళ్లి ఆయనకు స్నానం చేయించేవారు. వివిని నానావతికి మార్చాక ఆనంద్ తేల్తుంబ్డే రచన కారవాన్ పత్రికలో వచ్చినందుకు కక్షపెట్టుకున్న సూపరింటెండెంట్ ఎల్గార్ పరిషత్ కేసు ముద్దాయిలకు ఉత్తర ప్రత్యుత్తరాలు నిపిలివేశాడు. రోజుకు ఏడు లీటర్ల నీళ్లు మాత్రమే ఇవ్వడం ప్రారంభించాడు. వర్నన్‌ను వేరే సర్కిల్‌కు పంపించి స్టాన్ స్వామికి తోడుగా అప్పటికి ఇచ్చిన సాధారణ ఖైదీలను ఉపసంహరించారు. అప్పటికే మహారాష్ట్రలో తలోజా జైల్లో కరోనా ఉధృతమైంది. జెజె ఆసుపత్రికి పంపించి స్టాన్‌కు కరోనా పరీక్ష చేయకుండానే తిప్పి పంపారు. కోర్టు ఉత్తర్వులపై హాజరు పరిచినపుడు ఈ స్థితిలో తనను తన ప్రజల మధ్యకైనా పంపమని లేదా జైల్లోనే చస్తానని వీడియో కాల్‌లో చెప్పాడు. అది ఆయనను మూడు సార్లు జెజె ఆసుపత్రికి పంపిన చేదు అనుభవం. జైల్లో 2020 నవంబర్ 3న వివి 81వ పుట్టిన రోజు వార్డులో ఖైదీలను పిలిచి జరిపి ఉత్సాహంగా పాటలు పాడిన 84 ఏళ్ల స్టాన్ తానింక బతకనని మాట్లాడే స్థితికి ఆ తొమ్మిది నెలలు ఆయనకు మెడికల్ బెయిల్ కూడా నిరాకరిస్తూ వచ్చిన ఎన్ఐఎ, దుర్భరమైన, కక్షపూరితమైన సూపరింటెండెంట్‌లే బాధ్యులు.

ఎన్ఐఎ కోర్టు 'ఆయన పార్కిన్సన్ మొదలైన అనారోగ్య కారణాల కన్నా ఆయన మీద నేరారోపణల బరువు ఎక్కువ' అని వ్యాఖ్యానించింది. అది నిషేధిత మావోయిస్టు పార్టీతో సంబంధం. ప్రధాని మోడీని రాజీవ్ గాంధీ పద్ధతిలో హత్య చేసే కుట్రలో భాగం. చార్జిషీట్‌లో చూపిన ప్రకారం కూడా ఫాదర్ స్టాన్ స్వామి ఒక జెసూయిట్ ప్రీస్ట్ మావోయిస్టు సభ్యుడు కాగలడా అనేది ప్రైమాఫసీ నిలిచే ఆరోపణ కాదని జడ్జీ భావించి ఉండాలి. జెసూయిట్ ఫాదరేమిటి, మావోయిస్టు ఏమిటి అని సాధారణ మనుషులే ముక్కున వేలేసుకుంటుంటే సంఘ్‌పరివార్ శక్తులకు, ఎన్ఐఎకు, ఎన్ఐఎ కోర్టుకు మాత్రం ఆయన ప్రమాదకరమైన మావోయిస్టుగా కనబడ్డాడు.

స్టాన్ స్పష్టమైన మార్క్సిస్టు విశ్లేషణ చేయగల సామాజిక శాస్త్రవేత్త. చాల ప్రామాణికమైన ఆధారాలతో రాస్తాడు. తన మరణానికి రెండు రోజుల ముందు తనను కామ్రేడ్ అని పిలవమన్నాడని ఆయనను నిత్యమూ కలిసిన ఆయన మిత్రుడు చెప్పాడు. చర్చ్ పీడితుల పోరాట పాఠశాల అని, అది పోరాట పాఠాల వేదిక కావాలని ఫాదర్ స్టాన్ స్వామి ఆశించాడు. ఆయన అరెస్టయినప్పుడు ఆయన జెసూయిట్ మిత్రులు ఆయనకు బైబిల్, పోప్‌పాల్‌తో సెయింట్ ఫ్రాన్సిస్‌ను పోలుస్తూ వెలువడిన ఒక పుస్తకం పంపారు. ఆ సెయింట్ ఫ్రాన్సిస్ లాటిన్ అమెరికా మిలిటరీ నియంతల తుపాకీ గుండ్లకు గురయినవారు. ఒక మార్క్సిస్టును లేదా మార్క్సిస్టు లెనినిస్టును లేదా మావోయిస్టును మావోయిస్టు పార్టీ నిర్మాణంలో భాగమే అన్నట్లుగా ప్రభుత్వం భావిస్తోంది. మోడీ ప్రభుత్వమైతే తనతో లేకుంటే శత్రువుతో ఉన్నట్లే అని ఉదార ప్రజాస్వామ్య వాదులను కూడా వేధిస్తున్నది.

జీసస్ క్రీస్తు తన బోధనలతో, ఆచరణతో, త్యాగంతో ఎటువంటి మనిషి రూపొందాలని అనుకున్నాడో అటువంటి మనిషి ఫాదర్ స్టాన్ స్వామి. ఆదివాసుల జీవితాలు, పోరాటాలు, మార్క్సిస్టు అవగాహన ఆయనను అటువంటి మనిషిగా మలిచాయి.

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

మాటల్లోనే దళితుల సాధికారత

***ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించి, దళితులకు ఇవ్వడానికి భూమే లేదంటూ, బడా కార్పొరేట్లకు భూ బ్యాంకులను ఏర్పాటు చేస్తూ, ఇప్పుడు దళిత సాధికారతంటే వారిని మోసం చేయడమేనని అంటున్నారు* సంతోష్**

తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో సబ్బండ వర్గాలు పోరాడాయి. ఈ పోరాటంలో చైతన్యవంతంగా పాల్గొనడానికి ప్రధాన కారణం తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తమ జీవితాలు బాగుపడుతాయని దళితులు కూడ భావించారు. ఉద్యమ కాలంలోనే, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందే దళితులకు టిఆర్ఎస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చింది. ప్రత్యేక రాష్ట్రం వస్తే తొలి ముఖ్యమంత్రి దళితుడే అని స్వయంగా కెసిఆర్ చెప్పారు. కానీ రాష్ట్రం ఏర్పాటై టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన సిఎం కుర్చీలో కూర్చుని దళితులను మోసంచేశారు. మూడెకరాల భూమి, రిజర్వేషన్ల పెంపు, 120 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో హామీలను టిఆర్ఎస్ సర్కారు తుంగలో తొక్కింది. పైగా దళిత సమాజాన్ని ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా బలహీన పరచాలనే ప్రయత్నాలు చేసింది. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధి, అనుసరిస్తున్న విధానాలు దళితుల ప్రయోజనా లకు పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయి. స్వరాష్ట్రంలో దిగజారిన దళిత స్థితిగతులే దీనికి నిదర్శనం. ఇప్పుడు కెసిఆర్ హుజూరాబాద్ ఉప ఎన్నిక రావడంతో ఓట్ల కోసం దళిత్ ఎంపవర్‌మెంట్ అంటూ కొత్త రాగం తీస్తున్నారు.

దళితులకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడేళ్లుగా అనుసరిస్తున్న విధానాలు గమనిస్తే 'మాటలు కోటలు దాటుతున్నా చేతలు మాత్రం గడప దాటడం లేదు' అన్న చందంగా ఉన్నాయి. ఏడేళ్లుగా దళితులను ఓటు బ్యాంకుగా చూసింది తప్ప వారికిచ్చిన హామీలను ఒక్కటి కూడ నెరవేర్చలేదు. మనదేశంలో, రాష్ట్రంలో రాజకీయవేత్తలు చలాయించే అధికారాలకు అవధులు లేవు. దళితుల జీవితాలలో సువ్యవస్థిత మార్పులకు అవి ఏనాడు కృషి చేయలేదన్నది ఎవరికి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. ఏడు దశాబ్దాల తర్వాత కూడ దళితుల సామాజిక ఆర్థిక స్థితిలో చెప్పుకోదగ్గ గుణాత్మక మార్పులు ఏమి రాలేదు. జీవన వనరులు లేక విద్యా, వైద్యానికి, సామాజిక గౌరవానికి నోచుకోలేక అత్యధికులు దుర్భల జీవితాలనే గడుపుతున్నారని ప్రభుత్వ గణాంకాలే తెలుపుతున్నాయి. మన సమాజంలో దేనినైనా సరే తమ ప్రయోజనాలకు అనుకూలంగా ఉపయోగించుకోగల సామర్థ్యం ఉన్న వ్యక్తులు ఒక్క రాజకీయ నేతలే. మన ముఖ్యమంత్రి కెసిఆర్ ఏది మాట్లాడిన, ఏది చేసినా దాని వెనుక రాజకీయ వ్యూహం ఉంటుంది.

పంచాయితీ నుంచి పార్లమెంటు వరకు ఎన్నుకునే ప్రజలకు శూన్యహస్తాలు, శుష్క వాగ్దానాలే మిగులుతున్నాయి. మన రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమకాలంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే దళితున్ని ముఖ్యమంత్రి చేస్తా అన్నాడు. మన రాష్ట్రంలో దళితులు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉండేది. చంద్రశేఖర్‌రావు దళితున్ని ముఖ్యమంత్రి చేస్తా అన్న వాగ్దానంతో 2014 ఎన్నికల్లో లబ్ధిపొందాడు. తీరా గెలిచాక కావలి కుక్కగా ఉంటా అన్న తానే ముఖ్యమంత్రి అయ్యాడు. ఇది ఆయన దళితులకు చేసిన మొదటి దగా. టిఆర్ఎస్ ఎన్నికల ప్రణాళికలో వెనుకబడిన వర్గాలవారికి, కులాలవారికి హైదరాబాదులో కమ్యూనిటీ హాల్స్ కట్టి ఇస్తామని ప్రకటించి, కొన్ని కులాల వారికి స్థలాలు కేటాయించినా నిధులు ఇవ్వలేదు. ఈ నాటికి ఎస్‌సిలకు అసలు స్థలమే కేటాయించలేదు. దళితులకు రిజర్వేషన్ల పెంపు. ఎస్‌సి వర్గీకరణ, దళిత కుటుంబానికి మూడు ఎకరాల భూమి. బ్యాక్‌లాగు పోస్టుల భర్తీ, వంటి ఎన్నికల హామీల్లో ఏ ఒక్కటి కూడ ఏడేళ్ల కాలంలో అమలుకు నోచుకోలేదు. పైగా కెసిఆర్ పాలనలో దళితులపై దాడులు పెరిగాయి.

ఎప్పుడు పరిస్థితులు ఒకేలాగ ఉండవు. కెసిఆర్ నైజం తెలంగాణ ప్రజలు అర్థం చేసుకున్నారు. ఆయన అనుసరిస్తున్న నిరంకుశ వైఖరి, కుటుంబ పాలన, దగాకోరు మాటలు అర్థం చేసుకుంటున్న వారి సంఖ్య క్రమంగా తెలంగాణలో పెరుగుతుంది. తాజాగా ఖమ్మం జిల్లాకు చెందిన దళిత మహిళ మరియమ్మ యాదాద్రి జిల్లా అడ్డగూడూర్ పోలీసుస్టేషన్‌లో జూన్ 7న పోలీసుల కిరాతక లాఠీ దెబ్బలకు మరణించింది. రాష్ట్ర వ్యాప్తంగా పెల్లుబికిన ఆందోళనలు, హైకోర్టు జోక్యంతో తన పాలన వైఫల్యాన్ని, పోలీసుల కిరాతక, అమానుష చర్యని కప్పి పుచ్చుకోవడానికి హడాహుడిగా ఆమె కుటుంబానికి పరిహారం ప్రకటించి దోషులను శిక్షించకుండా వదిలేశాడు. దళితుల పట్ల కెసిఆర్ వ్యవహరిస్తున్న తీరు ఇది. సమస్యలకు మసిపూసి మారేడు కాయచేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. మరోవైపు టిఆర్ఎస్ నుంచి ఈటల బహిష్కరణ, బిజెపి, కాంగ్రెస్‌ల దూకుడు కెసిఆర్‌లో కంపనం పుట్టించాయనడంలో ఎవరికి సందేహం ఉండనవసరం లేదు. కెసిఆర్‌పై నిరుద్యోగులు కత్తులు నూరుతున్నారు. అన్ని వర్గాల్లో అసంతృప్తి పెరుగుతోంది. ఆయన పార్టీకి, ఆయన అధికారానికి ప్రమాద ఘంటికలు మోగుతున్న వేల ఉపశమన చర్యల అవసరాన్ని ఎత్తుగడగా స్వీకరించాడు. అందుకే దళితులకు సాధికారత అని కొత్త రాగం తీస్తున్నాడు.

ఎన్నికల ఎత్తుగడగా దళిత సాధికారత

కొద్ది రోజుల్లో ప్రతిష్టాత్మకమైన హుజురాబాద్ శాసనసభ్యుని ఉప ఎన్నిక జరుగబోతున్నది. మన రాష్ట్ర ఓటర్లలో ఎస్‌సి ఓటర్లు 18 శాతం ఉన్నారు. హుజురాబాద్‌లో 45 వేల ఎస్‌సి ఓటర్లు ఉన్నారు. వీరి

ఓట్లు రాబట్టుకోవాలంటే ఏదో ఒక గిమ్మిక్ చేయాలి కదా! ఈ నేపథ్యం లోనే జూన్ 27న కెసిఆర్ ఆగమేఘాల మీద ఏడేళ్లలో మొదటిసారిగా అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. అందులో దళితుల స్వావలంబన కోసం ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు 'దళిత సాధికారత' (సిఎం దళిత్ ఎంపవర్‌మెంట్) పథకాన్ని ప్రకటించాడు. 'ముఖ్యమంత్రి దళిత సాధికారత' పథకం కింద తొలి దశలో నియోజకవర్గానికి 100 కుటుంబాలను ఎంపిక చేసి, ఒక్కో కుటుంబానికి రు.10 లక్షలు అందజేయాలని, ఈ డబ్బు నేరుగా వారి ఖాతాల్లోనే వేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లోని 11,900 దళిత కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి. ఈ పథకం కింద దాదాపు రు.1200 కోట్ల ఆర్థిక సహాయాన్ని రైతుబంధు పథకం మాదిరిగానే అందించాలని సమావేశం నిర్ణయించింది.

దళిత సాధికారతపై సిఎం కెసిఆర్ ప్రగతిభవన్‌లో 11 గంటల పాటు అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. మన రాష్ట్రంలో 9 లక్షల పైన దళిత కుటుంబాలు ఉన్నాయి. వీరిలో పన్నెండు వేల మందికి మాత్రమే 10 లక్షలు ఇవ్వడం సముద్రంలో కాకిరెట్టంతా మాత్రమే. బహుశా లబ్దిదారులు 100 శాతం టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అయి ఉంటారనడంలో ఎలాంటి సందేహం లేదు. రాష్ట్రంలో దళిత జనాభాతో పోల్చితే నియోజకవర్గానికి 100 కుటుంబాలు అనేది చాలా తక్కువ. అలాగే లబ్దిదారుల ఎంపికలో అధికార పార్టీ గ్రామ, మండల స్థాయి నేతలు, కార్యకర్తలకే ప్రాధాన్యం ఇస్తారు. ఎస్‌సి కార్పొరేషన్ కింద లబ్దిదారుల ఎంపికలో ఇదే జరుగుతుంది. ఈ ఏడేండ్లలో దళితుల అభివృద్ధికి చేపట్టిన ఏ పనిని సరిగ్గా పూర్తి చేయని ఈ సర్కార్ కొత్తగా ఎత్తుకున్న 'దళిత సాధికారత' అనే రాగం కూడా ఒక మోసపూరిత గిమ్మిక్కే. ఈ మధ్య పార్టీ ఫిరాయింపులు జోరందుకున్నాయి. ఈ తరుణంలో ఎస్‌సి కార్యకర్తలను కాపాడుకోవడానికి ఈ పథకం టిఆర్ఎస్ పార్టీ వినియోగించుకుంటుంది.

ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో రాష్ట్ర ఎస్‌సి అభివృద్ధి, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, కాంగ్రెస్ శాసనసభా పక్ష నేత భట్టి విక్రమార్క, ఎస్‌సి ఎస్‌టి కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, రైతు బంధు సమన్వయ సమితి చైర్మన్ ఎంఎల్‌సి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, ఎంఐఎం ఎంఎల్‌ఏ సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రి, ఎంపిలు బి.వెంకటేశ్ నేత, పోతుగంటి రాములు, పసునూరి దయాకర్, ఎంఎల్‌సిలు ప్రభాకర్‌రావు, డి.రాజేశ్వర్‌రావు, గోరటి వెంకన్న, రాజేశ్వరరావు, ఎంఎల్‌ఏలు బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య, హన్మంతుషిండే, సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, క్రాంతి కిరణ్, కె.మాణిక్‌రావు, కాలే యాదయ్య, మెతుకు ఆనంద్, జి.సాయన్న, గువ్వల బాలరాజు, వి.ఎం అబ్రహం, చిరుమర్తి లింగయ్య, గ్యాదరి కిషోర్‌కుమార్, తాటికొండ రాజయ్య, ఆరూరి రమేశ్, సండ్ర వెంకటవీరయ్యతో పాటు మాజీ మంత్రి కడియం శ్రీహరి, మాజీ ఎంపి మంద జగన్నాథం, ఎస్‌సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న కాంగ్రెసు, వామపక్ష నేతలు ముఖ్యమంత్రి ప్రకటనకు ముగ్ధులై ముఖ్యమంత్రిని ఆహా, ఓహో అంటూ ప్రశంసలతో ముంచెత్తడం ప్రత్యేకంగానే ఉంది. దళితుల విషయంలో కెసిఆర్ తీరును తరచు తామే విమర్శించిన విషయాన్ని మరచిపోయి ప్రతిపక్షాలు వ్యవహరించడం విచిత్రమే. కెసిఆర్ ప్రకటనలు ఎప్పుడూ గొప్పగానే ఉంటాయి. కాని ఆయనకు అమలుచేయాలనే చిత్తశుద్ధి ఉండదు. నిధులు లేకుండానే హామీలు కుమ్మరిస్తాడు. మాటలు ఆచరణలోకి రాకపోతే అవి నీటి మూటలుగా, డాంభికాలుగా మిగిలిపోతాయి. ఏడేళ్ల అనుభవం దాన్నే రుజువు చేస్తోంది.

తెలంగాణ రాష్ట్రంలో 18 శాతం ఎస్‌సి జనాభా ఉంది. ఎస్‌సిల జాబితాలో మొత్తం 59 ఉప కులాలు ఉన్నాయి. ఎస్‌సి కుటుంబాల్లో 70 శాతం గ్రామాల్లో నివసిస్తుండగా 30 శాతం పట్టణాల్లో నివసిస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో అక్షరాస్యత 66.54 శాతం ఉంటే ఎస్‌సిల అక్షరాస్యత 58.9 శాతం మాత్రమే. అంటే దళితులు 7.64 శాతం వెనుకబడి ఉన్నారు. 2014లో చేసిన సామాజిక ఆర్థిక సమగ్ర సర్వే ప్రకారం రాష్ట్ర జనాభాలో ఎస్‌సిలకు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, వ్యవసాయ కూలీ జీవనాధారంగా ఉంది. వీరిలో భూమిలేని కుటుంబాలు 55 శాతం. సరైన ఇల్లు లేనివారు 67.33 శాతం. గ్రామాల్లో కుల వివక్ష, గ్రామ బహిష్కరణలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అట్టడుగు వర్గాలుగా ఉన్న ఉప కులాలలోని ఎస్‌సిలను ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతికంగా అభివృద్ధి చేయడానికి సిఎం దళిత ఎంపవర్‌మెంట్ స్కీం తోడ్పడుతుందా?

దళితుల ప్రత్యేక అభివృద్ధికి 2014-19 మధ్య రు. 69,380 కోట్లు కేటాయించి రు. 32,297 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సిలకు ఏదో చేసినట్టు ప్రచారం చేసుకుంటోందని, తాము ఎప్పుడూ వెనుకబడి, వివక్షకు గురి కావాలా అని ఎస్‌సి సంఘాలు మండిపడుతున్నాయి. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ కాలేదు. విద్య, ఉపాధి అవకాశాలు ఏమాత్రం మెరుగుపడలేదు. ప్రభుత్వ రంగంలో విద్య కునారిల్లుతుంది. స్వయం ఉపాధి ఆచరణకు నోచుకోలేదు. హైదరాబాదులో 5 ఎకరాల్లో మాదిగ భవన్ కట్టిస్తామని సిఎం కెసిఆర్ హామీ ఇచ్చారు. నేటికి భూమి కేటాయింపు చేయలేదు. రెడ్లకు మాత్రం పది ఎకరాల స్థలం కేటాయించి వారి భవన నిర్మాణమునకు నిధులను ఇవ్వడం జరిగింది. రాష్ట్రంలోని 16 మాల సంఘాలు కలిసి మాల సంఘాల సమన్వయ సమితిగా ఏర్పడి సిఎం కెసిఆర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. తమ కులానికి ల్యాండ్ ఇవ్వాలని, బిల్డింగ్ కట్టించాలని కోరాయి. కాని నేటికి పెండింగ్‌లోనే ఉండిపోయింది.

తెలంగాణలో పెద్ద సంఖ్యలో ఉన్న మాదిగ సామాజిక వర్గానికి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం, రోహిత్ వేముల సంఘటన సమయంలో, రాష్ట్రంలో 49 కుల దురహంకార హత్యలు జరిగినా కెసిఆర్ ప్రభుత్వం స్పందించలేదు. పైగా కొన్ని హత్యల్లో అధికార పార్టీ మంత్రులు, ఎంఎల్‌ఏలు హంతకులకు మద్దతిచ్చారు. కెసిఆర్ ఈ ఘటనల పట్ల తన వైఖరి ఏమిటో చెప్పనేలేదు. ఇటీవల కాలంలో నేరెళ్లలో దళితులపై అనేక అక్రమ కేసులు పెట్టిన సందర్భంలోనూ, పంజాగుట్ట ఫ్లైఓవర్ కింద దళిత యువకులు అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పితే కూల్చివేసిన సందర్భంలోనూ కెసిఆర్ వైఖరి ఏమిటో దళిత సమాజం అర్థం చేసుకుంది. దళితులు వేల ఏండ్లుగా దోపిడీకి గురవుతున్నారు. వీరి సంక్షేమాన్ని భారత రాజ్యాంగం నొక్కి చెబుతోంది. ఆరో పంచవర్ష ప్రణాళిక ఎస్‌సిల సామాజిక, ఆర్థిక జీవన పరిస్థితులను మెరుగు

పరచడానికి 'ఉప ప్రణాళిక భావన'ను ప్రతిపాదించింది. దేశ వ్యాప్తంగా ప్రభుత్వాలు వారి జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి, ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలనేది దీని లక్ష్యం. వాస్తవంగా ప్రతి రాష్ట్రం ఎస్‌సి సబ్ ప్లాన్ రూపొందించి వారి ఆర్థిక పరిపుష్టికి కృషి చేయాలి. కానీ పలు రాజకీయ పార్టీలు దళితుల సంక్షేమాన్ని ఎన్నికల తాయిలాలుగా చూస్తున్నారు. అనంతరం వారి సమగ్ర అభివృద్ధిని విస్మరిస్తున్నారు. అందువల్లనే దళితుల పురోగతి శూన్యం. ఈ వెనుకబాటు వలన అనేక మంది దళితులపైన దాడులు, అవమానాలు, హత్యలు, అత్యాచారాలు వంటివి పెరిగాయి. నేరెళ్ల మొదలుకొని రామోజీపేట, అల్మాన్‌పూర్, మరియమ్మ లాకప్ డెత్ వరకు జరిగిన ఘటనలు ఇందుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే.

అమలు కాని దళితులకు మూడెకరాల భూమి

టిఆర్ఎస్ ప్రభుత్వం మొదటిసారి అధికారంలోకి వచ్చిన అనంతరం దళితులకు మూడెకరాల సాగుభూమి పంపిణీ చేస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రంలో 9 లక్షల దళిత కుటుంబాలుంటే గ్రామీణ ప్రాంతాల్లో వీరిలో ఆరు లక్షల కుటుంబాలు ఉన్నాయి. వీరిలో 3.5 లక్షల కుటుంబాలకు సెంటు భూమి కూడా లేదు. వీళ్లందరికీ మూడెకరాల సాగుభూమి ఇవ్వడం లక్ష్యమని టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. 2014-15 బడ్జెట్‌లో ఈ పథకానికి 1000 కోట్లు కేటాయించింది. అయితే ఇప్పటివరకు 6890 మందికి 16,418 ఎకరాల భూమి మాత్రమే పంపిణీ చేసినట్టు ప్రభుత్వ లెక్కలు చెప్తున్నాయి. వాస్తవంగా అమలైతే ఈ భూ పంపిణీ వల్ల మూడు లక్షల కుటుంబాలకు లబ్ది జరిగేది. కానీ, మూడు శాతం లక్ష్యం కూడా చేరకుండానే మూలకు పడ్డది. దీనిలో ప్రభుత్వం భూమి 339.54 ఎకరాలు మాత్రమే. మిగతా భూమిని ఎకరం రు.3 లక్షల నుంచి రు.5 లక్షలు పెట్టి బీడు, రాళ్లు, రప్పలున్న భూములను 16,078.46 ఎకరాలు ప్రైవేట్‌గా కొన్నది. ఇందుకోసం రు. 68,134.23 కోట్ల సబ్ ప్లాన్ నిధులను ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా గ్రామీణ పెత్తందార్లకు కట్టబెట్టింది.

ఇచ్చిన భూమి సాగుచేసుకోవడానికి ఏలాంటి సహాయం అందించ లేదు. రెండేళ్ల తర్వాత రైతులు భూములు అమ్మడంలేదని, భూములు ఇవ్వడం సాధ్యం కాదని అసెంబ్లీలో సిఎం ప్రకటించారు. దళితులకు పంచడానికి భూమిలేదన్న ఇదే ప్రభుత్వం. భూ బ్యాంకు ద్వారా లక్షలాది ఎకరాలను బడా కార్పొరేట్ కంపెనీల కోసం సేకరించడం చూస్తేనే దళితులకు భూపంపిణీపై ప్రభుత్వం వైఖరి ఏమిటో తెలుస్తోంది. దీన్ని టిఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు చేసిన పెద్ద మోసంగా చూడాలి. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం రాష్ట్రంలో 54 లక్షల మంది దళితులున్నారు. అంటే రాష్ట్ర జనాభాలో 17.5 శాతం ఇందులోని 67.4 శాతం మందికి ఒక గుంట భూమి కూడా లేదని సర్వే తేల్చింది. దళితుల జీవితాలు ఇంత దారుణ స్థితిలో ఉంటే ప్రభుత్వం పట్ల వారి అసంతృప్తిని చల్లబరిచి తన తనవైపు తిప్పుకునేందుకు అనూహ్య నిర్ణయాలను ప్రకటిస్తే ఏ మేరకు సఫలీకృతం అవుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది.

సాధికారిత అంటే స్వావలంబన. ఒక కుటుంబం తనకున్న జీవనాధారం ద్వారా తన అవసరాలను తీర్చుకుని సమాజంలో ఆత్మగౌరవంతో తలెత్తుకుని నిలబడటంగా గుర్తించాలి. రాష్ట్రంలో 3 లక్షల దళిత కుటుంబాలు ఉండగా కేవలం 11,900 మందికి పది లక్షలు ఇవ్వగానే దళిత సమాజాన్ని ఉద్ధరించినట్లు ఎలా అవుతుందో ఏలికలకే తెలియాలి. నిజానికి దళితులు అత్యధికంగా వ్యవసాయ కూలీలుగా జీవితాలు గడుపుతున్నారు. వారికి కెసిఆర్ తలపెట్టిన 3 ఎకరాల భూ పంపిణీ పథకం నిజంగా అమలుచేస్తే గ్రామీణ దళితులకు వాస్తవిక సాధికారతను ఎంతో కొంత ఇవ్వగలిగిన పథకం. భూసంస్కరణలను తప్పించుకున్న భూస్వాముల నుంచి మిగులు భూమిని స్వాధీనం చేసుకుని, దళితులకు ఇవ్వాలనుకుంటే ఆ పథకానికి కావలసిన వనరులు సమకూరేవి. మిగులు భూముల పంపకం ద్వారా కాకుండా, భూమిని కొనుగోలు చేసి దళితులకు పంపిణీ చేయడానికి సంకల్పించారు. 3 లక్షలకు ఎకరం చొప్పున కొని ఇవ్వాలని నిర్ణయించిన భూమి విలువ బాగా పెరిగిపోవడం వ్యవసాయ అనుకూలమైన భూములు అందుబాటులో లేకపోవడంతో మూడు ఎకరాల పథకం మూలకు పడేసినాడు. దీంతో దళిత సాధికారతకు కెసిఆర్ సమాధి కట్టాడు.

జనాభా ఆధారంగా బడ్జెట్‌లో ప్రత్యేకంగా వారి అభివృద్ధి కోసం ఖర్చు చేయాలని కేటాయిస్తున్న ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులు ఉమ్మడి పాలనలో రు.25 వేల కోట్లు డైవర్ట్ అయితే ఏడేండ్ల టిఆర్ఎస్ పాలనలో రు.39,228 కోట్లను మళ్లించారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుండే ఈ చట్టాన్ని లేకుండా చేయాలని చూశారు. అవకాశం లేక ఎస్‌సి సబ్ ప్లాన్ చట్టం పేరును ఎస్‌సి ప్రత్యేక అభివృద్ధి నిధిగా మార్చారు. ఈ చట్టంలో ఉన్న సెక్షన్ (3) 11డిలో పేర్కొన్న మౌలిక వసతుల అభివృద్ధి కోసం 7 శాతం నిధులను వాడుకోవచ్చన్న క్లాజును ఉపయోగించి మొత్తం నిధులను డైవర్ట్ చేస్తున్నారు. ఫ్లై ఓవర్లు, పార్కుల అభివృద్ధి పేరుతో కాంట్రాక్టర్ల జేబులు నింపుతున్నారు. వెంటనే సెక్షన్ (3) 11డిని చట్టం నుంచి తొలగించాలని, సబ్‌ప్లాన్ నిధులను స్వతంత్ర నోడల్ ఏజెన్సీద్వారా ఖర్చు చేయాలని, ఖర్చుకాని నిధులు ఆ తర్వాత సంవత్సరానికి క్యారీ ఫార్వార్డ్ చేయాలని దళిత సంఘాలు కోరుతున్నా పట్టించుకోవడం లేదు.

అసైన్డ్ భూములనే లాక్కుంటోంది

తెలంగాణ ప్రాంతంలో 38 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, దీనిలో 25 లక్షల ఎకరాలు సాగుకు యోగ్యమైనదని 2006లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఆమోదించిన కోనేరు రంగారావు కమిటీ రిపోర్టు చెబుతోంది. 73 ఏండ్ల కాలంలో వివిధ సందర్భాల్లో పేదలకు అసైన్డ్ చేసిన భూమి 22 లక్షల ఎకరాలని, దీనిలో సగం భూములను తెల్ల కాగితాలపై సంతకాలు పెట్టించుకుని భూస్వాములు లాక్కున్నారని, వీటిపై సమగ్ర సర్వే చేసి పెత్తందార్ల చేతిలో ఉన్న భూములను స్వాధీనం చేసుకొని పేదలకు ఇవ్వాలని ఆ కమిటీ చెప్పింది. ఇదే పద్ధతిలో ఇనాం, వక్ఫ్ దేవదాయ భూములు అన్యాక్రాంతం అయ్యాయని పేర్కొంది. సమగ్ర భూ సర్వే చేసి భూ సీలింగ్ చట్టం ప్రకారం మిగులు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పంచితే భూమిలేని ప్రతి దళిత కుటుంబానికి రెండు ఎకరాలు ఇవ్వొచ్చని చెప్పింది. కానీ, ఈ పని చేయడానికి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం గానీ, నేటి కెసిఆర్ ప్రభుత్వం గానీ సిద్ధపడలేదు.

తెలంగాణ వచ్చాక కెసిఆర్ ప్రభుత్వం దొడ్డిదారిన సాదా బైనామాల రిజిస్ట్రేషన్ పేరుతో పెత్తందార్లు తెల్లకాగితాలపై అమ్మకాలు కొనుగోళ్లు చేసిన భూములకు పట్టాలిచ్చింది. రెవెన్యూ చట్టంలో మార్పులు తెచ్చి తరతరాలుగా దళితుల కింద ఉన్న ఊరుమ్మడి భూములు.

కేంద్రం గుప్పిట్లో తెలుగు ప్రజలు

కృష్ణా జల వివాదంలో రెండు తెలుగు రాష్ట్రాలు అనుసరిస్తున్న అనుచిత, మూర్ఖపు వైఖరి వల్ల కేంద్ర ప్రభుత్వపు అక్రమ జోక్యానికి వీలు కలిగిందంటున్నారు **అరుణ్**

కేంద్రం మిథ్య అన్నాడానాడు తెలుగుదేశం పార్టీ అధినేత ఎన్‌టిఆర్. కానీ, రాష్ట్రాలను మిథ్యగా మారుస్తున్నది'హిందీ', 'హిందూ', 'హిందూస్తాన్' నినాదాలకు వాస్తవరూపం ఇవ్వడంలో 'అఖండ భారత్' వాదుల కనుసన్ననలో పాలన జేస్తున్న మోడీ అండ్ కో. తమకు అందిన ప్రతి అవకాశాన్ని రాష్ట్రాల అధికారాలను కుంచించి 'ఒకే దేశం' (హిందూస్తాన్), 'ఒకే ప్రజ' (హిందూత్వ వాదులు), 'ఒకే నాయకుడు' (మోదీ) అనే భావనను ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలలో బలంగా నాటగలిగారు. ఆ క్రమంలో, రాష్ట్రాల అధికారాల పరిధిని క్రమంగా రద్దుజేస్తున్నారు. ఆర్టికల్ 370 రద్దు మొదలు, విద్యుత్ రంగ చట్టాలు, కార్మిక చట్టాలు, వ్యవసాయ చట్టాలు ఉమ్మడి జాబితాలో ఉన్నాయనే స్పృహ, చివరకు మధ్యతరగతిలో కూడా లేకుండా జేయగలిగారు. ఇప్పటికే అటవీ సంరక్షణ చట్టాలను నీరుగార్చారు. ఇక ఇప్పుడు జలవనరులపై అధికారం గుండుగుత్తగా తమ చేతుల్లోకి లాగేసుకున్నారు. ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీస్తూ, దేశ వనరులనన్నిటినీ తమ అధీనంలోకి తీసుకొని, వాటిని తమ యాజమానులైన కార్పొరేట్ల పాదాల చెంత నుంచి, వారి సేవలో తరించడమే కమలనాథుల లక్ష్యం. అయితే కేంద్ర ప్రభుత్వానికి, పై గమ్యం చేరేందుకు వివిధ రాజకీయ పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇతోధికంగా తోడ్పడుతున్నాయనేది ఒక చేదు వాస్తవం.

కేంద్రానికి కొన్ని సూటి ప్రశ్నలు: ఒక నదీజలాల నిర్వహణ బోర్డ్ ఏర్పాటుకు అనుసరించాల్సిన మౌలిక ప్రాతిపదికలేమిటి? ఆ నదీ పరీవాహక ప్రాంతాలలో, ట్రిబ్యూనళ్లచే కేటాయించబడ్డ నీటిని కేటాయింపుల మేరకే, ఆయా రాష్ట్రాలు వినియోగిస్తున్నాయా, లేదా నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయా? అని పర్యవేక్షించి తగిన మార్గ దర్శకాలివ్వడమే నదీజలాల నిర్వహణ బోర్డ్ విధి కదా! అలాంటప్పుడు కృష్ణా నదీ మేనేజ్‌మెంట్ బోర్డ్ పరిధిని కేవలం రెండు రాష్ట్రాలకే పరిమితం చేయడానికి, బోర్డ్ పరిధిలో మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల ప్రాజెక్టులను చేర్చకపోవడానికి కారణాలేంటి? ప్రాతిపదికలేంటి? పోనీ వివాదాలను పరిష్కరించడానికే అనుకుందాం, అలాంటప్పుడు వివాదాలు లేని వాటిని చేర్చడమెందుకు? ఈ ప్రశ్నలకు కేంద్ర జలసంఘం, అపెక్స్ కమిటీ జవాబు చెప్పాలి. అయితే వాటిని అడగవలసింది ఇరు రాష్ట్ర ప్రభుత్వాలే.

గతంలో ఎన్నడూ, ఏ బోర్డ్‌కు లేని అధికారాలను ఇప్పుడు కృష్ణా, గోదావరి నదీ బోర్డ్‌లకివ్వడంలో ఆంతర్యమేమిటి? దానికి బీజం కొంతమేరకు విభజన చట్టంలోనే ఉందనాలా? ఆ చట్టంలోని 11వ షెడ్యూల్ సెక్షన్ 87(7)(ఇ) లోని 95 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు బోర్డ్ ఆదేశాలను పాటించకపోతే, కేంద్రానికి ఆర్థిక పరమైన శిక్షలు విధించే అధికారం ఉంది. ఇప్పటికే ఆర్థికంగా రాష్ట్రాలన్నీ చేతులు జాచే పరిస్థితులున్నాయి. దానికి తోడు ఈ బెదిరింపులు. అంతే కాదు, మోడీ ప్రభుత్వం జూన్ 18, 2018 నాడు ప్రకటించిన కావేరీ మేనేజ్‌మెంట్ బోర్డ్ నియమ నిబంధనలను పరిశీలిస్తే, కేంద్ర ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల పట్ల గల వివక్షత స్పష్టం అవుతుంది. కావేరీ మేనేజ్‌మెంట్ బోర్డ్‌లో,

---

మాన్యాలు, అటవీ భూములకు పట్టాలిచ్చే ప్రావిజన్ లేకుండా చేసింది. సాగు చేయడం లేదనే పేరుతో డంపింగ్ యార్డులు, ప్రకృతి వనాల ఏర్పాటు, డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం, స్మశాన వాటికలు, రైతు వేదికలకు దళితుల దగ్గరున్న అసైన్డ్ భూములను లాక్కుంటోంది. ప్రాజెక్టుల నిర్మాణం, నిమ్జ్, ఫార్మాసిటీ కోసం జరిగిన భూ సేకరణలో దళితుల అసైన్డ్ భూమినే బలవంతంగా సేకరించారు. పట్టా భూములతో సమాన పరిహారం ఇవ్వాలనే చట్టం డైరెక్షన్‌ను ఎక్కడా అమలు చేయలేదు. పట్టా భూములకు ఎకరానికి రు. 12.5 లక్షలు చెల్లిస్తే అసైన్డ్ భూములకు రు. 4 లక్షలకు మించి ఇవ్వని ప్రభుత్వం దళితుల సాధికారిత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది.

ముగింపు

ఏడేళ్ల టిఆర్‌ఎస్ పాలనలో దళితులను ఓటు బ్యాంకుగానే చూసింది. ఎన్నికల ప్రణాళికలో చేసిన హామీలు అమలు చేయలేదు. ఎన్ని గొప్ప మాటలు చెప్పిన అవి అమలుకు నోచుకోకపోతే అవి చెత్తబుట్టలో వేసే చిత్తుకాగితం లాగానే మిగులుతాయి. టిఆర్‌ఎస్ ఇచ్చిన హామీలలో అమలైనవెన్నో, అమలు కానివెన్నో సమీక్షించుకొని వాటి సాధనకు దళితులు ఐక్యంగా ఉద్యమించడం తప్ప మరో మార్గం లేదు. మన రాష్ట్రంలో బలంగా ఉన్న ప్రజా ఉద్యమాలను బలహీనపరిచే కుట్రలు కెసిఆర్ అదేపనిగా చేశారు. బలంగా ఉన్న ఎంఆర్‌పిఎస్‌ను చీల్చి ఉద్యమ గొంతు నొక్కిన ఘనశాలీ మన ముఖ్యమంత్రి. దళితుల విముక్తికి తోడ్పడే నిర్మాణాత్మక చర్యలను ఉపేక్షించి ఇప్పుడు దళిత సాధికారత ప్రకటించాడు. ఈ పథకం అర్హులైన దళితులందరికి వర్తించేలా అప్రమత్తంగా ఉండాలి. గత పథకాల్లాగా ఈ పథకం కూడ ప్రకటనకే పరిమితం కాకుండా ఉద్యమించాలి. మన రాష్ట్రంలో 70 శాతం దళితులు వ్యవసాయం జీవనాధారంగా జీవిస్తున్నందున ప్రతి కుటుంబానికి రెండు ఎకరాల వ్యవసాయ యోగ్యమైన భూమి ఇవ్వడం ద్వారానే దళిత సామాజిక వర్గానికి సామాజిక న్యాయం కల్పించినట్లవుతుంది. అందుకు దళితుల ఐక్య ఉద్యమాలు తప్ప మరో మార్గం లేదు.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

సంబంధిత కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి ప్రతినిధులు సభ్యులుగా ఉండడం గమనార్హం. నేటి కృష్ణా బోర్డ్‌లో, రెండు రాష్ట్రాలకు ప్రాతినిధ్యమే లేదు. అంతా కేంద్ర మయం. కావేరీ బోర్డ్ పరిధిలో ఒక రెగ్యులేటరీ కమిటీ ఉంటుంది. అన్ని రాష్ట్రాలకు చెందిన చీఫ్ ఇంజనీర్ స్థాయి గల వారు సభ్యులుగా ఉంటారు. తమ అభిప్రాయాలను వ్యక్తం జేసే, వాదనలను విన్పించే అవకాశం ఉంది. అంతేగాదు, కావేరీ మేనేజ్‌మెంట్ బోర్డ్ నిర్వహణకై కేంద్రం తన వంతుగా రు. 2 కోట్లు ప్రకటించింది కూడా. మరి మన రెండు రాష్ట్రాల మాటేమిటి? రాష్ట్రాల హక్కులకై పోరాడడానికి మరో రామారావు, కరుణానిధి లాంటి వాళ్లు కావాలా?

ఇక రెండు రాష్ట్రాల పరిస్థితి-ఒక ఒంటెను తలదూర్చడానికి తావిస్తే, గుడారం మొత్తాన్ని ఆక్రమించిందని చెప్పిన అరబ్బు కథ జ్ఞాపకం వస్తుంది. కృష్ణా జలాల వినియోగంలో తలెత్తిన చిన్నపాటి వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోక, పంతాలకుపోయి, 'త్వం శుంఠ' అంటే 'త్వం శుంఠ' అని రెండు పిల్లుల్లాగా తిట్టుకుంటూ, కోతి (కేంద్రం) చేతికి పరిష్కార బాధ్యత అప్పగించారు. ఇప్పుడు వారిజుట్లు కేంద్రం చేతిలో ఉన్నాయి. వారు ప్రజలను రెచ్చగొట్టి ఓట్లు, సీట్లు పొందవచ్చేమో గాని, దీర్ఘకాలికంగా నష్టపోయేది ఇరు రాష్ట్రాల ప్రజలే. అందులోనూ, మరీ ముఖ్యంగా కరువు పీడిత రాయలసీమ, ప్రకాశం, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలే.

విచిత్రమేమిటంటే దశాబ్దాల కిందటే పూర్తయి నీరందిస్తున్న గురురాఘవేంద్ర ఎత్తిపోతలను అనుమతి పొందని వాటిలో చేర్చడం. అసలు ఆ ప్రాజెక్ట్ అదనంగా నీటిని ఎత్తి పోయదు. తుంగభద్ర దిగువకాలువకు కేటాయించిన 27.5 టిఎంసిలకు గాను, దానికింది ఆయకట్టు ఏనాడూ 10-15 టిఎంసిల కన్నా ఎక్కువ జలాలను పొందడం లేదు. ఆ ఆయకట్టు స్థిరీకరణకై చేపట్టినదే ఆ ఎత్తిపోతల. కేటాయించిన నీటిని వాడుకునేందుకు, రాష్ట్ర విభనకు దశాబ్దాల పూర్వం నిర్మించినదానికి అనుమతి లేదనడం దుర్మార్గం.

అలాంటిదే, ముచ్చుమర్రి ఎత్తిపోతల. కెసి కాలువకు కేటాయించిన 39.9 టీఎంసీలకు గాను నిలువజేసుకొనే రిజర్వాయర్ లేకపోవడంతో కెసి ఆయకట్టుదారులు ఏనాడూ 20 టీఎంసీలు వాడుకోలేక పోతున్నారు. దానికి ప్రత్యామ్నాయమే ముచ్చుమర్రి ఎత్తిపోతల.

ఇక వేదవతి ఎత్తిపోతల. దీనికి ఎవ్వరి అనుమతి అవసరం లేదనేది జల నిపుణుల అభిప్రాయం. రాష్ట్రానికి కేటాయించిన 12.47 టీఎంసీల వేదవతి జలాలకు గాను, గత 43 సంవత్సరాల (1965-66 నుండి 2007-08) రాష్ట్రం వాడుకున్నది సగటున సంవత్సరానికి కేవలం 6.77 టీఎంసీలు మాత్రమే. కనుక మిగిలిన 5.7 టీఎంసీలు వాడుకునే హక్కు రాష్ట్రానికి ఉంది. కానీ, విషాదమేమంటే సంబంధిత అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం కనీసం డిపిఆర్ సమర్పించకపోవడమే. రాష్ట్ర సాగునీటి అధికారులు సరైన సమాచారం ఇవ్వకపోవడం వల్ల, తగిన వాదనలు విన్పించకపోవడంతో గురురాఘవేంద్ర, ముచ్చుమర్రి, వేదవతి లిఫ్ట్‌లు ఇప్పుడు ప్రశ్నార్థకమయ్యాయి.

ఇంకొక విచిత్రం దశాబ్దాలుగా తుంగభద్ర బోర్డ్ పరిధిలో ఉన్న తుంగభద్ర ఎగువకాలువ, తుంగభద్ర దిగువకాలువలను కృష్ణాబోర్డ్ పరిధిలోనికి తేవడం. అంటే, ఇక తుంగభద్ర బోర్డ్‌కు కాలం చెల్లినట్టేనా? మరి, ఇంతవరకు దాని పరిధిలో ఉన్న కర్నాటక ప్రాజెక్టుల మాటేమిటి? అంటే, తుంగభద్రా జలాలను వినియోగించే కొన్ని ప్రాజెక్టులు కృష్ణా బోర్డ్ పరిధిలో, మరికొన్ని తుంగభద్ర బోర్డ్ పరిధిలో ఉంటాయను కోవాలా? ఇదేం తలతిక్క వ్యవహారం?

ఇప్పటి నోటిఫికేషన్ సీమను ఎడారి ప్రాంతంగా శాశ్వతత్వం ఆపాదించబోతుంది. ఈ నోటిఫికేషన్ ప్రకారం ఇంతవరకు అనుమతి పొందని ప్రాజెక్టులకు 6 నెలలలోగా అనుమతి పొందాలి. అనుమతికి ముందస్తు షరతు నీటి కేటాయింపులనే విషయం చెప్పక్కర్లేదు. దాంతో, ఇంతవరకు, బచావత్ పుణ్యమా అంటూ మిగులు జలాలపై నిర్మించిన, నిర్మిస్తున్న హంద్రీ-నీవా, గాలేరు-నగరి, వెలిగొండ, తెలుగు గంగ ఇప్పుడు నికరజలాల కేటాయింపులు లేవనే సాకుతో అనుమతులు పొందడం కష్టం. వాటి కింద మొత్తం 18 లక్షల 84 వేల 5 వందల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకమవుతుందని వేరే చెప్పాలా. మరి కృష్ణాబోర్డ్ ఏర్పాటును స్వాగతిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వ పెద్దలు, సలహా దారులు, ప్రభుత్వ కొంగుపట్టుకున్న మేధావులు ఏమంటారో? నష్టం జరిగేది సీమకే కదా, ఎటూ కరువుకు అలవాటు పడ్డవారేనని మిన్నకున్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు.

అయితే, అనుమతులు పొందడమెలా? బ్రిజేష్ కమిటీ తీర్పు అధికారికంగా వెలువడితే, మిగులు జలాలనూ పంపిణీజేశాడు కనుక, పైన తెలిపిన ప్రాజెక్ట్‌లకు అనుమతి పొందే అవకాశమే ఉండదు. మరి ఉన్న ప్రత్యామ్నాయలేమి? కొత్త ట్రిబ్యునల్ వేసినా రాష్ట్రానికి ఒరిగేదేమీ ఉండదు. కృష్ణా నదిలో ఇక కేటాయించడానికి నీరే లేదని చెబుతున్నారు. అందువల్ల రాజారాం కమిటీ సలహా మేరకు ఇప్పుడు కేటాయింపబడ్డ 811 టీఎంసీల కృష్ణా జలాలను పునఃపంపిణీ జేయక తప్పదు. కృష్ణా జలాలపై ఆధారపడ్డ ప్రాంతాలలో వ్యవసాయ యోగ్యమైన భూమిలో ప్రతి ఎకరానికి, కనీసం ఒక పంటకు నీరిచ్చేలా చూడాలి. ఒక టీఎంసీకి 15,000 ఎకరాల చొప్పున 811 టీఎంసీలతో దాదాపు 12 కోట్ల 16 లక్షల 5 వేల ఎకరాలకు నీరందించవచ్చు. ఒకవేళ జలాలు మిగిలితే, ఇంతకాలం రెండు, మూడు పంటలు, చేప, రొయ్యల చెరువుల ఫలాలు పొందుతున్న డెల్టాకే కేటాయించవచ్చు. అదే సహజ న్యాయం. ముందు నుండి అనుభవిస్తున్నాం కాబట్టి, ఎప్పటికీ మేమే అనుభవిస్తాం అంటే కుదరదు. పోతే, జగన్ రెడ్డి మోడీ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నాడు కాబట్టీ తన పరపతినుపయోగించి శ్రీశైలం, సాగర్ రిజర్వాయర్లలోని నిల్వ 150 టీఎంసీలను, మిగులు జలాలపై ఆధారపడ్డ తెలంగాణ నెట్టెంపాడు, కల్వకుర్తిలకు, రాష్ట్రానికి చెందిన హంద్రీ-నీవా, గాలేరు-నగరి, వెలిగొండ ప్రాజెక్టులకు కేటాయించేలా పాటుపడాలి. కృష్ణా డెల్టా అదనంగా పొందుతున్న పట్టిసీమ నీళ్లు సీమ ప్రాజెక్టులకు కేటాయించాలి. అంతకన్నా ముఖ్యంగా రాజన్న రాజ్యం అంటూ ఎప్పుడూ ఊదరగొట్టే జగన్, ఆ రాజన్ననే మొదలుపెట్టి, దాదాపు రు. 500 కోట్లు ఖర్చుజేసిన దుమ్ముగూడెం-సాగర్ టెయిల్ పాండ్ ఎత్తిపోతలను జాతీయ ప్రాజెక్ట్‌గా ప్రకటించేలా చూడాలి. వీటికవసరమైతే, తెలంగాణ ప్రభుత్వ సహకారం తీసుకోవాలి కూడా. అంతేగానీ తన వ్యక్తిగత ప్రయోజనాలకై, ఓటు బ్యాంక్ రాజకీయాలతో సీమ ప్రజలకు ద్రోహం జేస్తే, నేటి తరం గాకపోయినా భవిష్యత్ తరం క్షమించదు.

(రచయిత కన్వీనర్, రాయలసీమ విద్యావంతుల వేదిక) వీ

పెగాసస్, ఆర్సెనాల్ - చెల్లని భీమా కోరేగాం కేసు

భిన్నాభిప్రాయాలు ఉన్నవారి ఫోన్లలో జొరబడి వారి సంభాషణలను, ఫొటోలను, కదలికలను సంగ్రహించడం జరిగిందని వెల్లడైన నేపథ్యంలో భీమా కోరేగాం కేసు గురించి చర్చిస్తున్నారు **ఆనంద్ వెంకటనారాయణ్**

భిన్నాభిప్రాయాలు ఉన్నవారి ఫోన్లలో జొరబడి వారి సంభాషణలను, ఫొటోలను, కదలికలను సంగ్రహించడం జరిగిందని వెల్లడైన నేపథ్యంలో భీమా కోరేగాం కేసు గురించి చర్చిస్తున్నారు ఆనంద్ వెంకటనారాయణన్

రాజకీయ నాయకుల మీద, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారి మీద, జర్నలిస్టుల మీద, కార్యకర్తల మీద భారత ప్రభుత్వం ఒక స్పైవేర్ ఉపయోగించి గూఢచర్యం చేసిందని పెగాసస్ సమాచారం బైటపడిన వెలుగులో భీమా కోరేగాం కేసును మళ్లీ కొత్తగా, నిశితంగా పరిశీలించవలసి ఉంది.

భీమా కోరేగాం కేసు అనేక రకాలుగా ఒక ప్రత్యేకమైన కేసు. కాని ఒక విషయంలో అది మరింత ప్రత్యేకమైనది. ఈ కేసులో మాల్ వేర్ ఉపయోగించి "సాక్ష్యాధారాలను" నిందితుల కంప్యూటర్లలో జొప్పించారని ఆర్సెనాల్ విడుదల చేసిన మూడు నివేదికలు బహిర్గతం చేశాయి. ఆ నివేదికలను అర్థం చేసుకోవాలంటే కంప్యూటర్ ఫోరెన్సిక్స్ మీద, మాల్ వేర్ విశ్లేషణ మీద కొంత ప్రావీణ్యత అవసరమవుతుంది, కాని ఈ కింది పరిశోధనా ప్రాథమిక సూత్రాలను అర్థం చేసుకుంటే ఆ నివేదికల్లోని విశ్లేషణలను అర్థం చేసుకోవచ్చు.

మొదట మనం డిజిటల్ ఫోరెన్సిక్స్ తో ప్రారంభిద్దాం.

డిజిటల్ ఫోరెన్సిక్స్ మౌలికాంశాలు

ఫోరెన్సిక్స్ ను సాధారణంగా నేరాలను, న్యాయస్థానాల్లో వినియోగించే సాక్ష్యాధారాలను పరిశోధించడానికి శాస్త్రీయమైన పద్ధతుల వినియోగం అని నిర్వచిస్తారు. భీమా కోరేగాం కేసుకు సంబంధించినంతవరకు, ప్రాసిక్యూషన్ చూపుతున్న అత్యంత ప్రధానమైన సాక్ష్యాధారాలు అరెస్టయిన కార్యకర్తల హార్డ్ డిస్కులలో, కంప్యూటర్లలో ఉన్నాయని చెపుతున్న డాక్యుమెంట్లు. స్పష్టంగా ఈ డాక్యుమెంట్లు అరెస్టయినవారి కంప్యూటర్లలో ప్రారంభమయ్యాయని, ఇతరులందరికీ డిజిటల్ మాధ్యమాల ద్వారా (ఇమెయిల్ ద్వారా) పంపిణీ అయ్యాయనేదే పాసిక్యూషన్ వాదనకు మూలాధారం.

మూలం ఏమిటనే ప్రశ్న

అయితే ఆర్సెనాల్ చేసిన అధ్యయనంలో కేంద్రీకరించిన అంశం, డిజిటల్ ఫోరెన్సిక్స్ పద్ధతిని వర్తింపజేయడం ద్వారా ఈ డాక్యుమెంట్ల మూలం ఏమిటనేది అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం. ఆర్సెనాల్ నివేదికను వివరించడానికి ముందు కంప్యూటర్లు సమాచారాన్ని ఎలా నిలువ చేస్తాయో, ఎలా క్రమబద్ధీకరిస్తాయో తెలుసుకోవడం అవసరం.

అన్ని డిజిటల్ పరికరాలు (మొబైల్ ఫోన్లు, డెస్క్ టాప్‌లు, లాప్ టాప్‌లు, స్మార్ట్ ఫోన్లు) ఫైళ్లను అంతరాల వ్యవస్థ పద్ధతిలో నిలువ చేస్తాయి. ఇది సరిగ్గా పెద్ద గ్రంథాలయాల్లో పుస్తకాలను సర్ది పెట్టి, నిలువ చేసే పద్ధతిలా ఉంటుంది. ఆ పద్ధతిని పట్టికలో చూద్దాం.

ఈ పద్ధతి వల్ల ప్రతి ఫైలు గురించీ తెలుసుకోవడానికి, దాని గత చరిత్ర మొత్తాన్నీ పునర్నిర్మించడానికీ, ఎప్పుడు ఏమి జరిగిందో, ఎందుకు జరిగిందో పరీక్షించడానికీ వీలవుతుంది. సూచికనూ, లాగ్స్ నూ ఆర్టిఫాక్ట్ (పురావస్తువులు) అంటారు. ఏ నేర స్థలంలోనైనా సేకరించిన డిజిటల్ పరికరంలో ఉన్న ఆర్టిఫాక్ట్స్ ను పరీక్షించడానికి ఫోరెన్సిక్ లాబరేటరీలలో ప్రత్యేకమైన పరికరాలను వాడుతారు. చివరికి డిలిట్ చేసిన (తొలగించిన) ఫైల్స్‌ను కూడ తవ్వితీసి పరీక్షించడానికి సెల్లెబ్రిటి వంటి పరికరాలు ఉన్నాయి.

మాల్ వేర్ ద్వారా జొరబడిన ఫైళ్లను ఆర్సెనాల్ ఎలా గుర్తించింది?

కంప్యూటర్ మాల్ వేర్ కూ, ఇతర రకాల సాఫ్ట్ వేర్లకూ ఉండే ప్రాథమికమైన తేడా ఏమంటే, మాల్ వేర్ అనేది ఆ డిజిటల్ పరికరం వాడుతున్న వ్యక్తికి తెలియకుండా రహస్యంగా తన పనులు సాగిస్తుంది. సాధారణంగా ఆ పరికరం వాడుతున్నవారికి తెలియకుండానే ఆ పరికరంలో దాన్ని ప్రవేశపెడతారు. తద్వారా ఆ పరికరంలో ఉన్న సమాచారాన్ని బైటికి లాగగలుగుతారు. సాంకేతిక పరిభాషలో ఈ పనిని ఎక్స్ ఫిల్ట్రేషన్ అంటారు.

ఆర్సెనాల్ నివేదికలు కనిపెట్టిన ప్రకారం, 2012 నుంచీ ఉనికిలో ఉన్న నెట్ వైర్ అనే అందరికీ తెలిసిన మాల్ వేర్ ను ఉపయోగించి ఈ కార్యకర్తల కంప్యూటర్లలో కొన్ని డాక్యుమెంట్లను ప్రవేశపెట్టారు. ఇక్కడ సహజంగా తలెత్తే ప్రశ్న ఏమంటే, ఏ కంప్యూటర్ తోనూ సంబంధం లో లేని, నిర్జీవంగా ఉన్న హార్డ్ డిస్క్ మీద కేవలం ఫోరెన్సిక్ విశ్లేషణ పరీక్షలు మాత్రమే జరిపి వాళ్లు ఈ విషయం ఎలా కనిపెట్టగలిగారు?

చాల కష్టతరమైన అవరోధంగా కనిపించే ఈ ప్రశ్నకు జవాబు లాగ్ బుక్ లో దొరుకుతుంది. ఆ డిజిటల్ పరికరంలో జరిగిన ప్రతి పనినీ లాగ్ బుక్ నమోదు చేసి ఉంటుంది గనుక, ఆ లాగ్ బుక్ ఆ కార్యకర్తల కంప్యూటర్ల గురించి సమగ్రమైన చిత్రాన్ని చూపగలుగుతుంది. ఆ పరికరంలో మాల్ వేర్ ను ఎప్పుడు ప్రవేశపెట్టారనే దానితో సహా ఎన్నో వివరాలు తెలుస్తాయి. ఆ మాల్ వేర్ ఒక ఇంటర్నెట్ మూలం నుంచి ఇమెయిల్ ద్వారా, ఇమెయిల్ లో అటాచ్ మెంట్ ముసుగు వేసుకుని, ఈ కంప్యూటర్‌లోకి ప్రవేశించింది. కంప్యూటర్ లో కనబడని అంతర్భాగంగా మారిపోయింది.

సూత్రం	గ్రంథాలయం	డిజిటల్ పరికరం
అంతరాల వ్యవస్థ	విడివిడి పుస్తకాలన్నిటినీ వాటి విషయాలను బట్టి వేరు చేసి, వేరువేరు బీరువాల్లో నిలువ చేస్తారు (ఉదా: కళ, స్వయంశిక్షణ, వగైరా)	విడివిడి ఫైళ్లన్నిటినీ ఫోల్డర్‌లలో నిలువ చేస్తారు. ఆ ఫోల్డర్‌లకు వాటి విషయాన్ని బట్టి పిక్చర్స్, వీడియోస్, డాక్యుమెంట్స్, వగైరా పేర్లు పెడతారు
సూచిక	సూచికలో గ్రంథాలయంలో ఉన్న ప్రతి పుస్తకమూ ఏ బీరువాలో, ఏ వరుసలో ఉందో, అదే పుస్తకం దాని విషయాన్ని బట్టి మరే విషయ పరిధిలోకి వస్తుందో రాసి పెడతారు	సూచికలో హార్డ్ డిస్క్‌లో ఆ ఫైల్ ఎక్కడ, ఏ ఫోల్డర్‌లో ఉందో, దాని పరిమాణం ఎంతో, అది సృష్టించినది ఎవరో, దాన్ని చివరిసారి ఎప్పుడు తెరిచారో, దానిలో మార్పులు చేస్తే ఎప్పుడెప్పుడు మార్పులు చేశారో నమోదై ఉంటుంది.
లాగ్ బుక్	ప్రతి గ్రంథాలయంలోనూ లాగ్ బుక్ అనే పెద్ద ఆవర్జా పుస్తకంలో, ప్రతి పుస్తకమూ ఎప్పుడెప్పుడు ఎవరెవరు తీసుకుపోయారో, ఎప్పుడు తిరిగి ఇచ్చారో, అసలు పుస్తకం ఎప్పుడు కొన్నారో, అది పనికిరాదని పారేసి ఉంటే ఎప్పుడు ఎలా పారేశారో వివరాలుంటాయి.	ప్రతి కంప్యూటర్‌లోనూ ఫైల్ సిస్టంలో ఫైళ్ల గురించి సమస్త సమాచారమూ నమోదవుతుంది. ఆ ఫైల్ ఎప్పుడు తెరిచారు, ఎప్పుడు మూసేశారు, ఎక్కడికైనా బదిలీ చేశారా, దాని పేరు మార్చారా, ఎప్పుడైనా తొలగించారా, ఎప్పుడైనా విద్యుత్ లోపం వల్లనో, హార్డ్ డిస్క్ లోపాల వల్లనో ఆ ఫైల్ అర్థాంతరంగా ముగిసిపోయిందా, కరప్ట్ అయిందా అన్ని వివరాలూ ఉంటాయి.

'సాక్ష్యాధారాల' చొరబాటును నిర్ధారిస్తున్న నెట్ వైర్ లాగ్‌లు, లాగ్ బుక్

సాధారణంగా మాల్ వేర్‌ను ఒక పరికరం నుంచి సమాచారం బైటికి లాగే గూఢచార పనులకు ఉపయోగిస్తారు. అందువల్ల అలా లాగిన సమాచారం చేర్చడానికి ఒక గమ్యస్థానం ఉండాలి. అది బైటపడిపోతుంది గనుక సమాచారాన్ని నిరంతరాయంగా పంపడం జరగదు. ఒక ఫైల్ సిస్టంలో సమాచారాన్ని పోగు చేసి, దాన్ని నిర్ణీత కాలాల్లో పంపిస్తారు. ఇలా వేరు వేరు సమయాల్లో బదిలీ జరుగుతుంది గనుక లాగ్ బుక్ మీద ఫోరెన్సిక్ పరీక్ష జరిపినప్పుడు ఈ గూఢచార చర్య బైటపడిపోతుంది. ఇలా పోగు చేసిన సమాచారపు కుప్పను ఆర్సెనాల్ "నెట్ వైర్ లాగ్స్" అని పిలిచింది.

ఆ సమాచారం ఎక్కడికి (కమాండ్ అండ్ కంట్రోల్ సర్వర్ అంటారు) చేరిందో చూపే సూచనలను కూడ "నెట్‌వైర్ లాగ్స్" ద్వారా గ్రహించవచ్చు. మీ ఇంట్లో జరుగుతున్న సంభాషణలన్నిటినీ ఒక గూఢచార పరికరం ద్వారా సేకరించి, వాటిని బైట వీథిలో ఎక్కడో పెట్టిన రికార్డింగ్ పరికరానికి పంపించడంతో దీన్ని పోల్చవచ్చు. కాకపోతే ప్రస్తుత సందర్భంలో ఈ రికార్డింగ్ పరికరం ఎక్స్‌ఎక్స్‌ఎక్స్. జాప్టో.ఆర్గ్ అనే సర్వర్ గా తేలింది. ఈ సర్వర్ ప్రపంచంలో ఎక్కడైనా ఉండవచ్చు.

నెట్‌వైర్ లాగ్స్‌నూ, లాగ్ బుక్ నూ పరీక్షిస్తే మరొక విషయం కూడ బైటపడింది. ఈ మాల్‌వేర్ ఈ పరికరంలోని సమాచారాన్ని బైటికి ఎక్స్‌ఎక్స్‌ఎక్స్.జాప్టో.ఆర్గ్‌కు పంపించడం మాత్రమే కాదు, అది బైటి నుంచి పరికరాల్లో రహస్య స్థలాల్లోకి కొన్ని ఫైళ్లు చొరబడేట్టు చేసింది. అలా చొరబడిన ఫైళ్ల ఆధారంగానే అరెస్టులు జరిగాయి. అంతే కాదు, ఈ చొరబాటుదారు ఒక ముఖ్యమైన పొరపాటు కూడ చేశాడని ఆర్సెనాల్ నివేదిక గుర్తించింది. ఇలా చొరబరచిన ఫైళ్లన్నీ వర్డ్ 2010 లో తయారై ఉండగా, కార్యకర్తల కంప్యూటర్లలో వర్డ్ 2007 అనే పాత నమూనా అవకాశం మాత్రమే ఉంది. దాని ఆధారంగా ఇలా జొరబడిన ఫైళ్లను తయారు చేయడం సాధ్యం కాదు.

ఈ డాక్యుమెంట్ల మూలం ఏమిటనే చివరి చిక్కుముడి కూడ "లాగ్‌బుక్" ద్వారా విడిపోతుంది. లాగ్ బుక్ ప్రకారం తమ కంప్యూటర్లలో ఉన్న ఈ ఫైళ్లలో ఏ ఒక్కదాన్నీ ఏ ఒక్క కార్యకర్తా తెరిచి చూడలేదు. ఆర్సెనాల్ బైటపెట్టిన సమాచారమంతా చాల విశ్వసనీయమైనది. నెట్‌వైర్ మాల్‌వేర్ గురించి ఒక దశాబ్దంగా మాల్ వేర్ పరిశోధకులు లోతుగా పరిశీలించి ప్రపంచానికంతా తెలియజేసిన విషయాలతో అది సరిగ్గా సరిపోతుంది.

ఆర్సెనాల్ నివేదిక భీమా కోరేగాం కేసును ఎట్లా బద్దలు కొడుతుంది?

1. ఈ డాక్యుమెంట్లను ఈ పరికరాల్లో సృష్టించలేదు.
2. ఈ పరికరాల్లో ఈ డాక్యుమెంట్లను ఒక్కసారి అయినా తెరవలేదు.
3. ఈ డాక్యుమెంట్లను ఈ పరికరాల్లో నెట్‌వైర్ మాల్‌వేర్ ప్రవేశపెట్టింది. ఆ మాల్ వేర్ కు ఈ డాక్యుమెంట్లు ఎక్స్‌ఎక్స్‌ఎక్స్.జాప్టో.ఆర్గ్ అనే కమాండ్ అండ్ కంట్రోల్ సర్వర్ నుంచి అందాయి.

అనే మూడు విషయాలను ఆర్సెనాల్ నివేదిక రుజువు చేసింది గనుక ప్రస్తుతానికి కార్యకర్తల మీద కేసు సంపూర్ణంగా కుప్పకూలిపోతుంది.

ఇది సరిగ్గా ఎటువంటి కేసంటే, ఒక వ్యక్తి ఇంట్లో మాదకద్రవ్యాలు దొరికాయనే ఆరోపణకు వ్యతిరేకంగా,

1. ఆ మాదకద్రవ్యాలను ఆ వ్యక్తి తయారు చేయలేదు.
2. ఆ మాదకద్రవ్యాలను ఆ వ్యక్తి సేకరించలేదు.
3. ఆ మాదక ద్రవ్యాలను ఆ వ్యక్తి వినియోగించలేదు.
4. దొంగ తాళం చెవితో, ఇంటివారికి తెలియకుండా ఆ ఇంట్లో ప్రవేశించిన మాదకద్రవ్యాల వ్యాపారి ఆ ఇంట్లో ఆ మాదకద్రవ్యాలు పెట్టాడు.

అని రుజువు చేయడం లాంటిది.

మాల్ వేర్ ప్రవేశపెట్టినవారిని ప్రభుత్వం సులభంగా కనిపెట్టగలదు

ఆ మాల్ వేర్ ఎవరు ప్రవేశపెట్టారో వివరించడం గాని, ఊహించడం గాని ఆర్సెనాల్ నివేదిక చేయలేదు. అది వారి పరిధికి మించిన

హక్కుల నేత స్టాన్‌స్వామి మృతి

ఆదివాసుల హక్కుల కోసం మూడు దశాబ్దాలకు పైగా ఉద్యమించిన స్టాన్ స్వామి(84) ముంబైలోని ఆసుపత్రిలో మరణించారు. మావోయిస్టులతో సంబంధాలు, భీమా కోరేగాం కేసులో నేరారోపణలతో జాతీయ దర్యాప్తు సంస్థ తొమ్మిది నెలల క్రితం ఆయనను అరెస్టు చేసి జైలులో నిర్బంధించింది. తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో బాంబే హైకోర్టు ఆదేశాలతో మే 29న ముంబైలోని ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటికే పార్కిన్‌సన్ వ్యాధి, కొవిడ్ తదితర సమస్యలతో బాధపడుతున్న ఆయన జూలై 5న మృతిచెందారు. అనారోగ్యం రీత్యా బెయిల్ మంజూరు చేయాలన్న పిటిషన్‌పై విచారణ జరుపుతున్న ధర్మాసనం తాజా వైద్య నివేదిక గురించి అడుగుతున్న సమయంలోనే స్టాన్ స్వామి మరణించిన విషయాన్ని న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. కొవిడ్ సోకిన స్టాన్ స్వామికి సకాలంలో, సరైన వైద్యం అందకుండా ఎన్ఐఏ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆయన తరపు న్యాయవాది మిహిర్ దేశాయ్ ఆరోపించారు. ఆయన మరణం గురించి న్యాయవిచారణ జరిపించాలని ధర్మాసనాన్ని న్యాయవాది కోరారు. స్టాన్ స్వామి మరణంపై పలువురు రాజకీయ నేతలు, హక్కుల సంఘాల నాయకులు, మేధావులు తీవ్ర విచారం వ్యక్తంచేశారు. కుట్ర పూరితంగా స్టాన్ స్వామిని కేసులో ఇరికించి, బెయిల్ రాకుండా చేసిన ఎన్ఐఏ, కేంద్ర ప్రభుత్వం ఆయన మృతికి బాధ్యత వహించాలని పలువురు డిమాండ్ చేశారు.

వ్యవహారం. కాని ఐఐటి కాన్పూర్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ సందీప్ శుక్లా చెప్పిన ప్రకారం, ఈ ఎక్స్ఎక్స్ఎక్స్.జాప్టో.ఆర్గ్ అనే డొమెయిన్ యజమాని ఎవరో కనిపెట్టి ఆ సర్వర్ ద్వారా ఎవరు ఈ పని చేసి ఉంటారో కనిపెట్టడం ప్రభుత్వానికి చాల సులభమైన పని.

ప్రమాద సమాచారాన్ని సేకరించే నిఘాసంస్థల డాటా బేస్‌ను పరిశీలిస్తే, సరిగ్గా ఈ కార్యకర్తల కంప్యూటర్లలో డాక్యుమెంట్లను ప్రవేశపెడుతున్న సమయానికే (2016 జూన్ 13), 'డ్రాపింగ్ ఎలిఫెంట్' అనే ముసుగు పేరు పెట్టుకున్న మరొక చొరబాటుదారు కూడ భారతదేశం నుంచే పనిచేశారని, అక్కడి నుంచి చొరబరచిన మాల్‌వేర్ కూడ ఎక్స్ఎక్స్ఎక్స్.జాప్టో.ఆర్గ్ కే సమాచారం పంపుతున్నదని 2016 జూలైలో తెలిసింది.

ఈ చొరబాటుదారు ఎన్నో దౌత్య, ప్రభుత్వ సంస్థల కంప్యూటర్లలోకి జొరబడి ప్రత్యేకంగా చైనా కార్యకలాపాల మీద సమాచారం సేకరిస్తున్నాడు. ఈ చొరబాటుదారు కార్యకలాపాల పద్ధతి కూడ అచ్చంగా ఆర్సెనాల్ నివేదికలో చూపినట్టుగానే ఉంది.

ట్రెండ్ మైక్రో సంస్థ వెలువరించిన మరొక బహిరంగ నివేదిక (2020 డిసెంబర్ 9) ప్రకారం ఇదే డొమెయిన్ (ఎక్స్ఎక్స్ఎక్స్.జాప్టో.ఆర్గ్) నుంచే మరొక చొరబాటుదారు పాకిస్తాన్, చైనా, బంగ్లాదేశ్, నేపాల్ దేశాల కంప్యూటర్లను లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నారని తెలిసింది.

ఈ మొత్తం వ్యవహారానికి అర్థమేమంటే ఈ కార్యకర్తలకు వ్యతిరేకంగా సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టడానికి, వారిని ఇరికించడానికి గణనీయమైన పరిమాణంలో నిధులు, వనరులు, సమయం వెచ్చించడం జరిగింది. ఈ పని అంతా ఎవరో కిరాయి చొరబాటుదారు చేసి ఉండవచ్చు. ఆ చొరబాటుదారే కొన్ని జాతి రాజ్యాల గూఢచార సంస్థలతో కలిసి పనిచేసి ఉండవచ్చు.

వాటాలి తీర్పు తప్పులను ఆర్సెనాల్ నివేదిక సరిచేయగలుగుతుందా?

సుధా భరద్వాజ్‌కు బెయిల్ నిరాకరించడానికి ఉపయోగించుకున్న వాటాలి తీర్పు చాల ప్రమాదకరమైనదని న్యాయవాదులు కాలిన్ గోన్సాల్వెస్, గౌతం భాటియా ఇప్పటికే రాసి ఉన్నారు. ప్రాసిక్యూషన్ డాక్యుమెంట్ల మీద ఆధారపడి బెయిల్ నిరాకరించవచ్చుననీ, ఆ డాక్యుమెంట్లకు విచారణ సమయంలో సాక్ష్యాధారాలుగా ఉండే అర్హత లేకపోయినా సరేననీ వాటాలి తీర్పు ప్రకటించింది.

మాల్ వేర్ ల వంటి గూఢచార పరికరాలు ఈ సమస్యను మరింత జటిలం చేస్తాయి. ఎందుకంటే:

- మాల్ వేర్ మీద పరిశోధన జరపడానికి పెద్ద ఎత్తున నిధులు అవసరమవుతాయి. ఆ పని ఇప్పటికే జాతి రాజ్యాలు, వాటి ప్రైవేట్ సంస్థలు మాత్రమే చేయగలుగుతున్నాయి. అందువల్ల ప్రత్యర్థి వాదనల వాతావరణంలో, విశాల భౌగోళిక కారణాల వల్ల విచారణ సమయంలోనైనా ఆ పరిశోధన చేయడం న్యాయస్థానాలకు చాల కష్టమవుతుంది.
- జాతి రాజ్యాల మద్దతు ఉన్న కిరాయి చొరబాటుదారుల చేతిలో అత్యంత ఆధునికమైన పరికరాలు ఉంటాయి. వారు సురక్షితమైన సైనిక పరికరాల్లోకి కూడ చొరబడి డాక్యుమెంట్లను ప్రవేశపెట్టగలరు. మాల్ వేర్ తయారీ, పంపిణీ ఖర్చులు ఇటీవలి కాలంలో తగ్గినప్పటికీ, వాటికి వ్యతిరేకంగా రక్షించుకోవడానికి న్యాయస్థానాలలో వాదనల ఖర్చు చాల పెరిగింది.

వాటాలి తీర్పు నిజమైన విషాదం ఇదే. సాంకేతికంగా ఉన్నత స్థానంలో ఉన్న రాజ్యం పౌరుల డిజిటల్ పరికరంలో తన ఇష్టం వచ్చిన డాక్యుమెంట్లను ప్రవేశపెట్టవచ్చు, ఆ డాక్యుమెంట్ల ద్వారా తీవ్రవాద చట్టాల కింద కేసు పెట్టవచ్చు, బెయిల్ వచ్చే ఆశ లేకుండా చేయవచ్చు. విచారణ ప్రక్రియ అత్యంత కష్టభరితంగా ఉండవచ్చు. ఆ పౌరులు తాము నిరపరాధులమని తామే నిరూపించుకోవలసిన స్థితి రావచ్చు. బహుశా ఈ ప్రక్రియలో వారిని దోషులుగా కూడ నిర్ధారించి శిక్షలు వేయవచ్చు. అంటే, విస్పష్టంగా చట్టవ్యతిరేక చర్యలకు న్యాయపరమైన అనుమతి లభించినట్టే.

బహుశా భీమా కోరేగాం కేసు కూడ చిట్టచివరికి విచారణ జరిగితే, అనివార్యమైన హైకోర్టుకు అప్పీళ్ల ప్రక్రియ కూడ సాగితే, సుప్రీం కోర్టు ముందుకు వచ్చినప్పుడు వాటాలి తీర్పును కొట్టివేయవలసి వస్తుంది.

(రచయిత దేశంలోకెల్లా సుప్రసిద్ధమైన సైబర్ సెక్యూరిటీ పరిశోధకులు, గోప్యతా వ్యవహారాల నిపుణులు)

https://www.thequint.com/voices/opinion/after-pegasus-and-arsenal-reports-can-bhima-koregaon-case-still-stand? వీ

బిజెపిది కూడా ఎమర్జెన్సీ ఆధిపత్య తత్వమే

ఎమర్జెన్సీ వ్యతిరేక దినాన్ని ఉత్సాహంగా జరుపుతున్న సంఘ్ పరివార్ శక్తులు కూడా ఎమర్జెన్సీ కన్న ఘోరమైన అణచివేతను సాగిస్తున్నాయంటున్నారు **చరిత**

2014లో బిజెపి మెజారిటీగా ఉన్న ఎన్‌డిఏ కేంద్రంలో అధికారానికి వచ్చినప్పటి నుంచీ ప్రతి సంవత్సరం జూన్ 25-26 అర్ధరాత్రి ప్రధాని ఇందిరా గాంధీ ప్రకటించిన ఆంతరంగిక భద్రతా చట్టం (ఎమర్జెన్సీ) హరించిన జీవించే హక్కు మొదలు, ప్రాథమిక హక్కుల గురించి ప్రధాని మోడీ మొదలు జిల్లా స్థాయి నాయకుల వరకు గుండెలు బాదుకుని మాట్లాడుతున్నారు. అప్పటికి బాధితులు కానివాళ్లు కూడ తామే బాధితులైనట్లు మాట్లాడుతున్నారు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, ప్రాథమిక హక్కులు, ప్రజాస్వామ్యంలో విశ్వాసం ఉన్నవాళ్లు అందరూ బాధితులైనా కాకున్నా మాట్లాడవలసిందే. కాని ఈ ఏడేళ్లుగా మోడీ నాయకత్వంలోని కేంద్రమైనా, బిజెపి నాయకత్వంలోని రాష్ట్రాలైనా చేస్తున్నదదే. ఎమర్జెన్సీలో డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్, మీసా ఎంత దుర్వినియోగమయ్యాయో గత ఏడేళ్లుగా యుఏపిఏ, ఇతర అప్రజాస్వామిక చట్టాలు అంతకన్న ఎక్కువ అమలవుతున్నాయి. బిజెపి పూర్తిగా మౌనం వహిస్తున్నది. ఎమర్జెన్సీలో జైల్లోపెట్టి, బయట కూడ సామాజిక వర్గాలుగా అందరికన్నా ఎక్కువగా నిర్బంధానికి గురిచేసింది ముస్లింలను, మైనారిటీ హక్కుల గురించి మాట్లాడే వాళ్లను, ఆదివాసులను, దళితులను, వాళ్ల హక్కుల గురించి మాట్లాడే వాళ్లను. ఆదివాసీ, దళితులకు సంబంధించినంతవరకు 1975కు పూర్వం 1967 నుంచి కూడ ఆ సామాజిక వర్గాలు ఎక్కువగా అడవిలో, కొండల్లో ఆదివాసులుగా, మైదాన ప్రాంతాల్లో (బీహార్, పంజాబ్) దళితులుగా వాళ్లు నక్సలైట్ ఉద్యమంలోను, సానుభూతి పరులుగానే ఉన్నారు.

ముందు ముస్లింల విషయం చూద్దాం. జమాయితే ఇస్లాం వంటి సంస్థనే కాకుండా, మిలిటెంట్‌గా కనిపించిన ముస్లిం సంస్థలన్నిటినీ నిషేధించి నాయకత్వాన్ని, కార్యకర్తలను జైళ్లలో పెట్టారు. యుపి మొదలు హిందీ రాష్ట్రాలుగా పిలువబడుతున్న అయిదు రాష్ట్రాలలో నిర్విచక్షణగా అవివాహిత ముస్లిం యువకులకు కూడ చేసిన నిర్బంధ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, ఢిల్లీ నగర సుందరీకరణ కొరకు ముస్లింలు నివసించే తుర్క్‌మన్‌గేటులోని బస్తీలను బుల్‌డోజర్లతో నేలమట్టం చేయడం జరిగింది. ప్రపంచ బ్యాంకు నగరీకరణ, కుటుంబ నియంత్రణ ఆదేశాలను ఎమర్జెన్సీలో అమలుచేసిన రాజ్యాంగేతర అధికారం సంజయ్ గాంధీది. ఈ కుఖ్యాతి వల్లనే ఎమర్జెన్సీ తర్వాత ఎన్నికల్లో ఈ అయిదు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోయింది. నక్సలైట్లుగా పిలువబడే సిపిఐ ఎంఎల్ పార్టీ ఏర్పడింది 1969 ఏప్రిల్ 22ననే కాని అన్ని ఎంఎల్ పార్టీలు మొదటిసారిగా నిషేధించబడింది 1975 జూలై 4నే. అప్పటికింకా తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు నాయకత్వంలో ఉన్న యుసిసిఆర్ఐ ఎం.ఎల్ కూడ నిషేధానికి గురయింది. అనారోగ్యంతో ఉస్మానియా అసుపత్రిలో చేర్చిన తరిమెల నాగిరెడ్డి అజ్ఞాత జీవితంలోనే 1976 జూలై 28న అమరుడయ్యాడు. 1967లో రాజీనామా చేయడానికి ముందు ఆయన శాసనసభలో ప్రతిపక్ష నాయకుడు. నీలం సంజీవరెడ్డి, ఆయన ఒకరి సోదరిని ఒకరు చేసుకున్నారు.

ఎంఎల్ పార్టీల నిషేధం పార్టీల వరకే పరిమితం కాలేదు. ఆర్.ఎస్.యు, పి.డి.ఎస్.యు, డి.ఎస్.యు వంటి విద్యార్థి సంఘాలు, ఎ.పి.సి.ఎల్.సి, విరసం వంటి అన్ని సంస్థల నాయకత్వం, సభ్యులు కూడ వందల, వేల సంఖ్యలో ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జైళ్లలో ఎమర్జెన్సీ ఎత్తివేసేంతవరకు నిర్బంధంలో మగ్గారు. 1977 ఫిబ్రవరిలో ఎన్నికలు ప్రకటించగానే బిజెపి నాయకులు, కార్యకర్తలతో సహా అన్ని ఎన్నికల పార్టీల వాళ్లు విడుదలయ్యారు. పై ప్రజా సంఘాల నాయకులు, సభ్యులు మాత్రం 18 మంది ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత పార్లమెంట్ మార్చ్ 31న మీసా చట్టాన్ని రద్దు చేసేదాకా కూడ జైల్లో ఉండాల్సి వచ్చింది.

ఎమర్జెన్సీలో నిషేధింపబడిందని చెప్తున్న ఆర్.ఎస్.ఎస్. వినోబాభావే ఎమర్జెన్సీని అనుశాసన పర్వమని ప్రకటించగానే బాలాసాహెబ్ దేవరస్, నానాజీ దేశ్‌ముఖ్‌లు కూడ అదే ప్రకటన చేసి ఇందిరా నియంతృత్వాన్ని సమర్థించారు. మద్రాసులో ఉండి అరెస్టు కాని శ్రీశ్రీ మద్రాసు వెళ్లిన వెంగళరావును, 'ఇందిరా లెఫ్ట్ డిక్టేటర్‌షిప్'ను, ఇరవై సూత్రాలను స్వీయ చర్మ రక్షణ కోసం పొగిడిన మాట నిజమే గానీ, వంద మంది కూడ లేని విరసం సంస్థలో ముప్పై మందికి పైగా ఎమర్జెన్సీ కాలమంతా రాష్ట్రంలోని వివిధ జైళ్లలో ఉండి, కార్యదర్శి కె.వి. రమణారెడ్డి శ్రీశ్రీని అభిశంసిస్తూ సస్పెండ్ చేస్తూ జైలు నుంచే లేఖ రాశాడు. మద్రాసులో ఉన్న కుటుంబరావు కూడ మందలించాడు. 77లో విజయవాడలో జరిగిన విరసం సర్వసభ్య సమావేశానికి క్షమాపణ లేఖ రాసి సాధారణ సభ్యుడుగా కొనసాగించమని కోరి శ్రీశ్రీ విరసంలోకి వచ్చాడు. మరణించేదాక (1983) అట్లే కొనసాగాడు.

ప్రపంచవ్యాప్త ఉద్యమం వల్ల, పత్తిపాటి వెంకటేశ్వర్లు, తర్వాత కాలంలో కె.జి. కన్నబిరాన్ అన్ని పార్టీల నుంచి కూడగట్టిన మద్దతు వల్ల (జె.పి. వాజ్‌పేయి, జార్జి ఫెర్నాండెజ్, చంద్ర రాజేశ్వరరావు, జైపాల్ రెడ్డిలతో సహా) 1974 డిసెంబర్, 75 మేలలో ఆగిన భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్ష అమలు చేయడం ప్రభుత్వానికి ఎమర్జెన్సీలోనే డిసెంబర్ 1న సాధ్యమైంది. ఎమర్జెన్సీ లేకుంటే సాధ్యమయ్యేది కాదు. నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాలు 1972లోనే సెట్ బ్యాక్‌కు గురైనప్పటికీ ఆంధ్రప్రదేశ్, పంజాబ్‌లలో ఆ ఉద్యమ ప్రభావం ప్రజాస్వామిక శక్తులు, విద్యార్థులు, బుద్ధిజీవుల మీద, రైతాంగం, కార్మిక సంఘాల మీద బలంగా ఉన్నది. కనీసం ఐదారు ఎం.ఎల్. పార్టీలు ఎంతో కొంత బలంతో ప్రజల్లో పనిచేస్తున్నాయి. అందుకే జయప్రకాశ్ నారాయణ్ స్థాపించిన

ఉపశమనం లేని ఉద్దీపన ప్యాకేజీలు

కరోనాతో చితికిపోయిన ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడానికి ప్రభుత్వం ప్రకటించిన ఉద్దీపనలు కార్పొరేట్‌లకు మేలుచేశాయి తప్ప, ప్రజల కొనుగోలు శక్తిని పెంచలేకపోయాయని అంటున్నారు **డా. ఎ. పున్నయ్య**

ప్రజల పట్ల, పాలనా విధానాల పట్ల దార్శనికతలేని పాలకుల ఏలుబడి కారణంగా నేడు కరోనా విపత్తు ఆర్థిక వ్యవస్థతో పాటు మానవ జీవితాల్ని చిదిమేస్తున్నది. ప్రభుత్వానికి గత సంవత్సరం కరోనా విజృంభించిన అనుభవం ఉన్నప్పటికీ, రెండవ వేవ్ నుండి ప్రజలను రక్షించడంలో ఘోరంగా విఫలమైంది. మూడవ దశ ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ నేటికీ శాశ్వత నివారణపై శ్రద్ధ చూపకపోవడంతో ప్రభుత్వ గణాంకాల ప్రకారమే సుమారు 4 కోట్లకు పైగా జనం కరోనా వ్యాధిగ్రస్థులు అయినారు. అందులో సుమారుగా 3.90 లక్షల వరకు మరణించారు. దీనికి ఎన్నో రెట్లు అధికంగా (18–24 లక్షల మంది) మరణించి ఉంటారని అనధికార అంచనాలున్నాయి.

ఈ ఉత్పాతం దేశ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా కుంగదీసింది. తిరిగి ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి పునరుత్తేజం కలిగించేందుకు గత సంవత్సరం కేంద్రం 'ఆత్మనిర్భర్ భారత్' అంటూ రు. 21 లక్షల కోట్ల ప్యాకేజీ ప్రకటించారు. ప్యాకేజీలో కేంద్ర బడ్జెట్ నుంచి నికరంగా ఖర్చు పెట్టేదెంత అన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లేదు. కానీ ప్రకటించిన ప్యాకేజీ ఎవరెస్ట్ అంత ఎత్తు కనిపించినప్పటికీ అందులో పేదలకు ప్రయోజనం సెంటీమీటరన్న అందక పేదలు మరింత పేదలు కాగా, మధ్య తరగతి తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. కనుక ఈ ప్యాకేజీల ఫలితాలను ఏలినవారి మాటల్లో కాక, ప్రజల జీవితాల్లో చూడగలిగితే గానీ అసలు విషయం బోధపడదు. ఉపాధి తరిగి, నిరుద్యోగం మరింత పెరిగిపోయింది. సామాన్యులు ఇన్నాళ్లూ కడుపుకట్టుకుని దాచుకున్న సొమ్మూ కరిగిపోయింది. కరోనా తొలి ఏడాదిలోనే ప్రభుత్వ ప్రకటిత ప్యాకేజీలు అమల్లో ఉండగానే అదనంగా 23 కోట్ల మంది నిశ్శబ్దంగా దారిద్ర్య రేఖ దిగువకు జారిపోయారు. అదే సమయంలో ధనికుల సంపద మాత్రం అమాంతం పెరిగిపోయింది. కాగా ఈ ప్యాకేజీ ఆర్థిక వ్యవస్థ పతనాన్ని అడ్డుకోలేకపోవడంతో దేశ జిడిపి మాత్రం ఏకంగా 7.3 శాతం పడిపోయింది. కేవలం గత ఆర్థిక సంవత్సరంలోనే లిస్టెడ్ కంపెనీల కార్పొరేట్ నికర లాభాలు 57.6 శాతం పైకి ఎగబాకాయి. ఫలితంగా దేశంలోని శతకోటీశ్వరుల సంపద నికరంగా 35 శాతం పెరిగిపోయింది.

పియుసిఎల్‌డిఆర్ అధ్యక్షుడు వి.ఎం. తార్కుండే నాయకత్వంలో అరుణ్‌శౌరీ, కృష్ణకాంత్ కార్యదర్శులుగా కె.జి. కన్నబిరాన్, ఎం.వి. రామమూర్తి, కె. ప్రతాపరెడ్డి(ఆంధ్రప్రదేశ్)లతో ఏర్పాటు చేసిన కమిటీ ఎమర్జెన్సీలో కనీసం 75 మంది నక్సలైట్లను ఎన్‌కౌంటర్ పేరుతో ప్రభుత్వం చంపిందని సమగ్రమైన నివేదిక తయారు చేశారు. పంజాబ్ విషయంలోనూ వి.ఎం. తార్కుండే కమిటీ అటువంటి నిజనిర్ధారణ న్యాయవిచారణ చేసింది. కాని ఎపిసిఎల్‌సి, తార్కుండే కృషి వల్ల ముఖ్యమంత్రి జలగం వెంగళరావు కేంద్ర ప్రభుత్వాన్ని కమిషన్ వేయాలని కోరాల్సి వచ్చింది. ప్రధాని మొరార్జీ దేశాయ్ సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ భార్గవ కమిషన్‌గా వేశాడు. ఆ కమిషన్ విచారణకు సుందరయ్యగారు, ఓంకార్ మొదలు రాడికల్స్ (చెరుకూరి రాజ్‌కుమార్) వరకు సహకరించారు. ప్రభుత్వం తరపున తర్వాత కాలంలో న్యాయశాఖ మంత్రి శివశంకర్ వాదిస్తే, కమిటీ తరపున కె.జి. కన్నబిరాన్ వాదించాడు. కె.ఎస్. నాయకత్వంలోని గిరాయిపల్లి విద్యార్థులు నలుగురు, చంద్ర పుల్లారెడ్డి నాయకత్వంలోని నీలం రామచంద్రయ్య, జంపాల ప్రసాద్, ఎం.ఎం. గ్రూపుకు చెందిన జయరావు, రత్నం సూర్యవర్మలను జిల్లా తెట్టు దగ్గర ఎన్‌కౌంటర్‌లను మూడు విప్లవ పార్టీల ప్రాతినిధ్య ఉదాహరణలుగా ముందు తీసుకున్నాడు. ఆ వివరాలకు స్థలం లేదు గానీ, ఎమర్జెన్సీ మొత్తంగా దేశంలో, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో విప్లవ, ప్రజాస్వామిక శక్తులపై అమలయింది.

1971 బంగ్లాదేశ్ యుద్ధం తర్వాత లోక్‌సభలో ప్రధాని ఇందిరను ప్రతిపక్ష నాయకుడు ఎ.కె. గోపాలన్ పొగిడాడు. వాజ్‌పాయి అయితే అపర కాళిక అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంతవరకు సిపిఎం జిల్లా, తాలూకా స్థాయి నాయకులు కూడా ఎమర్జెన్సీలో మీసా కింద అరెస్టయి ఎన్నికల దాకా ఉన్నారు. ముఖ్యంగా ఈసారి తెలంగాణలో పార్లమెంట్‌కు బిజెపి 4 సీట్లు గెలుచుకున్న విజయగర్వమో, ఆస్తుల సంరక్షణకు ఈటెల రాజేందర్ తిమింగిల భయానికి, తిమింగిల గిలం తీర్థాన్ని పుచ్చుకున్న పారవశ్యమో కానీ బిజెపి హైదరాబాద్ మొదలు ప్రతి జిల్లా కేంద్రంలో ఎమర్జెన్సీ వ్యతిరేక సభలు పెట్టి ఎమర్జెన్సీలో జైళ్లలో ఉన్న బిజెపి, ఆర్ఎస్ఎస్ నాయకులు, కార్యకర్తలనందరినీ సన్మానించింది. వీళ్లందరికీ ఈనాడు బిజెపి, ఆర్ఎస్ఎస్‌లలో ఎంత క్రియాశీల స్థానం ఉన్నదో వాళ్లకే తెలియాలి కానీ, మోడీతో సహా ఎమర్జెన్సీలో ఇప్పటి నాయకత్వం ఎంత బాధితులో, నిర్బంధితులో అనుమానమే. ఇంతవరకు కనీవినీ ఎరుగని రాజ్య హింసను అమలు చేస్తున్న బిజెపి అధికారంలోకి వచ్చి రాజకీయ, సామాజిక హింసా దౌర్జన్యాలు అమలు చేసిన చరిత్రే గానీ (ఎమర్జెన్సీ కాలం తప్ప) జాతీయోద్యమం మొదలు, ఈనాటి వరకు ఏ ఉద్యమంలో ఉన్న చరిత్ర ఆర్ఎస్ఎస్ కు లేదు. దాని భావజాలంలోనే ఆధిపత్య భావం, హింస ఉన్నాయి.

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

స్థూలంగా ఈ కరోనా కాలమంతా, అసంఖ్యాకులైన భారత ప్రజలు తమ ఆదాయాలనూ, జీవనోపాధినీ కోల్పోయారు. పిడికెడు మంది కార్పొరేట్లు మాత్రం అంతులేని సంపద సొంతం చేసుకున్నారు. అంబానీ సంపద రు. 8,400 కోట్ల డాలర్లకు, అదానీ ఐశ్వర్యం 7,800 కోట్ల డాలర్లకు దూసుకుపోయాయి. కేవలం ఒక్క శాతం కార్పొరేట్ల వద్ద 62 శాతం జాతీయ సంపద పోగుపడిందంటే దోపిడి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. దీనిని బట్టి ప్యాకేజీల ఫలితం ఎవరికి చేరిందో ఇట్టే అవగతమౌతుంది. దేశంలో ఆకలి దప్పులు లేని ప్రజా బాహుళ్యం ఎందరున్నారనేదాన్ని బట్టి ఆ దేశం అభివృద్ధిని చెప్పవచ్చు కానీ, బిలియనీర్లను బట్టి కాదని పాలకులు గుర్తించాలి. అంటే పేదలు మరింత పేదలుగా, ధనికులు మరింత ధనికులుగా మారే పరంపర ఈ కరోనా కాలంలో శరవేగంగా జరిగిపోయిన నేపథ్యంలో ఈ ఉద్దీపనలు ఎవరిని ఉద్ధరించినట్లు.

ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనానికి కొనుగోలు శక్తే మూలం

ప్రజల కొనుగోలు శక్తి పెరగనిదే దేశ ఆర్థిక వ్యవస్థ కుదుటపడదనేది సహజ పెట్టుబడిదారీ సూత్రం. దీన్ని కూడ ఈ విపత్కర పరిస్థితిలో ప్రభుత్వం నిరాకరించడమంటే దాని విధానంగానే భావించాలి. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా ప్రజల చేతుల్లోకి డబ్బు పంపకుండా మొదటి ప్యాకేజీని కార్పొరేట్లకు కట్టబెట్టింది. నేడు ఉత్పత్తిని, ఎగుమతుల్ని, ఉపాధి అవకాశాల్ని పెంచే రీతిలో ఆరోగ్యం, సామాజిక, ఆర్థిక రంగాలకు ఊతమిచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు ప్రజలను నమ్మిస్తూ కార్పొరేట్ల ప్రయోజనాలకే తాజాగా రెండవ ప్యాకేజీ రు. 6,28,993 కోట్లు ప్రకటించింది. ఈ ప్యాకేజీ నికర ప్రయోజనం జిడిపిలో కేవలం 0.3 శాతానికి పరిమితం కాగా, సింహభాగం రుణ హామీలదే. కరోనా కారణంగా దేశంలో వినియోగ గిరాకీ తగ్గిపోయిందని ఆర్థిక వేత్తలు సహేతుకంగా విశ్లేషించినారు. గిరాకీ తిరిగి ఊపందుకుంటేనే ఆర్థిక, పారిశ్రామిక రంగాలు కోలుకుంటాయి. గిరాకీ పెరగాలంటే ప్రజల చేతుల్లో నగదు ఉండాలి. కనుకనే అర్హులైన పేదలకు ప్రభుత్వ ప్రత్యక్ష నగదు బదిలీ చెయాలి. అదే విధంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, పట్టణ ప్రాంతాలకూ దాన్ని విస్తరింపజేయాలని, కొన్నాళ్ల పాటు జిఎస్‌టి రేట్లు తగ్గించాలని సూచనలెన్నో వచ్చాయి. కానీ వాటి అమలుకు ఈ ప్యాకేజీలో చోటు లేకపోవడం గమనార్హం.

ఈ ప్యాకేజీలో ఆర్థిక సంవత్సరం పొడుగునా సర్కారీ అదనపు వ్యయం కేవలం రు. 60 వేల కోట్లకు మించే అవకాశం లేదు. వ్యక్తిగత ఆదాయాలు పెరిగేలా ఉపాధి, ఉద్యోగాలను గాడిన పెట్టాల్సింది పోయి – టూరిస్ట్ గైడ్లు మొదలు లఘు పరిశ్రమల వరకు రుణ హామీలకు ప్యాకేజీలో విశేష ప్రాముఖ్యతను ఇవ్వడం విస్మయపరుస్తోంది. నిజానికి ఉపాధికి ఊతమిచ్చేలా సమగ్ర వాస్తవిక ఉద్దీపన ఒక్కటే ప్రస్తుత స్థితిలో సరైనది. కానీ ప్రజల అసంతృప్తి పరాకాష్టకు చేరుతున్నప్పుడల్లా ఇలాంటి ప్యాకేజీలు వెలుగుచూడడం కరోనా కాలంలో పరిపాటిగా మారింది. ఈ ప్యాకేజీలు వెలువడిన ప్రతిసారీ ఈ ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోని మీడియా పతాక శీర్షికల్లో అలరించడమే తప్ప, ప్రజల జీవితాల్లో ప్రతిఫలించకపోవడం గమనార్హం. వాటి ప్రయోజనాలు పేద ప్రజలకు అందనప్పుడు అవి ఎంత భారీ ఉద్దీపనలైనా నిరుపయోగమే.

కార్పొరేట్ల ఖజానాను నింపిన ఉద్దీపనలు

ప్రకటించిన ఈ ప్యాకేజీలో రుణహామీ పద్దు కింద రు. 1,10,000 కోట్లు, అత్యవసర రుణహామీ పద్దు కింద రు. 1,50,000 కోట్లు, విద్యుత్ డిస్కంల నష్టాలు పూడ్చేందుకు రు. 93,631 కోట్లు, ఆహార భద్రత పద్దు కింద రు. 93,869 కోట్లు, ఎగుమతుల బీమా కోసం రు. 88,000 కోట్లు, ప్రాజెక్టు ఉత్పత్తుల ఎగుమతి కోసం రు. 33,000 కోట్లు, ఎరువుల సబ్సిడీ కింద రు. 14,775 కోట్లు, ఆరోగ్య బీమా పథకం కింద రు. 15,000 కోట్లు, గ్రామీణ ప్రాంతాలకు బ్రాడ్‌బాండ్ సేవల విస్తరణ కోసం రు. 19,041 కోట్లు, సూక్ష్మ రుణ సంస్థలకు బ్యాంకులు ఇచ్చే రుణాలకు ప్రభుత్వం హామీ ఉండేందుకు రు. 7,500 కోట్లు, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే ఉచిత వీసా పథకానికి వంద కోట్లు, ఈశాన్య భారత వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్ కోసం రు. 77 కోట్లు వెచ్చించనున్నట్లు ఆర్థిక మంత్రి ఘనంగా ప్రకటించారు. కానీ ఇందులో ఈ సంవత్సరం నగదు రూపంలో ఖర్చు చేయగలిగింది యాభై నుంచి అరవై వేల కోట్లకు మించి ఉండదని ప్రముఖ రేటింగ్ సంస్థలు విశ్లేషిస్తున్నాయి. కొంచెం లోతుల్లోకి వెళ్లి పరిశీలిస్తే ఈ ఆరు లక్షల ఇరవై తొమ్మిది వేల కోట్ల భారీ ప్యాకేజీలో దాదాపు మూడున్నర లక్షల కోట్లు అనగా సగం ప్యాకేజీ బడా పారిశ్రామిక వేత్తలకు ఇచ్చే రుణాలే కావడం గమనార్హం. పర్యాటక రంగానికి కేటాయించిన వంద కోట్లతో సహా దాదాపు ఐదు లక్షల కోట్లకు పైగా ప్రైవేట్ కార్పొరేట్ జేబుల్లోకి పోతున్నాయి. చివరికి సాధారణ ప్రజలకు మిగిలేది ఆహార భద్రత కింద వెచ్చించే తొంభై మూడు కోట్లు మాత్రమే.

కార్పొరేట్ వైద్యానికి ప్యాకేజీలో పెద్దపీట

సాధారణంగా వైద్య రంగానికి కేటాయింపులు అంటే ప్రభుత్వ వైద్యానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు, ఉస్మానియా, గాంధీ లాంటి ప్రభుత్వ ఆసుపత్రులకు కేటాయింపులు అనుకుంటాం. కానీ కేటాయించిన రు. 50 వేల కోట్లను దేశంలోని 8 ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలు మినహా మిగిలిన ప్రాంతాలలో కార్పొరేట్ ఆసుపత్రుల స్థాపనకు ఒక్కొక్కరికి గరిష్ఠంగా రు. 100 కోట్ల చొప్పున రుణం ఇస్తారు. ఈ రుణాలపై కేవలం వడ్డీ 7.95 శాతం మాత్రమే వసూలు చేస్తుంది. ఈ విపత్కర పరిస్థితిలో ప్రభుత్వ ఆసుపత్రుల స్థాపనకు కనీస చర్యలు లేకపోవడం విచారకరం. కానీ వైద్య రంగానికి భారీ కేటాయింపులు చేశామని ప్రజలను మభ్యపెడుతున్నారు. ఇంతకన్నా పచ్చి అబద్ధం మరొకటి లేదు.

కొవిడ్ రెండో ఉప్పెన ప్రభుత్వ వైద్య సేవల ప్రాధాన్యతను మరోసారి దేశం ముందు చర్చకు పెట్టింది. గత ఏడాది కంటే ఈ సారి ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొవిడ్ చికిత్సలు పొందిన వారి సంఖ్య ఘననీయంగా పెరిగింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ వైద్య సదుపాయాల విస్తరణ కోసం నిధులు వెచ్చించాల్సిన కేంద్రం, ప్రభుత్వ వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేసి, కార్పొరేట్ వైద్య రంగాన్ని విస్తరింప చేసేందుకు ఖర్చు చేయబూనుకోవడం అమానుషం. కేటాయించిన రు. 50 వేల కోట్లతో ప్రతి మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేసి జిల్లా కేంద్రంలోని ఆసుపత్రుల్లో పిల్లల వైద్య సేవల కోసం ఐసియు పడకలు, ఆక్సిజన్ సెంటర్స్ అభివృద్ధి పరిచి అవసరమైనన్ని పరికరాలు, మందులు, టెలి కన్సల్టేషన్, అంబులెన్స్

సేవలు అందుబాటులోకి తెస్తే బావుండు. నిజానికి కరోనా తర్వాత ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి కేటాయింపులు పెరగాలి. విచిత్రమేమంటే 2020-21లో రు. 78,853 కోట్లు కేటాయిస్తే 2021-22లో రు. 71,259 కోట్లకు తగ్గించారు. దీనిని కప్పిపుచ్చుకోవడానికి ఆరోగ్య శాఖకు డ్రింకింగ్ వాటర్, శానిటరీ శాఖను కలిపి 137 శాతం పెరిగినట్లు ప్రభుత్వ వైద్యా రంగానికి పెద్దపీట వేసినట్లు చూపినారు. కానీ ప్యాకేజీలో రుణం రూపంలో కార్పొరేట్ వైద్య రంగానికే అత్యంత ప్రయోజనం చేకూరుతుంది.

పేదలు భరించలేని వైద్య ఖర్చులు

ప్రజల వైద్య ఖర్చులు విపరీతంగా పెరిగాయి. కొవిడ్ రానివారి విటమిన్‌లు, ఇతర అనుబంధ ఖర్చు 2020-21లో రు. 15 వేల కోట్లని ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ సంస్థ వారు లెక్కలు తేల్చారు. ఇదే కాలంలో బ్యాంకుల్లో ప్రజలు తీసుకున్న గోల్డ్ లోన్స్ రు. 33,476 కోట్ల నుంచి రు. 60,726 కోట్లకు పెరిగాయి. వాస్తవానికి రెండవ దశ ఉధృతమైంది 2021 ఏప్రిల్ నుండి. ఈ జూన్ నాటికి ఈ లెక్కని తాజాపరిస్తే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. ఆ బంగారాన్ని జనం విడిపించుకోలేకపోవడం వల్ల బ్యాంకులు దాన్ని వేలమేస్తున్నాయని కూడా తాజా వివరాలున్నాయి. వ్యవస్థపై వినియోగదారుల విశ్వాసం (కన్స్యూమర్ కాన్ఫిడెన్స్) అధమ స్థాయిలో ఉందని మే నెలలో రిజర్వు బ్యాంకు అంచనా వేసింది.

వాక్సిన్‌తోనే రక్షిత సామర్థ్యం - వాక్సిన్ వ్యాపారం

వాక్సినేషన్‌తోనే ప్రజలందరికి రక్షిత సామర్థ్యం పెరుగుతుందని డాక్టర్లు చెపుతున్నారు. దీనిని ఆసరాగా తీసుకొని ప్రభుత్వం మొదట వ్యాక్సిన్ వ్యాపారానికి తెరలేపింది. తద్వార కార్పొరేట్ వర్గాలను కుబేరులను చేయడానికి పూనుకుంది. అందరికి వ్యాక్సిన్ స్వప్నం నిజం కావాలంటే రోజుకు 50 లక్షల టీకా డోసులు వేయాల్సి ఉంటుంది. కానీ, మే నెలలో మన దేశంలో సగటున టీకా వేసింది 15.2 లక్షలు మాత్రమే. అది జూన్ నాటికి 27 లక్షలకు చేరింది. ప్రభుత్వం దాని వేగం పెంచేందుకు చర్యలు తీసుకోవాలి. కానీ, ఈ నత్త నడకనే టీకా కార్యక్రమం నడిస్తే మాత్రం 140 కోట్ల భారతీయులకు రెండు విడతల టీకా డోసు పూర్తయ్యేవరకు రెండున్నరేళ్లు పడుతుంది. అప్పటికి డెల్టా ప్లస్ వేరియంట్ ఏ రూపం తీసుకుంటుందో ఎవరు చెప్పలేరు. 18 సంవత్సరాలు పైబడిన వారందరికి డిసెంబర్ లోగా టీకాలు వేయాలంటే 216 కోట్ల వ్యాక్సిన్ డోసులుండాలి.

మన దేశంలోని భారత్ బయోటెక్ వారి కోవ్యాక్సిన్ 55 కోట్ల డోస్‌లు, కోవీషీల్డ్ వారు 75 కోట్ల డోస్‌లు, బయో ఈ-సబ్ కమిటీ వారి వ్యాక్సిన్ 30 కోట్ల డోసులు, కోవ్యాక్సిన్ 20 కోట్ల డోసులు, భారత్ బయోటెక్ నాజల్ వ్యాక్సిన్ వారు 10 కోట్లు, జినోవా వాక్సిన్ 6 కోట్లు, జైడెస్లై కిలా వారు 5 కోట్లు, రష్యా వారి స్పుతినిక్ 15 కోట్లు కావాలంటూ ఆర్డర్ పెట్టారు. వీటిలో ఐదు రకాల వ్యాక్సిన్‌లు ఇంకా తయారీ దశలోనే ఉన్నాయి. ఇక మొత్తం జనాభాకు వ్యాక్సిన్‌లు కావాలంటే మరిన్ని డోసులు ఆర్డర్ పెట్టాలి. ప్రపంచంలో అత్యధిక జనాభా గల చైనాలో నేటికీ వంద కోట్ల మందికి టీకా వేయడం పూర్తయింది. అమెరికా, ఇంగ్లాండ్ మొదలైన దేశాల్లో 65 శాతం తమ ప్రజానీకానికి టీకా వేశారు. ఫ్రాన్స్ తమ దేశంలో ఇక మాస్క్ వాడక్కరలేదని ప్రకటించింది. కానీ ఈ దేశంలో సార్వత్రిక ఉచిత టీకా కార్యక్రమానికి కావల్సిన నిధులు కేటాయించడానికి బదులు కేంద్రం ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులు తీసుకునే బ్యాంకు రుణాల నిమిత్తం కోట్ల రూపాయలు ఖర్చు చేయాలని నిర్ణయించడం విచిత్రంగా ఉంది.

కరోనా మృతులకు పరిహారం - సుప్రీం కోర్టు ఆదేశం

కరోనాతో కన్నుమూసినవారి కుటుంబాలు ఆర్థికంగా చిన్నాభిన్నమైన నేపథ్యంలో మానవతా దృక్పథంతో ఆదుకోవాల్సిన ప్రభుత్వం మొహం చాటేసింది. ఈ తరుణంలో ఆ కుటుంబాలకు ఎంతోకొంత పరిహారం చెల్లించాల్సిందేననీ సుప్రీంకోర్టు చెప్పిన తీర్పు ప్రశంసనీయమైనది. విపత్తుల నుంచి ప్రజలను కాపాడుకోవాల్సిన ప్రభుత్వాలు ఆ పని చేయకపోగా, పరిహారం కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నామని చెప్పుకోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటివి. జాతీయ విపత్తుల సంస్థ తన విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించడంలో విఫలమైందని విమర్శిస్తూ, ప్రాణ రక్షణ నుంచి పరిహారం విధివిధానాలను తయారు చేయాలని న్యాయమూర్తులు ఆదేశించారు. బాధిత కుటుంబీకులు కోరితే డెత్ సర్టిఫికెట్లు సవరించాలనీ, ఒక వ్యక్తి కొవిడ్ పాజిటివ్ అయిన మూడు నెలలకు చనిపోయినా వారిని కరోనా మృతులుగానే ధృవీకరించాలనీ సుప్రీం కోర్టు ఆదేశించింది. సుప్రీం వ్యాఖ్యలు ప్రభుత్వాలు తప్పుకునే తత్వాన్ని నిర్మోహమాటంగా కోర్టు ఎత్తిచూపింది. మరణాలు వేలాదిగా ఉన్నా, పోస్టుమార్టమ్ లేకుండా, డెత్ సర్టిఫికెట్‌లో గుండెపోటు, శ్వాస నిలిచిపోవడం వంటివి రాస్తూ, కరోనా మిగిల్చిన దుష్ప్రభావాలతో సంభవించిన మరణాలను లెక్కకే తీసుకోలేదు. అధికారికంగా కొవిడ్ మరణాలను వందల్లో చూపుతూ ప్రభుత్వాలు ప్రజలను వంచిస్తున్నాయి. లక్షలాది చావుల వెనుక ఉన్న నిజాన్ని గుర్తించ నిరాకరించిన ప్రభుత్వాలు ఇప్పుడు, మూడు నెలల వరకూ సంభవించే ప్రతీ మరణాన్నీ కరోనా కోటాలోనే వేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను ఇప్పటికైనా ప్రభుత్వాలు విధిగా స్వీకరించాలి.

ప్రకృతి విపత్తుల నిర్వహణ చట్టం ప్రకారం ప్రభుత్వాలు బాధిత కుటుంబీకులకు పరిహారం ఇవ్వాల్సి ఉండగా, 2015లో మోదీ ప్రభుత్వమే దీనిని నాలుగు లక్షల రూపాయలుగా సవరించింది. ఇటీవల కరోనాను కూడా జాతీయ విపత్తుల జాబితాలో చేర్చినందున, కొవిడ్ మరణాలు సైతం పరిహారానికి అర్హమైనవే కనుక, సెక్షన్ పన్నెండులో పేర్కొన్న ప్రకారం నాలుగు లక్షల రూపాయలు ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వం గతంలో ఇదే మొత్తాన్ని పరిహారంగా ప్రస్తావిస్తూ ఒక నోటిఫికేషన్ జారీ చేసి, కొద్ది గంటల్లోనే ఉపసంహరించుకుంది. ఇప్పటివరకూ, అధికారిక లెక్కల ప్రకారమే 3.90 లక్షల మంది కరోనాతో మరణించినందున రు. 15 వేల కోట్ల రూపాయల పరిహారాన్ని తప్పక చెల్లించాలి. నిజానికి ప్రభుత్వాల భారీ వ్యయాలతో పోల్చితే ఈ పరిహారం భరించలేనిదేమీ కాదు. ప్రజారోగ్య పరిరక్షణలో విఫలం చెంది, సకాలంలో ఆక్సిజన్ కూడా అందించక వేలాది చావులకు కారణమైనవారు, ఇలా న్యాయస్థానాల విమర్శకు గురికావడంకంటే ముందే మానవీయంగా,

ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగుల ఆందోళన

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, ఓట్ల కోసం తాత్కాలిక ప్రయోజనాల్ని చేకూర్చే పథకాలను ప్రవేశపెట్టి, జీవన భద్రతనిచ్చే ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయట్లేదంటున్నారు **చిమ్మె. జాన్ బర్నబాస్**

గత కొన్ని రోజులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ రకాలుగా డిగ్రీలు పొందిన నిరుద్యోగులంతా ప్రభుత్వం ప్రకటించిన 'జాబ్ కాలెండర్'కు వ్యతిరేకంగా పోరాటం మొదలు పెట్టారు. ప్రస్తుతం ఉన్న ఖాళీలకు పూర్తిగా విరుద్ధంగా చాలా తక్కువ ఉద్యోగాలతో 2021-22 జాబ్ కాలెండర్‌ను ఇటీవల ముఖ్యమంత్రి విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ కోసం అభ్యర్థుల నుండి వివిధ పరీక్షల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది ఉన్న ఖాళీలో 5 శాతం కూడా కాదు. ఇది పూర్తిగా వాస్తవ విరుద్ధమంటూ అభ్యర్థులు, వారికి మద్దతుగా వివిధ యువజన, విద్యార్థి సంఘాలు రోడ్డెక్కాయి.

2019 సంవత్సరంలో ఎన్నికలకు ముందు ఇదే ముఖ్యమంత్రి అప్పటి ప్రతిపక్ష నాయకుని హోదాలో రాష్ట్రంలో పాదయాత్ర చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలలో యువతకు అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలోగా 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని బహిరంగంగా చెప్పారు. ఇప్పటికి వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలైంది. వివిధ కారణాలతో రాష్ట్రంలోని యువత దాదాపు 300 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఉద్యోగాలు భర్తీ చేయలేనప్పుడు వారికి నిరుద్యోగ భృతి కనీసం రు. 3,000 అందజేసే ప్రక్రియనన్నా చేపట్టాలి.

రాష్ట్రంలో దాదాపు 25,000 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలున్నప్పటికీ డిఎస్‌సి (డిస్టిక్ట్ సెలెక్షన్ కమిటీ) ప్రకటించలేదు. పోలీస్ శాఖలో మొత్తం కలిపి 6,500 (ఎస్ఐ/కానిస్టేబుల్) ఉద్యోగాలు ఖాళీలుండగా, వాటిని కూడా ప్రకటించలేదు. గ్రూప్ 1, గ్రూప్ 2 పోస్టులలో 2 వేల పోస్టులు ఖాళీలుండగా కేవలం 36 (15+21) పోస్టులే ప్రకటించింది రాష్ట్ర ప్రభుత్వం. ప్రభుత్వ ఇంజనీరింగ్ విభాగాలలో 20 వేల పోస్టులు ఖాళీలున్నాయి. రెవెన్యూ శాఖలో 740 పోస్టులు ఖాళీలున్నాయి.

మొత్తం అన్ని ఖాళీలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక 'జాబ్ కాలెండర్' ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విద్యార్థి, యువజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ముఖ్యమంత్రి ఇల్లు ముట్టడించాలనే లక్ష్యంతో జూలై 19న 'ఛలో తాడేపల్లి' పిలుపునిచ్చాయి. ఈ పిలుపునందుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థి, యువజనులు తాడేపల్లికి బయలుదేరే క్రమంలో వివిధ జిల్లాలలో అక్రమంగా పోలీసులు అరెస్ట్ చేశారు. చాలా సంఘాల కార్యాలయాల ముందు పోలీసు పహారా కొనసాగింది. పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధాన్ని అమలు చేస్తున్నారు.

ప్రభుత్వం తాను చెపుతున్న లెక్కల ప్రకారం 1.2 లక్షల గ్రామ సచివాలయాల పోస్టులు భర్తీ చేశారు. ఆ ఉద్యోగాలకు దరఖాస్తు చేసే సమయంలో అగ్రకుల పేద విద్యార్థులు ఇడబ్ల్యుఎస్ (ఎకనమికల్లీ వీకర్ సెక్షన్స్) అమలు చేయాలని వేడుకున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. పర్యవసానంగా పలు శాఖల్లో చేపట్టిన నియామకాల్లో దాదాపుగా 18 వేల రెగ్యులర్ పోస్టులు వీరు కోల్పోయారు.

ప్రభుత్వం ప్రకటించిన జాబ్ కాలెండర్ ప్రకారం వారి లెక్కల్లోనే 19,701 కాంట్రాక్ట్ పోస్టులు, 3,99,791 ఔట్ సోర్సింగ్ పోస్టులు ఈ రెండేళ్లలో నింపారు. అప్పుడే ఇడబ్ల్యుఎస్ పై నిర్ణయం తీసుకొని ఉండుంటే 10 శాతం అంటే సుమారు 42 వేల కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్

సానుకూలంగా స్పందించి ఉంటే గౌరవంగా ఉండేది. ప్రభుత్వం వ్యాక్సిన్‌ను కార్పొరేట్ లాభాల కొరకు వ్యాపారంగా చూడడం దారుణం.

ముగింపు

తాజా ప్యాకేజీ లోతులు పరిశీలించినప్పుడు ప్రభుత్వం కొవిడ్ సహాయ పథకాల పేరుతో పెండింగ్‌లో ఉన్న ప్రైవేటీకరణ సంస్కరణలను పూర్తి చేసుకునేందుకు నడుం కట్టిందన్నది స్పష్టమవుతోంది. కరోనా మహమ్మారి విలయతాండవం కొనసాగుతున్న ఈ కాలమంతా లక్షలాది మంది ప్రజలు తమ ఆదాయాలను, జీవనోపాధిని కోల్పోయారు. ఈ సమయంలో ప్రపంచంలోని చాలా ప్రభుత్వాలు తమ దేశాల్లో సార్వత్రిక నగదు బదిలీ ద్వారా ప్రజలను ఆదుకున్నాయి. మూడవ ప్రపంచ దేశాలలో పేద దేశాలు కూడా కొన్ని సార్వత్రిక నగదు బదిలీ చేసినాయి. ప్రజలకు నగదు బదిలీ అనేది ఇప్పుడు ఆర్థికవేత్తలు, ప్రతిపక్ష పార్టీలు, పౌర సంఘాలు మాత్రమే గాక పెట్టుబడిదారులు కూడా సమర్థిస్తున్న ప్రతిపాదన అని స్పష్టం అయింది. నేడు దేశ ఆర్థిక వ్యవస్థకు ఉన్న వాస్తవ సమస్య ప్రజల చేతుల్లో కొనుగోలు శక్తి లేకపోవడమే అని వారంతా అంగీకరిస్తున్నారు. ఏడున్నర దశాబ్దాలుగా ప్రభుత్వాలు ప్రజారోగ్యం, అవిద్య, ఆర్థిక అసమానతలు, పేదరిక నిర్మూలన, పతాక స్థాయికి చేరిన నిరుద్యోగం లాంటి మౌలిక అంశాలను పరిష్కరించకుండా కార్పొరేట్ల సేవలో మునిగి తేలుతున్నాయి. ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల ఆదాయాలను పెంచే ఈ విధానాలను ప్రజలు ఐక్యంగా ప్రతిఘటించాల్సిన అవసరం, అనివార్యత ఎంతైనా ఉంది. కార్పొరేట్లతో అంటకాగుతున్న ఈ ప్రభుత్వాన్ని మెడలు వంచాలంటే సంఘటిత ఉద్యమం తప్ప మరో మార్గం లేదు. ప్రజలు ఉద్యమించకుంటే భవిష్యత్‌లో అలలు కాదు, కరోనా సునామీలే రావచ్చు!

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ విశ్వవిద్యాలయం) వీ

పోస్టులు అగ్రకుల పేదలకు దక్కేవి. ఈ విధంగా దాదాపు 60 వేలకు పైగా పోస్టులు వీరికి దక్కకుండా పోయాయి.

కేంద్ర ప్రభుత్వం గత సార్వత్రిక ఎన్నికల ముందు ఎస్‌సి, ఎస్‌టి, బిసి యేతర ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం తెచ్చింది. అప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్‌లు కేటాయించాలని భావించగా, అందులో 5 శాతం కాపులకు ఇవ్వాలని ముందే అనుకున్న నిర్ణయం న్యాయ వ్యవస్థ చిక్కుల్లో పడిపోయింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఈ అంశానికి పూర్తిగా స్వస్తి పలికింది. విద్యా సంస్థలకు మాత్రమే పూర్తిగా ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ వర్తిస్తుందని స్పష్టపరిచింది. ఈ కోటాను ఎప్పటికప్పుడు ఉద్యోగ కల్పనకు వర్తింపజేయడంలో జాప్యం చేస్తూ వచ్చింది. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా జరిగిన నియామకాలు తప్ప ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నియామకాలు ఏమీ చేపట్టలేదు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ కన్నా పెద్ద ఉద్యోగాలు నియామకం జరగడం ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఇష్టం లేనట్లు కనిపిస్తున్నది. అందుకే ప్రభుత్వం ప్రకటించిన ఇటీవలి జాబ్ కాలెండర్‌లో వాటి మచ్చుతునకైనా కనిపించలేదు. అందుకే సవరించిన జాబ్ కాలెండర్‌ను మార్చి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ యువత పోరుబాట పట్టింది. ఈ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా యువత 'ఛలో తాడేపల్లి' నిర్వహిస్తోంది. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి ఈ రాష్ట్రంలోని యువత పెడదారి పట్టకుండా ఒక యువజన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు యువత.

వాస్తవానికి రాష్ట్రంలో అధికారిక లెక్కల ప్రకారం 37 లక్షల మంది క్వాలిఫైడ్ నిరుద్యోగులున్నారు. అనగా వివిధ రంగాలలో డిగ్రీలు పొందినవారు, నైపుణ్యం కలిగినవారు, నిష్ణాతులు, డిగ్రీ నుంచి పిఎచ్‌డి పొందినవారు, ఇంజనీరింగ్, మెడిసిన్ పట్ట భద్రులందరూ కలిపి 37 లక్షల మంది ఉన్నారు.

ముఖ్యమంత్రి ఇల్లు ముట్టడి కార్యక్రమాన్ని తప్పుదోవ పట్టించడానికి 2021 జూలై 17న మొత్తం రాష్ట్రంలోని వివిధ సంస్థలకు నామినేటెడ్ పోస్టులను 137 భర్తీ చేస్తూ ప్రకటించారు. వాటిలో ప్రధానమైన వాటిని ముఖ్యమంత్రి సామాజిక వర్గానికి కేటాయించి మిగిలిన వాటిని వివిధ సామాజిక వర్గాలకు పంచారు. ఇందులో కూడా అగ్రకుల కోటా కింద ఉన్న పోస్టులన్నీ కూడా అగ్ర కులాల్లోని రెడ్డి కులానికి ప్రాధాన్యతనిచ్చినట్లు మనకు స్పష్టమవుతున్నది. పేరుకు సామాజిక న్యాయం, సాధికారత గురించి మాట్లాడడం తప్ప ఆచరణలో ఏమీ లేదు. ఈ నామినేటెడ్ పోస్టులన్నీ రెండు సంవత్సరాల తర్వాత ప్రభుత్వం ప్రకటించడానికి కారణం ప్రస్తుతం యువత చేస్తున్న పోరాటాన్ని ఏదో ఒక మేరకు తప్పుదోవ పట్టించడానికి, ప్రజలలో పలుచన చేయడానికి, అధికార పార్టీలో ఉన్న యువత పోరుబాటలో భాగస్వాములు కాకుండా ఉండడానికే.

కేవలం ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, మిగతా అన్ని ప్రక్రియలనూ రద్దు దిశగా పయనించడం బాధాకరం. జగనన్న అమ్మ ఒడి, వైఎస్‌ఆర్ చేయూత, జగనన్న చేదోడు (రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లు) లాంటి దాదాపు 31 కార్యక్రమాలకు రు. 1,31,725 కోట్లు వెచ్చిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి తాత్సారం చేస్తున్నది. సంక్షేమం పేరుతో ఇస్తున్న డబ్బు (నగదు)ను కూడా ఒక చేత్తో ఇస్తూ, మరో చేత్తో అన్ని నిత్యావసర సరకుల ధరలను పెంచడం ద్వారా తీసుకోవడం జరుగుతూ ఉంది. ఇది ఒక రకంగా కుడి చేత్తో ఇచ్చి, ఎడమ చేత్తో తీసుకోవడం లాంటిది. ప్రజలను కేవలం 'ఓటు బ్యాంక్'గా చూస్తూ, మిగతగా విషయాలను విస్మరించడమే రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న పనిగా చెప్పవచ్చు. మద్యం, మాంసం ధరలు పెరగడమే ఇందుకు నిదర్శనం.

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్) రద్దు, ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పొరుగు సేవల (అవుట్ సోర్సింగ్) ఉద్యోగులకు సకాలంలో జీతాల చెల్లింపు లాంటి అనేక అంశాలపై వివిధ రూపాలలో రాష్ట్రంలో పోరాటాలు కొనసాగుతున్నాయి. కరోనా కష్టాలలో సైతం సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన ప్రధాన హామీలను ఎందుకు పక్కకు నెట్టింది? ఇప్పటికే రాష్ట్రంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించక పోవడంతో అప్పుడప్పుడూ వారు ఆందోళన బాట పడుతున్నారు.

చాలా మందిని సలహాదారులుగా నియమించుకొని వారికి క్యాబినెట్ ర్యాంక్ ఇచ్చి లక్షల రూపాయల జీతాలను ఇస్తూ వారికి మళ్లీ సహాయకులను ఏర్పాటు చేసిన ప్రభుత్వం, రాష్ట్రంలోని యువత చేస్తున్న డిమాండ్‌లను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నదో అర్థం కావడం లేదు.

రాష్ట్రంలోని నిరుద్యోగ యువకులు ఎంతో మంది వేలకు వేల రూపాయలు కోచింగ్ సెంటర్‌లకు ఖర్చు చేస్తూ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. ఒక రకంగా కోచింగ్ సెంటర్‌ల నిర్వాహకులు కూడా ఉద్యోగాల కోసం చాలా సంవత్సరాలు ప్రయత్నించి ఉద్యోగాలు రాక, ఆ అనుభవంతో కోచింగ్ సెంటర్‌లను నిర్వహిస్తున్నారు. కొంతమంది రిటైర్డ్ ఐఎఎస్/ఐపిఎస్ అధికారులు కోచింగ్ సెంటర్‌లను నిర్వహిస్తున్నారు. కోచింగ్ సెంటర్‌ల నిర్వాహకులకు లాభం కలిగించే విధంగా ఈ ప్రభుత్వాల చర్యలున్నాయి. ఇది దుర్మార్గం, అప్రజాస్వామికం.

ఎలాంటి భరోసా లేని ప్రభుత్వాల చర్యలు, రాజకీయ భావ దారిద్ర్యం, సమాజంలోని వ్యవస్థ లోపాలతో చాలా చోట్ల యువత చిన్న, చిన్న విషయాలకే కలతచెందుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటమొక్కటే మార్గం తప్ప, ఆత్మహత్యలు పరిష్కారం కాదు. భారత రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 41 ప్రకారం 'పని హక్కు'ను ప్రజలకు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయనడంలో అతిశయోక్తి లేదు. ఇటీవల ఉపాధి హామీ పథకం నిధులు రు. 870 కోట్లు గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జోక్యంతో, ఆదేశాలు జారీ చేయడం ద్వారా పంచాయితీ రాజ్/ఆర్థిక శాఖల ముఖ్య కార్యదర్శులను హైకోర్టుకు హాజరు కావాలని నోటీసులు జారీ కావడంతో నిధులు విడుదలవ్వడమే ఈ ప్రభుత్వ మొండి వైఖరికి నిదర్శనం. ఇప్పటికైనా ఈ రాష్ట్ర ప్రభుత్వం 'యువజన విధానాన్ని', జాబ్ కాలెండర్‌ను అన్ని పోస్టుల భర్తీ కొరకు విడుదల చేస్తుందని ఆశిద్దాం. లేనిచో నిరుద్యోగ యువత మరింత ఆగ్రహంతో పోరాటాన్ని ఉధృతం చేయాలి.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

'ఢిల్లీ కీ దూరీ, దిల్ కీ దూరీ' కశ్మీర్

***కేంద్ర ప్రభుత్వం జమ్మూ కశ్మీర్ ప్రజల స్వయం ప్రతిపత్తిని రద్దు చేసి, ఇప్పుడు నియోజక వర్గాల సంఖ్యను పెంచి కశ్మీర్ లోయ ప్రాధాన్యతను తగ్గించాలని ప్రయత్నిస్తోందని అంటున్నారు* రాజేంద్రబాబు అర్విణి**

'మనం కోరస్‌గా కలిసి పాడుదాం. పంజరంలో బంధించబడ్డ పక్షి కూడా గానం చెయ్యగలదు' – పోలీసు నిర్బంధంలో ఉండి, తాను మరణించడానికి కొన్ని నెలల ముందు సాధువుల్లోకెల్లా సాధువు స్టాన్ స్వామి అన్న మాటలివి. న్యాయ వ్యవస్థ, ప్రభుత్వాలు, పోలీసు యంత్రాంగం అన్నీ కలిసి స్టాన్ స్వామి అసువులు బాయడానికి కారణమయ్యాయి. పంజరంలో పక్షిలాగా ఉన్నాను, అయినా స్వేచ్ఛా గీతం పాడతాను అన్న స్టాన్ స్వామి భావాలు సరిగ్గా నేటి కశ్మీర్‌కు సరిపోతాయి. న్యాయ వ్యవస్థ ఎంత నిర్లక్ష్యం వహించినా, ప్రభుత్వాలు ఎంత కక్ష్యపూరితంగా వ్యవహరించినా, పోలీసు మిలిటరీ ఎంత డేగ కన్నులతో అణిచివేత చర్యలు చేపట్టినా కశ్మీర్ గొంతు లోంచి స్వేచ్ఛా గీతం పెగులుతూనే ఉంది.

2019 ఆగస్టు 5 భారతదేశ చరిత్రలో మరో చీకటి రోజు. కశ్మీర్ గొంతుపై కాలు అదిమి పెట్టి ఊపిరాడకుండా చేయాలని బిజెపి ప్రభుత్వం ప్రయత్నించిన రోజు. ఆర్టికల్ 370ని నిష్ఫలం చేసి, రాష్ట్రాన్ని విభజించి, ఇంటర్నెట్ రహిత ప్రాంతంగా మార్చి, లోయ మొత్తాన్ని పోలీసు శిబిరంగా చేసి, లక్షలాది మిలిటరీ నరహంతక మూకను విడిదిగా సమకూర్చి, స్త్రీ – పురుష తేడా లేకుండా పదేళ్ల బాలున్నయినా విడువకుండా జైలుపాలు గావించి, ప్రధాన నాయకులను గృహ నిర్బంధంలో ఉంచి ఢిల్లీ ప్రభుత్వం కశ్మీరీయత్ సంప్రదాయాన్ని అవమానం పాలు చేసిన రోజు. ప్రధాన స్రవంతి రాజకీయ నాయకులను అరెస్ట్ చేసింది. వారు అవినీతిపరులని, కశ్మీరీ ప్రజలు వారిని నాయకులుగా గుర్తించడం లేదని, వారు ఉగ్రవాదాన్ని సమర్థిస్తున్నారని, కశ్మీర్ గురించి ప్రధాన మంత్రి మోడీ స్వప్నం ఒకటుందని, అది సఫలీకృతం కావాలంటే వారిపై నిర్బంధం తప్పదని, కశ్మీర్ అందాలను మిగతా భారత ప్రజలందరూ పంచుకునేలా మార్గం సుగమం చేస్తానని మోడీ, అమిత్ షా ద్వయం దేశంలోని మిగతా రాష్ట్రాల ప్రజలకు నమ్మబలికారు.

దేశ, విదేశాల నుంచి పెట్టుబడులు తెచ్చి, కశ్మీర్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడం నా స్వప్నం అని, దాన్ని నిజం చేయడానికి అధికరణం 370 అడ్డం అని, దాన్ని తొలగించి కశ్మీర్‌ను పారిశ్రామికంగా పటిష్టం చేస్తానన్న వాగ్దాటి ఇప్పుడేమయింది? చిల్లిగవ్వంత పెట్టుబడి కూడా రాలేదు కదా! రాష్ట్రాన్ని చీల్చి, కశ్మీర్‌ను ఏకాకిని చేసి, మిలిటరీ బలగాన్ని దింపి మిలిటెన్సీని, ఉగ్రవాదాన్ని ఏరిపారవేస్తామన్న బడాయి మాటలు జనం మర్చిపోలేదులే! ఒక్క కశ్మీరీ పండిట్ అయినా కశ్మీర్‌కు తిరిగి వచ్చాడా? (కశ్మీరీ పండిట్‌ల విషయం వేరు. వారు ఏ విధంగా కశ్మీర్ నుంచి బయటికి వెళ్లిపోవాల్సిన పరిస్థితి వచ్చింది అన్న దానిలో విభిన్నమైన అభిప్రాయాలు ఉన్నాయి. అలా వేరే ప్రాంతాలకు వలస పోయిన వారు వ్యాపారాలలోనో, రాజకీయాలలోనో స్థిరపడిపోయారు. వారు వెనక్కి రావాలని అనుకుంటున్నట్టు దాఖలాలు ఏమీ లేవు) కశ్మీర్‌లోని రెండు ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా బిజెపిని పటిష్ట పరుస్తానన్న వ్యూహం పటాపంచలైపోయింది. జిల్లా అభివృద్ధి మండళ్ల ఎన్నికల్లో బిజెపి సాధించిన విజయాలు అంతంత మాత్రమే. 4జి సదుపాయం లేకుండా చేసి, సమాచార మాధ్యమాలనన్నింటినీ అందుబాటులో లేకుండా చేస్తే చివరికి అమెరికాలో ఎన్నికలు జరిగి ట్రంప్ పరాజయం పొంది, కొత్త ప్రభుత్వం ఎన్నికై ఆ ప్రభుత్వం ఒత్తిడితో వాటిని పునరుద్ధరించిన విదేశాంగ నీతి మనది. లఢక్‌లోని నియంత్రణ రేఖను దాటి చొచ్చుకు వచ్చిన చైనా, సమస్యను జటిలం చేస్తే ధీటుగా సమాధానం చెప్పగలిగే స్థితిలో ఉందా బిజెపి ప్రభుత్వం?

ప్రపంచంలోని అగ్ర రాజ్యాల ఒత్తిడి వల్లనో, ప్రపంచ వేదికల మీద కశ్మీర్ పరిస్థితిని గురించి పాకిస్తాన్, చైనా దేశాలు పలుసార్లు ప్రస్తావన చేయడం వల్లనో ప్రధాన స్రవంతి రాజకీయ ఖైదీలను భారత ప్రభుత్వం విడుదల చేసింది. సమాచార అవరోధాలు తొలగించింది. ఆల్ జజీరా టివి వార్తా కథనం ప్రకారం భారత్ – పాకిస్తాన్‌ల మధ్య తెరవెనుక చర్చలు జరిగాయి. ఆ చర్చలలో చాలా విషయాలు చర్చకు వచ్చాయి. ఆఫ్ఘనిస్తాన్ నుండి అమెరికా సైన్యాన్ని ఉపసంహరించాలని నిర్ణయించుకోవడం వలన జరగబోయే పరిణామాలు, ఆసియా ఖండంలో దాని ప్రభావం ఏ రకంగా ఉంటుందో కూడా భారత ప్రభుత్వం అంచనా వేసి ఉండవచ్చు. ఏమైనా కావచ్చు, కశ్మీర్ విషయంలో భారత ప్రభుత్వం కొన్ని సవరణలు చేసుకోవాల్సిన అవసరం ఉత్పన్నమైంది. కాబట్టి విధిలేని పరిస్థితులలో తన ఉగ్రరూపాన్ని కొంత మరుగుపరుచుకొంది. కానీ కశ్మీరీయత్‌లో ఉండే ప్రత్యేకతను తన కాషాయ వస్త్రంతో కప్పివేయాలన్న దుష్ట ఆలోచన మాత్రం మానలేదు.

2019 ఆగస్టు 4 నాడు కశ్మీర్‌లోని ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీల నాయకులు ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డా. ఫారూఖ్ అబ్దుల్లా నివాసం గుప్కార్‌లో సమావేశమై 'కశ్మీర్ స్వయం ప్రతిపత్తి, అస్తిత్వ పరిరక్షణ, ప్రత్యేక హోదా' లక్ష్యంగా గుప్కార్ ప్రకటన వెలువరించారు. (ఈ సంఘటన 1950వ దశకంలో ఏర్పాటైన ప్లెబిసైట్ ఫ్రంట్‌ను గుర్తుకు తెస్తున్నది. అది ఏ రాజకీయ అవసరాల కోసం ఏర్పాటు అయిందో, ఏ రాజకీయ అవసరాల కోసం రద్దు చేసుకున్నారో చరిత్రలో రికార్డ్ అయింది) ఆ ప్రకటన వెలువడిన 24 గంటలు గడవక ముందే భారత ప్రభుత్వం ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఎ లను నిర్వీర్యం చేస్తూ నిర్ణయం

కత్తి మహేష్ మృతి

సినీ నటుడు, దర్శకుడు, విమర్శకుడు, సామాజిక ఉద్యమకారుడు కత్తి మహేష్(44) ప్రమాదవశాత్తు మృతి చెందారు. నెల్లూరు జిల్లా, కొడవలూరు మండలం, చంద్రశేఖరపురం వద్ద జూన్ 26న జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జూలై 10న మరణించారు. ఆయన స్వస్థలం చిత్తూరు జిల్లాలోని పీలేరు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుండి మాస్ కమ్యూనికేషన్‌లో పట్టా పొందారు. సినిమాల పట్ల తనకున్న అభిరుచితో పరిశోధనాత్మక పద్ధతిని పెంపొందించుకొని ప్రపంచ సినిమాను, భారతదేశ సినిమాను పోల్చి అనేక విశ్లేషణలు చేశారు. అదే మహేష్‌ను మంచి సినీ విమర్శకున్ని చేసింది. దేవరకొండ బాలగంగాధర తిలక్ రచించిన 'ఊరు చివర ఇల్లు' కథను ఆధారంగా చేసుకొని 2011లో ఒక షార్ట్ ఫిలింకి దర్శకత్వం చేశారు. మిణుగురులు అనే చిత్రానికి సహ-రచయితగా వ్యవహరించారు 'హృదయ కాలేయం'తో పాటు కొన్ని సినిమాల్లో నటించారు. ఓ న్యూస్ ఛానల్‌లో జరిగిన డిబేట్‌లో కత్తి మహేష్ రాముడిపై చేసిన వ్యాఖ్యలు వివాదమయి నగర బహిష్కరణకు గురయ్యారు. సామాజిక ఉద్యమాల పట్ల తన మద్దతును, సంఘీబావాన్ని వ్యక్తం చేసేవారు.

ప్రకటించింది. మళ్లీ ఓ సంవత్సరం తర్వాత, ఆ పార్టీల నాయకులపై నిర్బంధం వీడిన తర్వాత 'గుప్కార్ ప్రకటన కోసం ప్రజా కూడలి' అన్న పేరుతో కొంత మంది రాజకీయ ప్రముఖులు సమావేశమై 2019 ఆగస్టు 4 నాటి ప్రకటనను పునరుద్ఘాటించారు. ఆ కూటమిని 'గుప్కార్ గ్యాంగ్' అని హోం మంత్రి అమిత్ షా ఎద్దేవా చేశాడు. ఏ కూటమి గురించి అమిత్ షా హేళనగా మాట్లాడాడో, ఏ నాయకులకు మోడీ కలలు కంటున్న 'నయా కశ్మీర్'లో స్థానం లేదని పౌరుషంగా మాట్లాడాడో అదే నాయకులను భారత ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించి 2021 జూన్ 24 నాడు వారితో చర్చలు జరిపింది.

ఆ చర్చలు ఓ నాటకం, ఓ బూటకం. కశ్మీరుకు వ్యతిరేకంగా కాషాయ దళం మళ్లీ కుట్ర పన్నింది. ముస్లిం జనాభా ప్రధానంగా ఉన్న జమ్మూ కశ్మీర్ అధికార పీఠంపై హిందూ ముఖ్యమంత్రిని కూర్చోబెట్టాలన్నది బిజెపి లక్ష్యం. ఆ వేటలో భాగంగా, బయటి ప్రపంచం వత్తిడికి తలవొగ్గుతూనే, కశ్మీర్ నుండి 14 రాజకీయ పార్టీల ముఖ్యులను న్యూ ఢిల్లీకి పిలిపించి, వారితో కాసేపు ముచ్చటించి, కలిసి గ్రూప్ ఫోటో దిగి పత్రికలకు విడుదల చేసి కశ్మీరు సమస్య సానుకూల పరిష్కారానికై ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ప్రజలకు సందేశం పంపించే ప్రయత్నం చేసింది బిజెపి ప్రభుత్వం. ఆ భేటీ తర్వాత నాయకులంతా కలిసి ఫొటో దిగారు గాని, సంయుక్త ప్రకటన విడుదల చేయలేదు.

అందుకు కారణం కశ్మీరీ నేతలు 2019 ఆగస్టు 5 నాటి స్థితిని పునరుద్ధరించాలని, జమ్మూ కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని, ప్రత్యేక హోదాను పరిరక్షించాలని, ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఎ లను పునరుద్ధరించాలని పదే పదే ప్రస్తావించారు. కానీ, ప్రధాన మంత్రి, హోం శాఖా మంత్రి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరగాలని, ఆ తర్వాత ఎన్నికలు జరుపుతామని నొక్కి చెప్పారు. గతంలో ఏర్పాటు చేసిన 'నియోజకవర్గాల పునర్విభజన కమీషన్'కు అన్ని పార్టీలు సహకరించి, కొత్త అసెంబ్లీ స్థానాల ఏర్పాటుకు మార్గం సుగమం చేయాలని కోరారు. ఆ తర్వాతే జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర స్థాయి ప్రతిపత్తి అని స్పష్టం చేశారు. ఆ రాష్ట్ర స్థాయి ఏ రకంగా ఉంటుంది, అసెంబ్లీకి పూర్తి అధికారాలు ఉంటాయా, లెఫ్ట్‌నెంట్ గవర్నర్‌కు లోబడి నడుచుకోవాలా అన్న విషయంలో సూచన ప్రాయంగా నైనా అభిప్రాయం ఇవ్వలేదు.

నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ అసలు లక్ష్యం కశ్మీర్ లోయ ప్రాధాన్యతను తగ్గించడమే అని భావించడం పొరపాటు కాదు. ప్రస్తుతం కశ్మీర్ లోయలో 46, జమ్మూలో 37, లధక్‌లో 4 నియోజకవర్గాలు ఉండగా, పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు 24 స్థానాలు కేటాయించారు. ఆ స్థానాలు ఎప్పుడూ ఖాళీగానే ఉంటాయి. 24 స్థానాలు పోగా మిగిలిన వాటిలోనే మెజారిటీ లెక్కిస్తారు. ఇది ఇలా ఉండగా, 2020 మార్చ్‌లో రంజన్ ప్రకాష్ దేశాయ్ నేతృత్వంలో కశ్మీర్ అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన కోసం ఒక కమిషన్ ఏర్పాటైంది. పునర్ వ్యవస్థీకరణ పేరుతో జమ్మూలోని నియోజక వర్గాల సంఖ్యను పెంచి కశ్మీర్ లోయ ప్రాధాన్యత తగ్గించడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని కశ్మీరీ ప్రజలు, రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. వారు అలా అనుమానించడానికి తగు ఆధారాలు ఉన్నాయి. ఇక్కడ మరో విషయం గుర్తు తెచ్చుకోవాలి. 1947లో జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినప్పుడు అప్పుడు ఉన్న అసెంబ్లీ స్థానాలు 75. మొత్తం 75 స్థానాలు ప్రధానంగా కశ్మీర్ ప్రజల ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించే నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ గెలుచుకుంది. ఆ తర్వాత ఏనాడూ రాష్ట్ర నాయకత్వం కశ్మీర్ లోయ దాటి పోలేదు. ఇప్పుడు అసెంబ్లీ నియోజక వర్గాలను పునర్ వ్యవస్థీకరించి భవిష్యత్తులో బిజెపి ప్రమేయం లేకుండా ప్రభుత్వం ఏర్పాటు అసాధ్యం అయ్యే పరిస్థితి కల్పించడం తప్పితే జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలో నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ అవసరం ఏమిటి?

'ఢిల్లీ కీ దూరీ, దిల్ కీ దూరీ'ని లేకుండా చేయడమే తన లక్ష్యం అని ప్రధాన మంత్రి మోడీ కశ్మీర్ నాయకులతో ముచ్చటిస్తూ ఆర్ద్రత ఒలకబోస్తూ అన్నాడు. కశ్మీర్‌కు, ఢిల్లీ ప్రభుత్వానికి ఉన్న దూరాన్ని, అలాగే కశ్మీర్ ప్రజల మనస్సులకు, భారత ప్రజల మనస్సులకు మధ్య ఉన్న దూరాన్ని పూర్తిగా తొలగించడమే తన ఆకాంక్ష అన్నాడు. మంచి ఉద్దేశమే. ఎవరూ కాదనలేని ఆకాంక్ష. కానీ ఆ ఆకాంక్ష కశ్మీరీ ప్రజల స్వయం నిర్ణయాధికారాన్ని గుర్తించి, ఆ హక్కు సాఫల్యం కోసం తగు చర్యలు తీసుకోవడం, ముందు కశ్మీరీయత్‌ను గుర్తించి గౌరవించడం, దుర్భరమైన అణిచివేత చర్యలను తక్షణమే నిలిపివేసి స్వయం ప్రతిపత్తి గల రాష్ట్రంగా జమ్మూ కశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది.

(రచయిత జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్) వీ

‘ప్రత్యామ్నాయ’ ఆలోచన ప్రజల కోసమేనా?

భాజపా పాలనను వ్యతిరేకిస్తున్న ప్రతిపక్ష పార్టీలు ఉమ్మడి ప్రత్యామ్నాయం కోసం చేస్తున్న ప్రయత్నాల మంచి చెడులను సమీక్షిస్తున్నారు **సతీష్ బైరెడ్డి**

మాజీ మంత్రి, బిజెపి నుండి బయటికి వచ్చి రాష్ట్రీయ మంచ్ పేరుతో సంస్థను నడుపుతున్న యశ్వంత్ సిన్హా చొరవతో కొద్ది రోజుల క్రితం ఢిల్లీలో మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ఎన్‌సిపి నాయకుడు శరద్ పవార్ ఇంట్లో అనేక రాజకీయ పార్టీలు, సామాజిక రంగంలో ఉన్న వాళ్లతో ఒక సమావేశం జరిగింది. మీడియా ఆ సమావేశానికి ఎంతో ప్రాధాన్యతను ఇచ్చింది. ఇది ఇప్పుడున్న బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి ఒక రాజకీయ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించే, ఒక రూపానికి తీసుకువచ్చే బృహత్తర పనికి అంకురార్పణ అన్నట్టుగా అన్ని రకాల మీడియా ప్రచారం చేసింది. ఇక సోషల్ మీడియా ఉత్సాహం చెప్పాల్సిన పనిలేదు. ఈ మీటింగ్ కంటే ముందే ఎన్నికల వ్యూహకర్తగా పేరుగాంచి పికెగా ప్రచారంలో ఉన్న ప్రశాంత్ కిషోర్ రెండు సార్లు శరద్ పవార్‌ను కలవడం బిజెపికి రాజకీయ ప్రత్యామ్నాయ వేదిక ఏర్పడబోతున్నట్టు మీడియా ప్రచారహోరెత్తించింది. ప్రశాంత్ కిషోర్ ఎన్నికల వ్యూహకర్త పాత్ర నుండి తప్పుకుంటున్నట్టు కూడా ప్రకటించి ఉన్నాడు గనుక సహజంగానే ఇలాంటి మీటింగులకు మీడియా విశేష ప్రాధాన్యం ఇచ్చి ప్రచారం చేయడంతో దేశ వ్యాప్తంగా ఆ దిశగా ఏమి జరగబోతుంది, ఏం జరగాలి అనే కోణంలోంచి చర్చలు జోరందుకున్నాయి.

మొన్ననే జరిగిన తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అస్సాం, కేరళ లాంటి రాష్ట్రాల ఎన్నికల్లో అస్సాం తప్ప మిగతా రాష్ట్రాల్లో బిజెపి పెద్దగా ప్రభావం చూపకపోవడం, పశ్చిమ బెంగాల్‌లో హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో బిజెపి చిత్తుగా ఓడటం కూడా రాజకీయ ప్రత్యామ్నాయం అనే ఊహ నిజ రూపం దాల్చడం పెద్ద కష్టమైన పనేమీ కాదనే విశ్వాసాన్ని ఇచ్చింది. ఇందులో ఏ పార్టీలు ఉంటాయి, ఉండాలి ఎలా ఉండాలి అని ఎడతెగని చర్చలు దేశమంతా జరుగుతున్నాయి.

కేంద్రంలో బిజెపి భారీ మెజారిటీతో రెండవ సారి అధికారంలో కొనసాగుతున్నది. మెజారిటీ రాష్ట్రాల్లో కూడా ఆ పార్టీనే అధికారంలో ఉన్నది. గతంలో ఇటువంటి స్థితిని కాంగ్రెస్ కూడా అనుభవించి ఉన్నది. నేడది కనీసం అధికారికంగా ప్రతిపక్షంగా కూడా గుర్తింపు పొందలేకపోయింది. ఇప్పుడది లోకసభలో అతి పెద్ద విపక్షం మాత్రమే. గత ఏడేళ్లలో దేశంలో అన్ని రకాలైన వాతావరణాన్ని తనకు అనుకూలంగా మల్చుకోవడమో, తన అంతిమ లక్ష్యానికి అనుగుణంగా మార్చుకోవడమో చేస్తున్నది బిజెపి. అనేక రాష్ట్రాల్లో వేరు వేరు పార్టీలు మెజారిటీతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను ఏర్పర్చినప్పటికినీ కేంద్ర స్థాయి అధికారం, పుష్కలమైన ఆర్థిక వనరులు, అన్ని అధికార వ్యవస్థలతో వాటి మనుగడనే ప్రమాదంలోకి నెట్టివేస్తున్నది. ‘ఒకే దేశం ఒకే ఎన్నికలు, ఒకే దేశం ఒకే పన్ను’ ఇలా అన్ని ‘ఒకే’ దిశగానే అడుగులను వడివడిగా వేస్తున్నది. లోక్ సభలో మెజార్టీ ఉండి రాజ్యసభలో తగినంత మెజారిటీ లేకపోయినా అనేక బిల్లులను ద్రవ్య బిల్లులుగా చెలామణి చేయించుకుంటు బైపాస్ చేస్తున్నది బిజెపి. రాజ్యాంగం రాష్ట్రాలకు ఇచ్చిన హక్కుల్ని, అధికారాలను తానే హస్తగతం చేసుకుని రాష్ట్రాల అభిప్రాయం, సమ్మతి లేకుండానే చట్టాలు చేసి రాష్ట్రాల మీద వదులుతున్నది.

రాష్ట్రాల అస్తిత్వాలను అధికారాలను నామమాత్రం చేస్తున్నది. అన్ని స్వతంత్ర వ్యవస్థలను తన గుప్పిట్లో పెట్టుకొని అందరినీ తన దారికి తెచ్చుకునేలా వ్యవహరిస్తోంది. మిగతా రాజకీయ పార్టీలు ఉక్కిరిబిక్కిరి అయ్యేలా తన అధికార దండాన్ని ప్రయోగిస్తున్నది. ప్రశ్నించడమే పాపం దేశ ద్రోహ కేసుల్ని ఎడా పెడా పెట్టేస్తున్నది. జాతీయ భద్రతా చట్టం పేరుతో ఎన్‌ఐఏ దేశంలో ఏ మూలన ఎవరి ఇంట్లో సోదాలు చేస్తుందో, ఎవరిని అరెస్ట్ చేస్తుందో తెలియని భయానక పరిస్థితి. ‘ఉపా’ చట్టం నేడు ఎవరినైనా దారికి తెచ్చుకునేందుకు బిజెపికి ఉపయోగపడుతుంది. విపక్ష పార్టీలు, ప్రజా సంఘాలని కాదు జర్నలిస్టులు, కవులు, రచయితలు ఎవరిని వదలకుండా కేసులు పెట్టి బెయిలు కూడా రాకుండా జైళ్లలోనే సంవత్సరాల తరబడి బందిస్తున్నది.

తన కాళ్ల మీద తాను నిలబడే శక్తి కూడా లేని, పార్కిన్ సన్ వ్యాధితో బాధపడుతున్న 84 ఏళ్ల గిరిజన హక్కుల పోరాట యోధుడు ఫాదర్ స్టాన్ స్వామి జైలులో ఉంటూనే ఆసుపత్రిలో చనిపోయేలా చేసిన మోడీ ప్రభుత్వ దుర్మార్గాన్ని ప్రపంచమంతా చూసింది. కశ్మీర్ స్వతంత్ర ప్రతిపత్తి రద్దు, నిరవధిక లాక్‌డౌన్, వేలాది మందిని జైళ్లలో బందించడం అంతర్జాతీయంగా విమర్శల పాలయింది. కరోనా కట్టడి పేరుతో నాలుగు గంటల వ్యవధితో దేశమంతా లాక్‌డౌన్ విధించి కోట్లాది శ్రమ జీవితాలతో విధ్వంస క్రీడ ఆడుకున్నది. అడ్డూ అదుపు లేకుండా ప్రతి రోజు పెరిగే ధరలు. పెద్ద నోట్ల రద్దుతో కుదేలైన జన సామాన్య ఆర్థిక వ్యవస్థ. మరో వైపు ప్రైవేటీకరణ ప్రక్రియను శరవేగంగా ముందుకు తీసుకెళ్తున్నది. కరోనా రెండో అల విరుచుకుపడుతున్నా మన్ కీ బాత్ తప్ప జనం గుండె చప్పుడు వినే మూడ్‌లో మోడీ ఎప్పుడూ లేనిది జన సామాన్యపు అనుభవమే.

నిజానికి ప్రత్యామ్నాయం గురించి ఆలోచిస్తున్న పార్టీలు ఏవీ ఒక దానితో ఒకటి నిత్య శత్రుత్వం గానీ, మిత్రుత్వం గానీ లేకుండా తమ ప్రయోజనాల కోసం, అవసరానికి తగ్గట్టు వ్యవహరిస్తున్నవే. ఇవాళ బిజెపితో కలిసిలేని పార్టీలన్నీ మిత్ర పార్టీలు అని చెప్పే వీలు లేదు.

ఆయా రాష్ట్రాల్లో బద్ధ శత్రువులుగా రాజకీయాలను నడుపుతున్న వారే. ప్రదానంగా దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల హవానే కొనసాగుతున్నది. ఒకవేళ జాతీయ పార్టీలు అయినప్పటికీ ఒకటి రెండు రాష్ట్రాలకు పరిమితమైన పరిస్థితి ఉన్నది. ఆయా రాష్ట్రాల నిర్దిష్ట పరిస్తుతులే వారి వారి వైఖరులను నిర్దేశిస్తాయి.

జమ్మూకశ్మీర్ పార్టీల రాజకీయాలన్ని ఆ రాష్ట్రం చుట్టూనే ఉంటాయి తప్ప దేశ వ్యాప్తంగా నెలకొని ఉన్న వాతావరణం ఆధారంగా వారి కార్యాచరణ ఉండదు. బిఎస్‌పి, సమాజ్‌వాదీ జనతా, తృణమూల్ ఇంకా కొన్ని జాతీయ పార్టీలు పేరుకే జాతీయ పార్టీలు అయినా వాటి బలం కొన్ని రాష్ట్రాలకు పరిమితమవడం వల్ల ఆ రాష్ట్రాల్లో వాటికున్న అవసరాలే వాటి రాజకీయ ప్రత్యామ్నాయ ఆలోచనలను ప్రభావితం చేస్తాయి. కేంద్రంలో బిజెపిని ఎంత తీవ్రంగా వ్యతిరేకించినా క్షేత్ర స్థాయిలో వాళ్ల ప్రత్యర్థులు ఎవరనేది అత్యంత కీలకమైనది. కేరళలో సిపిఎం నాయకత్వంలోని ఎల్‌డిఎఫ్, కాంగ్రెస్ నాయకత్వంలోని యుడిఎఫ్ రెండు రాజకీయ ప్రత్యర్థి శిబిరాలు. కానీ బిజెపికి బద్ధ విరోధులు. పశ్చిమ బెంగాల్‌లో సిపిఎం, కాంగ్రెస్ కలసి తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసినా అక్కడ తృణమూల్‌కి అసలు ప్రత్యర్థి బిజెపి మాత్రమే. అయినా కూడా ఆ రాష్ట్రంలో సిపిఎం తృణమూల్‌తో అస్సలు కలవదు. కాంగ్రెస్‌కి కొంత వెసులుబాటు ఉన్నది.

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో టిడిపి, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థులు. ఇప్పటికిప్పుడే రెండు పార్టీలు బిజెపిని వ్యతిరేకించే స్థితిలో లేవు. అవి రాజకీయ కారణాల వల్ల కావొచ్చు 'మరే ఇతర' కారణాల వల్ల కావచ్చు. తెలంగాణలో టిఆర్ఎస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కెసిఆర్ అప్పుడెప్పుడో కాంగ్రెస్, బిజెపిలకు ప్రత్యామ్నాయం వచ్చేసిందన్నట్టు హడావుడి తప్ప మరేమీ చేయలేదు.

తమిళనాడు పరిస్థితి కాస్త స్పష్టంగా ఉంటుందేమో. డిఎంకె బిజెపిని దూరం పెట్టడంలో కాంగ్రెస్ మరే ఇతర పార్టీల కంటే ముందున్నది. ఏఐడిఎంకె బిజెపితో జత కట్టడం డిఎంకెకు మరింత ప్రయోజన కరమైనది. కర్ణాటకలో జనతాదళ్ 'సెక్యులర్'కి బిజెపి, కాంగ్రెస్‌లో ఎవరు ఎప్పుడైనా దగ్గర కావచ్చు ఎవరు ఎప్పుడైనా దూరం కావచ్చు. అధికారం మాత్రమే పరమావధి అనుకున్నప్పుడు అందరూ గొప్పగానే కనిపిస్తారు. మహారాష్ట్రలో దేశంలో ఎక్కడాలేని విధంగా బిజెపితో దశాబ్దాల పాటు సైద్ధాంతిక ప్రయాణం చేసిన శివసేన బద్ధ శత్రువులుగా చూసిన కాంగ్రెస్, ఎన్‌సిపితో అధికారం పంచుకుంటోంది.

బీహార్‌లో ఎప్పుడు ఏ పార్టీ ఎవరితో కలసి పని చేస్తదో, ఏ రెండు పార్టీలు జట్టు కడుతాయో చెప్పడం చాలా కష్టం. రాత్రికి రాత్రి అటోళ్లు ఇటు ఇటోళ్లు అటు కావొచ్చు. ప్రస్తుతానికైతే జనతాదళ్ (యు), బిజెపి కాపురం బాగున్నట్టే ఉంది కానీ మెజారిటీ సీట్లు ఎక్కువున్న బిజెపి ఏ క్షణమైనా నితీష్ కుమార్ కుర్చీ కిందికి నీళ్లు తేవచ్చు. ఢిల్లీ, పంజాబ్‌లలో లాడాయి ఉన్న ఆప్, కాంగ్రెస్‌లు ఎలా కలిసే వీలు ఉంది? ఇన్ని శిబిరాలు, కూటములు ఉండి ఎవరి ప్రయోజనాల కోసం వారిదైన నినాదమిస్తున్న రోజుల్లో రాజకీయ ప్రత్యామ్నాయ మార్గాలను ఎలా ఆలోచించగలవు. అనేక సమస్యల పైన, మోడీ నిరంకుశ పాలన, ప్రజా వ్యతిరేక విధానాలపైన ఉమ్మడిగా పోరాడవచ్చేమో గాని ఉమ్మడిగా ఎన్నికల జట్టుకట్టి ఆయన్ని దించేసే రాజకీయ ప్రయాణం చేయడం ఈ పార్టీలకు సాధ్యమవుతుందా?

రాజకీయ ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ అనేది ఏ అనివార్యత లోంచి జనిస్తున్నది? 10 ఏళ్ల పాటు అధికారానికి దూరమవడం వల్ల వస్తున్నదా? దేశంలో రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామిక వాతావరణం, సమైఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా పరిపాలన కొనసాగున్నదనా? పౌర ప్రజాస్వామిక హక్కులు హరించబడుతున్నాయనా? రాజకీయ ఆధిపత్యంతో అనేక సమూహాలు భయం గుప్పిట్లో బ్రతుకిలీడుస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నదని బిజెపి ప్రభుత్వమే పెట్టుకున్న వారి ఒకప్పటి సలహాదారులు సెలవిస్తున్నారు. ఉపాధి అవకాశాలు దారుణంగా పడిపోతున్నాయి. ప్రజల కొనుగోలు శక్తి రోజు రోజుకి దిగజారిపోతోంది. ఆదానీల, అంబానీల సంపద వేల రెట్లు పెరిగిపోతుంటే బడుగు జీవులు మరింత బక్క చిక్కి పోతున్నరు. అసంఘటిత రంగమైతే కోలుకోలేని రీతిలో చతిగిలబడింది.

కరోనా దెబ్బతో మొత్తంగా కూలిపోయిన రవాణా, పర్యాటక, హోటల్ పరిశ్రమల్లో పనిచేసే శ్రమ జీవుల బతుకులు కడు దయనీయం. ప్రైవేటు విద్యా వ్యవస్థలో దేశ వ్యాప్తంగా కోట్లాది మంది పని చేస్తున్నారు. వారందరు రోడ్డున పడ్డారు. ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు అటు కేంద్రమూ ఆదుకోక పోవడంతో అనేకమంది ఆత్మహత్యలు చేసుకున్నారు. కోట్లాది మంది తమ సాంప్రదాయిక వృత్తుల్ని, ఇతర ఉపాధి పనుల్ని కోల్పోయి దుర్భర పేదరికంలోకి జారుకుంటున్నారు. కొద్ది సమూహాలకు మేలు చేసే, వారికే సంపద పోగేసే విధానాల మీద ఉన్న శ్రద్ధ కోట్లాది ప్రజల జీవన్మరణ సమస్యల పైన లేకపోవడమే నేటి పాలకుల చిత్తశుద్ధి.

ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మి ఉద్యోగులను, కార్మికులను ఇళ్లకు పంపించే పని ముమ్మరంగా జరుగుతున్నది. బిఎస్ఎన్ఎల్ ఏ గతికి తీసుకొచ్చారో కళ్ల ముందు కదులుతున్న విషాద చరిత్రే. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుకు అమ్మే దుర్మార్గపు నిర్ణయానికి వ్యతిరేకంగా అక్కడి ప్రజలు నెలల తరబడి ఉద్యమిస్తూనే ఉన్నారు. 43 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను 7 కార్పొరేట్స్‌గా మార్చేసే పనిలో పడి కార్మికులకు ఎలాంటి ప్రశ్నించే అధికారం, కనీసంగా నిరసన తెలిపే అవకాశమూ ఇవ్వకుండా బుల్డోజ్ చేస్తున్నది మోడీ ప్రభుత్వం. అధికారాలను కేంద్రీకృతం చేసుకొని మొత్తంగా దేశాన్ని ఒక అధ్యక్ష తరహా పాలనలోకి తీసుకెళ్లే ప్రయత్నం మోడీ చేస్తున్నట్టు కనిపిస్తున్నది.

దేశవ్యాప్తంగా ఇలాంటి ఘోర పరిస్థితులు నెలకొంటే అధికారానికి దూరంగా ఉన్న పక్షాలన్ని అధికార వ్యామోహంతో రాజకీయ ప్రత్యామ్నాయం అంటే అర్థమే ఉండదు. ఆ మాటకొస్తే ఇవ్వాలిటీ పాలకుల దుర్మార్గ విధానాలకు ఇవ్వాళ రాజకీయ ప్రత్యామ్నాయ వేదిక అంటున్న పార్టీలన్నీ బాధ్యత వహించాల్సినవే. అవన్నీ ఈ విధానాల రూపకల్పనలోనో, కొనసాగింపులోనో చాలా కీలక పాత్ర పోషించినవే! 1970 మధ్య కాలంలో ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ నుండే దేశంలో రాజకీయ ప్రత్యామ్నాయ కూటమి అనే భావన పుట్టుకొచ్చి కొన్ని పార్టీల, ప్రజా సంఘాల, వ్యక్తుల పూనికతోనే ఏక పార్టీ, ఏక వ్యక్తి పాలనకు సవాలు విసరగలిగాయి. ఇవ్వాళ పరిస్థితులు అంతకంటే భిన్నంగా ఏమీ లేవు. అప్రకటిత అత్యవసర పరిస్థితి నెలకొని ఉంది.

అణచివేత సాధనం నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ

అధికార పార్టీ చేతిలో ఎన్ఐఎ అణచివేత ఆయుధంగా మారిందని అఖిల్ గొగోయ్ పద్దెనిమిది నెలల నిర్బంధం, విడుదల నేపథ్యంలో వివరిస్తున్నారు **బి. రామకృష్ణ**

దేశ సార్వభౌమత్వం, సమగ్రత, భద్రతలను పరిరక్షించే పేరుతో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ చట్టం 2008ను చేశారు. ఇది 2008 డిసెంబర్ 31 నుండి అమల్లోకి వచ్చింది. దీనికి మరిన్ని విషయాలను జోడిస్తూ 2019లో సవరణ చట్టం తెచ్చారు. నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ) ప్రధాన కార్యాలయం ఢిల్లీలో ఉన్నది. దాని శాఖలు దేశవ్యాప్తంగా హైదరాబాద్, గౌహతి, లక్నో, కొచ్చి, ముంబై, కోల్‌కత్తా, రాయ్‌పూర్, జమ్ములలో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ అధీనంలో పనిచేసే ఎన్ఐఎ దేశంలోని ఏ ప్రాంతానికి సంబంధించిన వాటిపైనైనా విచారణను చేపట్టవచ్చు. ప్రత్యక్ష జోక్యం చేసుకోవచ్చు. ఎన్ఐఎ చేపట్టే కేసులలో ఎన్ఐఎ ప్రత్యేక కోర్టులలో విచారణ జరుగుతుంది. ఈ సంస్థ చేపట్టే కేసుల దర్యాప్తులో పూర్తి స్వేచ్ఛ కేంద్రానికే ఉంటుంది. ఇది భారత సమాఖ్య విధానానికి విఘాతం కలిగిస్తున్నది. రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకమైన ఈ చట్టాన్ని ఏ రాష్ట్ర ప్రభుత్వమూ నిరసించకపోవడం వాటి ప్రజాస్వామిక లేమితనాన్ని సూచిస్తుంది.

ఎన్ఐఎ చట్టంలో ప్రస్తావించిన అనేక విషయాలకు సంబంధించిన చట్టాలు ఇప్పటికే ఎన్నో ఉన్నాయి. నల్ల చట్టాలుగా పేరుగాంచిన రాజద్రోహ నేరం (124-ఎ, ఐపిసి), కుట్ర కేసులు (120-బి, ఐపిసి), జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) ఎమర్జెన్సీ సర్వీసెస్ మెయింటెనెన్స్ అక్ట్ (ఇఎస్ఎంఎ) వంటివి అమల్లో ఉన్నాయి. గతంలో వీటికి అదనంగా కల్లోలిత ప్రాంతాల చట్టం, టాడా, పోటా వంటివి వచ్చాయి. అవి కాలక్రమంలో కనుమరుగైపోయాయి. అయితే ఇవి వేర్వేరు రూపాలలో అమలు చేయబడుతుంటాయి. అలా వచ్చిందే చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యుఎపిఎ - ఉపా). ఇవన్నీ ఆధిపత్య శక్తుల దోపిడీ, పీడనలను నిరసించే, ప్రతిఘటించే గొంతులను నులిమి వేయడానికి పనిచేస్తూ వస్తున్నాయి. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీల చేతుల్లో అణచివేత సాధనాలుగా మలచబడుతున్నాయి.

అధికారంలో ఉన్న పార్టీ ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యతిరేక చట్టాలు తెచ్చినప్పుడు వాటిని నిరసిస్తే, వాటికి వ్యతిరేకంగా సంఘటితమైతే ఇక వారు రాజ్యాన్ని కూలదోసే కుట్రదారులుగా, రాజద్రోహులుగా, దేశ ద్రోహులుగా, తీవ్రవాదులుగా గుర్తించబడడానికి ఈ చట్టాలు పదునైన ఆయుధాలుగా మారుతాయి. ఇక ప్రజాస్వామిక గొంతులు నిర్బంధించబడి వాక్‌సభ స్వాతంత్ర హక్కులు అణచివేయబడతాయి.

రాజ్యాంగంలో పొందుపరచబడిన హక్కులు, విలువలను గౌరవించమని, అమలు చేయమని ప్రజలు అడగకుండానే పాలక వ్యవస్థ చేయవల్సి ఉంటుంది. రాజ్యాంగంలోని ప్రవేశికలోని స్ఫూర్తి, విలువలు, ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక హక్కులు పరిపాలనలో ప్రతిబింబించాలి. అది కదా పాలన అంటే. అందుకే కదా అధికారంలోకి వచ్చింది. దానికి విరుద్ధంగా పాలన సాగుతున్నప్పుడు ప్రజలు వ్యక్తిగతంగా గాని, సామూహికంగా గాని ఏమి చేయాలి? వాటికి వ్యతిరేకంగా నిరసిస్తే, నినదిస్తే, సంఘటితమైతే అది తప్పెలా అవుతుంది? కాని అధికారాన్ని సరిహద్దుల వెంబడి నెలకొనే కొన్ని ఉద్రిక్తతలను బూచీగా చూపెట్టి ప్రజల దేశ భక్తిని పదే పదే పరీక్షిస్తున్నారు. న్యాయ సూత్ర భావనతో సంబంధం లేకుండా రాజకీయ ప్రయోజనాల కోసం పాలకులు ఇతర దేశాలతో ఎట్లా వ్యవహరించినా దాన్ని మారుమాటాడకుండా వెనుకోసుకొని రావడమే దేశ భక్తికి కొలమానంగా కనిపిస్తున్నది. మీడియాను గుప్పిట్లో పెట్టుకొని కార్పొరేట్ ప్రయోజనాలకు అనుగుణంగా ప్రజల సమ్మతిని ప్రోదిచేసేలా వ్యవహారాలు నడుస్తున్నాయి.

ఓ వైపు గోప్యత ప్రాథమిక హక్కులో భాగమని సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు చెప్పి ఉన్నప్పటికినీ ఇజ్రాయెల్ అభివృద్ధి చేసిన పెగాసస్ లాంటి నిఘా సాఫ్ట్‌వేర్‌తో రాజకీయ నాయకులే కాదు ప్రజా సంఘాల బాధ్యులు, న్యాయవాదులు, జర్నలిస్టుల పైన నిరంతరం నిఘా పెట్టి వారి అంతర్గత జీవితాల్లోకి చొరబడి హక్కుల ఉల్లంఘనకు తెగబడుతోంది. దేశంలోని సకల వ్యవస్థలను తన గుప్పిట్లో పెట్టుకొని హిందుత్వ ఎజెండాను దూకుడుగా ముందుకు తీసుకెళ్లే పనిని పరిపూర్ణం చేసుకోవాలనుకుంటోంది. ఫాసిస్టు ధోరణులను బహిరంగంగా ప్రదర్శిస్తోంది. ఈ నేపథ్యంలో రాజకీయ ప్రత్యామ్నాయం అనే పార్టీలు, వ్యక్తులు దీనికి భిన్నమైన ఎజెండాతో ముందుకు రాగలరా? గంప గుత్తగా అమ్మకానికి పెట్టిన ప్రభుత్వ రంగ సంస్థలను అలాగే ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని, మొత్తంగా కార్మిక చట్టాలను చెత్త బుట్టలో వేస్తున్న మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను నిలిపివేస్తామని, నూతన రైతు చట్టాలను సంపూర్ణంగా రద్దు చేస్తామన్న మౌలిక ఎజెండాతో వస్తే తప్ప ప్రత్యామ్నాయానికి అర్థం ఉండదు. ప్రజా ప్రయోజనాలు, ప్రజా ఆకాంక్షలు పునాదిగా ప్రత్యామ్నాయ ఆలోచన కొనసాగాలి తప్ప రాజకీయంగా మాత్రమే ఏదో ఆశించి ప్రత్యామ్నాయం అంటే నేడున్న స్థితి కంటే భిన్నమైనది ఏమి ప్రజల అనుభవంలోకి రాదు.

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు)

వీ

అనుభవిస్తున్న వారికి అది నేరంగా కనిపిస్తుంటుంది. వారు అవలంభిస్తున్న విధానాల వల్ల ఎంతో మంది కనీస హక్కులకు నోచుకోవడం లేదు. ఇది కదా అసలు దోషమంటే, ద్రోహమంటే.

చట్టాలు అందరికి సమానంగా వర్తిస్తాయని అంటుంటారు. కాని ఆచరణలో సామాజిక, రాజకీయ, ఆర్థిక ప్రాభల్యం ఉన్నవారికి తప్పిస్తే కింది స్థాయి వారికి అవి అందుబాటులో ఉండడం కష్టం. అట్టడుగు బలహీన వర్గాల హక్కులు, సంక్షేమం వరకు వస్తే అవి నిమ్మకు నీరెత్తినట్లు ఉంటాయి. వారిని అణచి వేసే విషయంలో చురుకుగా పనిచేస్తుంటాయి. దీనికి విరుద్ధంగా రాజకీయ, సామాజిక, ఆర్థిక ప్రాభల్య శక్తులకు అవి ఊడిగం చేస్తుంటాయి. వారు చేసే నేరపూరిత చర్యల పట్ల ఉదాసీనంగా ఉంటాయి.

దేశ భద్రత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని పరిరక్షించే పేరుతో తీవ్రవాద కార్యకలాపాలను నిరోధించే ఉద్దేశంతో ఏర్పాటైన ఎన్ఐఎ ప్రశ్నించే ప్రజాస్వామిక వాదులను ఎలా అణచివేస్తుందో, ఎవరి చేతుల్లో ఆయుధంగా పనిచేస్తుందో తెలుసుకోవడానికి అస్సాంలోని అఖిల్ గొగోయ్ నిర్బంధం, విడుదల సంఘటన పనికి వస్తుంది. ఈ సంఘటన ద్వారా రాజ్యాంగ స్ఫూర్తి, హక్కులు, విలువలు ఎంతలా అవమానించబడతాయో, నిర్దాక్షిణ్యంగా ఉల్లంఘించబడతాయో స్పష్టం అవుతుంది.

అస్సాంలో పౌరసత్వ సవరణ చట్టం/బిల్లుకు (సిఎఎ/సిఎబి) వ్యతిరేకంగా నిరసన ఉద్యమాలలో పాల్గొన్నారని, హింసను ప్రేరేపించారని, హింసకు కారకులయ్యారని అఖిల్ గొగోయ్, అతని సహచరులు మరో ముగ్గురిపై 120–బి, ఐపిసి, 153–ఎ ఐపిసి, 153–బి ఐపిసి, 124–ఎ ఐపిసి, 18 యుఎ(పి)ఎ, 39 యుఎ(పి)ఎ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ప్రభుత్వాన్ని కూల్చడానికి కుట్ర పన్నారని, ప్రజా సమూహాల మధ్య శతృత్వాన్ని ప్రోత్సహించారని, జాతీయ సమగ్రతకు భంగం కలిగించారని, రాజద్రోహ నేరం, తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడ్డారని, తీవ్రవాద సంస్థలకు మద్దతునిచ్చారని తీవ్రమైన నేరారోపణలు చేశారు. కనీసం బెయిల్‌కు కూడా అవకాశం లేని సెక్షన్ల కింద అరెస్ట్ చేసి నిర్బంధించారు.

పౌరసత్వ సవరణ చట్టంలో పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుండి వలసలుగా వచ్చిన వారిలో ముస్లింలను తప్పించి హిందూ, సిక్కు, జైన, పార్శీ, బుద్ధిస్టులు, క్రైస్తవులకు పౌరసత్వం ఇచ్చేలా ఈ చట్టం చేయబడిందన్నది తెల్సిందే. ఇది రాజ్యాంగంలోని సెక్యులర్ విలువలకు ప్రతిఘాతకంగా ఉందని, దీనిని రద్దు చేయాలని దేశవ్యాప్తంగా అనేక నిరసనలు వచ్చాయి. రాను రాను అవి తీవ్రమవుతూ వచ్చాయి. కరోనా సందర్భంలో సహితం నిరంతర స్థిరమైన ఆందోళనలు జరిగాయి.

ఈ నేపథ్యంలో ఎంతో మంది విద్యార్థులు, యువకులు, ప్రజాస్వామిక వాదులు, మేధావులపై తీవ్రమైన కేసులు బనాయించి నిర్బంధించారు. ఉద్యమకారులపై పోలీసులు లాఠీ చార్జీలు, చివరకు కాల్పులు జరిపి ఆందోళనకారులు ఒక చోట గుమిగూడకుండా, నిరసనా దీక్షలు చేయకుండా చేశారు. శాంతియుత నిరసనకారులపై శక్తివంతమైన రాజ్యం విరుచుకుపడి వారిని చిన్నాభిన్నం చేస్తూ అణచివేసింది.

అస్సాం రాష్ట్రంలో పౌరసత్వ సవరణ బిల్లు/చట్టానికి వ్యతిరేకంగా అఖిల్ గొగోయ్ నేతృత్వంలోని క్రిషక్ ముక్తి సంగ్రామ్ సమితి, విద్యార్థి, మహిళా తదితర సంస్థలు నిరసనల్లో చురుకుగా పాల్గొన్నాయి. అఖిల్ గొగోయ్ అస్సాం రాష్ట్రంలో అనేక పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి విశాల ఐక్య సంఘటనను ఏర్పాటు చేయడంలో ముఖ్య భూమికను నిర్వహించాడు. అస్సాంలోకి ఏ విదేశీయుల రాక వలన అస్సాం జాతీయతకు, అస్సాం ప్రజలకు నష్టం కలిగించే ఏ చర్యనైనా వ్యతిరేకిస్తామని అతడు స్పష్టం చేస్తున్నాడు.

మత ఫాసిస్టు దేశంగా మార్చాలనే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ భావాజాల ఆచరణలో పౌనసత్వ సవరణ చట్టం ఒకటి. అస్సాంలో కాంగ్రెస్‌కు ముస్లింల ఓటు బ్యాంక్ ఉందని, దాన్ని అధిగమించడంలో భాగంగా పక్క దేశాల నుండి ముస్లిమేతరుల వలసలను ప్రోత్సహించి వారికి పౌరసత్వమివ్వడం ద్వారా ఓట్ల రాజకీయాలలో లబ్ది పొందాలనే దురాలోచనలో భాగంగా పౌరసత్వ సవరణ చట్టం ఏర్పాటు అని అఖిల్ గొగోయ్ అంటాడు.

అస్సాంలో పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున వచ్చిన ఆందోళనలు, ప్రజాస్వామిక నిరసనలను అణచడం కోసం అస్సాం రాష్ట్రం అలాగే కేంద్ర బిజెపి పాలకులు చేసిన ప్రయత్నాలలో అఖిల్ గొగోయ్ తదితరులను అక్రమ కేసుల పాల్జేస్తూ నిర్బంధించడంగా అర్థం చేసుకోవచ్చు. అఖిల్ గొగోయ్‌ను 2019 డిసెంబర్ 12న అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన మూడవ రోజు ఉపా చట్టం కింద కేసు పెట్టారు. మరో ఐదు రోజులకు ఢిల్లీ తీసుకెళ్లారు. అతనిపై మోపిన కేసుల్లోని రెండింటిని ఎన్ఐఎ తన చేతుల్లోకి తీసుకున్నది.

అరెస్ట్ చేసిన ఐదు నెలల తర్వాత 2020 మే 29న చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఆ తర్వాత మరో పది నెలలకు 2021 మార్చ్ 16న ప్రత్యేక ఎన్ఐఎ కోర్టులో విచారణ మొదలయింది. ఇది మూడు నెలలు సాగి వాద ప్రతివాదాలు 2021 జూన్ 10న ముగిశాయి. ఒక కేసులో అఖిల్ గొగోయ్ నిరపరాధి అని 2021 జూన్ 23న తీర్పు వచ్చింది. మరొక కేసులో కూడా నిరపరాధి అని 2021 జూలై 1న ప్రత్యేక ఎన్ఐఎ కోర్టు తీర్పు చెప్పింది. అఖిల్ గొగోయ్‌తో పాటుగా ముగ్గురిని కూడా నిరపరాధులుగా ప్రకటించింది.

అఖిల్ గొగోయ్‌పై ఎన్ఐఎ కోర్టు తీర్పు త్వరగా వచ్చిందనే చెప్పుకోవాలి. అదీ కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిందితులుగా చెప్పబడే వారికి అనుకూలంగా తీర్పు రావడం ఒకింత ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. భీమా కోరేగావ్ కేసులో అరెస్టులు జరిగిన మూడేళ్లు కావస్తున్నా కూడా విచారణనే మొదలు కాలేదు. ఈ కేసులో అరెస్ట్ కాబడిన పదహారు మందిలో ఏ ఒక్కరికీ కూడా బెయిల్ దొరకలేదు. ఒక్కరికి మాత్రమే మెడికల్ గ్రౌండ్స్‌పై ముంబయిలోనే ఉండాలనే షరతులతో 6 నెలలకు బెయిల్ ఇచ్చారు.

వీరందరిలో పెద్దవారైన 84 ఏళ్ల స్టాన్ స్వామికి అదీ కూడా దొరకలేదు. అనారోగ్య కారణాల రీత్యా సరైన వైద్యం అందక ఆసుపత్రిలోనే మరణించాడు. సరైన వైద్యం అందించక కావాలనే ఆయన మరణానికి కారణమై హత్య చేశారని చెప్పుకోవచ్చు.

ఈ క్రమంలో విచారణ మాటేమో గాని, విచారణా ప్రక్రియనే ఒక శిక్షగా పరిణమించింది. నిజానికి ఇటువంటి అభూత కల్పనల కేసుల విషయంలో శిక్షలు పడడం అరుదు. బెయిల్ ఇవ్వకుండా జైళ్లలో

నిర్బంధించి కనీస ప్రాథమిక హక్కులను హరించి వేయడం జరుగుతుంది. 18 నెలలు జైలులో నిర్బంధానికి గురై అన్ని రకాల హక్కులను కోల్పోయిన అఖిల్ గొగోయ్ నిర్దోషిగా విడుదలయ్యాడు. మరి ఈ పద్దెనిమిది నెలల కాలాన్ని తిరిగి ఇవ్వగలరా? నష్టపోయిన జీవితాన్ని పూడ్చగలరా? అంటే సమాధానం ఉండదు.

అఖిల్ గొగోయ్ మరితర ముగ్గురిపై తీర్పును పరిశీలిస్తే హేతుబద్ధమైన, క్రమానుగతమైన తర్కం కనిపిస్తుంది. ఎన్ఐఎ మోపిన కేసులకు సంబంధించి ఎంత పేలవమైన సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టారో తెలిసిపోతుంది. ఇద్దరు రక్షిత సాక్షుల పేరుతో చెప్పబడిన సాక్ష్యంలో అఖిల్ గొగోయ్ మావోయిస్టులతో సంబంధాలున్నాయని పేర్కొన్నారు. వారు చెప్పిన విషయాలన్నీ కూడా 2009కి పూర్వంవి అని, అప్పటికి మావోయిస్టు పార్టీపై నిషేధం లేదనే వాదనను కోర్టు ముందుకు తెచ్చింది. రక్షిత సాక్షులు (వీరి గుర్తింపును బయట పెట్టరు) చెప్పిన విషయాలు 2004, 2006, 2007, 2008, 2009 సంవత్సరాలకు చెందినట్టివి. కాని వారి స్టేట్‌మెంట్లను 11 నుండి 16 సంవత్సరాల గ్యాప్‌తో ఢిల్లీ మెజిస్ట్రేట్ కోర్టు ముందు 2020లో రికార్డు చేయించారు. ఇంత ఆలస్యంగా రికార్డు చేయబడిన వాటి సాధికారతను కోర్టు ప్రశ్నించింది. వీరి స్టేట్‌మెంట్లలో ఎక్కడా కూడా మావోయిస్టు పార్టీని నిషేధించాక దానితో అఖిల్ గొగోయ్‌కు ఉన్న సంబంధాల ప్రస్తావన లేదని కోర్టు తేల్చింది.

మిగతా సాక్షుల విషయంలో కూడా ఎక్కడా కూడా అఖిల్ గొగోయ్ మరితరుల మాటలు అల్లర్లను, హింసను ప్రేరేపించినట్లుగా రుజువు కాలేదని చెప్పింది. పైగా ఎన్ఐఎ సాక్ష్యంగా ప్రవేశపెట్టిన వీడియోలో అఖిల్ గొగోయ్ మాట్లాడుతూ ఎక్కడా కూడా హింసకు చోటివ్వవద్దని, ఒకవేళ తనను అరెస్ట్ చేస్తే చేసుకోనివ్వమని చెప్పిన విషయాలను పునరుక్తి చేసింది. తద్వారా ఎన్ఐఎ మోపిన కేసుల్లో పసలేదని చెబుతూ అఖిల్ గొగోయ్ మరితరులను నిర్దోషులుగా ప్రకటించింది.

ఈ తీర్పులో కొన్ని సాధారణ పరిశీలనను తన వైపు నుండి ఎన్ఐఎ ప్రత్యేక కోర్టు ప్రకటించింది. యుఎపిఎ, మరెన్నో తీవ్రమైన చట్టాల ప్రకారం దీర్ఘకాలికంగా ఐదు నుండి ఇరవై సంవత్సరాల జైలు శిక్షలు, జీవిత ఖైదు, మరణ శిక్షలు అమలు చేయబడతాయి. ఇటువంటి కేసుల్లో యుఎపిఎలోని 43 (డి) (5) సెక్షన్ ప్రకారం బెయిల్ ఇవ్వడం నిషేధించబడిందని ఒకవేళ అదే జరిగితే గనుక విచారణ పూర్తయ్యే దాకా జైళ్లోనే ఉండిపోవాల్సి వస్తుందని, ఈ విచారణ సత్వరమే జరిగితే కొన్ని నెలల్లో అలా కాకుంటే సంవత్సరాల తరబడి జరుగుతుందని అందుకోసం న్యాయ విచారణను తమలాగా వేగవంతం చేయాలనీ అన్నది. ఏవో కారణాల రీత్యా ఒకవేళ బెయిల్ ఇవ్వడం కుదరకపోతే కోర్టులో విచారణ సంవత్సరం లోపే పూర్తి చేయాలని చెప్పింది. తద్వారా రాజ్యాంగ, మానవ హక్కులు, అలాగే సత్వర న్యాయ విచారణలు ఉల్లంఘించబడవని వివరించింది.

యుఎపిఎ చట్టాన్ని అమలు చేసే క్రమంలో సంబంధిత విచారణా సంస్థలు చట్ట పరిమితులకు మించి అతిగా కాకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ విషయంలో గతంలో 1955 నుండి సుప్రీంకోర్టు, హైకోర్టులు చెప్పిన, వ్యాఖ్యానించిన అనేక న్యాయ సూత్రాలకు కట్టుబడి ఉండాలని అన్నది ఎన్ఐఎ కోర్టు. అటువంటి వ్యాఖ్యానాలను తమ తీర్పులో ఎన్నో చోట్ల పునరుక్తి చేసింది.

1962లోని కేదర్‌నాథ్ కేసు విషయంలో గాని, మరెన్నో కేసుల్లో గాని ఇచ్చిన తీర్పుల్లోని స్ఫూర్తిని పాటించాలని వాటి వివరణలను కోర్టు చాలా సార్లు ప్రస్తావించింది. నేర విచారణ సంస్థలకు వీటిపై నిరంతరంగా అవగాహనను కల్పించాలని, శిక్షణలు ఇవ్వాలని కూడా కోర్టు చెప్పింది. ఈ విధంగా జరుగకపోవడం వల్ల తీవ్రమైన పరిణామాలుంటాయని చెప్పింది. ఇతర చట్టాల పరిమితుల్లో ఉండే కేసుల్లో తీవ్రమైన తీవ్రవాద చట్టాలను అమలు చేయడం ద్వారా నేరారోపణ వ్యక్తులు బెయిల్ పొందకుండా నష్టపోతారని, అలాగే తీవ్రవాద వ్యతిరేక చట్టాలను వాటిని అనుమతించబడిన పరిమితులకు మించి ఉపయోగిస్తూ మామూలు నేరాలకు అన్వయించడం జరిగితే కాలక్రమంలో అసలు తీవ్రవాద వ్యతిరేక చట్టాలు నీరుగారి పోతాయని, తద్వారా అసలు తీవ్రవాద నేరాలపై సమరాన్ని బలహీనపరిచినట్లు అవుతుందని స్పష్టం చేసింది. చట్టాల పరిధికి మించకుండా చట్టాల స్ఫూర్తికి కట్టుబడి రాజ్యాంగపరమైన పౌరహక్కులకు భంగం కలగని రీతిలో నేర విచారణ సంస్థలు, వ్యవస్థలు స్పందించాలని ఎన్నో ఉన్నత న్యాయస్థానాల తీర్పులు చెప్పి ఉన్నప్పటికీ అవి బుట్ట దాఖలు అవుతుండడం విషాదం.

ఎన్ఐఎ విచారణలో భాగంగా అఖిల్ గొగోయ్ తనను శారీరకంగా, మానసికంగా వేధించిందీ, తనను ప్రలోభపెట్టిందీ మీడియాకు వివరించాడన్న విషయాలను క్లుప్తంగా ఎన్ఐఎ కోర్టు తన తీర్పులో ప్రస్తావించింది. అదనపు కేసు డైరీలో ఉన్న విషయాలు తమ దృష్టికి వచ్చాయని, అయితే అఖిల్ గొగోయ్ వీటిని తమకు చెప్పాల్సి ఉండిందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

అఖిల్ గొగోయ్ బిజెపి లేదా ఆర్ఎస్ఎస్‌లో చేరితే వెంటనే బెయిల్ ఇప్పిస్తామని విచారణాధికారులు చెప్పినట్లు అఖిల్ గొగోయ్ మీడియాకు తెలిపాడు. ఏదో ఒక దగ్గర నుండి ఎంఎల్ఏగా పోటీ చేసి తర్వాత మంత్రి పదవిని కూడా పొందవచ్చని ప్రలోభ పెట్టారని చెప్పాడు. ముఖ్యమంత్రితో అలాగే ముఖ్య స్థాయిలో ఉన్న మరో మంత్రితో సమావేశం ఏర్పాటు చేస్తామని, క్రిస్టియన్ మత మార్పిడిలకు వ్యతిరేకంగా స్వచ్ఛంద సంస్థను ప్రారంభిస్తే 20 కోట్లు ఇస్తారని ఒప్పించే ప్రయత్నం చేశారని స్పష్టం చేశాడు. వీటిని నిరాకరించిన పక్షంలో బెయిల్ రాదని, పదేళ్లు జైలులోనే ఉండిపోవాల్సి వస్తుందని లేదా చావుకు గురికావాల్సి వస్తుందని తనను హెచ్చరించారని అఖిల్ గొగోయ్ మీడియా ముందు స్పష్టం చేశాడు. బిజెపిలో గాని, ఆర్ఎస్ఎస్‌లో గాని చేరితే కేసులుండవ్, జైళ్లుండవ్. అధికారంలో ఉన్నవారికి ఎంత వెసులుబాటో కదా! రాజ్య యంత్రాంగాన్ని అంతా తమ చెప్పు చేతుల్లో పెట్టుకుని తమ స్వార్థ ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి అడ్డం వచ్చే ప్రజాస్వామిక, ప్రగతిశీల శక్తులను అణచివేయడానికి ఎంతకైనా తెగిస్తారన్నట్లు. చట్ట సభలు, పోలీసు వ్యవస్థ, నేర విచారణ వ్యవస్థలు, ఉద్యోగస్వామ్యం, న్యాయ వ్యవస్థలు మొదలైన అనేక రాజ్య యంత్రాంగాలను బలహీనపరిచి తమకు అనుకూలంగా మలుచుకోవడం జరుగుతున్నది. ఇదంతా కూడా 'దొంగే.. దొంగా దొంగా...' అన్నట్లుగా ఉంటుంది.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

భావ ప్రకటనా స్వేచ్ఛకు ఉచ్చు బిగిస్తున్న కేంద్రం

సామాజిక మాధ్యమాలు ప్రభుత్వాల దాష్టీకాలను బయటపెట్టడం నచ్చని పాలకవర్గాలు వాటిని తమ కనుసన్నలలో నడవాలని చట్టం చేశారని అంటున్నారు **పబ్బతి వెంకటేశర్లు**

స్వతంత్ర భారతంలో రాజ్యాంగం ద్వారా సంక్రమించిన అత్యంత విలువైనది భావప్రకటన స్వేచ్ఛ. జీవించే హక్కుకు భంగం కలిగినప్పుడు, అన్యాయం, అక్రమం, అణచివేత పెచ్చరిల్లినప్పుడు, ప్రజావ్యతిరేక, అనాలోచిత, అప్రజాస్వామిక విధానాలతో ఊపిరి సలపకుండా చేసినప్పుడు పెగిలే గొంతుకు స్వేచ్ఛ ఉండాలన్నది రాజ్యాంగం. ఈ భావ ప్రకటన స్వేచ్ఛ సర్వజన ప్రాథమిక హక్కు. ఈ భావ ప్రకటన స్వేచ్ఛకు సంకెళ్ళు బిగించినప్పుడు హక్కుల హననం జరుగుతుంది. నిజానికి ప్రజాస్వామ్యంలో ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా గతానికి భిన్నంగా వ్యవహరిస్తున్నాయి. అది పాలకుల లేదా రాజకీయ పార్టీల జేబు సంస్థలుగా మారిపోయాయి. బడా పెట్టుబడిదారుల చేతుల్లో బందీ అయ్యి ప్రజల హక్కులు కాలరాయబడుతున్నా, వాటి తాలూకు ఆనవాళ్లు కూడా కనపడకుండా ప్రధాన మీడియా పనిచేస్తున్నది. ఈ దశలో సామాన్యుని వేదన అరణ్య రోదనే అవుతున్నది. ఈ క్రమంలో ప్రతి ఒక్కరికి అందుబాటులోకి వచ్చిన సౌకర్యం సోషల్ మీడియా. తమ అభిప్రాయాలకు విమర్శలకు ఈ సామాజిక మాధ్యమం ప్రధాన ఆయుధమైంది. సుప్రీంకోర్టు చెప్పినట్టు ఇంటర్నెట్ పొందటం సామాన్యుని హక్కు అయిన నేపథ్యంలో ఇది అందరికీ అందుబాటులోకి రావడంతో ప్రతి ఒక్కరు తమ అభిప్రాయాలు సోషల్ మీడియా ద్వారా వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యక్తీకరణలో ప్రభుత్వాల, రాజకీయ నాయకుల సమాజ వ్యతిరేక విధానాలు బట్టబయలు కావడం మొదలైంది. రానురాను సోషల్ మీడియా అత్యంత ప్రభావశీల శక్తిగా ఎదిగింది. ప్రధాన మీడియాను తలదన్ని ప్రజాభిప్రాయాలకు వేదికగా నిలబడింది. ప్రజల చైతన్య శీలతకు సహజంగానే వ్యతిరేకి అయిన పాలకవర్గం, తమ గుట్టు మట్లన్నీ ప్రచారం కావడంతో తమ అధీనంలో లేని సోషల్ మీడియాపై కన్నేసింది. ద్వేషంతో దోషాన్వేషణ మొదలు పెట్టింది. కోట్లకొలది అభిప్రాయాలలో అభూత అసత్య లైంగిక, అసాంఘిక, ఆర్థిక నేరాలతో పాటు, మోసపూరిత ప్రచారాలకు కొంతమేరకు తావున్నది. ఒక్కోసారి నిజమైన వార్తలు కూడా నమ్మాలో వద్దో తెలియని స్థితి నెలకొంది. అయినప్పటికీ ఈ సామాజిక మాధ్యమాలు సామాన్యులు తమ బాధలు గాథలూ, కష్టాలు కన్నీళ్లు సమాజంలో జరిగే విషయాల పై ప్రతిస్పందించే ప్రధాన వేదికలుగా మారినాయి అనడంలో సందేహం లేదు. దీన్ని ఎలాగైనా కట్టడి చేయాలన్న ఉద్దేశంతో కొత్త ఐటి నియమాలను తీసుకొచ్చింది. సోషల్ మీడియా సంస్థలకు ముక్కుతాడు వేసి తద్వారా ప్రజల నోటికి తాళం వేయ జూస్తున్నది ప్రభుత్వం. దీని వెనుక ప్రభుత్వం అసలు ఉద్దేశం ఏమిటో తెలుసుకోవలసి ఉంది.

కొత్త ఐటి రూల్స్ తీసుకు రావడానికి గల నేపథ్యం

స్వేచ్ఛాయుత ప్రజాభిప్రాయవేదిక లైన వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్, మొదలైన సోషల్ మీడియా, డిజిటల్ మీడియా వేదికగా అమెజాన్ నెట్‌ఫ్లిక్స్ హాట్‌స్టార్, డిస్నీ మొదలైన సంస్థలపై ఉక్కుపాదం మోపడానికి సరికొత్త రూల్స్ ను సంధించింది భారత ప్రభుత్వం. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంటర్మీడియరీ గైడ్ లైన్స్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్ 2021 (మధ్యవర్తిత్వ మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్ 2021) పేర రూల్స్‌ను 25, మార్చి 2021 న కేంద్ర సమాచార శాఖ విడుదల చేసింది.

సమాచార నియంత్రణ విషయమై ట్విట్టర్ లాంటి సంస్థలతో వివాదం తలెత్తిన కొద్దివారాల్లోనే ఈ నియమాలను తీసుకురావడం గమనించ దగినది. ఈ నియమాలను తీసుకు రావడానికి గల కారణాలను వివరిస్తూ, సోషల్ మీడియాలోని కంటెంట్ భారత సమగ్రతకు ఐకమత్యానికి భంగం కలిగించేలాగా ఉంటుంన్నదని, కాబట్టి అవి జవాబుదారీతనాన్ని కలిగి ఉండాలని అందుకోసం సోషల్ మీడియా వేదికలను అదుపు చేయాల్సి ఉందని లేని పక్షంలో దేశ సమగ్రతకు భంగం కలిగే ప్రమాదం పొంచి ఉన్నందున ఈ నియమాలు తీసుకురావాల్సి వచ్చిందని ప్రభుత్వం చెబుతున్నది. ఈ నియమాల ప్రకారం 50 లక్షలకు పైగా వినియోగదారులు ఉన్న ఇంటర్మీడియరీ అయిన సామాజిక మాధ్యమాలు ఈ నియమాలు వెలువడిన మూడు నెలల్లోగా అంటే మే 25లోగా అంగీకరించాలని తెలిపారు. ఎవరైనా ఈ నియమాలను అంగీకరించని పక్షంలో వారికి లభించే రక్షణలు పోతాయని హెచ్చరించడం జరిగింది. మతపర అంశాలు దేశాన్ని అగౌరవపరిచే అంశాలు చోటుచేసుకుంటున్నాయని జాతి వ్యతిరేక శక్తులు సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తున్నాయని ఈ మీడియా ద్వారా కొందరు ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని కేంద్రం అంటున్నది.

ఓటీటీ (ఓవర్ ది టాప్) వేదికలు అయినటువంటి అమెజాన్, నెట్ ఫ్లిక్స్, హాట్‌స్టార్ లలో కూడా ఇలాంటి కంటెంట్ ఉంటుందని దీనివల్ల అశాంతి నెలకొంటుందని ప్లాట్ పామ్ లన్నీ కూడా భారత ప్రభుత్వ చట్టాలు అలాగే కొన్ని నియమాలకు కట్టుబడి పనిచేయాలని ఆ మధ్యవర్తిత్వ సంస్థలకు సూచించింది, లేని పక్షంలో వీటికి ఉండే రక్షణలు తొలగిస్తామని హెచ్చరించింది.

మధ్యవర్తిత్వ వేదికల పాత్ర

ఇంటర్మీడియరీస్ అంటే మధ్యవర్తిత్వ సంస్థలు అయినటువంటి ఫేస్బుక్ వాట్సప్, ట్విట్టర్, ఇంస్టాగ్రామ్ మొదలైనవి. ఈ మధ్యవర్తిత్వ

సంస్థలు వినియోగదారుల వార్తలను ఒక వినియోగదారుడి నుండి మరొక వినియోగదారుడికి చేరే వేయడం వరకే పరిమితం అవుతాయి. వినియోగదారులు పెట్టే సమాచారాన్ని నియంత్రించవు. వాటికీ బాధ్యత వహించవు. ఎండ్ టు ఎండ్ ఎన్క్రిప్షన్ వల్ల సంస్థలు కూడా ఈ సమాచారాన్ని చూడలేవు చదవలేవు. దీనివల్ల వినియోగదారుడి ప్రైవసీకి ఎటువంటి భంగం కలగదు. అందుకు అనుగుణంగా ఇవి రూల్స్ రూపొందించుకున్నాయి. కాబట్టి వినియోగదారులు నిరభ్యంతరంగా తమ అభిప్రాయాలను ఈ వేదికల ద్వారా పంచుకుంటున్నారు కనుక వినియోగదారుల పక్షాన ఇంటర్మీడియట్ సంస్థలు తాము రూపొందించుకున్న నియమాలకు భిన్నంగా వ్యవహరించలేమని అంటున్నాయి. దీంతో మధ్యవర్తిత్వ సంస్థలపై కొత్త నియమాల కొరడా ఝులిపించింది.

ప్రభుత్వం కొత్త ఐటి నియమాలు

సామాజిక మాధ్యమాలలో తమకు వ్యతిరేకంగా పోస్టింగ్స్ వస్తుండటంతో ప్రభుత్వం కలవరపడింది. ఈ మాధ్యమాలు ఎంత ప్రభావాన్ని చూపుతాయో అనుభవం కలిగిన పాలకపక్షం వీటిని ఎలాగైనా తమ అదుపులో ఉంచుకోవాలనే ఉద్దేశంతో నిబంధనలు రూపొందించింది. కేంద్రం తెచ్చిన ఈ నియమాలు ముఖ్యంగా రెండు రకాల ప్లాట్ ఫామ్ లకు సంబంధించినవి. అవి. 1) సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ (ఫేస్‌బుక్, వాట్సప్, ట్విట్టర్, కూ) 2) ఓటీటీ ప్లాట్ ఫామ్ (అమెజాన్, నెట్ ఫ్లిక్స్, హాట్ స్టార్, డిస్నీ).

మొదటగా ప్రభుత్వం సూచించిన నిబంధనలన్నీ సామాజిక మీడియా సంస్థలు పాటించాలని లేనట్లయితే వాటికి లభించే సేఫ్ హార్బర్ రక్షణలు వర్తించవని హెచ్చరించింది. సేఫ్ హార్బర్ రక్షణలు అంటే ప్రభుత్వం తాను చెప్పిన నియమాలను అనుసరించకపోతే ఈ సామాజిక సంస్థలను బ్యాన్ చేయలేవు, బ్లాక్ చేయలేవు. కానీ, వాటికి లభించే రక్షణలు అంటే ఇప్పటి వరకు ఉన్న నియమాల ప్రకారం ఎవరైనా తప్పుడు సమాచారం పెడితే వారి మీద క్రిమినల్ కేసు పెట్టవచ్చు కానీ మధ్యవర్తిగా ఉన్నటువంటి మీడియా సంస్థల మీద కేసులు పెట్టలేరు. మీడియాలో వచ్చే మెస్సేజ్ లకు ఆ సంస్థలకు సంబంధం ఉండదు. అలాగే బాధ్యత వహించజాలవు. వాటి పని ఏమైనా ఒకచోటి నుంచి మరొక చోటికి చేర్చడమే. కొత్త నియమాల ప్రకారం నియమాలను అది అంగీకరించకపోతే ఈ రక్షణలు ఉండవు. కాబట్టి ఆ మీడియా సంస్థల మీద కూడా కేసులు పెట్టే అవకాశం ఉంటుంది. అప్పుడు ఈ సంస్థలు చాలా ఇబ్బందులు పడవలసిన పరిస్థితి ఉంటుంది. ప్రతి రోజు అనేక వేల కేసులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి రావచ్చు. ఈ నేపథ్యం లో ప్రభుత్వం విధించిన నియమాలు ఇవి.

సామాజిక మాధ్యమాలపై విధించిన నియమాలు

సోషల్ మీడియా సంస్థలు అంటే ఫేస్బుక్ వాట్సప్ ట్విట్టర్, కూ మొదలైనవి వినియోగదారుడు చేసే ఫిర్యాదులను పరిష్కరించడానికి ఆ సామాజిక మాధ్యమాలు గ్రీవెన్స్ అధికారిని నియమించుకోవాలి. బాధితుడి ఫిర్యాదు అందిన 24 గంటల్లోగా చర్యలు చేపట్టాలి. 15 రోజుల్లోగా ఫిర్యాదును ముగించాలి. గ్రీవెన్స్ అధికారి వివరాలన్నీ కూడా అందరు వినియోగదారులకు తెలియజేయాలి. ఈ సామాజిక వేదికలు తప్పకుండా భారత దేశ చట్టాలకు లోబడి, కట్టుబడి ఉండాలి. అన్ని సామాజిక మాధ్యమాలు తప్పకుండా చీఫ్ కంప్లియన్స్ ఆఫీసర్ ను నియమించుకోవాలి. ఇతను భారతదేశంలో నివాసం ఉండాలి. 24/7 చట్టబద్ధ సంస్థలతో సంప్రదింపులు జరపడానికి వాటికి సహకరించడానికి నోడల్ ఆఫీసర్ ను నియమించాలి. ఫిర్యాదుల పరిష్కారం కోసం భారత దేశంలో నివసించే రెసిడెంట్ గ్రీవెన్స్ అధికారిని నియమిస్తూ . ప్రతినెల సంబంధిత వివరాలను ప్రభుత్వానికి అందించాలి. భారతదేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు సంబంధించిన, దేశ భద్రతకు భంగం కలిగించే, మహిళల లైంగిక వేధింపులకు సంబంధించి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన మొదటి వారిని గుర్తించే యంత్రాంగం తయారు చేసుకోవాలి. అధికారుల వివరాలు తమ తమ వెబ్ సైట్ లో పొందుపర్చాలి. వినియోగదారులు తమ వినియోగదారుల యొక్క సమాచారాన్ని మధ్యవర్తిత్వ సంస్థలు తొలగించే సమయంలో వినియోగదారునికి తగిన సమాచారం ఇచ్చి వారు చెప్పే సంజాయిషీ విని ధ్రువీకరించి యంత్రాంగాన్ని కలిగి ఉండాలి. భారతదేశ సార్వభౌమత్వం, సమగ్రత పబ్లిక్ ఆర్డర్ విదేశాలతో స్నేహపూర్వక సంబంధాలకు భంగం కలిగించే లేదా ఏదైనా చట్టం కింద నిషేధించబడ్డ సమాచారాన్ని పోస్ట్ చేయరాదు లేదా ప్రచురించ రాదు.

పైన చెప్పిన నియమాలన్నీ 2021 ఫిబ్రవరి 25 నుండి 3 నెలల తర్వాత అంటే మే 26 నుండి అమలులోకి వస్తాయని, అప్పటికల్లా తగిన యంత్రాంగాన్ని సిద్ధం చేసుకోవాలని కేంద్రం సూచించింది. అందులో గూగుల్ ప్రభుత్వం తెచ్చిన నియమాలకు అనుగుణంగా తమ ప్రొడక్ట్స్ ఉంటాయని తెలిపింది. ఫేస్బుక్, వాట్సాప్ పై నిబంధనలకు అనుకూలమని ఒకవైపు ఒప్పుకుంటూనే మరోవైపు వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తాయని వీటికి వ్యతిరేకంగా కోర్టుకెళ్లింది.అయినా ఈ రెండు సంస్థలు నియమాలు పాటిస్తామని దాదాపు 2 మిలియన్ల నకిలీ ఖాతాలను తొలిగించినట్లు తమ మొట్ట మొదటి నివేదిక జూన్ 15న ప్రకటించాయి. ట్విట్టర్ మాత్రం ఒప్పుకోలేదు.

డిజిటల్ మీడియా, ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఎథిక్స్ కోడ్

సోషల్ మీడియాకు నియమాలను పెట్టినట్లే డిజిటల్ మీడియా, ఓటీటీ ప్లాట్ ఫామ్ లకు కూడా కొన్ని నిబంధనలు విధించింది. అన్ని రకాల వర్గాల నుండి ప్రభుత్వానికి డిజిటల్ మీడియా మీద అనేక ఆరోపణలు వచ్చాయని అందువల్ల వీటిని కూడా నియంత్రించాల్సి ఉందని సుప్రీంకోర్టు కూడా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరిందని అందువల్ల ఓటీటీ సంస్థలు స్వీయ నియంత్రణ వ్యవస్థను కలిగి ఉండాలన్నది. మూడు స్థాయిల్లో ఫిర్యాదుల యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలని కోరింది. నిబంధనలు అమలు చేయడానికి అధికారులు నియమించుకోవడం తో పాటు వారి పేరు చిరునామాలను వెల్లడించాలి. వినియోగదారుల నుండి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించాలి వాటి తొలగింపు వంటివి అదే సంస్థలు చేయాలి. శాంతి భద్రతలకు భంగం కలిగించే అంశాలను ప్రచురించకుండా చేయడానికి ఈ నియమాల ప్రకారం ప్రభుత్వానికి అధికారం వచ్చింది.

మూడు స్థాయిల్లో ఫిర్యాదుల యంత్రాంగం ఇలా ఉండాలని చెప్పింది.

1. ప్రచురణకర్తల స్వీయ నియంత్రణ: భారతదేశ కేంద్రంగా ఉన్న ఫిర్యాదులను 15 రోజుల్లో పరిష్కరించడానికి ఫిర్యాదుల పరిష్కార అధికారి గ్రీవెన్స్ సెల్ ఆఫీసర్ ను నియమించుకోవాలి.
2. స్వీయ నియంత్రణ సంస్థ (సెల్ఫ్ రెగ్యులేటరీ బాడీ):సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తి లేదా ఒక ప్రముఖ వ్యక్తి నాయకత్వంలో కమిటీని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.
3. పర్యవేక్షక విధానం (ఓవర్ సైట్ మెకానిజం): సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ రూపొందించే పర్యవేక్షక యంత్రాంగం ఓటీటీ సంస్థల ఫిర్యాదులను వినటానికి ఇంటర్ డిపార్ట్మెంటల్ కమిటీ ఏర్పాటు చేస్తుంది.

ఓటీటీ లో వచ్చే కంటెంట్ ఆధారంగా ఐదు భాగాలుగా విభజించాలి అవి.

1. అన్ని వయసుల వారు చూసేది.
2. 7 ఏళ్ల వయసు వరకు చూసేవి.
3. 13 ఏళ్ల వయస్సు పిల్లలు చూసేవి.
4. 16 ఏళ్ల వయసు పిల్లలు చూసేవి.
5. పెద్ద వాళ్లు మాత్రమే చూసేవిగా ఉండాలి.

వినియోగదారుని పరువు మర్యాదలకు భంగం కలిగించే ఏదైనా వార్త ప్రచురించబడితే దానిపై ఫిర్యాదు అందిన 24 గంటల్లోగా తొలగించాలి. ఇటువంటివి బయట దేశం నుండి వస్తే మన దేశంలో మొదటి పోస్ట్ చేసింది ఎవరో చెప్పాలి. నిబంధనలు పాటించకుంటే ఇంటర్మీడియరి స్టేటస్ రద్దు చేస్తామని క్రిమినల్ చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని కేంద్ర ప్రభుత్వం ఘాటుగానే హెచ్చరిస్తున్నది. డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ చట్టంలోని సెక్షన్ 69(ఎ) పరిధిలోకి తీసుకొచ్చారు. వ్యవస్థకు అగ్ర స్థాయిలో ఉండే ఇంటర్ మినిస్టీరియల్ కమిటీకి అధిపతిగా వ్యవహరించే అధికారి అత్యవసర పరిస్థితుల్లో ప్రసారాలను నిలిపి వేసే ఆదేశాలను జారీ చేయవచ్చు.వివరణ ఇవ్వడానికి కంపెనీలకు అవకాశం కూడా ఇవ్వరు. అత్యవసరంగా ప్రసారాలను నిలిపి వేయడానికి 48 గంటల్లోగా సమావేశం కావాల్సి ఉంటుంది. సమాచారం మొదట ఎక్కడి నుండి వచ్చింది వంటి వివరాలను దర్యాప్తు సంస్థలతో పంచుకోవాల్సి ఉంటుంది. సోషల్ మీడియా కుత్తుకలపై కత్తిపెట్టి ఇదేమంటే సోషల్ మీడియా కు సోషల్ రెస్పాన్సిబిలిటీ ఉండాల్సిందే కదా అంటుంది.ఇవి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నియమాలు.

సమాజంపై సోషల్ మీడియా ప్రభావం

అత్యంత బలమైన శక్తిగా ఎదిగిన సోషల్ మీడియా ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చింది . సామాజిక మాధ్యమాల ద్వారా అధికారుల, రాజకీయ పార్టీల మీద, ప్రభుత్వాల మీద, వాటి వైఖరుల మీద ఏ మూల ఏ సంఘటన జరిగినా సోషల్ మీడియా నే వేదికవుతుంది . అత్యంత రహస్యంగా జరిగిన సమావేశాలు సంఘటనలు సోషల్ మీడియా ద్వారా బయటికి పొక్కి వైరల్గా మారడంతో కనిపించని నిఘా నేత్రం తమను పరిశీలిస్తుందని కొంత మంది జాగ్రత్త వహిస్తున్నారు. ప్రధాన మీడియాలో వెలుగు చూడని మేనేజ్ చేయబడిన అనేక విషయాలను సోషల్ మీడియాలో కంట్రోల్ చేయడం సాధ్యం కావడం లేదు. క్షణాల్లో లక్షల మందికి చేరిపోతుంది. కొన్నిచోట్ల వెంటనే ప్రతిస్పందనలు ధర్నాలుగా, నిరసనలుగా మారుతున్నాయి. అత్యంత శక్తివంతమైన సాధనంగా ఈ మీడియా మారిపోయింది. ప్రజాస్వామ్యానికి మూల స్తంభంగా ఉండాల్సిన ప్రధాన మీడియా ప్రభుత్వాలకు, ధనిక వర్గాలకు కొమ్ము కాయడంతో సోషల్ మీడియా ప్రజా సమస్యల వెల్లడిలో ప్రధాన భూమిక పోషిస్తుంది. ఇదే క్రమంలో కొన్ని అనవసర అనైతిక అసాంఘిక కార్యక్రమాలు మోసాలు ఈ వేదికగా జరుగుతున్నాయి

"కొత్త డిజిటల్ నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని గోప్యత లేకుండా దీన్ని సృజించటం నిర్వహించటం సాధ్యం కాదని ఈ నిబంధనలు నా హక్కును కాలరాస్తున్నాయని" ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు టి.ఎం. కృష్ణ మద్రాసు కోర్టును ఆశ్రయించారు. కరోనా సమయంలో తప్పుడు సమాచారం రూమర్స్ అన్న సాకుతో జనం గొంతును నొక్కవద్దని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం తో పాటు అన్ని రాష్ట్రాల డీజీపీలను ఆదేశించింది. ఆపదలో ఉన్న ప్రజలు సహాయం కోరుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడితే వారిపై చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆదేశాలను ఉల్లంఘిస్తే కంటెంట్ ఆఫ్ కోర్టు కింద చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. దీన్నిబట్టి సామాజిక మాధ్యమాల పాత్ర ఎంత ప్రభావశీలమైన తో అర్థమవుతుంది కనుక పైకి చెబుతున్న కారణాలు వెనుక మర్మమేదోదాగి ఉన్నదని అవగతమవుతుంది.

నిబంధనల వెనుక ఉన్న మర్మం

సుప్రీం కోర్టు ఆదేశాలు, రాజ్యసభలో చర్చ, రాజ్య సభ కమిటీ నివేదిక అనంతరం విస్తృతమైన సంప్రదింపుల తర్వాతనే డిసెంబర్ 24, 2018న ఈ నియమాల ముసాయిదా విడుదల చేశామని, వచ్చిన సూచనలు సలహాల ప్రకారం ఈ నియమాలను తీసుకొచ్చామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నది. నిజానికి సోషల్ మీడియా వేదిక ద్వారా ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను విమర్శిస్తూ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే ప్రచారం జరుగుతున్నది. ఈ నియమాలు ప్రవేశపెట్టడంతో నెటిజన్ల నుంచి చాలా వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. వీటిని కట్టడి చేయడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. ఈ నియమాలతో సోషల్ మీడియాలో వచ్చే ప్రతి మెసేజ్ను ట్రేస్ చేసేందుకు ఐటీ శాఖకు అధికారం వచ్చింది. సోషల్ మీడియా బాధ్యతగా ఉండాలని నియంత్రణలో ఉండాలని చెప్పి తమకు వ్యతిరేకంగా వచ్చే వార్తలను సోషల్ మీడియాలో రాకుండా చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఈ రూల్స్ అమల్లోకి వస్తే ఏం మాట్లాడితే ఏ కేసు మీద పడుతుందోనని భయపడుతున్నారు నెటిజన్లు. ఈ నిబంధనలు తీసుకురావడానికి ఇంతగా ప్రభుత్వం ఎందుకు ప్రయత్నిస్తున్నదో కొన్ని ఉదాహరణలు చూస్తే అర్థమవుతుంది.

ఇటీవల కాంగ్రెస్ పార్టీ తన కార్యకర్తలకు పార్టీ తరఫున నిర్వహించాల్సిన కార్యక్రమాల గురించి అంతర్గత సూచనలు ఇచ్చే ఒక టూల్ కిట్ విడుదల చేసింది. దీనికి బీజేపీ పార్టీ నాయకుడు ఒకరు కొంత విషయం జతపరిచి ట్విట్టర్లో పెట్టి దేశ సమగ్రతకు వ్యతిరేకంగా కాంగ్రెస్ టూల్ కిట్ తయారు చేసిందని ఆరోపించారు. దానిమీద కాంగ్రెస్ పార్టీ కేసు పెట్టడం జరిగింది ఈ క్రమంలో ట్విట్టర్ సంస్థ బిజెపి నాయకుని ట్విట్టర్ మీద మానిపులేటెడ్ అని పెట్టింది దీన్ని ప్రభుత్వం జీర్ణించుకోలేక పోయింది అలాగే తాము చెప్పిన వారి ఎకౌంట్లను బ్లాక్ చేయాలని

కోరింది. తాము తమ సిద్ధాంతాల ప్రకారమే నడుచుకుంటామని ట్వీట్లను అది తొలగించలేదు అది కేంద్రానికి నచ్చలేదు.

ఢిల్లీలో జరిగిన షహీన్‌బాగ్ అల్లర్ల సందర్భంగా జరిగిన హింస ప్రభుత్వానికి మాయని మచ్చగా మిగిలిపోయింది. దీనిలో బిజెపి నాయకులు కొంతమంది రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని, దాడులకు తెగబడ్డారని దీంతో ఢిల్లీలో అల్లర్లు జరిగాయని కేంద్ర ప్రభుత్వం మీద సోషల్ మీడియా వేదికగా విపరీతమైన చర్చ నడిచింది. టీవీలు పత్రికలు చెప్పని, చూపించని విషయాలు సోషల్ మీడియాలో విరివిగా ప్రచారం జరిగాయి. ఈ సోషల్ మీడియా ప్రచారం కేంద్ర ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది.

మరొక సంఘటన ఢిల్లీలో జరుగుతున్న రైతాంగ పోరాటం. ఈ ఉద్యమాన్ని అణిచే ప్రయత్నంలో ప్రభుత్వం వ్యవహరించి న తీరు సోషల్ మీడియాలో ప్రచారం కావడం తో ప్రభుత్వ ప్రతిష్ఠ మసకబారింది.

అదే విధంగా ప్రపంచాన్ని కుదిపేసిన కొవిడ్ మొదటి వేవ్‌లో గిన్నెలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి చేసిన పని పైన దేశప్రజలకు వ్యాక్సిన్ వేయించడానికి ప్రయత్నించక, బయట దేశాలకు పంపించి గొప్పలకు పోయిన ప్రభుత్వవిధానాలను సోషల్ మీడియా దుమ్మెత్తిపోయదాన్ని సహించలేని కేంద్రం నియమాల రూపంలో అదుపుచేయ పూనుకుంది. అదే విధంగా కరోన రెండవ వేవ్ తీవ్రమవుతున్న దశలో బాధ్యతా రహితంగా ఎన్నికల ర్యాలీలలో దేశ ప్రధాని హోంమంత్రి పాల్గొని అనేక మంది ప్రాణాలు పోవడానికి కారకులయ్యారని కుంభమేళ లాంటి సంఘటనల పై సోషల్ మీడియా తీవ్రంగా విరుచుకు పడింది. స్మశానల్లో శవాల గుట్టలని, నదుల్లో తేలుతున్న శవాలను, ఆసుపత్రుల ముందు బారులు తీరిన అంబులెన్సులను, ఆక్సిజన్ లేక అల్లాడిన ప్రాణాలను ప్రపంచ మీడియాకు పరిచయం చేసింది ఈ సోషల్ మీడియానేనని, ప్రపంచ దేశాల ముందు తమ పరువు పోవడానికి కూడా కారణం అయ్యిందని కేంద్రం భావించింది. దీంతో రచ్చ గెలవలేకపోయినా ఇంట కూడా గెలవలేని ప్రభుత్వ డొల్లతనం బయట పడింది. అందుకే ఈ సోషల్ మీడియాను ఎలాగైనా కట్టడి చేయాలన్న ఉద్దేశంతో తెచ్చినవే ఈ మార్గదర్శకాలని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పెట్రోల్ డీజిల్ ధరల పెరుగుదలను నియంత్రించలేని ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ లీటర్ పెట్రోల్ రేటు ఒక బారెల్ రేటుకు సమానంగా మారిందని సోషల్ మీడియాలో మోడీ ప్రభుత్వాన్ని సామాన్యులు సైతం పెద్ద ఎత్తున విమర్శించారు. ఇదికూడా సోషల్ మీడియాకు ఉచ్చు బిగించటానికి కారణమైంది. అదేవిధంగా ఉత్తర ప్రదేశ్‌లో గ్యాస్ సిలిండర్ కావాలన్న ఒక సామాన్యుడిని జైల్లో పెట్టడం, ప్రజల విజ్ఞప్తికి క్షణంలో ప్రతిస్పందించే సోనూ సూద్ ను ఉదాహరణ చూపి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, మహిళలపై జరిగిన దాడులను వీడియోలతో సహా బయట పెట్టడం వంటి వార్తలు సోషల్ మీడియాలో గుప్పుమనడం ప్రభుత్వం తట్టుకోలేకపోయింది.

ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకంపై సోషల్ మీడియా నిప్పులు కురిపించింది. ఇలా ప్రజల స్వేచ్ఛాయుత భావ ప్రకటనకు సాక్షీభూతమైన విమర్శకు గొంతుకైన సోషల్ మీడియాను ఎలాగైనా నియంత్రించాలని లేకపోతే అది తమ ఉనికికే ప్రమాదం తీసుకొస్తుందని గ్రహించి ప్రభుత్వం ఈ మార్గదర్శకాలు తెచ్చిందని యిట్టే అవగతమవుతుంది. ప్రభుత్వం చెబుతున్నట్లు దేశ సమగ్రత, సార్వభౌమత్వం, మహిళల రక్షణ, మోసాలకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో వచ్చే వార్తలను నియంత్రించేందుకు ఈ నియమాలు తెచ్చామని చెబితే వినే స్థితిలో ప్రజలు లేరు. దీనికి ఇటీవల ట్విట్టర్‌పై నమోదైన కేసే ఉదాహరణ.

ట్విట్టర్‌పై నమోదైన ఎఫ్ఐఆర్ కేసు

గత కొన్ని నెలలుగా ట్విట్టర్‌కు కేంద్రానికి మధ్య విభేదాలు ఉన్నాయి. తమ ఆదేశాలను పాటించడం లేదని జూన్ మొదటి వారం లోనే ఒక నోటీసు ఇచ్చింది కేంద్రం. ఇదే సమయంలో ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ ఖాతాలపై బ్లూ టిక్ తొలగించిన విషయం మరొక వివాదానికి దారితీసింది. ఈ క్రమంలో గత ఆరు నెలలుగా వాడని ఖతాల పై ఉన్న బ్లూ టిక్ ఆటోమేటిక్ గా తొలగించబడుతుంది అని క్లారిఫికేషన్ ఇచ్చి తిరిగి పునరుద్ధరించింది.

కొత్త నియమాలు ఒప్పుకోవడానికి మొండికేస్తున్న ట్విట్టర్ కు కేంద్రం 16 జూన్ 2021న మరొక నోటీసు జారీ చేసి 18 జూన్ 2021 పార్లమెంటరీ పానల్ ముందు హాజరుకావాలని సమన్లు జారీ చేసింది. అలాగే దాని యొక్క మధ్యవర్తిత్వ హోదా రద్దు చేసింది. ఒక ప్రచురణకర్తగా మాత్రమే కొనసాగుతుందని తెలిపింది. తమ మాట వినకపోతే ఏం జరుగుతుందో కేసు ద్వారా గుర్తు చేసింది ప్రభుత్వం. అయితే దీనికన్నా ఒకరోజు ముందు తమకు వచ్చే ఫిర్యాదుల పరిశీలనకు సంధానకర్తగా ఒక అధికారిని నియమించినట్లు తెలిపింది. కాగా ఐటి నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణపై ఉత్తరప్రదేశ లోని ఘజియాబాద్ మాట ఘర్షణలకు ట్వీట్ల ద్వారా వీడియో షేరింగ్ ద్వారా కారకులయ్యారని ట్విట్టర్‌తో పాటు కొంతమంది జర్నలిస్టులు 153, 153ఏ, 505,295ఏ, 34, 120బి సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇది దేశంలో సోషల్ మీడియా సంస్థల మీద నమోదైన మొదటి కేసు. గొడవకు కారణమైన ట్వీట్ లను తొలగించడానికి ట్విట్టర్ ఏ మాత్రం ప్రయత్నించలేదని మధ్యవర్తిత్వ సంస్థ ప్రతిస్పందన సరిగా లేదని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. దీనిని బట్టి తమకు వ్యతిరేక వార్తలను ప్రచురించిన ప్రచారానికి పాల్పడిన వారు తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందేనని అందుకోసమే ఈ నియమాలు రూపొందిస్తున్నాం అని చెప్పకనే చెప్పినట్లయింది.

ముగింపు

భారత ప్రజాస్వామ్యంలో ప్రజలు ఏ వేదిక మీదనైనా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాల్ని విమర్శించేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కును వాడుకొని, తమ భావాన్ని వ్యక్తీకరిస్తే అది తనకు నచ్చలేదని ఆ వ్యక్తిని అరెస్టు చేయడం కేసులు పెట్టడం రాజ్యాంగ విరుద్ధం. మార్గదర్శకాల పేరుతో సోషల్ మీడియా మెడ మీద కత్తి పెట్టి తమ కోరికను అమలు చేయించుకోచూస్తున్నారు. కేసుల పేరుతో ప్రజలను భయభ్రాతులకు గురిచేయడం సరైనది కాదు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ప్రజల మనోభావాలను తొక్కి పెట్టడం పాలకవర్గాల నిరంకుశత్వానికి నిదర్శనం. ఫాసిస్టు విధానాల బరితెగింపును అడ్డుకోవడానికి సోషల్ మీడియా ప్రజలకు ఆయుధమైంది. తమ కష్టాలను చెప్పుకోవడానికి తమ భావాలను పంచుకోవడానికి ప్రజా వ్యతిరేక

తత్వశాస్త్ర ప్రాథమిక ప్రశ్నలు

మతం ప్రాతిపదికగా ఉండే ప్రాపంచిక దృక్పథానికి, తత్వశాస్త్ర ప్రాపంచిక దృక్పథానికి చాలా వ్యత్యాసం ఉంటుందని అంటున్నారు **యు.ఎ. ఖారిన్** *(అనువాదం: రాజేంద్రబాబు అర్విణి)*

భౌతికవాదం – చారిత్రిక దశలలో వివిధ రూపాలు

చరిత్రలో ఆదిమ జాతుల సమూహాలు విచ్ఛిన్నమయిపోతూ, వర్గ సమాజం ఆవిర్భవిస్తూ ఉన్న కాలంలో సామాజిక చైతన్య సూచికగా తత్వశాస్త్రం రూపుదిద్దుకోవడం ప్రారంభమయింది. ఆ కాలంలో కూడా ప్రపంచం పట్ల భౌతికవాద దృక్పథానికి భావవాద దృక్పథానికి మధ్య ఎంతో వ్యత్యాసం ప్రస్ఫుటంగా ఉండింది. ఈ రెండు దృక్పథాలూ చాలాదూరం ప్రయాణించి, ఆలోచనా ధోరణిలో చాలా అభివృద్ధి సాధించి, చాలా రకాలయిన రూపాలు సంతరించుకున్నాయి.

బానిస విధానం ప్రభావంలో రెండున్నర సహస్రాబ్దిల క్రితమే తొలుత ఈజిప్టు, బాబిలోనియా, ఇండియా, చైనా, గ్రీస్, రోమ్ దేశాలలో మొట్టమొదటి తత్వశాస్త్ర సిద్ధాంత గ్రంథాలు రూపు దిద్దుకున్నాయి. ఈ చారిత్రిక దశలో వృత్తి పనులు, వ్యాపారమూ అభివృద్ధి చెందడానికి, శాస్త్రీయ విజ్ఞానమూ సంస్కృతి పెంపొందడానికి బానిస సమాజంలోని అభ్యుదయ శక్తులు ఎంతో పోరాటం చేశాయి. ఈ పోరాట ప్రభావం వల్ల ప్రపంచం పట్ల భౌతికవాద దృక్పథం పెంపొందడానికి అవకాశం ఏర్పడింది. ఆనాటి రాజకీయ ఆర్థిక రంగాలను గుప్పిట్లో ఉంచుకున్న బానిస యజమానుల వర్గం సామాజిక వ్యవస్థలో మార్పులు రాకుండా ఉండడానికి ప్రధానమయిన మత, పౌరాణిక భావాలను సంరక్షించుకొనేందుకు తీవ్ర కృషి సల్పింది. ఆ ప్రయత్నాలను భౌతికవాదం గట్టిగా ప్రతిఘటించింది. బానిస సమాజంలో ఉద్భవించిన భౌతిక తత్వం మొట్టమొదటి భౌతికవాద చారిత్రిక రూపం.

అది సహజ సిద్ధంగా, ప్రాపంచిక అనుభవం ఏమీ లేకుండానే ఏర్పడిన భౌతికవాద దృక్పథం. క్రీ.పూ. 6వ శతాబ్దంలో జీవించిన భారత తత్వవేత్తలు 'చార్వాకులు' ప్రపంచంలోని అన్ని వస్తువులు అగ్ని, గాలి, నీరు, నేల అన్న నాలుగు అంశాలు కలిగి ఉంటాయని, ప్రాణం కలిగిన అన్ని జీవులు ఈ నాలుగు ముఖ్యమయిన అంశాల సమాహారమేనని, ఇందుకు మానవుడు మినహాయింపేమీ కాదని అభిప్రాయపడ్డారు. చైతన్యం మనుష్యులకు మాత్రమే సొంతమని, మనుష్య శరీరంలో ఈ నాలుగు అంశాలు మిళితమయితేనే చైతన్యం పుడుతుందని, శరీరం మృత్యువాత పడినప్పుడు ఆ చైతన్యం కూడా అంతరించిపోతుంది అని తమ గ్రంథాలలో వివరించారు. చార్వాకులు భగవంతుని ఉనికిని తిరస్కరించారు. భౌతికంగా మనిషి చనిపోయిన తర్వాత ఆతని ఆత్మ మరో శరీరంలో ప్రవేశించి పునర్జన్మ పొందుతుందన్న మత బోధనలు అర్థరహితమని కొట్టి పారేశారు. వారు మత భావనకు, ఆ కాలంలో ప్రబలంగా ఉన్న భావవాద సిద్ధాంతాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేశారు. ఆనాటి పూజారి వర్గం, సాంప్రాదాయ మత ప్రచారకులు వారిని ద్వేషించి, వారి రచనలను చాలావరకు ధ్వంసం చేశారు.

పురాతన కాలంలో తత్వవేత్తల భౌతికవాదం ప్రపంచం పట్ల సహజ సిద్ధంగా ఏర్పడే గతితార్కిక భావనలేగాని అనుభవంతో కూడుకున్నది కాదు. ప్రపంచం గురించి సరైన అవగాహన ఏర్పరచుకొనే క్రమంలో గతితర్కానికి, అధిభౌతిక వాదానికి మధ్య జరిగే ఘర్షణతో భౌతిక వాదానికి భావవాదానికి మధ్య ఉన్న పరస్పర వ్యతిరేకత సరిపోలి ఉంటుందన్న సంగతిని ఈ సందర్భంగా ప్రత్యేకంగా గుర్తించుకోవాలి.

ప్రకృతికి సంబంధించిన వస్తువులు, వాటిల్లో సంభవించే మార్పులకు పరస్పర సంబంధం ఉంటుంది. వాటిల్లో ఉండే అంతర్గత వైరుధ్యాల మూలంగా అవి గుణాత్మకంగా మార్పులు చెందుతాయి. వాస్తవ ప్రపంచంలో జరిగే పరిణామాలకు అసలు కారణం వైరుధ్యాలే.

అధిభౌతిక వాదంలో వాస్తవ ప్రపంచానికి పూర్తిగా విరుద్ధంగా ఉండే దృశ్యం అంతర్గతంగా ఉంటుంది. అధిభౌతిక వాదం దృష్టిలో ప్రపంచం అంటే ఏమాత్రం పరివర్తన చెందకుండా, యథాస్థితిలో ఎల్లప్పుడూ కొనసాగేది. ఇంకా, వస్తువుల మధ్య పరస్పర సంబంధం ఉండే అవకాశం లేదని, సహజంగా జరిగే మార్పులలో అంతర్గత వైరుధ్యాల ప్రభావం ఏమీ ఉండదని, ప్రపంచంలో మార్పులేమీ ఉండవని సంకుచిత స్వభావంతో ఆలోచిస్తుంది.

చట్టాలను వ్యతిరేకించడానికి వేదిక అయింది. అయితే ఈ వేదికలో అనేక అనైతిక, అసత్య వార్తలు కూడా చోటుచేసుకుంటున్నాయి ఇది కాదనలేని నిజం. కానీ దీనిని తమకు అనుకూలంగా మార్చుకోవాలను కోవడం తమ కనుసన్నల్లోనే అది నడవాలని వ్యక్తి గోప్యతకు భంగం వాటిల్లినా పర్వాలేదని ప్రభుత్వాలు ఆలోచించడం అత్యంత దుర్మార్గం. ఈ నిబంధనల పేరుతో ప్రభుత్వం తమకు అనుకూలంగా మార్చుకుంటే తమ కనీస హక్కుల కొరకు మాట్లాడగలిగే గళాలు, సామాజిక మీడియా మూగబోతుంది. ఇది వాంచితం కాదు. ప్రజలను కాపాడాల్సిన వారే ప్రజలను శత్రువులుగా భావించి వారి నోర్లు మూయించి తమ నోరు మాత్రమె మాట్లాడేలా నిబంధనలు రూపొందించుకొని ప్రజల హక్కులకు నీళ్ళోదిలి, వేలెత్తిన చేతులకు సంకెళ్ళు బిగించడం అంటే సామాజిక మాధ్యమాలకు ఉరితాళ్ళు తగిలించటమే. ఇది ఎంత మాత్రం అభిలషణీయం కాదు. కనుక అంతిమంగా ప్రజల హక్కులు, ప్రజల ఆకాక్షలు విధిగా కాపాడబడాలి. ప్రజల ఆకాంక్షలు వారి మనోభావాలను గౌరవించినప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది.

(రచయిత డిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్) వీ

తత్వశాస్త్ర చరిత్రలో గతితార్కిక పద్ధతి లేదా అదిభౌతిక పద్ధతి లేదా రెండింటి కలయికతో కూడిన పద్ధతిని భౌతిక వాదులు, భావ వాదులు అవలంబించారు. కాబట్టి, ఈ రెండు పోకడల గుణగణాలను లెక్కించేటప్పుడు వాస్తవమయిన చారిత్రిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకోవాలి.

ఇంతకు ముందు ప్రస్తావించినట్టుగా, పురాతన తత్వవేత్తల భౌతికవాదం సహజసిద్ధమయిన గతి తార్కికం. అంటే మనిషి ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నట్టుగా వారు ప్రపంచాన్ని చూశారు. అదేవిధంగా ప్రకృతి చలనశీలమయినదని, సదా అభివృద్ధి వైపు గమనంలో ఉంటుందని, ఎల్లప్పుడూ తన రూపాలు మార్చుకుంటూ ఉండడమే తన లక్షణమని గమనించారు. భౌతిక మూల పదార్థమయిన అగ్ని పైనే అన్నీ ఆధారపడి ఉంటాయని, అగ్నిలో వచ్చే మార్పులను బట్టే దృగ్గోచరాలయిన సహజ పదార్థాలు పరివర్తనం చెందుతూ ఉంటాయని ప్రసిద్ధిగాంచిన గ్రీకు తత్వవేత్త హెరాక్లిటాస్ (క్రీ.పూ. 530–470) అభిప్రాయపడ్డారు. ప్రపంచం ఒకటేనని, అదే సమయంలో అది బహుళత్వం కలిగినదని, ఈ ప్రపంచాన్ని మనిషిగానీ దేవుడుగాని ఎవరూ సృష్టించలేదని, ఎప్పుడూ ఉండిన ఇక ముందు కూడా ఉండబోయే శాశ్వతమయిన అగ్ని, ఎల్లప్పుడూ మండుతూ చల్లారుతూ ఉండే అగ్ని ప్రపంచానికి జీవం అని బోధించాడు. ప్రతిదీ చలనశీలంగా ఉంటుంది, ప్రతిదీ మారుతూ ఉంటుంది, చలనరహితంగా ఏదీ ఉండదు అని కూడా ఆయన బోధించాడు. ఆయన సిద్ధాంతం ప్రకారం అవసరాన్ని బట్టి, విరుద్ధ శక్తుల ఘర్షణ ఫలితంగా ఒక దశ నుండి మరొక దశకు పదార్థాలు మారతాయి.

మరొక ప్రసిద్ధ గ్రీకు తత్వవేత్త డెమోక్రిటస్ (క్రీ.పూ. 460–370) కూడా ఈ విధమయిన సహజ గతితార్కిక ప్రాపంచిక దృష్టి కనబరచారు. విభజించడానికి వీలులేని, కంటికి కనిపించనంత చిన్న రేణువులుగా లెక్కలేనంత బహుళ సంఖ్యలో ఉన్న పరమాణువుల సమూహమే ప్రపంచమని, అది శూన్యంలో కదులుతూ ఉంటుందని ఆయన తన బోధనలలో పేర్కొన్నాడు. శూన్యంలో కదులుతూ ఈ పరమాణువులు ప్రకృతి అవసరాలను బట్టి వివిధ రకాలుగా కలవడము, విడిపోవడము ద్వారా మార్పులు సంభవిస్తూ ఉంటాయనీ, ఈ పరమాణువుల కదలిక మొదలు అంతమూ లేకుండా శాశ్వతమని కూడా ఆయన ప్రకటించాడు.

ఆ విధంగా, మొట్టమొదటి భౌతికవాద తత్వశాస్త్ర చారిత్రిక రూపం ప్రాపంచిక అనుభవం కొరవడినా సహజ సిద్ధంగా ఏర్పడినదిగా ఉండినది. అయినా ప్రకృతి పట్ల గతితార్కిక భావనలతో ఉండడమే దాని ప్రత్యేకత.

కాలక్రమంలో బానిస యుగం స్థానంలో భూస్వామ్య వ్యవస్థ వచ్చింది. భూస్వామ్య పద్ధతిలో కొన్ని శతాబ్దాల పాటు మత ఆధారిత భావవాద దృక్పథం ప్రబలంగా ఉండింది. ఈ కాలంలో తత్వశాస్త్రం మత సంబంధమయిన భావజాలానికి పరిచారికగా పనిచేసింది. అయితే, భౌతికవాద సంప్రదాయం అంతరించిపోలేదు. మధ్య ఆసియాకు చెందిన ప్రముఖ తత్వవేత్త ఇబిన్ సైనా (క్రీ.శ. 980–1037) ప్రపంచం భగవంతునిచే సృష్టించబడినది అన్న సిద్ధాంతాన్ని నిర్ద్వందంగా తిరస్కరించాడు. భగవంతుని లాగా ప్రపంచం కూడా శాశ్వత మయినది అని ఆయన నమ్మాడు. అరేబియా తత్వవేత్త ఇబిన్ రుషాద్ (క్రీ. పూ. 1126–1198) కూడా ప్రపంచం 'శూన్యం'లోంచి ఉద్భవించిందన్న మత విశ్వాసాన్ని ఒప్పుకోలేదు. ఆయన 'విశ్వాసము', 'విజ్ఞానము'వేరు వేరని, అలాగే 'సైన్స్', 'మతము' భిన్న అస్తిత్వం కలిగినవని పెద్దఎత్తున ప్రచారం చేసే ప్రయత్నం చేశాడు.

అయితే ఇవన్నీ భౌతికవాద దృక్పథానికి ప్రతీకలు మాత్రమే. భూస్వామ్య వ్యవస్థ నుండి పెట్టుబడిదారీ విధానం వైపు మారిన క్రమంలో ప్రపంచ సామాజిక యవనికపై ఒక కొత్త చారిత్రిక భౌతిక వాదం రూపుదిద్దుకుంది.

17, 18వ శతాబ్దాలలో పశ్చిమ యూరప్‌లో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం బలపడుతున్న తరుణంలో అంతకు ముందున్న పురాతన తత్వవేత్తల సహజ సిద్ధమయిన, ప్రాపంచిక అనుభవం లేని భౌతికవాద భావాల స్థానంలో భౌతికవాదం అభివృద్ధి చెందుతూ పురోగమించింది. ఆనాడు బూర్జువా వర్గంలోని అభ్యుదయవాదుల ప్రాపంచిక దృక్పథమే భౌతికవాదం. కాలం చెల్లిన భూస్వామ్య సంబంధాలు నశించిపోవాలని, ఉత్పత్తి శక్తులు ఇబ్బడి ముబ్బడిగా పెరగాలని వారు ఆశించారు. అలాగే మధ్యయుగాల నాటి అవశేషాలుగా మిగిలి ఉన్న చర్చ్ ఆధ్యాత్మిక ఉపదేశాలు రూపుమాసి పోవాలని వారు కోరుకున్నారు. పరిశ్రమలు, సాంకేతిక విజ్ఞానము అభివృద్ధి చెందుతున్న కొద్దీ పెట్టుబడిదారీ వర్గానికి శాస్త్రీయ పరిజ్ఞానం అవసరమయ్యింది. కాబట్టి, ఆ వర్గం ప్రయోగాత్మక ప్రకృతి విజ్ఞాన శాస్త్రాల అభివృద్ధికి తనవంతుగా తోడ్పడింది. నిజానికి గతంలోని బానిస, భూస్వామ్య సమాజాలలో తత్వశాస్త్రానికి, ఒక విషయంలో ప్రత్యేకమయిన విజ్ఞానానికి మధ్య తేడా తెలియదు.

కానీ, ఇంతకు క్రితం ఒక్కటిగానే ఉన్న సైన్స్ ఇప్పుడు ఖగోళ శాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, యంత్రగతిశాస్త్రం (మెకానిక్స్) ఇంకా ఇతర ప్రత్యేక విభాగాలుగా విభజించబడ్డది. ఏది ఏమయినప్పటికీ, ఆ విభాగాలన్నీ ఆ కాలానికి అభివృద్ధి చెందుతున్న దశలోనే ఉన్నాయి. వాస్తవాలను సేకరించి, వాటిని సాధారణీకరించే పనిలో, వివిధ వస్తువులను, వాటి పరివర్తనా దశలను అధ్యయనం చేసి, వర్గీకరించి విశ్లేషించే పనిలోనే నిమగ్నమయి ఉన్నాయి. కానీ, వాటి మధ్య సంబంధం ఏమిటి, ప్రపంచంలో వస్తున్న మార్పులను ఎలా అధ్యయనం చెయ్యాలి అన్న పని అప్పటికి ఇంకా మిగిలే ఉండింది. ఈ కాలంలో యంత్రగతి శాస్త్రం బాగా అభివృద్ధి చెందింది. అయితే, ప్రకృతిలో క్రమపద్ధతిన జరిగే కొన్ని క్రియల (ముఖ్యంగా రసాయన, జీవశాస్త్ర సంబంధమైనవి)కు సంబంధించి అధ్యయనం జరగలేదు. అవి గుర్తించబడకుండా ఉండిపోయాయి. వీటి ప్రభావం తత్వశాస్త్రం మీదా, శాస్త్రీయమయిన ఆలోచనా క్రమం పైనా తప్పనిసరిగా ఉంటుంది. ప్రఖ్యాత ఇంగ్లిష్ తత్వవేత్త థామస్ హాబ్స్ (1588–1679) రాసిన సిద్ధాంత గ్రంథంలో ఆ కాలపు భౌతికవాదం స్పష్టంగా వివరించబడ్డది.

భావ వాదానికి వ్యతిరేకంగా, మత సంబంధమయిన ఆధ్యాత్మిక వాదాన్ని, స్కూళ్లలో బోధించే భావజాలాన్ని నిరసిస్తూ హాబ్స్ రాజీలేని పోరాటం చేశాడు. భగవంతుని అస్తిత్వాన్ని ప్రశ్నించాడు; ఆత్మ శాశ్వతమనే వాదాన్ని తోసిరాజన్నాడు. ఆయన ఉద్దేశ్యంలో ప్రపంచం ఒక ఏక వస్తు సముదాయం. పదార్థం శాశ్వతం; దానిలో ఉండే అంశాలు తాత్కాలికం, అవి ఉనికిలోకి వస్తాయి, ఆ తర్వాత గతించిపోతాయి. పదార్థం సజాతీయమయిన గుణం కలదిగా ఆయన భావించాడు.

వస్తువులు భౌతికంగా వాటి విస్తరణ, బరువు, పరిమాణం, రూపం, ఇంకా ఇతర పరిమాణాత్మక పరిమితులలోని గుణాల ద్వారా విశిష్టతను కలిగి ఉంటాయి. చలనం పదార్థానికి ఉండే గుణం. కానీ, పదార్థానికి ఉండే చలన లక్షణాన్ని హాబ్స్ సీదాసాదాగా, యాంత్రికంగా స్థలమార్పిడి అనే ఒకే ఒక్క రూపంలో మాత్రమే చూశాడు. ఆయన మనిషిని (అన్ని సహజ శరీర నిర్మాణాలను కూడా) ఒక యంత్ర నిర్మాణంతో పోల్చాడు. గుండెను నీటి ఊటతో, నరాలను దారాలతో, కీళ్లను చక్రాలతో పోల్చాడు. ఇంకా అలాంటి ఎన్నో పోలికలను ప్రస్తావించాడు. ఆయన ఉద్దేశ్యంలో మనుషులు తమకు సహజంగా సంక్రమించే హక్కులను విశ్వశాంతి కోసం హేతుబద్ధంగా పరిమితం చేసుకొని రాజ్యం అనే వ్యవస్థను నిర్మించుకున్నారు. ఒక వ్యక్తి లాగా ప్రభత్వం లేదా రాజ్యం కూడా అదే తరహాలో నిర్మాణం కలిగి ఉంటుంది. అత్యున్నతమయిన అధికారం దాని ఆత్మ; న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక శాఖలు దాని వివిధ అవయవాలు; బహుమతులు, శిక్షలు దాని నాడీ వ్యవస్థ, మొదలగునవి. భౌతిక ప్రపంచం పరిశీలించడానికి అన్ని విధాలా అనువుగా ఉంటుంది. బుద్ధి జ్ఞానం ద్వారా, సహేతుకమయిన వివేచన అంటే హేతుబద్ధమయిన వివేచనా పద్ధతుల ద్వారా సత్యాన్ని కనిపెట్ట వచ్చు. కానీ ప్రాకృతిక, సామాజిక ఘటనలు అన్నీ కూడికలు తీసివేతలతో నిండి ఉంటాయన్న నమ్మకంతో ఆయన, హేతుబద్ధమయిన ఆలోచనను లెక్కలకు సంబంధించిన వ్యవహారంగా పరిగణించాడు.

అయితే, 17, 18వ శతాబ్దాలకు చెందిన భౌతికవాద తత్వవేత్తలందరు హాబ్స్ అభిప్రాయాలను పూర్తిగా సమర్థించలేదు. వాస్తవాలను దర్శించడానికి ఇంద్రియ జ్ఞానం, వ్యక్తిగత అవగాహన, అనుభవపూర్వక పద్ధతులపై ఎక్కువగా దృష్టి పెట్టాలని కొంతమంది భావించారు (ఇంగ్లాండ్‌లో బేకన్, జాన్ లాక్‌లు, రష్యాలో లొమొనోసోవ్ ఇతరులు). మరికొంత మంది తత్వవేత్తల (ఉదాహరణకు హాలండ్ లో స్పినోజా, ఫ్రాన్స్ లో డిడెరోట్) ఆలోచనలలో గతితార్కిక ఛాయలు కనిపించాయి. మొత్తంమీద ఆనాటి భౌతికవాదం చారిత్రికంగా పరిమితులకు లోబడినది, స్థిరత్వం లేనిది. హాబ్స్ విషయంలో అది యాంత్రిక భౌతికవాదం. ఎందుచేతనంటే, ఆయన రసాయనిక, ఇంద్రియ సంబంధమయిన, ఇంకా సామాజిక ప్రక్రియకు కూడా కేవలం యాంత్రిక నియమాలను ఆపాదించవచ్చని భావించాడు. దానిని పారలౌకిక......? భౌతికవాదం అని కూడా చెప్పవచ్చు. ఆయన దృష్టిలో, ప్రపంచం అంటే, సహజమయిన రీతిలో చారిత్రిక పరిణామం చెందకుండా, మూలంలో చలనంలేని పదార్థాన్ని కలిగి ఉన్న విడివిడి అంశాల ఏక మొత్తం. హాబ్స్ తన సిద్ధాంత గ్రంథంలో భౌతిక ప్రపంచంలోని చలన శక్తిని కేవలం సాధారణమయిన వస్తువుల స్థల మార్పుగా మాత్రమే విశ్లేషించాడు. వస్తువుల మధ్య ఉండే పరిమాణాత్మక వ్యత్యాసాలను మాత్రమే చూసి, గుణాత్మక మార్పులను గమనించ నిరాకరించాడు. చివరగా, 17-18 శతాబ్దాలకు చెందిన భౌతికవాదులు తత్వశాస్త్రం గురించి ప్రాథమికమయిన ప్రశ్నకు ప్రకృతికి సంబంధించి మాత్రమే సరయిన సమాధానం ఇచ్చారు గాని, చరిత్ర గురించి సమాజాన్ని గురించిన తమ అభిప్రాయాలలో భావ వాదులుగానే మిగిలిపోయారు. రాజకీయ లేదా మత సంబంధమయిన భావాలు, వ్యక్తిగత విశిష్టత కలిగిన ముఖ్యుల ఇష్టాయిష్టాలు, విజ్ఞాన విస్తరణ మొదలగు వాటి గురించి సమాజంలో జరిగే మార్పులను ఆధ్యాత్మిక ధోరణిలో వివరించారు. ఈ కాలపు భౌతికవాదులు ప్రజల అభిప్రాయాలలో, భావాలలో వచ్చే మార్పుకు కారణాలు, ప్రజల జీవితాలలో వస్తుగత ఆర్థిక స్థితిగతుల పాత్ర గురించి వివరించలేక పోయారు. హాబ్స్ రాసిన సిద్ధాంత గ్రంథం నుండే ఉదాహరణతో ఈ విషయాన్ని గ్రహించవచ్చు. సమాజంలోని ఒక ముఖ్యమయిన అంగం దానిని నియంత్రించే రాజ్యాంగ వ్యవస్థ. ఆ రాజ్యం ఎలా ఆవిర్భవించిందో హాబ్స్ పూర్తిగా భావవాద ధోరణిలో వివరిస్తాడు. భౌతికవాద కారణాల (వ్యక్తిగత ఆస్తి పోగవడం, మనుషులను శ్రమ దోపిడికి గురిచేయడం, వర్గ సంఘర్షణ మొదలగునవి) వలన కాకుండా సమాజ వ్యవస్థీకరణకై ప్రజలు వివేకంతో చేసుకున్న ఏర్పాటుగా ఆయన తన అభిప్రాయాన్ని ప్రకటిస్తాడు.

అయినప్పటికీ, పెట్టుబడిదారీ వ్యవస్థకు పూర్వం ఉన్న భౌతికవాదం తత్వశాస్త్ర విజ్ఞాన పరిణామ క్రమంలో ఒక ముఖ్యమయిన మలుపు. అది పురాతన కాలంలో సహజసిద్ధంగా ఉద్భవించిన భౌతికవాదం కాదు. అది ఆధిభౌతికం అయినప్పటికీ, ప్రకృతి విజ్ఞాన శాస్త్రాల గట్టి పునాదుల మీద పూర్తిగా ఆధారపడి, రూఢిపరచబడిన తత్వశాస్త్ర పరిశోధనా పద్ధతిని ఆ విజ్ఞాన శాస్త్రాలకు సూచించింది.

ఆధిభౌతిక భౌతికవాదానికి ఉన్న పరిమితులు చాలా వరకు 19 శతాబ్దపు రష్యన్ విప్లవ ప్రజాస్వామిక వాదులు బెలిన్స్కి, హెర్జన్, చేరనిషేవిస్కీ, దొబ్రోల్యుబోవ్ ఇతరులు అధిగమించారు. వీరి వాదనలు, భావాలు తత్వశాస్త్ర చరిత్రలో మూడవ ప్రధానమయిన భౌతికవాద పాయ అని చెప్పవచ్చు. రష్యా రైతాంగం, ఇతర అభ్యుదయకర శక్తులు బానిసత్వానికి, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగించిన పోరాటం వారి అభిప్రాయాల ద్వారా సామాజిక రంగంలో ప్రతిఫలించింది. వారు భావవాదాన్ని, మత సంబంధమయిన మార్మికతను తిరస్కరించారు. ప్రకృతి విజ్ఞాన శాస్త్రాలపై ఆధారపడి ఈ భౌతిక ప్రపంచంలో జరిగే నిరంతర గుణాత్మకమయిన మార్పు, అది లోనయ్యే వివిధ దశలను గురించి వివరణలు ప్రతిపాదించారు. పరస్పర విరుద్ధమయిన అంశాలు, వాటి నిరాకరణలతో కూడిన గతితార్కిక ప్రక్రియయే నిజమయిన అభివృద్ధి అని వారు భావించారు. ఈ అంశంలో వారు అధివాస్తవికతను బోధించే సిద్ధాంతాలతో విభేదించారు. విప్లవ ప్రజాస్వామిక వాదులు సమాజం పట్ల కొన్ని భౌతిక వాద ధోరణులను కనబరచారు కానీ, మొత్తం మీద సమాజం, దాని అభివృద్ధి పట్ల వారి భావనలు భావవాదాన్ని పోలి ఉన్నాయి. సమాజ అభివృద్ధికి కారణమయిన భౌతిక కారణాలను వారు పరిగణనలోకి తీసుకోలేక పోయారు. దోపిడీ నుండి, పీడన నుండి విముక్తి చెందిన సమాజ నిర్మాణానికి శాస్త్రీయమయిన ప్రత్యామ్నాయ పద్ధతులను ప్రతిపాదించడంలో వారు విఫలమయ్యారు.

మార్క్స్‌కు ముందు రూపు దిద్దుకున్న ముఖ్యమయిన భౌతికవాద చారిత్రిక దశలను పైన పేర్కొన్నాము. సుదీర్ఘంగా సాగిన ఈ అభివృద్ధి పథంలో అది భావవాదం నుండి అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నది. ఈ రెండు ప్రధానమయిన ధోరణుల మధ్య జరిగిన ఘర్షణలోంచి వాస్తవమయిన తత్వశాస్త్ర భావన ఆవిర్భవించింది.

(యు.ఎ. ఖారిన్ రచించిన 'ఫండమెంటల్స్ ఆఫ్ డయలెక్టిక్స్' పుస్తకంలోని మొదటి అధ్యాయంలో నాలుగవ ఉపశీర్షిక) వీ

రైతుల ఆదాయాలు ఎందుకు పెరగడం లేదు?

***కనీస మద్దతు ధరను నిర్ణయించడంలోని అశాస్త్రీయత, స్వామినాథన్ సిఫారసులను అమలు చేయకపోవడం వంటి కారణాల వల్ల రైతులు నష్టపోతున్నారని అంటున్నారు* కన్నెగంటి రవి, శేరుపల్లి రాజేష్**

(...గత సంచిక తరువాయి)

7) ఈ నష్టాన్ని పూడ్చడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏమి ప్రయత్నం చేస్తున్నది? ఎకరానికి 5000 రైతుబంధు సహాయం అందించినా రాష్ట్ర ప్రభుత్వ అంచనా నష్టంలో (15,560 – 5000) 10,560 నష్టం ఇంకా మిగిలే ఉంటుంది. చివరికి సిఏసిపి అంచనా ప్రకారం నష్టం (11,740 – 5000) 6740 రూపాయలు ఇంకా మిగిలే ఉంటుంది. పైగా రైతు బంధు సహాయం తప్పకుండా సాగు చేస్తున్న రైతుకే అందుతుందన్నగ్యారంటీ లేదు. అది ఆ భూమి యజమానికి చెందుతుంది తప్ప, ఆ భూమిలో సాగు చేసే కౌలు రైతుకు అందదు. అప్పుడు కౌలు రైతులు కౌలు భారాన్ని పూర్తిగా మోయడమే కాక, ధరల నిర్ణయంలో మోసాల వల్ల ఇంకా ఎక్కువ నష్టపోతున్నారు.

8) సమగ్ర ఉత్పత్తి ఖర్చు (సి 2)లో వరి సేద్యానికి సంబంధించి స్వంత భూమికి కౌలు విలువ ఎకరానికి 11,881 రూపాయలు, స్థిర పెట్టుబడి పై వడ్డీ 1641 రూపాయలు, పనిముట్లు, భవనాల విలువ తరుగు 177.40 రూపాయలు, పంటల బీమా పథకం ప్రీమియం 600 రూపాయలు లాంటివి మద్దతు ధరల నిర్ణయం సమయంలో అసలు పరిగణనలోకి తీసుకోవడం లేదు.

9) పొలం నుండీ పంట సేకరణ కేంద్రం లేదా మార్కెట్ యార్డుకు రవాణా ఖర్చులు అసలు కలపడం లేదు. ధాన్యం ఆరబోయడానికి, క్లీనింగ్ యంత్రంలో క్లీన్ చేయడానికి అయ్యే ఖర్చులను కూడా కలపడం లేదు. ఇవన్నీ రైతులు ప్రతి సంవత్సరం అదనంగా ఖర్చు పెడుతూనే ఉన్నారు. ధాన్యం నింపడానికి సంచి ఖరీదు, హమాలీల ఖర్చు, ధాన్యం రోడ్లపై ఆరబోసిన సమయంలో కాపలా కూలీల ఖర్చు కూడా ఉత్పత్తి ఖర్చులలో కలపడం లేదు. పొలంలో బోర్లు వేయడానికి, డ్రిప్ లేదా స్ప్రింక్లర్ బిగించడానికి, నీటి కోసం పైప్ లైన్లు దూరం నుండీ వేసుకు రావడానికి, ట్రాక్టర్ కొనుగోలు చేయడానికి రైతులు లక్షల రూపాయలు అప్పు చేస్తుంటారు. కానీ మద్దతు ధరల సమయంలో వీటికి వేసే విలువ శూన్యం. వీటన్నిటికీ కలిపి స్థిర పెట్టుబడిపై వడ్డీ పేరున 1,641 రూపాయలు వేస్తారు కానీ వాటిని మద్దతు ధర నిర్ణయ సూత్రంలో(ఏ 2) కలపరు. సమగ్ర ఉత్పత్తి ఖర్చు (సి 2 ప్రకారం) మద్దతు ధరలను ప్రకటిస్తే తప్ప, ఈ సమస్య పరిష్కారం కాదు.

10) సిఏసిపి సంస్థ ఎంఎస్‌పి ప్రకటించడానికి తీసుకునే జాతీయ సగటు ఖర్చులు కూడా చాలా తక్కువ ఉంటున్నాయి. వీటి కంటే తెలంగాణ రాష్ట్రంలో ఖర్చులు తప్పకుండా ఎక్కువ అవుతున్నాయి. ఉదాహరణకు వరి విత్తన ఖర్చు ఎకరానికి 930 రూపాయలుగా, రసాయన ఎరువుల ఖర్చు 3,199, పశువుల ఎరువు ఖర్చు 172, పురుగు, కలుపు విషాల ఖర్చు 1.544, సాగు నీటి చార్జీల ఖర్చు 427, యంత్రాల కిరాయి ఖర్చు 4,231, స్వంత యంత్రాల ఖర్చు 253 దుక్కిటెద్ల కిరాయి ఖర్చు 112, స్వంత దుక్కిటెద్ల ఖర్చు 254, కూలీల ఖర్చు 8,344, చిల్లర ఖర్చులు 53 రూపాయలుగా అంచనా వేశారు. పైగా స్వంత కుటుంబ సభ్యుల శ్రమకు (ఎంత మంది పని చేసినా) ఎకరానికి, 6 నెలల పంట కాలానికి 4,179 రూపాయలుగా నిర్ణయించారు. పైగా కౌలు భూమికి కౌలు చెల్లింపు కింద ఎకరానికి ఒక సీజన్‌కు కేవలం 2,590 రూపాయలు వేశారు. నీటి పారుదల సౌకర్యం కలిగిన భూమి ఇంత తక్కువకు కౌలుకు ఎలా దొరుకుతుందో సిఏసిపికి మాత్రమే తెలియాలి.

తెలంగాణాలో గత మూడేళ్లుగా రైతులకు ఎంఎస్‌పి అందడం లేదు. (పంట సంవత్సరాన్ని జూన్ 1 నుండీ మే 31 వరకూ పరిగణించాము)

11) ఈ ఒక్క సంవత్సరమే కాదు. 2018 నుండీ ప్రైవేట్ వ్యాపారులు వరి ధాన్యం పండించే రైతులకు కనీసం ఎంఎస్‌పి కూడా చెల్లించడం లేదు. తెలంగాణ మార్కెటింగ్ శాఖ వెబ్ సైట్ ప్రకారం 2018లో ఎంఎస్‌పి 1,770 రూపాయలు ఉండగా, ప్రైవేట్ వ్యాపారులు అందించిన మోడల్ ధర 1,653 రూపాయలు మాత్రమే. 2019లో ఎంఎస్‌పి 1,835 రూపాయలు కాగా ఆ సంవత్సరం ప్రైవేట్ వ్యాపారులు రైతులకు చెల్లించిన మోడల్ ధర 1,728 రూపాయలు మాత్రమే. 2020లో ఎంఎస్‌పి 1,888 రూపాయలు ఉన్నా రైతులకు ప్రైవేట్ వ్యాపారులు చెల్లించిన మోడల్ ధర 1,636 రూపాయలు మాత్రమే. ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వం, ఎఫ్‌సిఐ కోసం పెద్ద ఎత్తున ధాన్యం సేకరణ చేస్తున్నా, ప్రైవేట్ వ్యాపారులు మాత్రం తమ చేతికి అందిన ధాన్యానికి ఎంఎస్‌పి చెల్లించడానికి సిద్ధంగా లేరని ఈ మూడు సంవత్సరాల అనుభవం తెలియచేస్తున్నది.

12) పై వివరాలన్నీ పరిశీలిస్తే వరి ధాన్యం పండించే రైతుకు ఎక్కడ నష్టం జరుగుతుందో స్పష్టంగా అర్థం అవుతుంది.

13) వరితో సహా తెలంగాణలో పండుతున్న కొన్ని ముఖ్యమైన పంటల ఉత్పత్తి ఖర్చులు, మద్దతు ధరల తీరు చూడండి. మరీ ముఖ్యంగా 2014 –2021 మధ్య కాలంలో అంటే 7 సంవత్సరాల వివరాలు కొన్ని పోల్చి చూడండి.

2020-21 సంవత్సరాల మధ్య మద్దతు ధరల పెరుగుదల శాతం

1) తెలంగాణ రాష్ట్రంలో పంటల ఉత్పత్తి ఖర్చులు ప్రతి సీజన్‌కు పెరుగుతూ పోతున్నాయి. కానీ కనీస మద్దతు ధరలు మాత్రం అదే మోతాదులో పెరగడం లేదు.

2) 2020–2021 సంవత్సరంతో పోల్చినపుడు 2021 – 2022లో వరికి కేవలం 3.85 శాతం మాత్రమే ధరలో పెరుగుదల ఉంది. పత్తికి కూడా కేవలం 3.43 శాతం మాత్రమే ధర పెరిగింది. మొక్క జొన్నకు 1.08 శాతం, రాగికి 2.49 శాతం, పెసరకు 1.10 శాతం, జొన్నకు 4.50 శాతం, కందికి 5 శాతం సోయాబీన్‌కు 1.80 శాతం, వేరు శనగకు 5.21 శాతం, నువ్వులకు 6.59 శాతం, పొద్దు తిరుగుడుకు 2.21 శాతం ధరలు పెరిగాయి.

3) నిజానికి ద్రవ్యోల్బణం పెరుగుతున్న శాతంతో పోల్చి చూసినప్పుడు పంటల మద్దతు ధరల ఈ పెరుగుదల లెక్కలోకే రాదు. ముఖ్యంగా 2019–2020లో వ్యవసాయ ఉపకరణాల ధరలు, డీజిల్ ధరలు, యంత్రాల ధరలు, కిరాయిలు, కూలి రేట్లు గణనీయంగా పెరిగాయి.

4) 2014 – 2021 మధ్య పంట సాగు ఖర్చు పెరుగుతున్న దానితో సమానంగా కూడా కనీస మద్దతు ధరలు పెరగడం లేదు. లాభాల సంగతి అటుంచి, రైతులకు నికరంగా నష్టం రావడానికి ప్రభుత్వాల ఈ వైఖరే కారణం.

తెలంగాణలో సాగు ఖర్చులు ఎక్కువ

5) 2014–2021 సంవత్సరాల మధ్య జాతీయ స్థాయిలో పంట సాగు ఖర్చు కంటే తెలంగాణలో సగటు పంట సాగు ఖర్చు ఎక్కువ పెరిగింది. ముఖ్యంగా వరి పంట సాగు ఖర్చు (ఏ 2 + ఈఒ) జాతీయ స్థాయిలో 31.9 శాతం పెరగగా, తెలంగాణలో 42.9 శాతం పెరిగింది. మొక్క జొన్న జాతీయ స్థాయిలో 24.7 శాతం పెరగగా, తెలంగాణలో 34.1 శాతం పెరిగింది. కంది జాతీయ స్థాయిలో 20.8 శాతం పెరగగా, తెలంగాణలో 30.3 శాతం పెరిగింది. పెసర జాతీయ స్థాయిలో 57.4 శాతం పెరగగా, తెలంగాణలో 86.5 శాతం పెరిగింది. మినుము జాతీయ స్థాయిలో 48.6 శాతం పెరగగా, తెలంగాణలో 83 శాతం పెరిగింది. వేరుశనగ జాతీయ స్థాయిలో 21.4 శాతం పెరగగా, తెలంగాణలో 29.3 శాతం పెరిగింది. పత్తి జాతీయ స్థాయిలో 55.8 శాతం పెరగగా, తెలంగాణలో 85.3 శాతం పెరిగింది.

6) జాతీయ స్థాయిలో ఖర్చుల సగటు పెరుగుదలను బట్టీ మాత్రమే కనీస మద్దతు ధరలను నిర్ణయిస్తారని గుర్తుంచుకోవాలి. అంటే తెలంగాణలో ఉత్పత్తి ఖర్చులు భారీగా పెరిగినా, అందుకు అనుగుణంగా ఎంఎస్‌పి నిర్ణయం కాదు.

పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా ఎంఎస్‌పి పెరగడం లేదు

7) 2014–2021 సంవత్సరాల మధ్య పంట సాగు ఖర్చులు పెరిగినా, అందుకు అనుగుణంగా కనీస మద్దతు ధరలు ఆయా పంటలకు పెరగడం లేదు. ఉదాహరణకు 2014–21 మధ్య తెలంగాణలో పంట సాగు ఖర్చు పత్తికి 85.32 శాతం పెరగగా, ఎంఎస్‌పి మాత్రం కేవలం 44.83 శాతం పెరిగింది. గ్రేడ్ "ఏ" వరి సాగు ఖర్చు తెలంగాణలో 42.88 శాతం పెరగగా, ఆ కాలంలో ఎంఎస్‌పి పెరుగుదల 40 శాతం మాత్రమే. పెసర సాగు ఖర్చు 86.48 శాతం పెరగగా, ఎంఎస్‌పి 58.15 శాతం మాత్రమే పెరిగింది. మినుము సాగు ఖర్చులు 82.96 శాతం పెరగగా, ఎంఎస్‌పి మాత్రం 44.83 శాతం పెరిగింది.

8) కంది, మొక్కజొన్న, వేరుశనగ పంటలకు సాగు ఖర్చు కంటే ఎంఎస్‌పి ఎక్కువగా పెరిగినా, ఆచరణలో ఆ ధర రైతులకు అందడం లేదు. ప్రభుత్వం ఈ పంటల పూర్తి స్థాయి సేకరణలో లేకపోవడమే అందుకు కారణం. వరి, పత్తి ఏదో మేరకు సేకరణ సాగుతున్నది కనుక, ఆ మేరకు రైతులు మరింత ఎక్కువ నష్ట పోకుండా బయట పడుతున్నారు.

9) అయినా పంట సాగు ఖర్చులకు అనుగుణంగా, ఎంఎస్‌పి పెరగకపోవడం వల్ల, తెలంగాణ రైతులు వరి ధాన్యం పంటలో 2.9 శాతం, పెసరలో 28.3 శాతం, మినుములో 38.1 శాతం, పత్తిలో 36.6 శాతం నికరంగా నష్టపోతున్నారు.

10) సిఏసిపి అంచనా ప్రకారం వివిధ పంటలలో ఈ సంవత్సరం రైతులకు నికర మిగులు ఈ కింది విధంగా ఉంటుంది. మొక్కజొన్న పంటకు ప్రకటించిన ఎంఎస్‌పి నుండి సాగు ఖర్చు (ఏ2 +ఎఫ్ఎల్) తీసేస్తే, రైతుకు ఎకరానికి 18,064 రూపాయలు మిగులుతాయి. వరి పంటకు ఎకరానికి 13,135 రూపాయలు, పత్తి పంటకు ఎకరానికి 10,677 రూపాయలు, కంది పంటకు ఎకరానికి 6,504 రూపాయలు మిగులుతాయి.

స్వామినాథన్ సిఫారసుల ప్రకారం ధరలు ప్రకటించక నష్టం

11) నిజానికి సిఏసిపి అంచనా ఖర్చుల ప్రకారమే, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం ఎంఎస్‌పి ప్రకటిస్తే తెలంగాణ పత్తి రైతుకు ఎకరానికి 28,161 రూపాయలు, మొక్కజొన్నలో ఎకరానికి 27,797 రూపాయలు, వరి రైతుకు ఎకరానికి 29,498 రూపాయలు. కంది రైతుకు ఎకరానికి 13,780 రూపాయలు మిగలాలి.

12) సిఏసిపి జాతీయ స్థాయి లెక్కలను బట్టి ఎంఎస్‌పి ప్రకటిస్తుంది కనుక, మిగుళ్లు ఆ విధంగా ఉంటాయి. కానీ, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం పంట సాగు ఖర్చులను (ఏ2 +ఎఫ్ఎల్) పరిగణనలోకి తీసుకుని, ప్రస్తుత పద్ధతిలోనే ఎంఎస్‌పి ప్రకటిస్తే రైతుకు ఎకరానికి మొక్క జొన్నకు ఎకరానికి 16,209 రూపాయలు, వరికి ఎకరానికి 13,076 రూపాయలు, పత్తికి ఎకరానికి 9,042 రూపాయలు, కందికి ఎకరానికి 5,192 రూపాయలు మాత్రమే మిగులుతాయి.

13) అదే స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం, (రాష్ట్ర వ్యవసాయ శాఖ అంచనా వేసిన సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకుని) ఎంఎస్‌పి ప్రకటిస్తే తెలంగాణలో మొక్క జొన్న రైతుకు ఎకరానికి 34,905 రూపాయలు, వరి రైతుకు ఎకరానికి 56,875 రూపాయలు, పత్తి రైతుకు ఎకరానికి 57,857 రూపాయలు, కంది రైతుకు ఎకరానికి 19,269 రూపాయలు మిగులుతాయి. వివరాలను లోతుగా చూస్తే రైతులు ప్రతి సీజన్‌లో చాలా నష్టపోతున్నట్లు అర్థం అవుతుంది. (ఎస్‌డబ్ల్యుఎన్ స్వామినాథన్ కమిషన్) (ఎన్ఒఎన్ కాస్ట్ ఆఫ్ కల్టివేషన్)

14) కేంద్రం ధరల నిర్ణయం విషయంలో సమగ్ర ఉత్పత్తి ఖర్చు (సి 2) తీసుకోకుండా, కేవలం పంట సాగు ఖర్చు (ఏ 2+ ఎఫ్ఎల్) మాత్రమే తీసుకుంటుంది కనుక, కొన్ని పంటలలో రైతులకు నికర మిగులు ఉన్నట్లు కనపడుతున్నది. స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం సమగ్ర ఉత్పత్తి ఖర్చు లెక్కలోకి తీసుకుంటే రైతులకు ఖర్చులు కనీసం తిరిగి వస్తాయి. ఆయన సిఫారసు చేసినట్లుగా సి 2 + 50 శాతం కలిపి ఎంఎస్‌పి నిర్ణయిస్తే అప్పుడు రైతులకు నిజమైన లాభం వస్తుంది.

15) వ్యవసాయం రాష్ట్ర పరిధిలోని అంశం కనుక, రాష్ట్ర ప్రభుత్వమే రాష్ట్ర పరిధిలో అన్ని పంటలకు సమగ్ర ఉత్పత్తి ఖర్చులను లెక్కవేసి, ఎంఎస్‌పి ప్రకటించగలిగితే, మన రాష్ట్ర రైతులకు నిజమైన లాభం జరుగుతుంది. ప్రస్తుతం ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం మీదకు వదిలేసి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకుంటుంది కనుక, ప్రతి సీజన్‌లో రైతులు నికరంగా ఆర్థిక నష్టానికి గురవుతూనే ఉన్నారు.

2021–22లో కొన్ని పంటలు పండించే రైతులకు నికర నష్టం

1) ఎవరైనా పంటలు ఎందుకు పండిస్తారు. కొంత ఆదాయం కోసం. కానీ తెలంగాణలో కొన్ని పంటలు పండించే రైతులు ఈ సంవత్సరం నికరంగా నష్టపోతారని జాతీయ సంస్థ స్పష్టంగా నివేదికలో పేర్కొంది. అది కూడా కేంద్రం ప్రకటించిన ఎంఎస్‌పి అందినాక కూడా సుమా..

2) ఇప్పుడున్న ఖర్చులు, ధరల ప్రకారం జొన్న రైతులు ఎకరానికి 9,015 రూపాయలు, కంది రైతులు ఎకరానికి 1,913 రూపాయలు, పెసర రైతులు ఎకరానికి 5,316 రూపాయలు, మినుము రైతులు ఎకరానికి 4,491 రూపాయలు నష్ట పోతారని సిఏసిపి చెప్పింది.

3) రైతులకు ఎంఎస్‌పి అందకపోతే ఈ నష్టాలు మరింత పెరుగుతాయి. అంటే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఈ పంటలు పండించే రైతులను ఆదుకోకపోతే రైతులు నష్టపోతారు. ఒకటి రెండు సంవత్సరాలు చూసి వాళ్లు కూడా లాభం వచ్చే పంటల వైపు మళ్లిపోతారు. ఇప్పటికే ఆ పరిణామం తెలంగాణలో వేగంగా జరుగుతున్నది. నికర మిగులుతో రైతు కుటుంబానికి వచ్చే నికర ఆదాయం ఎంత?

4) ప్రస్తుత సంవత్సరంలో ప్రకటించిన ఎంఎస్‌పి వల్ల, వరి రైతులకు ఎకరానికి నికరంగా 12,105 రూపాయలు, పత్తి రైతులకు నికరంగా ఎకరానికి 4,046 రూపాయలు, వేరుశనగ రైతులకు నికరంగా ఎకరానికి 9,825

రూపాయలు, సోయాబీన్ రైతులకు నికరంగా ఎకరానికి 8,338 రూపాయలు మిగులుతాయని సిఏసిపి అంచనా వేసింది.

5) మనం సి2 గురించీ, సి2 + 50 శాతం గురించీ, జాతీయ సగటుతో పోల్చినప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువ అవుతున్న ఖర్చుల గురించీ కాసేపు మర్చిపోయి, ఈ నికర మిగులు ప్రకారం, ఆ పంట పండించే రైతు కుటుంబానికి సీజన్‌కు వచ్చే ఆదాయం ఎంత అనేది చూదాలి.

1) రెండున్నర ఎకరాల సన్నకారు వరి రైతుకు సీజన్‌కు నికర మిగులు 12,105 లీ 2.5 ఎకరాలు = 30,262 రూపాయలు. 6 నెలల పంట కాలం అనుకుంటే నెలకు 5,043 రూపాయలు మాత్రమే.

2) 5 ఎకరాల చిన్నకారు వరి రైతుకు సీజన్‌కు నికర మిగులు 60,525 రూపాయలు. అంటే నెలకు 10,087 రూపాయలు.

3) రెండున్నర ఎకరాల పత్తి రైతుకు సీజన్‌కు నికర మిగులు 4046 లీ 2.5 ఎకరాలు=10,115 రూపాయలు. 8 నెలల పంట కాలానికి నెలకు 1,264 రూపాయలు.

4) 5 ఎకరాల పత్తి రైతుకు సీజన్‌కు నికర మిగులు 4,046 లీ 5 = 20,230 రూపాయలు. అంటే నెలకు 2,528 రూపాయలు మాత్రమే.

ఈ రెండు పంటలూ 80 శాతం భూభాగాన్ని ఆక్రమించాయి కనుక, ఎక్కువ మంది రైతులకు వచ్చే ఆదాయాలు ఇవన్నమాట.

6) ఈ ప్రకారం ఒక రైతు కుటుంబం ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న కనీస మద్దతు ధరల విధానం వల్ల, ఎప్పటికైనా ఒక సగటు ఉద్యోగి వేతనాన్ని చేరుకోగలుగుతుందా? అప్పుల నుండి బయట పడగలుగుతుందా? తన కుటుంబాన్ని పోషించుకోగలుగుతుందా? తన పిల్లలను చదివించుకో గలుగుతుందా?

మిగిలిన ఆదాయాలు స్థిరంగా ఎట్లా ఉంటున్నాయి?

2015 నుండి తెలంగాణ రాష్ట్రంలో అమలులోకి వచ్చిన టిఎస్‌యుకె+ఎస్ఎస్ విధానం రాష్ట్రంలో పరిశ్రమలు, సంస్థలు స్థాపించే వారికి అనేక హక్కులు, సౌకర్యాలు, రాయితీలు కల్పిస్తున్నది. 2014 నుండీ 2021 లోపు ఈ సంస్థలు 15 లక్షల మందికి ఉపాధి కల్పించినట్లు, ప్రభుత్వం చెప్పుకుంటున్నది. మంచిదే. నిర్దిష్ట రూపంలో ఒకవేళ ప్రభుత్వం నుండీ చట్టబద్ధంగా ఆ సౌకర్యాలు, హక్కులు పారిశ్రామిక వేత్తలకు, సంస్థల యజమానులకు అందకపోతే ఇది సాధ్యం అయ్యేదా? ఆయా పారిశ్రామిక సంస్థలు, అందులో పనిచేసే కార్మికులకు, ఉద్యోగులకు హక్కులు కల్పించకుండా, కనీస వేతనాలు కల్పించకుండా దోచుకుంటున్నాయన్నది వాస్తవం. కానీ ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండానే, ఈ రాయితీలను, సౌకర్యాలను, హక్కులను ఈ సంస్థలకు అందిస్తున్నది.

2018 నుండీ అమలులోకి రావాల్సిన తెలంగాణ పే రివిజన్ కమిషన్ (కెఎఫ్ఎన్) నివేదిక ఆధారంగా నూతన వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం 2021 జూన్ నుండీ అమలు చేయడం ప్రారంభించింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు కోరుకున్నట్లుగా ఈ వేతనాల పెంపు, ఇతర సౌకర్యాలు లేకపోయినా ప్రభుత్వం ఆమోదించి అమలు చేస్తున్న వాటికి చట్టబద్ధత ఉంది. ప్రభుత్వం అంగీకరించిన మేరకు చెల్లింపులు చేయకపోతే ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు కోర్టుకు వెళ్లే అవకాశం ఉంది. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు వేతనాలతో పాటు, అనేక రకాల సౌకర్యాలు కూడా అమలులోకి వస్తాయి. ఇంటి అద్దె నుండీ ప్రారంభించి పదుల కొద్దీ స్కీములు అమలవుతాయి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు డిఎ కూడా అదనంగా అందుతుంది. నిర్దిష్ట పని గంటలు, పని దినాలు, వారాంతపు సెలవులు సహా అనేక హక్కులు అమలవుతాయి.

ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు అందే చట్టబద్ధ వేతనాలు, సౌకర్యాలు, హక్కుల గురించి మనకేమీ బాధ లేదు. కాకపోతే రెండు అంశాలలో మనకు అసంతృప్తి ఉంది. సమాజంలో మిగిలిన శ్రామిక వర్గాలతో పోల్చినప్పుడు మెరుగైన వేతనాలు, సౌకర్యాలు, హక్కులు పొందుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు, తమ బాధ్యతలను మాత్రం సంపూర్ణంగా నిర్వహించడం లేదని, పైగా వీరిలో కొంత మంది, ప్రజల పట్ల, ముఖ్యంగా పేద ప్రజల పట్ల చాలా అమానుషంగా వ్యవహరించడం, అవినీతికి పాల్పడడం చూసినప్పుడు, అలాగే తమ గురించి మాత్రమే తప్ప, సమాజంలో మిగిలిన శ్రామిక వర్గాల సమస్యలు, డిమాండ్ల పట్ల ఏ మాత్రం పట్టకుండా ఉండే "వేతన శర్మ"లుగా మారిపోతున్న విషయం మనసుకు తెలుస్తున్నప్పుడు ఈ అసంతృప్తి కలుగుతున్నది.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు పెరిగాయి

14.7వ పే కమిషన్ సిఫారసుల తర్వాత కింది స్థాయి ఉద్యోగి వేతనం కూడా 18,000 రూపాయలకు చేరింది (ఇతర సౌకర్యాలు, అలవెన్సులు కాకుండా).

వ్యవసాయ శాఖ సిబ్బంది వేతనాలు కూడా 100 శాతం పెరిగాయి

1) రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖలో కూడా సిబ్బంది వేతనాల తీరు 2014–15తో పోల్చినప్పుడు 2021–2022 నాటికి రెట్టింపు వేతనాలు అయ్యాయి. డిప్యూటీ సెక్రెటరీ స్థాయి అధికారికి 2014 –15 వేతనం స్కేలు 29000–53,060 రూపాయలు కాగా అది 2021–2022 నాటికి 56,870–1,05,810 రూపాయలకు పెరిగింది. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వేతన స్కేలు 2014–2015లో 23,650 – 49,360 రూపాయలు కాగా, అది 2021–2022 నాటికి 49,870 – 1,00,770 రూపాయలుగా పెరిగింది.

2) అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వేతన స్కేలు 2014–2015లో 19,050 – 45,850 రూపాయలు కాగా, 2021–2022 నాటికి అది 40,270 – 93,780 రూపాయలకు పెరిగింది. అగ్రికల్చర్ ఆఫీసర్ వేతన స్కేలు 2014–2015లో 16,150 – 42,590 ఉండగా, అది 2021–2022 నాటికి 35,120 – 87,130 రూపాయలకు పెరిగింది.

3) వ్యవసాయ విస్తరణ అధికారి (గ్రేడ్ 2) వేతన స్కేలు 2014–2015లో 11,530 – 33,200 రూపాయలు కాగా, అది 2021–2022 నాటికి 22,460 – 66,330 రూపాయలకు పెరిగింది. వ్యవసాయ విస్తరణ అధికారి (గ్రేడ్ 1) వేతన స్కేలు 2021–2022లో 29,760 – 80,930 రూపాయలుగా నిర్ణయించబడింది. (ఆధారం; 2021–2022 రాష్ట్ర బడ్జెట్ పత్రాలు)

4) ఈ వేతన స్కేల్స్‌ను పరిశీలిస్తే ఉద్యోగుల వేతనాలు ఈ ఏడేళ్లలో (రెండు పిఆర్‌సిల మధ్య) నూటికి నూరు శాతం పెరిగాయని అర్థం అవుతుంది. వేతనాలు ఒక్కటే కాదు, వ్యవసాయ రంగంలో ఉన్న ఉపకరణాల (విత్తనాలు, ఎరువులు, పురుగు విషాలు) కంపెనీలు, వ్యవసాయ యంత్రాల కంపెనీల లాభాలు కూడా విపరీతంగా పెరిగాయి. ఆయా ఉపకరణాల, యంత్రాల డీలర్లు, ఏజెంట్ల కమిషన్ల ఆదాయం కూడా రెట్టింపు అయ్యింది.

ముఖ్యమంత్రి, మంత్రుల వేతనాలు 100 శాతం పెరిగాయి

5) తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రాష్ట్ర మంత్రుల వేతనం 2.42 లక్షలు కాగా, 2016 మార్చ్ 29న అసెంబ్లీలో ఆమోదించుకుని, 4 లక్షలకు పెంచుకున్నారు (100 శాతం) రాష్ట్ర ముఖ్యమంత్రి వేతనం 2.44 లక్షల నుండీ 4.21 లక్షలకు పెరిగింది. దేశంలోనే అత్యధిక వేతనం పొందుతున్న ముఖ్యమంత్రి మనకు ఉన్నారు. పైగా, ఆయనే స్వయంగా "తనకు, తన కుమారుడికి కలిపి 100 ఎకరాల పొలం ఉంది. అందులో ఎకరానికి కోటి రూపాయల ఆదాయం వ్యవసాయం ద్వారా వస్తున్నది" అని కూడా ప్రకటించారు.

కరోనా కల్లోలమా? కనక వర్షమా?

***ప్రజల ఆరోగ్యాలను అల్లకల్లోలం చేసిన కరోనా సంక్షోభాన్ని కూడ పెట్టుబడిదారీ శక్తులు తమ సంపద పెంచుకోవడానికి వాడుకున్నాయంటున్నారు* చుంచు శ్రీశైలం**

'కొత్త మార్కెట్లను గెలుచుకునే క్రమంలో బూర్జువా వర్గం మరింత విస్తారమైన, వినాశకరమైన సంక్షోభాలకు మార్గాన్ని సుగమం చేసుకుంటుంది'

ప్రపంచ వ్యాప్తంగా కరోనా వైరస్ కారణంగా అల్లకల్లోల పరిస్థితులు నెలకొని ఉన్నాయి. దీనికి కారణాలు ఏవైనా, ఎవరైనా పర్యవసానాలు అనుభవిస్తున్నది మాత్రం ఎక్కడైనా సామాన్య ప్రజలే. సంక్షోభాలను (ఇంకా పెద్దవిగా చూపి) అవకాశాలుగా మలుచుకుందామని కరోనా మొదటి దశలో మోడీ వెలువరించిన ప్రకటన సారాంశం రెండవ దశ వచ్చే సరికి కానీ ప్రజలకు (అందరికీ కాదు) అర్థం కాలేదు. సంక్షోభాన్ని నివారించడానికి చేయవలసిన వ్యూహాలు, తరుణోపాయాల గురించి మాట్లాడడం, ఆచరణాత్మక ప్రణాళిక రూపొందించి ఆచరించడం ప్రజా పక్షపాత లక్షణం. అలా కాకుండా సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకుందాం అన్న పిలుపు బూర్జువా ప్రతినిధిగా తన వర్గానికి ఇచ్చిన సందేశం అని ఇప్పుడు స్పష్టంగా తెలుస్తుంది. ఈ సందేశం దొరికిన శవాన్ని మాత్రమే పీక్కు తినే రాబందులకు, శవాలుగా మార్చి సైతం పీక్కు తిందామని సూచన (బీజితిలి) ఇచ్చినట్లుంది. ప్రజలు తిండి, వైద్యం, కనీస వసతులు కూడా అందుకోలేక అవస్థలు పడుతుంటే కుబేరులు, అపర కుబేరులుగా మారుతున్న కళ్లముందరి పరిస్థితులే అందుకు నిదర్శనం. మోడీ పిలుపు మేరకు అవకాశాన్ని అందిపుచ్చు కోవడంలో రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, వైద్య పరంగా, విశ్వాసాల పరంగా ఏర్పడ్డ పోటీలో స్వార్థ పూరిత, దోపిడీ శక్తులు శరవేగంగా దూసుకపోతున్నాయి. ఈ పోటీ ప్రజల బంధాలను, అనుబంధాలను, భయాలను, కన్నీళ్లను, చివరికి శవాలను కూడా సొమ్ము చేసుకుంటూ అమానవీయతకు అసలు సిసలు నిర్వచనంలా ఉంది. ప్రజల కల్లోలం కొందరికి కనక వర్షం (అవకాశం)గా మారింది. వారికి శవాలు కాసులను రాల్చే యంత్రాల్లా కనిపిస్తున్నాయి.

ఈ సంక్షోభాన్ని రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు చట్టబద్ధత కల్పించుకునేందుకు, ప్రశ్నను ఉచ్చరించే గొంతులను నిషేధించి, పాశవికంగా నులిమేసేందుకు మహాద్భుత అవకాశంగా పాలకులు అందిపుచ్చుకున్నారు. వ్యవసాయ, కార్మిక, ప్రైవేటీకరణ రంగాల్లో కార్పొరేట్ అనుకూల చట్టాలను చేసి, ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న తమ కార్పొరేట్ యజమానులకు బంగారు పళ్ళెంలో పెట్టి సమర్పించారు. వైరస్ కారణంగా ప్రాణ భయంతో, ప్రజలే స్వచ్ఛందంగా చేతులారా అందజేస్తున్న డబ్బుతో లక్షల కోట్లు సంపాదించే అవకాశాన్ని మెడికల్, కార్పొరేట్ మాఫియా అందిపుచ్చుకుంది. తమ విశ్వాసాలు, బోధనలకు అనుగుణంగా మలుచుకోవడానికి మతాలు ప్రస్తుత పరిస్థితులను అవకాశంగా మలుచుకుంటున్నాయి. సనాతన సంస్కృతి, సంప్రదాయాల పేరుతో అశాస్త్రీయ అంశాలను, మూఢనమ్మకాలను సుస్థిరం

ప్రభుత్వాలు తమ సహజ సిద్ధ వర్గ స్వభావంతో, ధనవంతులకు, సంఘటిత వర్గాలకు ఇచ్చే ప్రాధాన్యత ఎప్పుడూ, ఆర్థికంగా, సామాజికంగా బలహీన వర్గాలకు, అసంఘటిత వర్గాలకు ఇవ్వవు. అందుకే దశాబ్దాలు గడుస్తున్నా, పేద ప్రజల జీవితాలలో మార్పులు రావడం లేదు. సమాజంలో ఆర్థిక అంతరాలు విపరీతంగా పెరుగుతున్నాయి. సామాజిక, సాంస్కృతిక అంతరాలు కూడా పెరుగుతూనే ఉన్నాయి. వివక్ష కొనసాగుతూనే ఉంది.

ముఖ్యంగా ఆదివాసీ ప్రజల పట్ల, ప్రాంతాల పట్ల, గ్రామీణ ప్రజల పట్ల, ప్రాంతాల పట్ల, నగరాలలో పేదలు, అసంఘటిత ప్రజల పట్ల, వారు నివాసముండే ప్రాంతాల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి కొనసాగుతూనే ఉంది. ఈ ప్రాంతాల, వర్గాల ప్రజలకు హక్కులు, సౌకర్యాలు, చట్టబద్ధ ఆదాయ భద్రత, కార్యకలాపాలు కొనసాగించడానికి మద్దతు వ్యవస్థల గురించి ప్రభుత్వాలు పట్టించుకోవు. ఈ వర్గాల ప్రజలను కేవలం ఓటర్లుగా తప్ప, సమాన హక్కులు అందాల్సిన పౌరులుగా చూడని ఒక అనాగరిక పాలన కొనసాగుతుంటుంది.

ఇవన్నీ ఏమి చెబుతున్నాయి?

అంటే సమాజంలో ఆధిపత్య, సంఘటిత వర్గాలకు ఆదాయాలు పెరుగుతున్నాయి. అసంఘటిత వర్గాల ఆదాయాలు పెరగడం లేదు. పైగా అన్ని వనరులూ రాను రానూ ఆధిపత్య వర్గాల చేతుల్లో కేంద్రీకృతమవుతున్నాయి. ప్రభుత్వాల మద్దతు వ్యవస్థలు కూడా వీరికి త్వరగానే అందుబాటులోకి వస్తాయి. అందుకే పెద్ద రైతులకు వ్యవసాయం గిట్టుబాటు అయినట్లుగానే అనిపిస్తుంది.

చిన్న రైతులకు వ్యవసాయం చేయడం చేతకాక నష్ట పోతున్నారనే అపోహలు కూడా ఇందులోంచే పుడతాయి. బాగా చదువుకున్న, నగరాల నుండి వచ్చిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల వ్యవసాయం, లాభాల గురించి కథనాలు వెల్లువెత్తుతుంటాయి. అందుకే చిన్న కమతాలు నశించిపోయి, పెద్ద కమతాలు రావాలనీ, చిన్న రైతులు, కూలీలు వ్యవసాయం పెద్దవాళ్లకు, పెద్ద కంపెనీలకు వదిలిపెట్టి ఇతర రంగాలలోకి, నగరాలకు తరలి వెళ్లాలని సూత్రాలు కూడా వినిపిస్తుంటాయి. ప్రపంచ బ్యాంకు అందుకున్న ఈ రాగం మీడియా సంస్థలు, అధికారంలో ఉన్న వాళ్లు ప్రతిధ్వనిస్తుంటారు.

ఇదొక మోసపూరిత వాదన. అమెరికా, యూరప్‌లతో సహా, ప్రపంచ వ్యాపితంగా ఏ దేశంలో అయినా వ్యవసాయం ప్రభుత్వాల బడ్జెట్, సానుకూల విధానాల మద్దతుతోనే నిలబడుతుంది. అలా లేని రోజు ఏ దేశంలోనూ వ్యవసాయం ఒక్క అడుగు కూడా ముందుకు పడదు. అందుకే చిన్న రైతులు వ్యవసాయం వదిలి పెట్టడం కాదు. కార్పొరేట్లు వ్యవసాయ భూములను లాక్కోకుండా మన పోరాటం సాగాలి. సన్న, చిన్న కారు రైతుల వ్యవసాయం గిట్టుబాటు అయ్యేలా ప్రభుత్వాల విధానాలు మారాలి.

(రచయితలు రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు, పరిశోధక విద్యార్థి)

వీ

చేయడానికి పోటీ పడుతున్నాయి. పరస్పర నిందారోపణలు, దూషణలతో రాజకీయ పక్షాలు ప్రజల క్షేమాన్ని వదిలి తమ రాజకీయ ప్రయోజనాలలో మునిగి దోపిడీ వర్గాలకే కొమ్ముకాస్తున్నాయి. గోరంతను కొండంతలుగా చేస్తున్న పాలకుల, మతాల, ప్రచార సాధనాల విధానాలను లేశమాత్రంగా నైనా అనుమానించి, ప్రశ్నిస్తే అది అత్యంత సాహసోపేత చర్య అవుతుంది.

కరోనా పుట్టుక, వ్యాప్తి మీద ఏర్పడ్డ సందేహాలు నివృత్తి కాకముందే అనేక కొత్త ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కరోనా వ్యాక్సిన్లు (?) అందుబాటులోకి వచ్చిన తర్వాతనే రెండవ దశ ఎందుకు ప్రబలింది? ఇంత త్వరగా ఇన్ని వ్యాక్సిన్లు ఎలా సాధ్యం అయ్యాయి? భయంతోనే చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిసీ కూడా ప్రజల్లో ధైర్యాన్ని నింపే ఒక్క ప్రకటన, కార్యాచరణ ఎందుకు చేపట్టడం లేదు? వ్యాక్సిన్ అమ్ముకోవడానికే రెండవ, మూడవ వేరియంట్ లు ముందుకొస్తున్నాయా? కరోనా టెస్టుల్లో విశ్వసనీయత ఎంత, ఖచ్చితత్వం ఎంత? తొలుత పూణే కేంద్రంగా ఉన్న టెస్టు కిట్లు ఇంత తక్కువ సమయంలో గ్రామ గ్రామానికి ఎలా వచ్చాయి? ఒక వ్యక్తికి ఒకే రోజు వేర్వేరు చోట్ల జరిపిన రెండు టెస్టులు రెండు భిన్న ఫలితాలను ఎందుకు కనపరుస్తున్నాయి? కరోనా వైద్యంలో డాక్టర్ల మధ్య ఉన్న వైరుధ్యాలకు అధికారిక సమాధానం ఏదీ? ప్రజల ఇలాంటి సందేహాలన్నింటికి సత్యంతో కూడిన సమాధానం ఖచ్చితంగా ఉండి తీరుతుంది. కానీ ,అది ఎప్పటికీ కాల గర్భంలో దాక్కునే ఉంటుందా లేక ఏదో ఒకనాడు గర్భ విచ్ఛిత్తి చేసుకుని బయటపడుతుందా వేచి చూడాలి.. అది జరిగిన నాడు పెట్టుబడి ఎంత బలి కోరుతుందో స్పష్టంగా తెలిసొస్తుంది. లాభాపేక్ష మానవ సమాజానికి ఎంతటి అమానవీయతను సృష్టించేందుకైనా వెనకాడదని స్పష్టమవుతుంది. అప్పుడు పెట్టుబడిదారీ వర్గం (బూర్జువా) కొత్త మార్కెట్లను గెలుచుకునే (దోచుకునే) క్రమంలో మరింత విస్తారమైన, వినాశకరమైన సంక్షోభాలకు మార్గాన్ని సుగమం చేసుకుంటుందని కమ్యూనిస్టు ప్రణాళికలో మార్క్స్, ఎంగెల్స్‌లు తెలిపిన కఠోర వాస్తవాలు మరోమారు బట్టబయలు కానున్నాయి. దీనికి ఫైజర్ వ్యాక్సిన్ ఇవ్వాలంటే తమ దేశాల్లోని మిలిటరీ ఎయిర్ బేస్‌ల వినియోగానికి అనుమతివ్వాలని బ్రెజిల్, అర్జెంటీనా దేశాలకు అమెరికా విధించిన షరతును మించిన ఉదాహరణ ఇంకేమి అవసరం లేదు.

వైరస్‌ను మించిన సంక్షోభం పెట్టుబడి భావజాలం

పాలకులు సంక్షోభావకాశాలను అందిపుచ్చుకుంటుంటే ప్రశ్నించాల్సిన సమాజం మౌనం వహిస్తుంది. అంతమాత్రమే కాకుండా మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వ్యాపార వర్గాల్లో విస్తరించిన పెట్టుబడిదారీ స్వభావం చూస్తుంటే గగుర్పాటుకు గురి కాక తప్పదు. సంక్షోభ సమయంలో సామాజిక ఐక్యతను, సహకారాన్ని, మానవత్వాన్ని చూపాల్సిన తరుణంలో అందినకాడికి దోచుకుందామనే వైఖరులు ప్రపంచీకరణ ప్రభావం విస్తృత వ్యాప్తికి నిదర్శనం. వాక్సిన్ల కోసం అల్లాడిపోతున్న సామాన్య ప్రజలు ఒకవైపు ఉండగా ఇంకోవైపు అవసరం లేకున్నా ముందుజాగ్రత్తగా నిల్వ చేసుకుంటున్న ఉన్నత, సంపన్న వర్గాలు ఉన్నాయి. వాటిని బ్లాక్ మార్కెట్‌కు తరలించి ప్రజల ప్రాణాలను బలి చేస్తూ లక్షలాది రూపాయలు సంపాదిస్తున్న వ్యాపార ముఠాలు మరోవైపు నిలుచున్నాయి. శవాలను ప్లాస్టిక్ సంచులలో చుట్టడానికి డబ్బు, అప్పగించడానికి డబ్బు, తీసుకెళ్లడానికి డబ్బు, కాల్చడానికి డబ్బులు విపరీతంగా వసూలు చేస్తూ శవాలతో పాటు బ్రతికిఉన్న వారినీ పీక్కుతినే తీవ్రమైన అవినీతి, దోపిడీ స్వభావం గల సమాజం మానవత్వాన్ని వెక్కిరిస్తుంది. టాక్సీలు, అంబులెన్స్ ల ధరలను భరించలేని పేద ప్రజలు తమ బంధువుల మృతదేహాలను భుజాల మీద, బైక్‌ల మీద మోసుకెళ్ళే సంఘటనలు ఇది సభ్య సమాజమేనా అని సిగ్గుపడేలా చేస్తున్నాయి. 5 ఆసుపత్రుల్లో నిండు గర్భిణి ప్రసవానికి నిరాకరించిన ఫలితంగా ప్రాణాలు కోల్పోవడం, శవానికి సిజేరియన్ చేసి మృత శిశువును వేరు చేసి దహనం చేయడమనే సంఘటన ప్రతీ మనిషిని ద్రవింపచేస్తుంది. కనిపించిన ప్రతి తెల్లకోటు కాళ్ళు పట్టుకుని వేడుకున్నా ఆక్సీజన్ బెడ్ లేక తన తండ్రిని, అంతలోనే తల్లిని కోల్పోయిన యువతి దుఃఖాన్నీ, ఆవేదనను ఎలా తీర్చగలం. తామేమీ తక్కువ కాదంటూ లాక్ డౌన్ కారణంగా రవాణా ఇబ్బందుల సాకుతో కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలను కూడా పెంచేస్తున్న చిన్న వ్యాపారులు కూడా నరనరాన నిండిన వ్యాపార స్వభావాన్ని బయట పెడుతున్నారు. పై నుంచి క్రింది వరకు అందరూ సంక్షోభాన్ని అవకాశంలా అందిపుచ్చుకుంటూ మోడీ పిలుపును ఆచరిస్తున్నారు. నాణేనికి మరో పార్శ్వం ఉన్నట్లుగానే తక్షణ సహాయం కోసం ఎదురుచూస్తున్న వారికి సాయం చేసేందుకు ముందుకు వస్తున్న వ్యక్తులు, సంస్థలను అభినందించాల్సిందే. కానీ, ఇవేవీ మొత్తంగా వ్యవస్థ మార్పుకు ఉపయోగపడవని, దాని కోసం ప్రజా పోరాటాలే మార్గమని కూడా గుర్తుంచుకోవాలి. దాతృత్వం, విరాళాల వల్ల వేళ్ళ మీద లెక్కపెట్ట గలిగినంత మంది సమస్యలకు అది కూడా తాత్కాలికంగా మాత్రమే సాంత్వన దొరకగలదన్న వాస్తవాన్ని అంగీకరించాలి. అలాగే సంక్షోభానికి ఎదురొడ్డి పోరాడుతున్న ఫ్రంట్ లైన్ యోధులందరికీ అభినందనలు. ప్రాణభయంతో అందరూ ఇండ్లకే పరిమితమైనా, తమ ప్రాణాలను, కుటుంబ సభ్యుల ఆరోగ్యాలను పణంగా పెడుతూ విధులు నిర్వహిస్తున్న వైద్య, పారిశుద్ధ్య సిబ్బందికి జేజేలు. ఏది ఏమైనా ఈ సంఘటనలు, పరిస్థితులన్నీ మనిషికి అత్యంత ప్రమాదకరమైనది శరీరంలో ప్రవేశిస్తున్న వైరస్సేనా లేక మెదళ్లను, మనసును స్వాధీనం చేసుకుంటున్న వ్యాపార భావజాలమా అన్న ప్రశ్నను లేవనెత్తుతున్నాయి. ఎవరికివారు దీనికి సమాధానం వెతుక్కోవడం తక్షణావసరం. ఆ సమాధానమే నూతన సమాజ సృష్టికి తమ కర్తవ్యాలను నిర్ణయించగలదు.

వైరస్ సృష్టించిన కల్లోలం కంటే దాని చుట్టూ అల్లిన భయాలు మారణహోమానికి, అనేక ఆకృత్యాలకు కారణమవుతున్నాయి. బ్రతకడానికి ఆహారాన్ని అర్థించే దేశంలో చచ్చిన శవాన్ని కాల్చడానికి కలప కోసం కూడా అర్థించాల్సిన దుస్థితి నెలకొంది. కుటుంబ సభ్యులు తమ సంబంధీకుల శవాలను తాకడానికి, మనసారా ఏడ్వడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. శవాలను కాల్చడానికి లేదా పూడ్చడానికి కూడా స్వచ్ఛంద సంస్థలు ఏర్పడాల్సి రావడం, స్మశానవాటికల్లో అడ్డగింపులు పతనమైన పరిస్థితులకు నిదర్శనం. కరోనా పాజిటివ్ వచ్చిందని కొందరు, వస్తుందేమో అని మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కరోనా సోకిందని భార్యను చంపి, తాను ఆత్మహత్యలకు పాల్పడుతున్నటువంటి మాటల్లో చెప్పలేని, రాతల్లో రాయలేని అమానవీయ పరిస్థితులు పెరుగుతుండడం కలవరపెడుతోంది. కరోనా సోకిన ముసలి తల్లిదండ్రులను అనాథలుగా, అనాథ శవాలుగా వదిలి పోతున్న అకృత్యాలకు కొదువ లేకుండా ఉంది. గంగా నదిలో కొట్టుకొచ్చిన కరోనా శవాలు ఎప్పటికీ మానవత్వానికి మాసిపోని మచ్చలా నిలిచే ఉంటాయి. ఈ హృదయవిధారక సంఘటనలు శవాలతో పాటు కాల్చి, లేదా మట్టిలో పూడ్చవేయబడేవి కావు. ఈ పరిస్థితులు కుటుంబ, మానవ సంబంధాలు మేలిముసుగులే అని గుర్తుచేస్తున్నాయి. ఇంతటి దుర్మార్గపు పరిస్థితులన్నింటికి వైరస్ చుట్టూ అల్లిన కల్పిత భయాలే కారణం. జరుగుతున్న మరణాలన్నింటికి వైరస్‌తో పాటు ఇతర అనారోగ్య సమస్యలు కూడా కారణంగా నిలుస్తున్నాయి. అందులో అతి ముఖ్యమైన కారణం భయం. వైరస్ కారణంగా సంభవించిన మరణాల కంటే భయం వల్ల జరుగుతున్నవే ఎక్కువగా ఉన్నాయి. ధైర్యాన్ని కోల్పోవడం, ఒత్తిడి, భయం, మానసిక ఆందోళనలు రోగనిరోధక శక్తిని

తీవ్రంగా కొల్లగొడతాయని అప్పుడు శరీరంలో ఏర్పడ్డ సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకోవడంలో (మోడీ లాగా) వైరస్ కూడా పెట్టుబడితో సమానంగా దూకుడుగా పనిచేస్తుందని అర్థం అవుతుంది

మోడీపై అంతర్జాతీయ విమర్శలకు కారణాలు

కరోనా మొదటి దశ వ్యాప్తి తర్వాత అది సృష్టించిన భయాందోళనల నుండి ప్రజలు కొంచెంకొంచెంగా బయటపడి సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. బ్రతుకు పోరాటంలో సాగుతూ దైనందిన బాధ్యతల్లో మునిగి దాదాపుగా వైరస్ ను పట్టించుకోని స్థితికి ప్రజలు చేరుకున్నారు. అంటే కరోనా ప్రాణాంతకమైనదేం కాదని, సాధారణ జలుబు జ్వరం లాంటిదేనన్న అవగాహనకు దాదాపు ప్రజలంతా వచ్చి ఉన్నారు. అప్పటిదాకా వైరస్ కు ఎప్పుడెప్పుడు వ్యాక్సిన్ వస్తుందా అని ఎదురుచూసిన వారంతా దాని గురించి పట్టించుకోవడమే మానేశారు. వైరస్ ఆనవాళ్లను ప్రజల మెదళ్ల నుంచి పూర్తిగా తొలగించడం ఇష్టం లేని కార్పొరేట్ పాలకులు దేశవ్యాప్తంగా (ఒకటి, రెండు రాష్ట్రాలు మినహా) పాఠశాలలను మూసి ఉంచారు. జనంను గంటల పాటు చీకటి గదిలో బంధించే సినిమా,పబ్, బార్‌లకు మాత్రం అనుమతించడంలో ఔచిత్యం ఏమిటో తెలియలేదు. ఈ పరిస్థితుల ఆధారంగా తొందరపడి ముందే కూసినట్లుగా కరోనాను ఎదుర్కోవడంలో ప్రపంచమంతా భారత్ వైపు చూస్తుందని మోడీ తన సహజ ధోరణిలో ప్రగల్భాలు పలికారు. దాదాపు కరోనాను జయించినట్లేనన్న భావం ఆయన మాటల్లో వ్యక్తమైంది. దానికి తోడు 5 రాష్ట్రాల్లో ఎన్నికలు నిర్వహించడం, చిన్న చిన్న సమావేశాలు, హాలు మీటింగులపై మాత్రం నిషేధం ఉండగా, కోటి మందితో జరిగే కుంభమేళా ను ఒక సంవత్సరం ముందుకు జరిపి నిర్వహించడం జరిగింది. ఇటు వంటి చర్యల వల్ల వైరస్ చుట్టూ అల్లిన అపోహలు, భయాలు తగ్గిపోయి ప్రజల్లో ప్రశ్నించడం మొదలైంది. అంటే వాస్తవిక అవగాహన పెరిగే అవకాశం ఏర్పడింది. నిజంగా వైరస్ అంత ప్రమాదకరమైనదే అయితే వీటి నిర్వహణకు అనుమతించే వారే కాదు కదా అన్న సందేహం దేశవ్యాప్తంగా సామాన్యుడికి సైతం వ్యక్తమైంది. సరిగ్గా ఇక్కడే వ్యాక్సిన్ విడుదలకు, అమ్మకాలకు సిద్ధంగా ఉన్న అంతర్జాతీయ, జాతీయ గుత్త పెట్టుబడిదారులకు, వారి అనుకూల మీడియాకు మోడీ వ్యాఖ్యలు, అతని రాజకీయ స్వార్థం తమ వ్యాపారానికి గండి కొట్టేవిగా కనపడి ఉండవచ్చు. అందువల్లే గతంలో మోడీని ఆకాశానికెత్తిన అంతర్జాతీయ, జాతీయ మీడియానే ఇప్పుడు తీవ్రంగా విమర్శిస్తుంది. రెండవ దశ వైరస్‌ను అదుపు చేయడంలో విఫలమయ్యారని, ఆయనొక విఫల ప్రధాని అని చేస్తున్న ప్రచారం, విదేశాల నుంచి అందుతున్న సహకార ముసుగులు అందుకు నిదర్శనం. అడగకపోయినా సహకరిస్తామని విదేశాలు ప్రకటిస్తుండడం మోడీ ప్రతిష్టను దిగజార్చే ప్రణాళికలో భాగమై ఉండవచ్చు. దీనికి కారణం తమ వర్గ ప్రతినిధిగా మోడీ ఇక పనికి రాడని, మరో కొత్త జీతగాన్ని ప్రమోట్ చేయాలని భావించడం కారణం కావచ్చు. లేదా తన రాజకీయ ప్రయోజనాల కంటే పెట్టుబడి ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వాలని హెచ్చరించడానికైనా కావచ్చు. అంతేకాకుండా ప్రజల్లో తొలగిపోయిన భయాలను తిరిగి పునఃప్రతిష్టంచడం కూడా కావచ్చు. ఏకకాలంలో రెండు ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్న స్థితి ప్రస్తుతం కొనసాగుతుంది.

ఊపందుకున్న వ్యాక్సిన్ వ్యాపారం

వాక్సిన్లు అమ్మకానికి సిద్ధమైనా వాటిని నమ్మడానికి, కొనడానికి ప్రజలు సిద్ధంగా లేని స్థితిని అధిగమించి, వాక్సిన్ల అమ్మకాలు జోరుగా సాగాలంటే తిరిగి ప్రజల్లో విపరీత భయాలను నెలకొల్పాల్సిన అవసరం ఏర్పడింది. దాంతో అప్పటివరకు నిలిచిపోయిన కరోనా టెస్టులు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. టెస్టులతో పాటే పాజిటివ్ కేసులు కూడా. మొదటి దశకు చైనా కేంద్రంగా నిలిస్తే, రెండవ వేరియంట్ లండన్ కేంద్రంగా మొదలైంది. అప్పటివరకు ప్రజలు కూడదీసుకున్న ధైర్యం ఒక్కసారిగా నిర్లక్ష్యంగా కనపడింది. రెండవ దశకు ప్రజల ఈ నిర్లక్ష్యమే కారణమని నింద మోపారు. కరోనా కట్టడికి నిర్లక్ష్యాన్ని వీడాలంటూ రెండవ దశ ప్రచారం ఇంకా కొనసాగుతుంది. రెండవ దశ వైరస్ విజృంభించేలా చేయగానే (టెస్టుల ద్వారా) అప్పటికే సిద్ధంగా ఉన్న వాక్సిన్లు ఒక ప్రణాళిక ప్రకారం మార్కెట్ లోకి రావడం మొదలైంది. మొదట వ్యాక్సిన్ అవసరమే లేదన్న ప్రజల ధైర్యాన్ని, ఆ తర్వాత వ్యాక్సిన్ సురక్షితం కాదన్న భయాల్ని ఏక కాలంలో దెబ్బకొట్టగలిగారు. అంతేకాకుండా వ్యాక్సిన్ కరోనాను నియంత్రించడం లేదన్న వాస్తవానికి సైతం తీవ్రత తగ్గిస్తుందన్న సమాధానాన్ని నమ్మించడంలో కూడా విజయవంతం అయ్యారు. వ్యాక్సిన్ అమ్మకాలకు ఎదురైన అవరోధాలను ఒక్కొక్కటిగా అవకాశంగా మలుచుకుంటూ తీవ్రమైన డిమాండ్ ను నెలకొల్పుకోని, బ్లాక్ మార్కెట్ కు వాక్సిన్లను తరలించేంత గొప్పగా వ్యాపారం వర్ధిల్లే స్థాయికి చేర్చారు. వ్యాక్సిన్ వేసుకోవడం బాధ్యతాయుత పౌరుని లక్షణమని, లేకపోతే దేశద్రోహిననే స్థాయికి కూడా చేరింది మన దేశభక్తి. ఈ లాభసాటి వ్యాపారానికి అబ్బురపడుతున్న అనేక కంపెనీలు తాము సైతం అంటూ కొత్త కొత్త పేర్లతో, సమర్థంగా పనిచేస్తుందన్న ఆకర్షణలతో రోజుకో వ్యాక్సిన్ ను పరిచయం చేస్తున్నారు. ధరల నిర్ణయాధికారాన్ని ఆయా కంపెనీలకే వదిలేయడం, ధరల నియంత్రణకై ఎటువంటి విధానం ప్రకటించక పోవడం కూడా దోపిడీ ఆశను పెంచుతుంది. అందుకే కోవాక్సిన్, కోవిషీల్డ్, స్పుత్నిక్, రెమ్డేసివిర్, విరాఫిన్, 2-డిజి, జైకోవి-డి, అస్ట్రాజెనిక, ఫైజర్, తోసిలీజుమాబ్ వంటి ప్రస్తుతం ఉన్న వాటికి తోడు మరికొన్ని వాక్సిన్లను ముందు ముందు చూడాల్సి రావచ్చు. ఇందులో కరోనా రాకుండా ఉండేందుకు కొన్ని, కరోనా తీవ్రత తక్కువగా ఉన్నప్పుడు వేసేవి కొన్ని, కరోనా లోడ్ ఎక్కువగా ఉన్నప్పుడు వేసేవి కొన్ని గా వర్గీకరణ కూడా చేసుకున్నారు. ఇక కరోనా మధ్యస్థంగా ఉన్నా, వచ్చి తగ్గిన తర్వాత మళ్ళీ రాకుండా ఉండే వ్యాక్సిన్లు కూడా రావొచ్చు. ఈ వ్యాపార కిటుకులు వ్యాక్సిన్ అమ్మకాల్లో నెలకొన్న పోటీకి నిదర్శనంగా ఉన్నాయి తప్ప ప్రజల ఆరోగ్యం పట్ల, దేశం పట్ల ప్రేమ ఎంతమాత్రం కాదని చాలా స్పష్టంగా కనిపిస్తోంది. వ్యాక్సిన్ పని తీరును పంచుకున్నట్లే ధరలను కూడా పంచేసుకున్నారు. అందులోనూ విదేశీ ధరల కంటే ఎక్కువగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, ప్రైవేట్ కు వేర్వేరు ధరలు కూడా ప్రకటించబడ్డాయి. దీని పై వచ్చిన విమర్శలు, ఒత్తిడికి తలొగ్గి ఉచిత వాక్సిన్‌కు కేంద్రం అంగీకరించింది. పేరుకు ఉచితమైనా చెల్లించేది ప్రజల డబ్బే అని గుర్తుపెట్టుకోవాలి. ఇక మిగిలింది ఉత్పత్తి, అమ్మకాలు మాత్రమే. ఈ లోపు ఎన్ని విలువైన ప్రాణాలు పోయినా, మనిషి ఎంతటి కఠినుడిగా మారినా, మరెంతటి అమానవీయత రాజ్యమేలినా లెక్కేలేదు. ఏ కంపెనీ అమ్మకాల్లో ఎన్ని రికార్డులు నెలకొల్పుతుందనేదే లెక్క. ఆ లెక్క తేలేవరకు కావాల్సిన అనుకూలతలను సజీవంగా కాపాడుకోవడం ఒక్కటే లక్ష్యం. మూడవ వేరియంట్ ప్రమాదం కూడా తప్పదని కేంద్ర శాస్త్ర సలహాదారు విజయ్ రాఘవన్ చెప్పిన జోస్యం అందులో భాగమే కావచ్చు. మూడు కాదు ముప్పై వేరియంట్లు అయినా రావచ్చేమో. లేదంటే ఈ సంక్షోభం అందిచ్చిన లక్షల కోట్లు దోపిడీ చేసే అవకాశాన్ని చేజేతులా కోల్పోవాల్సి వస్తుంది. 130 కోట్ల మంది జనాభా గల భారత దేశం అతిపెద్ద మార్కెట్. ఎక్కువ జనాభా కలిగిన దేశాల్లో మాత్రమే కరోనా ప్రభావం ఎక్కువగా ఉండడానికి గల కారణాలు కూడా మార్కెటే అయినా ఆశ్చర్యం లేదు. ఈ దేశంలో కనీసంగా 100 కోట్ల మంది వ్యాక్సిన్ వేసుకున్నా సగటున ఒక్కొక్కటి రూ. 500 చొప్పున రెండు డోసులకు కలిపి

అక్షరాల లక్ష కోట్ల రూపాయలు ఒక్క వ్యాక్సిన్ ద్వారా పోగుపడనున్నాయి. వ్యాక్సిన్ ప్రజలకు అలవాటు చేసి, ఖచ్చితం, అత్యవసరం చేసేంతవరకు మాత్రమే వ్యాక్సినేషన్ ప్రభుత్వం చేపట్టొచ్చు. ఆ తర్వాత వివిధ కారణాలతో ప్రైవేట్ కు అప్పజెప్పి దోపిడీకి తలుపులు బార్లా తెరవడం ఖాయం. ఇప్పుడు ప్రకటించిన ధరలు వినియోగదారుల వద్దకు వచ్చేసరికి ఎన్ని రెట్లయిన పెరిగిపోవచ్చు. కృత్రిమ కొరతతో ధరలు అమాంతం పెరిగిపోవడం కూడా ఖాయం. ఇప్పటికే బ్లాక్ మార్కెట్ కు చేరిన రెమ్ డేసివిర్ లక్ష రూపాయల వరకు ధర పలకడం చూశాం. ఆ రకంగా టెస్టులు, మందులు, ఆహారం, మాస్కులు, శానిటైజర్లు, అంబులెన్స్‌లు, ఆసుపత్రి బెడ్లు, ఆక్సిజన్, వెంటిలేటర్ వంటివి కాకుండా ఒక్క వ్యాక్సిన్ రూపంలోనే, ఒక్క మన దేశంలోనే లక్షల కోట్లు ప్రజల నుండి పిండుకోనున్నారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఇంకెంత పెద్ద వ్యాపారమో ఊహకు అందనిది.

విష పు(ప)త్రికల విశాల హృదయం

పరిశోధక, వాస్తవిక వార్తలకు తిలోదకాలిచ్చి, ప్రకటిత విషయాలనే వార్తలుగా నమ్ముతున్న, నమ్మిస్తున్న ప్రచార సాధనాలు ఈ సందర్భంలోనూ అదే ధోరణిని అవలంభిస్తున్నాయి. సంచలన వార్తలు, భయపెట్టే కథనాలతో ప్రభుత్వాలు విడుదల చేసే పాజిటివ్ సంఖ్యలు, శవాల గణాంకాలు ప్రచురిస్తూ మృత్యుఘోషను విన్పించడానికే పరిమితమవుతున్నాయి. వైరస్ తీవ్రతతో ఒకరు మరణిస్తే, వార్తల తీవ్రతతో అంతకు మించే చనిపోయారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వార్తలు చదవకుండా, వినకుండా ఉంటే ఏంతో ధైర్యంగా ఉందని అందుకే వార్తలు మానేస్తున్నామనే వారూ ఉన్నారు. ఆ రకంగా ప్రజలను భయపెడుతూ, ప్రభుత్వాల పట్ల తమ విశాల దృక్పథాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఉదాహరణకు స్మశానవాటికల్లో లైన్లలో ఉన్న శవాలను చూపుతూనే దానికి గల సహేతుక కారణాలను, అధిగమించడానికి పరిష్కారాలను కూడా చూపించాల్సిన బాధ్యతను విస్మరిస్తున్నాయి. మామూలు రోజుల్లో రోజువారీ మరణాలు, ప్రస్తుత మరణాల సంఖ్యలో పెరుగుదల ఉంటే ఉన్న వ్యత్యాసాన్ని వెలికితీయవచ్చు. సాధారణ స్థితిలో ఆసుపత్రుల నుంచి శవాలను కుటుంబ సభ్యులు తీసుకొని తమ కాలనీలు, గ్రామాలకు తీసుకెళ్లి దహన సంస్కారాలు నిర్వహించేవారు. కానీ, ఇప్పుడు మృత దేహాలను గతంలో లాగా కుటుంబ సభ్యులకు అప్పగించే ప్రోటోకాల్ లేదు. అందువల్ల హాస్పిటల్స్ లోను, స్మశానవాటికల్లోనూ శవాల కేంద్రీకరణ జరుగుతుంది. కాబట్టి శవాల లైన్లు, సామూహిక దహనాలు జరుగుతున్నాయి. ఈ దృశ్యాలు ప్రజలను సహజంగా భయకంపితులను చేస్తాయి. కానీ, వాటి వెనుక ఉన్న ఈ కారణాలను వెలికితీసి విశ్లేషణాత్మక, వాస్తవిక అంశాలను ప్రచారం చేయడం ద్వారా ప్రజల్లో నెలకొంటున్న భయాలను నివారించేందుకు కృషి చేయకుండా, మరింత పెంచే విధంగా పని చేయడం సామాజిక ద్రోహం. 1 శాతం కరోనా మరణ వార్తలకు ఇచ్చే ప్రాధాన్యత, 99 శాతం కరోనాను జయించిన వార్తలకు ఇవ్వకపోవడం పత్రికా ధర్మం కాదు. హాస్పిటల్స్ లో బెడ్ల కొరత, ఆక్సిజన్ కొరత, వాక్సిన్ల కొరత వంటి వార్తలు వాస్తవాలే అయినా ఇలాంటి వార్తలు ఆయా అంశాల పట్ల మరింత డిమాండ్ ను పెంచేందుకు దోహదం చేస్తున్నాయి. ఈ అంశాల దృష్ట్యా ప్రచారసాధనాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. అది నైతిక ధర్మం కూడా.

తక్షణ కర్తవ్యాలు

పెట్టుబడి ఆడుతున్న మృత్యుక్రీడలో దేశాలు, పాలకులు, ప్రజలు, డాక్టర్లు, మీడియా, శాస్త్రవేత్తలు అందరూ తమకు తెలియకుండానే పావులుగా నిలిచారు, నిలుస్తున్నారు. దీనంతటికీ అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది. ప్రజల్లో ఇప్పటికే పెంచిన భయాలను తగ్గించడానికి అవసరాలకు అనుగుణంగా వైద్య సేవలను పెంచాలి. బెడ్స్, వ్యాక్సిన్, వైద్యుల కొరతను అధిగమించడానికి ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్స్ ను, ఫార్మా కంపెనీలను, వైద్యులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం ప్రభుత్వాల ప్రథమ ప్రాధాన్యం అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. వ్యాక్సిన్ ఒక దివ్యౌషధంలా మార్చారు కాబట్టి ఉత్పత్తిని పెంచి ప్రతీ ఒక్కరికీ ఉచితంగా వ్యాక్సిన్ అందించాలి. కరోనా టెస్టులు, మందులు, ఆక్సిజన్ సరఫరా, హాస్పిటల్స్ లో పడకలు వంటి వాటి పర్యవేక్షణ, పరిష్కారాల కొరకు జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్యులు, సామాజిక కార్యకర్తలతో అధికారికంగా కమిటీలు ఏర్పాటు చేసి వాటిని అనుసంధానించాలి. వైద్య ఖర్చుల నియంత్రణకు, బ్లాక్ మార్కెట్ ను అడ్డుకోవడానికి విజిలెన్స్ ను పటిష్టం చేయాలి. సుప్రీంకోర్టు స్వయంగా జాతీయ స్థాయిలో టాస్క్ ఫోర్స్ ను ఏర్పరచిన విషయాన్ని గమనించాలి. అంతేకాకుండా ప్రస్తుత పరిస్థితి జాతీయ సంక్షోభం అని సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యను కూడా పరిగణనలోకి తీసుకొని జాతీయ సార్వత్రిక టీకా కార్యక్రమం క్రింద కోవిడ్ వ్యాక్సిన్ ను చేర్చి దేశ ప్రజలందరికీ నిరంతరం టీకా అందించాలి. అప్పుడే ఆర్టికల్ 14, 21ల ద్వారా రాజ్యాంగం హామీ ఇచ్చిన జీవించే హక్కు, సమనత్వపు హక్కులు కాపాడబడతాయి. దేశ అత్యున్నత న్యాయస్థానం కూడా కేంద్ర ప్రభుత్వానికి దీనినే సూచించింది. కోవిడ్ వ్యాక్సిన్ సార్వత్రిక టీకా కార్యక్రమం క్రిందకు తేనట్లైతే కోట్లాది మంది పేద, గ్రామీణ, ఆదివాసీ, గిరిజన వర్గాలు వ్యాక్సిన్ కు దూరమయ్యే అవకాశం ఉంది. కరోనా ఉధృతి పెరుగుతున్న క్రమంలో ఎన్నికల నిర్వహణ చేపట్టిన ఎన్నికల కమిషన్ పై హత్యానేరం కింద కేసు నమోదు చేయవచ్చునని, ఆక్సిజన్ కొరతతో మరణించడం అంటే అది మారణ హోమంతో సమానమంటూ చేసిన వ్యాఖ్యలు ఏ ప్రతిపక్షాలవో లేదా విప్లవ పక్షాలవో కావు. సాక్షాత్తు మద్రాస్, అలహాబాద్ హై కోర్టులు చేసిన ఘాటైన వ్యాఖ్యలు. న్యాయస్థానాల ఈ వ్యాఖ్యానాలు, సూచనలు ప్రభుత్వాల వైఫల్యాలకు తిరుగులేని సాక్ష్యం. ఇకనైనా ఈ పరిస్థితులను ఒక గుణపాఠంగా తీసుకొని దీర్ఘకాలంలో ప్రజల అవసరాలకు తగిన వైద్య సదుపాయాలను శాశ్వత ప్రాతిపదికన కల్పించాలి. అందుకోసం ప్రజల ఉద్రేకాలు, ఉద్వేగాలు రెచ్చగొట్టి రాజకీయ స్వార్ధానికి ఉపయోగించుకుంటున్న రక్షణ, ఆయుధాల కొనుగోలు కంటే విద్యా, వైద్య రంగాలకు ఎక్కువ కేటాయింపులు, ఖర్చు జరపాల్సి ఉందన్న వాస్తవం నగ్నంగా నిలబడింది. ఇవేవీ ప్రభుత్వాలు తమకు తాముగా చేసేవి కావు కనుక ఈ భయానక పరిస్థితుల పునాదిగా ప్రజలు ప్రశ్నించాలి, ఉద్యమించాలి. అన్నింటికంటే ముందు వైరస్ పేరుతో పేర్చిన భయాలను, అపోహలను బద్దలుకొట్టాలి. పాలకులు, వారి యజమానులు (కార్పొరేట్లు) పన్నుతున్న వ్యూహాలను ఎప్పటికప్పుడు ఛేదించాలి. కరోనా వైరస్ కంటే అతి వేగంగా వ్యాపిస్తూ, అమానవీయ పరిస్థితులను సృష్టిస్తున్న భయం అనే భయంకరమైన వైరస్ కు అడ్డుకట్ట వేయాలి. కరోనా వైరస్ మానవాళిని ఏమి చేయలేదు కానీ, మానవత్వం మీద చేస్తున్న దాడి, నష్టం మాత్రం పూడ్చుకోలేనిది. లాభాపేక్షతో పెట్టుబడి సృష్టించిన భయాలను పారద్రోలితే జరుగుతున్న ప్రాణ నష్టాన్ని పూర్తిగా నివారిస్తామనడంలో సందేహం ఉండనక్కర లేదు. ఇవి జరిగితే కల్లోలంతో పాటు కనక వర్షం కూడా నిలిచిపోతుంది. అప్పటికీ ప్రజలు మర్చిపోవాల్సింది కరోనా వైరస్ నే తప్ప అది ఎత్తిచూపిన లోపాలను, వైఫల్యాలను, నేర్పిన గుణపాఠాలను కాదు. భవిష్యత్ ఉద్యమాలకు అవే పునాది.

(రచయిత ఉపాధ్యాయులు, టిపిటిఎఫ్ జిల్లా కౌన్సిలర్, మహబూబాబాద్) వీ

సార్కెన్‌గూడ మారణకాండకు తొమ్మిదేళ్లు

పోలీసులు ఆదివాసుల సాంప్రదాయక విత్తనాల పండుగ ఉత్సవాల మీద దాడి చేసి పదిహేడు మంది ప్రాణాలు బలిగొన్న ఘటనను గుర్తు చేసుకుంటున్నారు **కురుసం శంకర్**

28 జూన్ 2021కి సార్కెన్‌గూడా నరసంహారానికి తొమ్మిదేళ్లు పూర్తయ్యాయి. సార్కెన్‌గూడా బీజాపుర్ జిల్లాలో ఒక ఆదివాసీ కుగ్రామం. ఇప్పటికీ ఆదివాసులు తమ గ్రామంలో ఏ పని మొదలుపెట్టాలన్నా సమష్టిగా ఒక నిర్ణయానికి వచ్చిన తరువాతే దానిని అమలుపరుస్తారు. సాధారణంగా ఇక దానిని ఎవరూ ఉల్లంఘించరు. మూలవాసీ ప్రజలు తరతరాలుగా వారి వ్యవసాయ పనులను ప్రారంభించడానికి ముందు 'విజ్జ పండుం' (విత్తనాల పండుగ) విధిగా అత్యంత భక్తి శ్రద్ధలతో పాటిస్తారు. తొలకరి ప్రారంభమైందంటేనే అన్ని గ్రామాలలో పండుగ వాతావరణం చోటుచేసుకుంటుంది. కానీ, 2012లో సార్కెన్‌గూడాలో ఆ రోజు అత్యంత విషాదం నెలకొంది. 2012, జూన్ 28 నాడు కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు చెందిన జవాన్లు గ్రామస్తులపై జరిపిన విచ్చలవిడి కాల్పుల్లో 17 మంది ఆదివాసీ ప్రజలు తమ ప్రాణాలను కోల్పోయారు. వారిలో మైనర్ పిల్లలు ఆరుగురున్నారు. వారందరి స్మృతిలో వేలాది మంది ప్రజలు 2021 జూన్ 28 నాడు విశాల బహిరంగ సభ జరిపి అమరులకు జోహార్లు అర్పించారు.

బస్తర్‌లో జరుగుతున్న పోలీసుల అత్యాచారాలకు, హత్యాకాండకు సార్కెన్‌గూడా మొదటిది కాదు, చివరిది కాలేదు. సార్కెన్ గూడా నెత్తుటి తడి ఆరకముందే ఆ పక్కనే అదే బీజాపుర్ జిల్లాలోని ఎడ్సుం అనే ఆదివాసీ గ్రామంలో అలాంటి మరో పండుగ రోజు అవే బలగాలకు చెందిన మరో యూనిట్ వారు జరిపిన విచ్చలవిడి కాల్పుల్లో అక్కడా అనేక మంది మూలవాసీ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ శతాబ్దంలో అలాంటి ఘటనలు ఎన్నో మా బస్తర్‌లో చోటు చేసుకున్నాయి. ఒక్క కోత్రపాల్ అనే గ్రామంలోనే ఈ దశాబ్ద కాలంలో దాదాపు 23 మంది మూలవాసీ ప్రజలు పోలీసుల హత్యాకాండలో అసువులు బాసారు. బస్తర్‌లో ప్రతి ఇంటికి ఒక వెత ఉంటుంది. మరణమో, అత్యాచారమో, జైలుకెల్లడమో, నిరపరాధులైనప్పటికీ పోలీసుల తప్పుడు ఆరోపణలతో కేసులకు నడుస్తుండడమో, పోలీసుల చేతిలో దెబ్బలు తినడమో, వారికి వెట్టి చాకిరీ చేసి పెట్టడమో, వారి జులుం, జబర్దస్తీ ఎదుర్కోలేక వారు అడిగినంత లంచం ఇచ్చుకోవడమో, ఆస్తులను కోల్పోవడమో, అప్పులకు దూరమవడమో ఇలా రాస్తూ పోతే అనేక రకాలుగా పోలీసుల వేధింపులకు గురికాని కడప కానరాదు. సార్కె గూడా ప్రజా సభకు హాజరైన విశ్రాంత ప్రొఫెసర్, సామాజిక కార్యకర్త నందినీ సుందర్ అక్షరబద్ధం చేసిన 'బర్నింగ్ ఫారెస్ట్' పుస్తకం చదివితే మూలవాసులపై చోటుచేసుకుంటున్న రాజ్యహింస తెలుస్తుంది.

అందుకే మా బస్తర్ మూలవాసీ ప్రజలు పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా జీవన్మరణ పోరాటం చేస్తున్నారు. ఒక్క బస్తరే కాదు యావత్ దండకారణ్య మూలవాసీ ప్రజల జీవన్మరణ సమస్యగా మారిన సమస్య ఇది. వాస్తవంగా ఇది దేశ వ్యాప్త మూలవాసుల సమస్యగా పరిణమించింది. ఇటీవలే జూన్ 12 నాడు ఝార్ఖండ్ రాష్ట్రంలోని లాతేహార్ జిల్లాలో గారూ పోలీస్ స్టేషన్ పరిధిలోగల కుకు-పిరి అడవిలో మావోయిస్టులతో కాల్పులు జరిగాయంటూ పిరి గ్రామస్థుడైన 24 ఏళ్ల యువకుడు బ్రహ్మదేవ్ సింగ్‌ను పోలీసులు హత్యచేశారనీ ఝార్ఖండ్ జన్ అధికార్ మంచ్ తన నిజనిర్ధారణ నివేదికలో స్పష్టం చేసింది. అడవులలోని మూలవాసీ ప్రజలపై కాల్పులు జరపడం, వారి ప్రాణాలను బలిగొనడం ఆ తరువాత వారు మావోయిస్టులని ప్రకటించడం ఈ దేశ పోలీసులకు పరిపాటైంది. కానీ, అలాంటి పోలీసులపై హత్యానేరం కింద కేసు చేయాలనీ ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం గతంలోనే స్పష్టం చేసింది. కానీ అది ఎక్కడా అమలులోకే రాలేదు.

గత 66 రోజులుగా బీజాపుర్ జిల్లా సిల్గేర్ గ్రామ ప్రజలు అక్కడ నెలకొల్పిన పోలీసు క్యాంపుకు వ్యతిరేకంగా న్యాయబద్ధంగా పోరాడుతున్నారు. ఆ పోరాటంలో ఒక గర్భిణీ మహిళా సహ నలుగురు మూలవాసీ ప్రజలు పోలీసు కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు. అయినప్పటికీ వారి పోరాటం కొనసాగుతూనే ఉంది. వారికి అండగా దేశవ్యాప్త మూలవాసీ ప్రజలు, ప్రజా సంఘాలు, ఆదివాసీ శ్రేయోభిలాషులు, ప్రజాస్వామిక మేధావులు, పాత్రికేయులు, దేశభక్త శక్తులు నిలిచాయి. ఈ ఆపత్కాలంలో ముంబాయిలోని తలోజా జైలులో భారత నిఘా సంస్థల, పోలీసుల, న్యాయస్థానాల, హిందుత్వ శక్తుల కుట్రలు కుహకాలకు ఫాదర్ స్టాన్ స్వామి బలికావడం ఎనలేని లోటుగా మిగిలింది. ఆయన దాదాపు గత మూడు దశాబ్దాలుగా మూలవాసీ ప్రజల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్నాడు. ఆయన సేవలు మూలవాసీ ప్రజలకే పరిమితం కాలేదు. ఆయన గత కొద్ది సంవత్సరాలుగా శిక్షపడిన ఖైదీల సత్వర విడుదల కోసం ఏర్పడిన కమిటీకి కన్వీనర్‌గా కొనసాగుతున్నాడు. అలాంటి గొప్ప వ్యక్తి ఈనాడు మనకు లేడు. ఆ మహనీయుడికి వినమ్రంగా 'జై సేవా' 'జై జోహార్' అంటూ పీడితులమంతా శ్రద్ధాంజలి అర్పిద్దాం. ఆయనతో పాటు ఇంకా మరికొంత మంది ప్రజాహిత శక్తులు ఆ జైలులోనే మూడేళ్లుగా మగ్గుతున్నారు. వారి గురించి ఎప్పుడు ఏ దుర్వార్త వినాల్సివస్తుందోననీ పోరాట ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వారిని విడిపించుకోవడానికి పోరాడాలనీ ప్రతిన బూనుతున్నారు.

సిల్గేర్ చారిత్రిక ప్రజా పోరాటాన్ని నీరుగార్చడానికి ఛత్తీస్‌గఢ్ పోలీసులు, ప్రభుత్వాధికారులు, బూటకపు ఆదివాసీ నాయకులు, సంఘాలు అనేక విధాలుగా దుష్ట ప్రయత్నాలను కొనసాగిస్తున్నాయి. సిల్గేర్ ప్రజా ఉద్యమం నుండి ఆవిర్భవించిన మూలవాసీ బచావ్ మంచ్ రాష్ట్ర ముఖ్యమంత్రితో దృశ్య మాధ్యమం ద్వారా చర్చలు జరిపిన

సందర్భంలో ఆయన వారికి అనేక హామీలిచ్చాడు. సిల్గేర్ కాల్పులలో ప్రాణాలు కోల్పోయిన వారి విషయంలో విచారాన్ని వ్యక్తం చేసి మెజిస్టీరియల్ విచారణ కొనసాగుతోందనీ, నివేదిక అందిన వెంటనే దోషులను శిక్షిస్తామనీ నమ్మబలికాడు. కానీ, ఇప్పటికీ నెల రోజులు దాటినప్పటికీ ఆయన హామీలలో ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదు. పైగా ఆయన సార్కెన్‌గూడా సభ సందర్భంగా నిజమైనా ఆదివాసుల అభివృద్ధికి తన ప్రభుత్వమే పాటు పడుతోందనీ, జల్ జంగల్ జమీన్ తన ప్రభుత్వం ద్వారానే ఆదివాసులకు చెందుతుందనీ మావోయిస్టులు వారి శతృవులనీ వారు కేవలం నినాదాల ద్వార ఆదివాసులను మోసపుచ్చుతున్నారనీ అసత్య ఆరోపణలు అనేకం చేశాడు.

వాస్తవానికి ఆయన అసందర్భంగానే మావోయిస్టుల ప్రస్తావన ఎత్తుకున్నాడు. అది కేవలం ప్రజలను పక్కదారి పట్టించడం తప్ప మరేం కాదు. ప్రజలకు ఎవరు శతృవులు ఎవరు మిత్రులు అనేది వారికి తెలువనిది ఏం కాదు. మేమే మీకు మిత్రులం అన్నంత మాత్రాన ప్రభుత్వాలను నమ్మే అమాయకపు స్థితిలో మూలవాసులే ఉంటే గత నాలుగు దశాబ్దాలుగా వారు అడవులలో తమతో తమ పిల్లలను కలుపుకొని సహజీవనం చేస్తున్న మావోయిస్టులను ప్రజా మిత్రులుగా భావించేవారే కాదు. నిజానికి ఆ సందర్భంగా ముఖ్యమంత్రి దివాళాకోరు రాజకీయాలను వదలి 2012 నాటి సార్కెన్‌గూడా మృతుల విషయంలో ఏడేళ్ల తరువాత వెలువడిన ప్రభుత్వ నివేదికపై మాట్లాడాల్సి ఉండింది. ఆ నివేదిక వెలువడి రెండేళ్లు దాటుతున్నప్పటికీ ప్రభుత్వం దానిపై ఏ చర్య తీసుకుందో నిజాయితీగా ప్రజలకు బాధ్యతగా వివరించాల్సి ఉండింది. ఆ నివేదికలో చాలా స్పష్టంగా పోలీసులు ప్రజలపై కాల్పులు జరిపారనీ, అక్కడ మావోయిస్టులు ఎవరూ లేరనీ చనిపోయిన వారు మావోయిస్టులు కారనీ వారంతా గ్రామస్తులేననీ వివరించారు. దానిపై మౌనం వహించిన ముఖ్యమంత్రి ప్రజలకు శతృవులు ఎవరో చెప్పబూనుకోవడం ఆయన మతిలేనితనాన్నే చాటుతుంది. ఇంకా చెప్పాలంటే ఆనాడు ముఖ్యమంత్రిగారి పార్టీ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండింది. సార్కెన్ గూడా హత్యాకాండ జరిగిన వెంటనే ప్రస్తుత అబ్కారీ మంత్రి మా లక్మా దాదీ ఉరుకులు పరుగుల మీద ఘటనా స్థలానికి చేరి న్యాయ విచారణ కోరిన సంగతి ముఖ్యమంత్రి గుర్తుకు తెచ్చుకోవలసింది. లక్మాదాదీకి ఇపుడు ఇంటింటికి సారా చేరవేయడంపై ఉన్న ఆరాటం తన నియోజకవర్గ ప్రజల పట్ల లేకపోవడం ఎన్నికల రాజకీయాలలో ఆయన భవిష్యత్తును పరీక్షకు పెడుతుంది.

రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్డ్ ప్రాంతాలలో గ్రామ సభల అనుమతి లేకుండా అడవులలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టకూడదు. గ్రామసభల అనుమతి లేకుండా అడవులలోకీ ఆదివాసీ గూడాలలోకీ పోలీసులు, ప్రభుత్వ అధికారులు సహ బయటివారు ప్రవేశించడం చట్ట రీత్యా నేరమవుతుంది. అలాగే ఇతర ప్రాంతాలలో అయితే, అక్కడి పంచాయతీ ప్రతినిధులకు తెలుపకుండా గాలింపు చర్యలు చేయడం నేరమవుతుంది. దీనిని పట్టించుకోకుండా అతి దుర్మార్గంగా ఉల్లంఘిస్తూ పోలీసులు అడవులలో గాలింపులు జరుపుతున్నారు. మావోయిస్టుల నెపంతో ఆదివాసులను కాల్చి చంపుతున్నారు. ఈ చర్యలను ఖండించడం పోయి కొన్ని ఆదివాసీ సంఘాలు బయటి ప్రాంతాల నుండి అడవి గ్రామాలలోకి, మూలవాసీ ప్రజల మధ్యకు వచ్చి క్యాంపులు వేసిన భారత భద్రతా బలగాల వారికి స్థానిక మూలవాసీ ప్రజల భాషా, ఆచార సాంప్రదాయాలు, సంస్కృతి గురించి ఎంత మాత్రం తెలియకపోవడంతో సార్కెన్‌గూడా నరసంహారం లాంటివి చోటు చేసుకుంటున్నాయంటూ మాట్లాడడం ప్రజలపై వారు విచ్చలవిడిగా జరిపిన కాల్పులకు సాధికారతను కల్పించడమే అవుతుంది. ఇలాంటి వాదనలను నిర్ద్వందంగా ఖండించాలి. ప్రభుత్వం రూపొందించిన పెసా, గ్రామ సభల విధి విధానాలను పోలీసులు, ప్రభుత్వ అధికారులు కచ్చితంగా పాటించాలి.

సార్కెన్‌గూడానే కాదు ఇంకా అనేక పోలీసుల అత్యాచారాల ఘటనలపై ప్రభుత్వ నివేదికలు వెలువడి ఉన్నాయి. ఉదాహరణకు టిఎంటిడిగా ప్రాచుర్యంలోకి వచ్చిన తాడిమెట్ల, మోరపల్లి, తింపురం గ్రామాలలోని 90 మంది మూలవాసీ ప్రజల ఇండ్లు తగులపెట్టిన కేసులో పోలీసులే నిందితులనీ 2016లోనే ప్రభుత్వ నివేదిక వెలువడింది. ఈ ఘటనపై కూడ మీ పార్టీ ప్రతిపక్ష హోదాలో ఆనాడు న్యాయ విచారణను కోరిందన్న విషయాన్ని గుర్తుకు తెచ్చుకుంటే ప్రజలకు మీరు ఏపాటి మిత్రులో వారి ముందు నిలబడితే తేల్చిచెపుతారు. ఆ నివేదిక వెలువడిన మరుక్షణమే అప్పటి పోలీసు అధికారి ఎస్ఆర్ కల్లూరీ ఆ దహనకాండకు తానే బాధ్యత వహిస్తున్నానని కూడ బహిరంగంగా ప్రకటించి విసిరిన సవాళ్లకు ఆయన్ని ఏ సర్కార్ ఏం చేసిందో? పైగా వర్తమాన ముఖ్యమంత్రి అధికారాన్ని చేపట్టిన వెంటనే ఆ పోలీసు అధికారికి అప్పగించిన బాధ్యతలపై ప్రతిపక్ష భారతీయ జనతా పార్టీ అభ్యంతరం తెలిపితే 'గుర్రం ముఖ్యం కాదు గుర్రాన్ని నడిపే రౌతు ప్రధానం' అనే స్వోత్కర్షతో వ్యంగ్యోక్తి విసిరి దాటవేసిన వారు ప్రజలకు మిత్రులో శతృవులో సందర్భం వచ్చినపుడు ప్రజలే తెలియచేస్తారు.

కాంగ్రెస్ ప్రతిపక్షంగా ఉన్న కాలంలో 2017 ప్రారంభంలో బుడిగిని, గెల్లూరు, పెగడపల్లి తదితర అనేక గ్రామాలపై బడి దాదాపు 40 మందికి పైగా మహిళలపై పోలీసులు అత్యాచారానికి పాల్పడిన కేసులో పోలీసుల దుశ్చర్యను తీవ్రంగా ఖండించి ప్రభుత్వం నిజనిర్ధారణ జరుపాలనీ కోరింది. ఆ కేసులో ఎన్‌హెచ్ఆర్‌సి పోలీసులను తప్పు పట్టి పీడిత మహిళలకు నష్టపరిహారంగా డబ్బు చెల్లించాలని చెప్పిన విషయం లోకవిదితమే. ఎన్‌హెచ్ఆర్‌సిలో ఉండేవారంతా ఐపిఎస్ అధికారులేగా, అదేమీ మీరు ఆరోపిస్తున్నట్టు మావోయిస్టుల అనుబంధ సంఘం కాదే! అదే దోషులు పోలీసులని చెప్పింది వాస్తవం కాదా! కానీ, ఇప్పటి వరకు ఏ కేసులో ఏ ఒక్క దోషి పోలీసును కానీ, పోలీసు అధికారిని గానీ ఏ ప్రభుత్వమైనా శిక్షించిందా? లేదు. ఈ విషయం ప్రజల మనసుల నుండి ఎవరు చెరిపివేయగలరు! ఈ దుశ్చర్యలకు పాల్పడిన వారు, వారిని కాపాడుతున్న ప్రభుత్వాలు ప్రజలకు మిత్రులా, శతృవులా ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమే లేదు. ఈ రోజు దండకారణ్యంలో ప్రత్యేకించి బస్తర్‌లో వేలాది మంది ప్రజలు తమ అడవులలో, తమ గ్రామాలలో, తమ మధ్య ఖాకీలు ఉండకూడదనీ తమ చేదు అనుభవాల నుండి నినదిస్తున్నారు.

ముఖ్యమంత్రి బఘేల్ తమ ప్రభుత్వం ఆదివాసులకు 'జల్ జంగల్ జమీన్' సమకూరుస్తున్నదనీ నిస్సిగ్గుగా ప్రకటించాడు. ఇది ఎంత వాస్తవ విరుద్ధమో 2019 ఫిబ్రవరి రెండవ వారంలో సుప్రీం కోర్టు ఆదివాసీ ప్రజా వ్యతిరేక తీర్పు వెలువరించిన నాటికి దేశంలో పెసా లేద షెడ్యూల్డ్ తెగల, ఇతర అటవీ వాసుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం (నూతన అటవీ చట్టం) – 2006 ప్రకారం భూములు లభించని ఆదివాసీ ప్రజలు

ఛత్తీస్‌గఢ్‌లోనే అత్యధికం అనే గణాంకాలకు బఘేలే జవాబు చెప్పాలి. వాస్తవంగా ముఖ్యమంత్రికి అడవులపై ఆదివాసులకు భారత ప్రభుత్వం రూపొందించిన చట్ట ప్రకారమే అధికారం ఇచ్చే సత్తానే ఉంటే ఇవాళ సార్కెన్‌గూడాలో వేలాది మంది ప్రజల కంఠనాధాలు తమకు గ్రామ సభలు కావాలనీ, తమ భూములకు పట్టాలు కావాలనీ జల్ జంగల్ జమీన్‌పై తమదే అధికారమనీ నినదించారు ఎందుకు? 2019లో నారాయణపుర్ రెవెన్యూ డివిజనల్ అధికారి గ్రామసభల నిర్మాణ నమూనాను విడుదల చేసి చేతులు దులుపుకున్నాడే తప్ప ఏ ఒక్క ఆదివాసీ గ్రామంలో గ్రామసభ నిర్మించలేదు. బస్తర్‌లో ఎన్ని గ్రామాలలో మూల పెసా చట్ట ప్రకారంగా గ్రామసభల నిర్మాణం జరిగిందో ముఖ్యమంత్రి వివరించగలడా! మీడియా తమ చేతిలో ఉందని ప్రజల ముందు అబద్దాలు, అర్థసత్యాలు ప్రచారం చేయడం పాలకులకు వెన్నతో పెట్టిన విద్యే.

మీరు పెసా ప్రకారం గ్రామసభలు నిర్మించడం లేదు, ప్రజలకు ఆ అధికారాన్ని ఇవ్వడం లేదు. దాని ఫలితంగా ఇవాళ మాడ్ సహ అనేక ప్రాంతాలలోని మూలవాసీ ప్రజలు తమకు 6వ షెడ్యూల్ ప్రకారం స్వయం పాలన కావాలనీ నినదిస్తున్నారు. 'మాడ్ బచావో', 'బస్తర్ బచావో' అంటూ మూలవాసీ ప్రజలు ముందుకు వస్తున్నారు. వారికి అండగా మాజీ కేంద్ర మంత్రి అరవింద్ నైతాం లాంటి వాళ్లు అనేకం నిలబడుతున్నారంటే, వారికి బస్తర్‌లో గ్రామసభలు ఏర్పడలేదని తెలిసే ప్రజల పక్షాన నిలిచారనీ ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరమే లేదు. తమకు గ్రామసభలు కావాలనీ చట్ట ప్రకారం డిమాండ్ చేస్తే ఝార్ఖండ్‌లోని ఖుంతీ జిల్లాలో పదివేల మంది మూలవాసులపై గద్దెదిగిన భాజపా సర్కార్ కాలం చెల్లిన రాజద్రోహం కేసు పెట్టిన విషయం, ఛత్తీస్‌గఢ్ లోని భాజపా రమన్‌సింగ్ ప్రభుత్వం వారిని మావోయిస్టులుగా పేర్కొని సమస్యను పక్కదారి పట్టించిన విషయం ఏ మూలవాసీ మరిచిపోలేదు.

జల్ జంగల్ జమీన్‌పై మూలవాసులకు అధికారం ప్రభుత్వాలు ఇవ్వడం లేదు కానీ, భారీ పోలీసు బందోబస్తుతో 6 లేన్ల, 8 లేన్ల రోడ్ల నిర్మాణం చేస్తూ ప్రకృతి వనరుల తరలింపుకు పెంపర్లాడుతున్నారనడానికి సిల్గేర్‌లో పెట్టిన క్యాంపే ఒక పెద్ద ఉదాహరణ. అది జగర్‌గుండా, చింతల్నార్ రోడ్డు నిర్మాణం కోసం ఏర్పర్చినదే కదా!

బస్తర్ నడిబొడ్డును చీలుస్తూ పోతున్న నేషనల్ హైవే నంబర్ 16 నిర్మాణంలో ఎంత రక్తం పారిందో ఎందుకు పారిందో పాలకులు దాచినా ప్రజలకు సుబోధితమే. పాలకులు అబద్దాలతో ఎల్లకాలం ప్రజలను వంచించలేరనీ సిల్గేర్, కడియమెట్ట, ఆముదాయి, పోటాలీ, గంగాలూర్, బర్రెగూడెం, నాహెడ్ తదితర వందలాది గ్రామాల ప్రజలు పోలీసు క్యాంపుల నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి చేస్తున్న పోరాటాలే చాటుతున్నాయి.

సిల్గేర్ ప్రజా పోరాటం బద్ధలైన నాటి నుండి దానిని విఫలం చేయడానికి పోలీసులు కరోనా మంత్రాన్ని జపిస్తునే ఉన్నారు. ప్రజలు జమ అవుతున్న ప్రతి సందర్భంలో ఖాకీలకు కరోనా గర్తుకు వస్తున్నది. కానీ, సిల్గేర్‌లో కొత్తగా పోలీసు క్యాంపు పెడుతుండగా కరోనా సోయి లేని పోలీసులు ప్రజలను రోడ్ల మీదికి తెచ్చి ఇపుడు కరోనా సంక్రమిస్తుందనీ హెచ్చరించడాన్ని ప్రజలు మాత్రం తీవ్రంగా ఖండిస్తున్నారు. తుదకు సార్కెన్‌గూడాలో ఇద్దరు రైతులు పాముకాటుకు గురి కాగ, కుందేడ్ గ్రామానికి చెందిన ఉయిక పొదియా (52) అనే రైతు మరణించాడు. ఆయన శవాన్ని సభ నిర్వాహకులు ఇంటికి చేర్చారు. కానీ, పోలీసులు ఆ రైతు శవాన్ని స్వాధీనం చేసుకొని స్వాబ్ టెస్ట్‌లో కరోనా పాజిటివ్‌గా బయటపడిందని ప్రకటించారు. కానీ, ఇది పూర్తిగా అబద్ధం. వేలాది ప్రజల సమక్షంలో పాముకాటుతో మరణించిన రైతుకు స్వాబ్ టెస్టులో కరోనా పాజిటివ్ బయటపడిందని పోలీసులు తప్పుడు ప్రచారం చేస్తూ సార్కెన్ గూడా ప్రజా సభను అప్రతిష్టపాలు చేయపూనుకున్నారు.

నిజానికి కరోనా డెల్టా వేరియంట్ అత్యంత తీవ్రంగా దాడిచేసి దేశవ్యాప్తంగా లక్షలాది ప్రజల ప్రాణాలను బలిగొంది. వారణాసి నుండి దావోస్ వరకు దేశ విదేశాలలో కరోనాను మేం జయించామనీ జనంతో చప్పట్లు కొట్టించిన, కొవ్వొత్తులు వెలిగిపించిన, బోనాలలో మహాంకాళికి పబ్బం పడుతున్న బ్రాహ్మణవాద శక్తులు ముఖ్యంగా దేశ ప్రధాని ఎంతో గొప్పలు చెప్పుకున్నాడు. ఆత్మనిర్భర్ భారత్ అంటూ జబ్బలు చరచుకున్నాడు. శాస్త్రవేత్తల హెచ్చరికలను కోవిడ్ ప్రొటోకాల్‌ను మూర్ఖంగా నిర్లక్ష్యం చేశాడు.

దేశంలో అత్యున్నత సంస్థ 'టాస్క్ ఫోర్స్ ఆన్ కోవిడ్-19' 2021 జనవరి 11 తరువాత కనీసం మూడు మాసాలు సమావేశం కూడ కాలేదు. దేశంలో మరణాలతో ప్రజలు విలవిలలాడుతుంటే ప్రవర్తనా నియమావళినైనా పట్టించుకోలేదు. 56 ఇంచుల ప్రధానికి దేశంలో ప్రాణాలు కోల్పోతున్న ప్రజల వివరాలైనా దాపరికం లేకుండా ప్రకటించే దమ్ములేకుండా పోయాయనీ మే చివరి వారంలో విడుదలైన న్యూయార్క్ టైమ్స్ నివేదిక ద్వార వెల్లడవుతోంది. భారత ప్రభుత్వం ప్రకటిస్తున్న మరణాల కన్నా ఐదు రెట్లు అధిక మరణాలు జరిగి ఉంటాయనీ అది తెలిపింది. వాటికి కారకులెవరు? దేశం కొరోనా మహమ్మారితో తల్లడిల్లుతుంటే ఐదు రాష్ట్రాలలో ఎన్నికల బరిలోకి దిగడం, కుంబమేళాలకు శంఖమూదడం, పంచాయతీ ఎన్నికలు, క్రికెట్ మ్యాచ్‌లు పోలీసులకు కానరావు. కానీ, దిల్లీలో రైతుల ప్రదర్శనలను నిలువరించ డానికి, సిల్గేర్‌లో క్యాంపు వ్యతిరేక ప్రజా పోరాటాన్ని ఆపడానికి కరోనా గుర్తొస్తున్నది.

గత కొద్ది రోజులుగా బీజాపూర్, దంతెవాడ, సుక్మా జిల్లాలు సహ బస్తర్ డివిజన్ అంతటా గ్రామ గ్రామాన కరోనా ప్రవర్తనా నియమావళి అమలు, టీకాకరణ గురించి విస్తృతమైన ప్రజా ప్రచార కేంపెయిన్ జరుగుతోంది. వారు దీర్ఘకాలిక పోరాటాలకు సిద్ధమవుతున్నారు కాబట్టి ఇక కరోనాతో సహజీవనం చేస్తూనే ఈ కుళ్లు వ్యవస్థలో ప్రజా సమస్యలపై పోరాడక తప్పదని ప్రజలలో కరోనా జాగరూకత కేంపెయిన్ చేపట్టారు. నిద్రలో సైతం మావోయిస్టులను నిందించే పోలీసులకు ఈ సోయి ఉంటే ఎంత బాగుండు!

సార్కెన్‌గూడాలో మృతవీరుల తొమ్మిదవ వార్షికానికి హాజరైన వేలాది మంది ప్రజలు వారికి నాయకత్వం వహించిన 'మూలవాసీ బచావో మంచ్' ఇచ్చిన పిలుపుకు అండగా రానున్న ఆగస్టు 9 'విశ్వ మూలవాసీ దినాన్ని' మూలవాసులపై రాజ్యహింసా వ్యతిరేక దినంగా పాటించాల్సిన అవసరం ఉంది. 'బస్తర్ మే నరసంహార్ బంద్ కరో' ఇది ఒక రణ నినాదంగా నిల్చిన నేడు, ఆ ప్రజల పక్షాన మూల వాసులంతా నిలవాలి. నిజానికి ఇది ఒక బస్తర్ మూలవాసుల సమస్యే ఎంతమాత్రం కాదు. దేశంలోని సమస్త మూలవాసుల సమస్య. 2019లో సుప్రీం కోర్టు అడవుల నుండి ఆదివాసులను సాగు భూములకు పట్టాలు లేవనే పేరుతో

తరిమివేయాలని ఇచ్చిన ఆదేశం ఇప్పటికీ పూర్తిగా రద్దు కాలేదు.

దానిపై తాత్కాలిక స్టే మాత్రమే కొనసాగుతోంది. మూలవాసీ ప్రజలు దేశ అత్యున్నత న్యాయస్థానం, పదిహేనేళ్లు దాటినా ప్రభుత్వ చట్టాన్ని అమలు చేయలేదెందుకనీ ప్రభుత్వాలను ప్రశ్నిస్తుందనుకున్నారు. కానీ అది పూర్తిగా అందుకు భిన్నంగా మూలవాసులనే తమ అడవుల నుండి గెంటెయ్యాలనే ఆదేశాలు ఇవ్వడంతో అది తన దోపిడీ వర్గ స్వభావాన్ని చాటుకుంది. షెడ్యూల్డ్ తెగల, జాతుల అత్యాచార నిరోధక చట్టాన్ని నీరు కార్చిన ఆ కోర్టు, బాబ్రీ మసీదు విధ్వంసం కేసులో రామభక్తులకు అండగా నిల్చిన సుప్రీం కోర్టు మా ఆదివాసులకు న్యాయం చేసి చట్టాన్ని అమలు చేయ మంటుందనుకోవడం మా భ్రమగానే తేలిపోయింది. ఆ కోర్టు ఆదేశం దేశవ్యాప్తంగా దాదాపు 20 లక్షల ఆదివాసుల జీవితాలపై గొడ్డలి పెట్టు పెట్టనుంది.

దేశంలోకి ప్రవహిస్తున్న ఎఫ్‌డిఐలకు ఎప్పటికైనా నారుమడిలాంటి ప్రాంతాలు ఆదివాసీ ప్రాంతాలే. అపార ప్రాకృతిక వనరులకు నిలయాలైన దేశ సుసంపన్నమైన అడవులను తమ కైవశం చేసుకోవడానికి కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలు చేస్తున్న కుట్రలను, దాడులను ఓడించకుండా ఈ దేశంలోని మూలవాసీ ప్రజల అస్తిత్వమే మిగలదు. రాష్ట్రాల పోలీసుల, కేంద్ర పోలీసుల దుశ్చర్యలను ధైర్యంగా ఎదుర్కోకుండా ఆదివాసీ ప్రజలు కోరుకుంటున్న డిగ్నిటీకే అర్థం ఉండదు.

నిజానికి ఏ బూర్జువా రాజకీయ నాయకుడు, ఏ ప్రభుత్వాధికారి తమ దేశ ప్రజలకు వాస్తవాలను ఎన్నటికీ వెల్లడించరు. బస్తర్ వ్యాప్తంగా వేలాది పోలీసులను మొహరించింది ఎందుకు? బస్తర్‌లో ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా అతి విశాలమైన రోడ్ల నిర్మాణం చేస్తున్నది ఎందుకు? బస్తర్‌ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతూ చేస్తున్న అతి విలాసవంతమైన రిసార్టుల నిర్మాణం ఎవరి కోసం? ప్రబల ఆదివాసీ ప్రాంతమైన బస్తర్‌లో పిల్లలకు మాతృభాషలో విద్య కరువైనచోట, పదవ తరగతి చేరేసరికే 20 శాతం డ్రాపవుట్లు ఉంటున్నచోట ఎడ్యుకేషన్ హట్లు ఎవరిని ఉద్ధరించడానికి?

ఇప్పటికీ అనేక గ్రామాల ప్రజలకు కనీస ఆసుపత్రి సౌకర్యం లేకుండా స్వల్ప అనారోగ్యాలతో, అతి సాధారణ జబ్బులతో ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే పట్టించుకోని ప్రభుత్వాలు పోలీసు క్యాంపులు కూచోపెడుతూ, వారి దయతో సివిక్ ఆక్షన్ ప్రోగ్రాంలు నిర్వహిస్తూ ప్రజలను ముష్టివాళ్లుగా తయారుచేయడమెందుకు? బస్తర్ అభివృద్ధి అంటూ బైలాదిల్లా గనుల తవ్వకాలు మొదలు పెట్టి ముడి పదార్థాల రవాణా కోసం రైల్వే లైన్లను నిర్మించి బస్తర్ స్థానిక ప్రజలను 'కార్పొరేట్ సామాజిక అభివృద్ధి' (సి.ఎస్.ఆర్) నిధులకు బలిపెట్టి చేసిన అభివృద్ధి ఎంతో ఇక్కడ కలెక్టర్‌గా పనిచేసిన బ్రహ్మదేవ్ శర్మగారు రాసిన 'బైలదిల్లాలో దగాపడిన చెల్లెలు' చదివితే తేటతెల్లమవుతుంది. ఇవాళ మా మూలవాసీ ప్రజలు రోడ్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, సంతలు మున్నగునవన్నీ కావాలంటున్నారు. కానీ తన బ్రాహ్మణవాద చాణక్యంతో దేశంలో మూలవాసులే లేరంటూ ఐక్యరాజ్య సమితినే దబాయించి మోసం చేసిన కేంద్ర ప్రభుత్వం నుండి ఇవన్నీ ఆశించ తగునా! దోషులను శిక్షించని ప్రభుత్వాలు, చట్టాలను అమలు చేయని పాలకులు ప్రజలకు మేలు చేయరనే చరిత్ర చాటుతోంది. అందుకే ప్రజలు పోరాటాలలోకి దిగక తప్పడం లేదు.

ఏ బస్తర్ ప్రజల కోసం ఫాసిస్టు సల్వాజుడుం (2005-09)ను ప్రారంభించారు? ఆ శ్వేత భీభత్సకాండలో బస్తర్ ప్రజలను మూడు ముక్కలు చేసి పరాయీకరణకు బలి చేశారు. ఆ తరువాత ఓ పదేళ్లు (2009-17) గ్రీన్‌హంట్ అన్నారు. గత నాలుగేళ్లుగా సమాధాన్ అంటున్నారు. ఇవన్నీ బస్తర్ మూలవాసీ ప్రజల కోసమేనా! అబద్దాలతో అసత్యాలతో ప్రజలను మోసగించడంలో అందెవేసిన పాలకులు వాస్తవాలను ఎన్నటికీ ప్రజలకు చెప్పరు. చెప్పలేరు.

గత ఇరువై ఏళ్లకు పైగా ఇక్కడి ప్రజల మీద అత్యంత ఫాసిస్టు పద్ధతులలో సైనిక దాడులకు పాల్పడుతున్నారు. వాటి సాధికారత కోసం మీ అభివృద్ధి జపం తప్ప ప్రజల మేలుకోరి మాత్రం కాదు. భారతదేశ నడిబొడ్డున ప్రజా పోరాటాల చరిత్రలో తొలిసారిగా 2021 ఏప్రిల్ 19 నాడు డ్రోన్ దాడులు ప్రారంభించారు. ఇవి ఎవరిని మట్టుబెట్టడానికి? బొత్తలంక పాలోడు గ్రామాల ప్రజలను లక్ష్యంగా చేసుకొని 12 బాంబులు వేశారు. అదృష్టవశాత్తు ఆ దాడులలో ప్రజల ప్రాణ నష్టం జరుగలేదు.

కేంద్ర, రాష్ట్ర పాలకులు జపిస్తున్న ఏకైక మంత్రం మావోయిస్టుల నిర్మూలన. నిర్ణీత గడువులో ఆ లక్ష్యాన్ని సాధించడానికి ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక చర్యలన్నింటికీ అభివృద్ధి ముసుగు తొడగడాన్ని ప్రజలు ఇంకెంతో కాలం భరించలేరని సిల్గేర్ ప్రజా పోరాటం, సార్కెన్‌గూడా ప్రజా సమీకరణ తిరుగులేని విధంగా ప్రకటిస్తున్నది. వారు చట్టబద్ధ పాలనను కోరుకుంటున్నారు. వారు భారత రాజ్యాంగం ప్రకారం తమకు అన్ని హక్కులు చెందాలంటున్నారు. వారిపై దాడులకు దిగే ఖాకీ మూకలపై చట్టబద్ధ చర్యలు చేపట్టాలని నినదిస్తున్నారు. దోషులు నిర్దోషులుగా పీడితుల మధ్య తిరుగకూడదనీ, పదే పదే తమ దాష్టీకాలకు ప్రజలను బలి చేయకూడదనీ వారు హెచ్చరిస్తున్నారు.

ప్రజలకు తిరుగుబాటు మార్గాన్ని చూపిస్తున్నది పాలకులేనని నిస్సందేహంగా చెప్పవచ్చు. పాయికా (పరాయివారు) అంటేనే అమడ దూరం పరుగు తీసే మా మూలవాసీ ప్రజలను కమాండో బలగాలతో, కేంద్ర సాయుధ పోలీసు బలగాలను నిలదీసే విధంగా తయారు చేస్తున్నదెవరు? రాజ్యాంగబద్ధంగా తమ హక్కుల కోసం వీధులలోకి వచ్చేలా చేస్తున్న పాలకులు ఇంకెంతో కాలం ప్రజలను వంచించలేరు.

(రచయిత మూలవాసీ స్వాభిమాన్ మంచ్ కార్యకర్త) వీ

వచ్చే సంచికల్లో

- కృష్ణా జలాల పునఃపంపిణీయే పరిష్కారం - ఎం. రాఘవాచారి
- ఫాసిస్టు రాజకీయాలకు అద్దం పట్టిన పుస్తకం - కేశవ్
- ప్రైవేటైజేషన్‌తో రిజర్వేషన్‌లు హుళక్కే - తండా సదానందం
- పెట్టుబడిదారీ వ్యవస్థే హింసాత్మక అవరోధం - యానిస్ ఇక్బాల్

పచ్చని గ్రామీణ వ్యవస్థతోనే ప్రగతి సాధ్యం

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి వ్యవసాయం, పరిశ్రమలపై ప్రభుత్వాలు శ్రద్ధ పెట్టాలని, కరోనా కాలంలో ప్రజల్ని కాపాడింది వ్యవసాయరంగమే అనేది గుర్తించి పర్యావరణ హితంగా మార్చాలని అంటున్నారు **వి. వరదరాజు**

గత ఐదేళ్లుగా దేశ ఆర్థిక వ్యవస్థ నత్తనడక నడుస్తున్నది. 2019-20 సంవత్సర ఆర్థికాభివృద్ధి నాలుగు శాతం మాత్రమే. ఇది 2016-17వ ఏడాది వృద్ధిలో సగం కంటే కాస్త తక్కువ. అప్పటి నుండి ఆర్థిక వ్యవస్థ మెరుగుపడలేదు. పులిపై పుట్రలా 2020లో కొవిడ్ వ్యాప్తి చెంది, దేశ ఆర్థిక, ప్రజారోగ్య పరిస్థితులను దారుణంగా దిగజార్చింది. కోట్లాది మందిని నిరుద్యోగులుగా చేసింది. దీనికి తోడుగా కొవిడ్ వ్యాప్తి కాలంలో ప్రభుత్వ ఆర్థిక యాజమాన్య లోపాలు అగ్నికి ఆజ్యం పోశాయి. రాత్రికి రాత్రే దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించారు. దీంతో ఎక్కడి ఆర్థిక కార్యకలాపాలు అక్కడే నిలిచిపోయాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలి. పేదలకు ఆర్థిక సహాయం అందించాలి. కానీ తగినంత సాయం చేయలేదు. ఫలితంగా ప్రజల కొనుగోలు శక్తి పడిపోయది. ఆర్థిక వ్యవస్థకు గిరాకి కొరవడింది. జాతీయ ఆదాయ పెరుగుదల మందగించింది.

వ్యవసాయానికి అందే సాయం చాలా తక్కువ. ఇది అందరికీ అన్నం పెట్టే ముఖ్య రంగమని మనకు తెలుసు. కానీ ఎవరికీ పట్టని రంగంగా పరిణమించడం విచారకరం. కరోనా కష్ట కాలంలో ఊహించిన దానికంటే అధిక ప్రగతి సాధించింది. జాతీయ ఆదాయానికి గణనీయమైన స్థూల విలువ చేర్చిన రంగాలలో వ్యవసాయం ఒకటని 2020-21 ఆర్థిక సంవత్సర అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దేశ ఆర్థిక రంగ ఎదుగుదలకు ఊతంగా నిలిచింది. లాక్‌డౌన్ కారణంగా ఆకస్మికంగా ఉపాధి కోల్పోయిన లక్షల మందిని అక్కున చేర్చుకొంది. పట్టెడు అన్నం పెట్టి ఆదుకొంది. కష్టాలలో ఆదుకోగలదే నిజమైన ప్రగతి. బలమైన వ్యవస్థ.

కొవిడ్ విజృంభించిన కాలంలో కూడా వ్యవసాయం దేశానికి వెన్నుదన్నుగా నిలిచి ముఖ్య పాత్ర నిర్వహించిందని చెప్పవచ్చు. గత ఐదేళ్లుగా ఆర్థిక వ్యవస్థ మందగించింది. కానీ అదే కాలంలో వ్యవసాయం నిలకడైన ప్రగతి సాధించింది. ఆర్థిక చోదక శక్తి అయింది. 2016-20 జిడిపి సగటు కేవలం 3.6 శాతం. ఈ ఐదేళ్ల వ్యవసాయ సగటు పెరుగుదల 4.8 శాతంగా ఉండడం గమనార్హం.

గ్రామీణ భారతాన్ని సెకండ్ వేవ్ చుట్టేసింది. ఆరోగ్యాన్ని కబళించింది. బతుకుతెరువులు లేకుండా చేసింది. చాలా కుటుంబాలలో ఇంటి సంపాదన పరులను, పెద్దలను తీసుకుపోయింది. ఇన్ఫెక్షన్ తగ్గించుకోవడానికి ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించక తప్పని పరిస్థితి నెలకొంది. చికిత్స కోసం ఎందరో అప్పులపాలయ్యారు.

గ్రామీణ ప్రాంతాల్లో కొవిడ్ వ్యాప్తి స్థాయికి తగు విధంగా ప్రభుత్వం కట్టడి చర్యలు చేపట్టలేదు. గత సంవత్సరం ఉపాధి హామీ పథకం కొంతమేరకైనా ఆదుకొంది. ప్రభుత్వం ఈ ఏడాది దానిలో కోత విధించింది. 2020 మే నెలలో వంద మందికి పని కల్పిస్తే, 2021 మేలో 65 మందికే ఉపాధి హామీ లభించింది. ఉచిత ఆహార ధాన్యాల పంపిణీని కూడా తగ్గించారు. తొలి వేవ్ కాలంలో నగదు సాయం చేశారు. సెకండ్ వేవ్‌లో ఎలాంటి సాయం చేయలేదు.

గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్న ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. వేతనాలు తగ్గుతున్నాయి. గత రెండేళ్లలో ఏడాదికి 0.9 శాతం వ్యవసాయేతర వేతనాలు తగ్గాయని అంచనాలు తెలియజేస్తున్నాయి. వ్యవసాయ కూలీలకు చెల్లించే కూలి రేట్లలో పెంపుదల కనిపించదు. పలు రకాల వ్యవసాయ ఉత్పత్తుల టోకు ధరలు దిగజారిపోతున్నాయి. ఇది వాటికి గిరాకీ తగ్గినట్టు సూచిస్తున్నది. గత ఆరు నెలలలో కూరగాయల ధరలు నేల చూపులు చూస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పెరుగుతున్నాయి. ఇండియాలో అందుకు వ్యతిరేక దిశలో పయనిస్తున్నాయి.

డీజిల్, ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు ఇతర వ్యవసాయ పరికరాల ధరలు పైకెగసిపోతున్నాయి. కాని రైతు పండించే పంటకు గిట్టుబాటు ధర పెరగడం లేదు. ఈ పరిస్థితి వ్యవసాయదారుల కంట నీరు పెట్టిస్తున్నది. ఇతర గ్రామీణ సెక్టార్ల పరిస్థితి ఇదే విధంగా ఉంది. మొత్తంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చాలా ఏళ్లుగా దిక్కుతోచని స్థితిలో ఉందని గ్రామీణ ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

వ్యవసాయం, గ్రామీణ పరిశ్రమలు, సేవా రంగంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని నిలిచాయి. ఈ రంగాలపై వరుసగా ఎన్నికైన ప్రభుత్వాలు పెద్దగా శ్రద్ధ పెట్టలేదనడం సత్యదూరం కాదు. వీటికి దేశ ఆర్థిక వ్యవస్థను చిగురింపజేయగల సత్తా ఉందని గత ఐదేళ్ల వ్యవసాయ ఇతర రంగాల ప్రగతి చెబుతోంది. గ్రామీణాభివృద్ధిపై ఇప్పటికైనా ప్రభుత్వాలు దృష్టిని సారించాలి. రెండంచెల పటిష్ఠ ప్రణాళికను చేపట్టాలి. ముందుగా టీకా కార్యక్రమాన్ని వేగిరపరచాలి. ఆరోగ్య వ్యవస్థను బలపరచాలి. కొవిడ్ శాంతించేవరకు నగదు బదిలీ, ఉచిత ఆహార ధాన్యాల పంపిణీని చేయాలి.

గ్రామాల్లో 65 శాతం మంది జీవిస్తున్నారని 2020 గణాంకాలు చెబుతున్నాయి. వీరిలో 38 శాతం మంది 18-59 వయస్సు వారు. వ్యవసాయంతో సహా ఇతర రంగాల అభివృద్ధికి దీర్ఘకాల ప్రణాళిక అమలు అవసరం. వ్యవసాయాన్ని పర్యావరణ హితకరం వైపు మరల్చాలి. పచ్చని పరిశ్రమలకు ప్రాధాన్యతనివ్వాలి. పర్యావరణ సమస్యలు చాపకింద నీరులా ముంచుకొస్తున్నాయి. భూమికి జీవం పోసే ప్రకృతి వ్యవసాయమే చక్కని పరిష్కార మార్గమని పర్యావరణ నిపుణులు పదే పదే చెబుతున్నారు. ఆధునిక వ్యవసాయంలో నీటి వాడకం చాలా పెరిగింది. ఒక కిలో ధాన్యం, గోధుమలు పండించడానికి కొన్ని వేల లీటర్ల నీరు అవసరం.

కొన్ని కోణాలలో గాంధీ - లెనిన్

ఇరవయో శతాబ్ది సామాజిక ఆలోచనలను ప్రగాఢంగా ప్రభావితం చేసిన రెండు వ్యక్తిత్వాలను తులనాత్మకంగా పరిశీలిస్తున్నారు **దివికుమార్**

కరోనా మహమ్మారితో ప్రపంచమంతా గడగడలాడుతూ ఉన్న కాలంలో 103 ఏళ్ల క్రితం 'ప్రపంచాన్ని కుదిపిన' శ్రామికవర్గ మహా విప్లవ సారథి వి.ఐ. లెనిన్ 150వ జయంతి (ఏప్రిల్ 22, 2020) వచ్చింది. సరిగ్గా 6 నెలల క్రితం భారత జాతిపితగా ప్రసిద్ధుడైన మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ 150వ జయంతి (అక్టోబర్ 2, 2019) కూడా రావడం మనందరం బాగా ఎరిగిన విషయం. గాంధీ కంటే లెనిన్ 6 నెలలు చిన్నవాడే అయినా, గాంధీ భారతదేశ రాజకీయాలలో చురుకైన పాత్ర ఆరంభించే నాటికే 1917 నవంబర్ 7న రష్యా దేశంలో లెనిన్ నాయకత్వాన కార్మిక – కర్షక విప్లవం విజయవంతమైంది. అప్పటికి లెనిన్ వయసు 48కి లోపే. 17 ఏళ్ల వయసులోనే న్యాయశాస్త్రం చదువుతూ విద్యార్థి ఉద్యమ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నందుకు లెనిన్‌ను కజన్ విశ్వవిద్యాలయం నుండే కాక, ఆ పట్టణం నుండి కూడా సంవత్సరం పాటు బహిష్కరింపబడినాడు.

అప్పటికే లెనిన్ ఒక మార్క్సిస్టు అధ్యయన రహస్య బృందంలో సభ్యుడైనాడు. 19 ఏళ్ల వయసులో న్యాయశాస్త్రంలో విద్యాభ్యాసానికి గాంధీ లండన్ బయల్దేరాడు. ఎలాంటి భావాలతో వెళ్లాడో దాదాపు అలాగే భారతదేశానికి తిరిగి వచ్చాడు. వారిరువురికి రెండు, మూడు సామాన్య అంశాల పట్ల గల అవగాహనా వైరుధ్యాలకు, ఆచరణలోని తేడాలకు పరిమితమై ఇప్పుడు మనం మాట్లాడుకుందాం.

24 ఏళ్ల వయసులో దక్షిణాఫ్రికాకు న్యాయవాదిగా వెళ్లిన గాంధీకి అక్కడి జీవితంలో ముఖ్యమైన భాగం బ్రిటిష్ వారి తెల్ల దొరతనపు దౌష్ట్యాలను ధిక్కరిస్తూ, భరిస్తూ, సహిస్తూ సాగింది. అప్పటికి దక్షిణాఫ్రికాలో డచ్ వలసవాదుల పెత్తనం కూడా కొంత ఉండేది. డచ్ వారికీ, బ్రిటిష్ వారికీ నడుమ దక్షిణాఫ్రికా దేశంలోని వనరులు, ముడిసరుకులపై ఆధిపత్యం, పెత్తనం కొరకు పోటీ ఉండేది. అందులో భాగంగా జరిగిన యుద్ధంలో – దాన్ని బోయర్ యుద్ధం అంటారు. – 'గాంధీ బ్రిటిష్ వారి పక్షానే ఉన్నారు'. స్థానిక నల్లజాతుల వారైన (నీగ్రో) జూలు తెగలపై తెల్లవారు సాగించిన అణచివేత యుద్ధాల సందర్భంలో కూడా గాంధీ బ్రిటిష్ వారి పక్షాన ఉన్నారు. ఆ క్రమంలో అహింసా సిద్ధాంతంపై బాగా నమ్మకం పెంచుకుంటూ రష్యన్ మహా రచయిత టాల్‌స్టాయ్ భావజాలం పట్ల ప్రత్యేక ఆకర్షణకు గురయ్యాడు.

గాంధీపై టాల్‌స్టాయ్ ప్రభావం: టాల్ స్టాయ్ పట్ల లెనిన్ అవగాహన:

మన ప్రస్తుత పరిశీలన అంశం ఒకటి ఇక్కడే ఉంది. ఎందుకంటే గాంధీ సమవయస్కుడైన లెనిన్ స్వయంగా రష్యా దేశస్థుడు. టాల్‌స్టాయ్‌ని, ఆయన సాహిత్య కృషిని లెనిన్ ఎలా స్వీకరించాడు అన్నది ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన అంశం.

పురోగామి శక్తులు టాల్‌స్టాయ్ సాహిత్యం నుండి స్వీకరించవలసినవీ, నిరాకరించవలసినవి... అంటూ లెనిన్ ఒక విశ్లేషణ చేశాడు. రష్యన్ ప్రజాతంత్ర విప్లవానికి గల నేపథ్య జీవితానికి అద్దం పట్టే ఆ కాలపు వాస్తవికతను టాల్‌స్టాయ్ సాహిత్యం సమాజం ముందు నిలబెట్టినట్లు లెనిన్ చెప్పాడు.

'టాల్‌స్టాయ్ రచనలు రైతుల సామూహిక ఉద్యమం బలాన్ని – బలహీనతలను శక్తిని – పరిమితులను వ్యక్తం చేస్తాయి. రాజ్యం పట్ల, పోలీసులతో పొత్తుగలిగి ఉండిన అధికారిక వ్యవస్థ పట్ల ఆయన ప్రగాఢమైన ఆవేశపూరితమైన, తరచూ నిర్దాక్షిణ్యంగా, నిశితమైన అసమ్మతి ఉంటుంది. శతాబ్దాల ఫ్యూడల్ దాస్యం, అధికారుల క్రూర పరిపాలన, దోపిడీ మత వ్యవస్థ నటన, వంచన, టక్కులు, ఎవరిలో ఆగ్రహాన్ని, ద్వేషాన్ని గుట్టలుగా రాసి పోసినాయో, ఆ ఆదిమ కర్షక ప్రజాతంత్ర జనాల మనోస్థితులను ఆయన రచనలు తెలియజేస్తాయి. భూమి మీద సొంత ఆస్తి పట్ల రాజీలేని ఆయన వ్యతిరేకత... పాత మధ్యయుగ భూ యాజమాన్యం అనివార్యంగా అత్యంత నిర్దాక్షిణ్యంగా

అధిక దిగుబడుల కోసం కృత్రిమ ఎరువుల వాడకం మోతాదు మించి భూమి నిస్సారమైంది. భూగర్భ జలాలు విషతుల్యమౌతున్నాయి. రసాయన కీటక నాశనుల వినియోగం విచక్షణా రహితమైంది. ఇవి పంటలను ఆశించే వాటిని నశింపజేయడానికే పరిమితం కాలేదు. ఎన్నో జీవరాసులు నాశనం చేశాయి, చేస్తూనే ఉన్నాయి. నేడు పల్లెల్లో కూడా పిచ్చుకలు కనుమరుగయ్యాయి.

జీవావరణం క్షీణిస్తున్నది. ఆహార కాలుష్యం పెచ్చుమీరుతోంది. వ్యవసాయంలో రసాయనాల వాడకం అధికమౌతోంది. ఈ చెడు పరిణామాలన్నిటికి వినియోగదారులే కారకులు. అంటే మనమే బాధ్యులం. అమిత అందంగా, పెద్దగా ఉండే పళ్లు, కూరగాయలు కొంటాం. ఇటువంటి వెచ్చాలకే ప్రధాన్యత ఇస్తాం. అలా పండించడానికి రైతు మరికొన్ని రసాయనాలు వాడవలసి వస్తున్నది. ఫలితంగా ఆహార కాలుష్యం అలా అలా పెరిగిపోతున్నది. జీవావరణం ఇంకా ఇంకా క్షీణిస్తున్నది. వినియోగదారులు మారాలి. ముడి ధాన్యాలు తినడం అలవరచుకోవాలి. ఏ కాలంలో దొరికే పళ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలు ఆ కాలంలో వాడాలి. స్థానిక రకాలు వినియోగించాలి. సొంపు సొంపులపై మోజు తగ్గించుకోవాలి. సహజ ఆహారం భుజించాలి. ప్రకృతి ఎన్నో ప్రసాదించింది. వాటిని మానవుడు తయారు చేయలేడని గ్రహించాలి. ప్రకృతితో కలసి జీవిస్తేనే ఆరోగ్యం, మనుగడ సాధ్యం.

(రచయిత మూలికా వైద్యుడు) వీ

ధ్వంసం కావలసి ఉండిన కాలంలో రైతు జనాల మనస్తత్వాన్ని ఆయన సాహిత్యం తెలియజేస్తుంది. ఒక్క మాటలో ఏ కాలం చెల్లిన ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా ఆనాటి రష్యన్ ప్రజానీకం ముఖ్యంగా రైతాంగం పోరాడి ఒక విప్లవాత్మక మార్పుకై తపనపడుతోందో, ఆ దౌర్భాగ్య జీవితపు నికృష్ట స్థితిగతులను ప్రజలు అర్థం చేసుకునే విధంగా టాల్‌స్టాయ్ సాహిత్యం విశదీకరించిందని లెనిన్ చెప్పాడు.

అయితే పై రష్యన్ జీవిత వాస్తవికతను ప్రతిబింబించే టాల్‌స్టాయ్ సాహిత్యాన్ని గాని, ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఆయన నవలలు, కథలను గాని తాను చదవలేదని గాంధీ స్వయంగా చెప్పుకున్నాడు. కానీ గాంధీని బాగా ప్రభావితం చేసి టాల్‌స్టాయ్ పుస్తకం ఒకటి ఉంది. 'ది కింగ్‌డమ్ ఆఫ్ గాడ్ ఇజ్ విథిన్ యు'.

'నీలోనే ఉన్న దైవ ప్రపంచం' అనే ఆ పుస్తకం చదివిన వెంటనే గాంధీ టాల్‌స్టాయ్‌కి ఉత్తరం రాశాడు. వారి నడుమ ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచాయి. దక్షిణాఫ్రికాలో తన నిర్వహణలో ఉన్న ఒక వ్యవసాయ క్షేత్రానికి టాల్‌స్టాయ్ పేరును కూడా గాంధీ పెట్టుకున్నాడు. ఆయనను అంతగా ప్రభావితం చేసిన ముఖ్యాంశాలు అందులో (ది కింగ్‌డమ్ ఆఫ్ గాడ్ ఇజ్ విథిన్ యు) లో ఏమున్నాయి? 1. చెడు పట్ల మందకొడి ప్రతిఘటన. (Passive Resistance To Evil). 2) నిరాడంబర పేద, సాధుజీవనం. 3) శాకాహార సేవనం. 4) సాత్విక మతం ఆధారిత జీవితాన్ని గడపడం.

రస్కిన్, థోరే లాంటి వారి ప్రభావం కూడా గాంధీపై ఉండి నప్పటికీ, టాల్‌స్టాయ్ బోధనలలోని Passive Resistance To Evil ప్రభావంతోనే అహింసా సిద్ధాంతాన్ని, సత్యాగ్రహం మార్గాన్ని ఆయన రూపొందించుకున్నాడు. వీటికి అవసరమైన మత ధార్మిక జీవనాన్ని ఎంచుకున్నాడు.

రష్యాలో విప్లవ శక్తులు ఊపందుకున్న తర్వాత (1905–07 నడుమ ఒక తిరుగుబాటు జరిగింది), వర్గ స్వభావ రీత్యా టాల్‌స్టాయ్ తన జీవిత చరమాంకంలో క్రీస్తు మతపు చర్చి శరణుజొచ్చి అన్యాయాలకూ, దురాగతాలకూ వ్యతిరేకంగా పోరాడడానికి బదులు చెడు పట్ల మందకొడి ప్రతిఘటన. Passive Resistance To Evil సిద్ధాంతాన్ని ప్రబోధించాడు.

సరిగ్గా అవే రోజులలో భారతదేశంలో బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా వందేమాతరం ఉద్యమం ఊపందుకుంది. యువకులు తిరుగుబాట్లు చేస్తున్నారు. కాంగ్రెసు పార్టీపై అతివాదుల పట్టు పెరిగింది. క్రూర నిర్బంధ చట్టాలు, ఆంక్షలు, నిషేధాలతో భారత జాతీయోద్యమంపై క్రూర అణచివేత సాగుతోంది. బాల గంగాధర తిలక్ అరెస్టుకు నిరసనగా బొంబాయిలో కార్మికులు అపూర్వమైన సమ్మె చేశారు. భారత కార్మికవర్గం రాజకీయ రంగప్రవేశం చేయడంగా లెనిన్ దానిని అభివర్ణించాడు. అప్పటికే రష్యా దేశంలో 1905 – 07 లలో విప్లవం ఒక రిహార్సల్ లాగ జరిగింది. ఓటమి పొందిన సైన్యాలు ఎక్కువ నేర్చుకుంటాయి అని భావించిన లెనిన్, ఆ విప్లవం నుండి గుణపాఠాలు తీసి దృఢమైన కార్మిక, కర్షక ఐక్యత అవసరమని అప్పటికే ప్రబోధిస్తున్నాడు.

టాల్‌స్టాయ్ సాహిత్యంలో ఎంత వాస్తవిక జీవన సంఘర్షణ ప్రతిబింబించినా, అలాంటి అణచివేతల జీవితం నుండి బయట పడడానికి బడుగుజీవులు సాగించే ప్రతిఘటనా పోరాటాన్ని గానీ, దాని ఆవశ్యకతను గానీ టాల్‌స్టాయ్ గ్రహించలేకపోయాడంటాడు లెనిన్. టాల్‌స్టాయ్‌ని జీవనోపాధ్యాయుడుగా ప్రకటిస్తున్న వారంతా ప్రగతి నిరోధకులే! మితవాదులు బుద్ధిపూర్వకంగా టాల్‌స్టాయ్‌లోని విప్లవ వ్యతిరేక అంశం నుండి వీరు లబ్ధిపొంద గోరుతున్నారు అని లెనిన్ విస్పష్టంగా 1908లోనే విశ్లేషించి చెప్పాడు. టాల్‌స్టాయ్ బోధించిన సృజనాత్మక సాహిత్యేతర సామాజిక సందేశాల గురించి లెనిన్ చెప్పిన విషయాలలోని ఈ రాజకీయ సారాంశమే గాంధీకి కూడా చక్కగా అన్వయం అవుతుంది.

మొదటి ప్రపంచ యుద్ధం పట్ల గాంధీ – లెనిన్‌లు

మొదటి ప్రపంచ యుద్ధం సందర్భంగా గాంధీ – లెనిన్‌లు తీసుకున్న వైఖరులు, ప్రజలకు ఆ సమయంలో అందించిన మార్గదర్శకత్వం పరిశీలించితే వారిరువురి అవగాహన ఆచరణలలోని తేడాలు కూడా విస్పష్టంగా అర్థం అవుతాయి.

మొదటి ప్రపంచ యుద్ధం 1914–18 నడుమ ప్రపంచ పెత్తనానికై అభివృద్ధి చెందిన ఐరోపా దేశాల రెండు కూటముల నడుమ సాగినది. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జారిస్టు రష్యా, ఇటలీ, ఆలస్యంగా అమెరికా ఒక కూటమి దేశాలు కాగా, జర్మనీ, ఒట్టోమన్ సామ్రాజ్యపు టర్కీ, ఆస్ట్రియా హంగరీలు మరొక కూటమిగా రూపొంది సాగించిన ప్రపంచ మహా యుద్ధంలో కోటి మందికి పైగా తమ విలువైన ప్రాణాలను కోల్పోయారు. రెండు కోట్ల మంది వికలాంగులయ్యారు. 50 లక్షల మంది మహిళలు తమ భర్తలను కోల్పోయారు. కోటి మంది బాల బాలికలు తల్లితండ్రులను కోల్పోయారు. ప్రపంచాన్ని పునర్విభజన చేసుకోవడానికి సామ్రాజ్యవాద దోపిడీ కూటముల నడుమ జరిగిన మొదటి యుద్ధం ఇది. ఇలాంటి ఒక ప్రపంచ యుద్ధాన్ని 1907 లోనే ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం పసిగట్టి ప్రజలను, ఐరోపా దేశాలు కొన్నింటిలో అప్పటికే ఏర్పడి ఉన్న కమ్యూనిస్టు పార్టీలను, కార్మిక వర్గాలను హెచ్చరించాయి. లెనిన్ కూడా ప్రతినిధిగా పాల్గొన్న రెండవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ 1907 నాటి పై స్టుట్‌గార్ట్ మహాసభ నుండి, 1910లో జరిగిన కోపెన్హాగన్ సభ, ఆ తర్వాత 1912లో జరిగిన బాస్లే సభలలో ప్రపంచ యుద్ధ ప్రమాదాన్ని గురించి ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం లోతైన చర్చలు జరిపి, తీర్మానం రూపంలో ముఖ్యమైన నిర్ణయాలు చేసింది. కానీ వాస్తవంగా యుద్ధం మొదలవగానే, కమ్యూనిస్టు ఉద్యమంలోని రకరకాల అవకాశవాదులు (ఆస్ట్రియా మినహాయింపు) మాతృభూమి రక్షణ పేరిట తమ తమ దేశాల పాలకవర్గాల యుద్ధోన్మాదానికి అండదండలనిస్తే, లెనిన్ నాయకత్వానగల రష్యన్ బోల్షివిక్ పార్టీ తమ దేశంలో అంతర్యుద్ధానికై రష్యన్ ప్రజానీకానికి పిలుపునిచ్చింది. కార్మికులను, రైతులను, సైనికులను సమీకరించి ముందుగా జార్ ప్రభువుల రాజ్యాన్ని (1917 ఫిబ్రవరి), తరువాత బూర్జువా కెరన్స్కీ ప్రభుత్వాన్ని (1917 నవంబర్ 7) విప్లవం ద్వారా ఓడించి ప్రపంచ శాంతికి ప్రత్యక్షంగా తోడ్పదింది. ఇదంతా కామ్రేడ్ లెనిన్ నాయకత్వాన జరిగిందన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

మొదటి ప్రపంచ యుద్ధంలో గాంధీ నిర్వహించిన పాత్రను పాలకవర్గాలు, వారి చరిత్రకారులు సాధ్యమైనంత దాచడానికి ప్రయత్నం చేస్తారు. ఎందుకంటే, అడుగడుగునా ఆయన బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు ఎనలేని సేవ చేసిపెట్టినట్లు నేటి తరాలకు తెలియకుండా ఉంచేందు కోసం!!

మొదటి ప్రపంచ యుద్ధం మొదలు కాగానే గాంధీ దక్షిణాఫ్రికా నుండి లండన్ చేరాడు. 'ఈ ఆపద సమయంలో మీ రాజభక్తిని ప్రదర్శించండి' అని అక్కడున్న భారతీయ యువతకు విజ్ఞప్తి చేశాడు.

యుద్ధం నిమిత్తం తమ సేవలను బ్రిటిష్ అధికారులకు అంకితం చేయడానికి సిద్ధమంటూ తన, ఇతర భారతీయుల సంతకాలతో ఒక లేఖను బ్రిటన్ ప్రభుత్వపు భారత మంత్రికి పంపించారు.

1914 – 15 – 16లలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహా సభలకు మద్రాసు – బొంబాయి – ఉత్తరప్రదేశ్‌ల బ్రిటిష్ గవర్నర్లు స్వయంగా హాజరై, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల యుద్ధ ప్రయత్నాలకు కాంగ్రెస్ పార్టీ నుండి తగినంత రాజకీయ సహకారాన్ని పొందారు. సరిగ్గా అదే కాలంలో 'గదర్ వీరులు భారతదేశంలో సైనిక తిరుగుబాటుని తెచ్చి బ్రిటిష్ వారిని తరిమి వేయాలనే ప్రయత్నం నిజాయితీగా చేశారు'. అది విఫలం కాగా దారుణమైన చిత్రహింసలకు, ఉరితీతలకు, నిర్బంధాలకు గురైనారు. ఐరోపా గడ్డమీద ఇంకా ఆఫ్రికా, పశ్చిమ ఆసియా దేశాలలో జరిగిన ఆ యుద్ధంలో బ్రిటిష్ వారి తరపున పోరాడేందుకు సుమారు 13 – 14 లక్షల మంది భారతీయ సైనికులు నిర్బంధంగా తరలించబడ్డారు. వారిలో సుమారు 75 వేల నుండి లక్ష మంది దాకా సైనికులు యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. మరెన్నో లక్షల మంది క్షతగాత్రులయ్యారు. మొదటి ప్రపంచ యుద్ధంలో బ్రిటిష్ వారి గెలుపుకి భారతీయ సైన్యాలు నిర్ణాయక ప్రభావం చూపాయి. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కోసం తమ ప్రాణాలను అర్పించడానికి గాను జరిగిన ఈ బలిపశువుల సమీకరణ, యుద్ధ ఆరంభానికి ముందు సంవత్సరం 15,000 మంది మాత్రమే ఉంటే, యుద్ధకాలంలో 1917లో 1,21,000 కాగా, మరుసటి ఏడు అది 3,00,000 లకు పెరిగింది. స్వయంగా గాంధీ గారు భారత ప్రజల నుండి సైనిక సమీకరణలో పాల్గొన్నారు.

'మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పుడు కూడా ఒక అంబులెన్స్ దళాన్ని సమకూర్చేను. దాని కోసం పడిన శ్రమ ఫలితంగా ప్లూరసీ వ్యాధి తీవ్రంగా పట్టుకుంది. యుద్ధం సందర్భంలో ఢిల్లీలో జరిగిన మహాసభలో నేను లార్డ్ ఛెమ్స్ ఫర్డ్‌కు ఇచ్చిన వాగ్దానం ప్రకారం నా కర్తవ్యాన్ని నిర్వహిస్తూ, సైనికులను చేర్చేందుకు ఖేడా జిల్లాలో తిరుగుతూ, ఆ దీర్ఘ ప్రయాణాలలో రక్త గ్రహిణి వ్యాధిని తెచ్చుకుని చచ్చిబతికేను.'

అలా గాంధీజీ సైనిక సమీకరణలో పాల్గొనే సందర్భంగా – 'మీరు అహింసావాదులై హింసాత్మక యుద్ధానికి సహకరించడం ఏమిటి? అని ప్రశ్నించిన వారికి ఆయన ఇచ్చిన జవాబులిలా ఉండేవి.

'ఇతరులు తమ పిరికితనం, బలహీనతల వల్ల అహింసను ఆశ్రయిస్తున్నారు. అలాంటివారు తమ కర్తవ్యం నుండి తప్పించుకోవడానికి పవిత్రమైన అహింసా సిద్ధాంతాన్ని ఒక సాకుగా ఉపయోగించ కూడదు.'

'బ్రిటిష్ సామ్రాజ్యం మనలను శత్రుదాడుల నుండి కాపాడే ప్రయత్నం చేస్తోంది. మరి సామ్రాజ్య పరిరక్షణ కోసం ఇలాంటి క్లిష్ట సమయంలో మన చివరి రక్తపు బొట్టు సైతం ధార పోయడానికి సంకోచించకుండా ఉండడమే నేటి మన కర్తవ్యం కావలసి ఉంది' అన్నాడు గాంధీ. అయితే 'బాలగంగాధర తిలక్ మాత్రం యుద్ధంలో సాయపడడానికి యుద్ధానంతరం 'స్వరాజ్యం' ఇస్తామనే హామీని' ఇవ్వాలని షరతు పెట్టాడు. దానిపై గాంధీ టైమ్స్ ఆఫ్ ఇండియాలో రాస్తూ ఈ విషయంలో నాకు తిలక్‌కు చిన్న భేదాభిప్రాయం ఉంది. ఆయన వంటి వ్యక్తి, సైన్యం రిక్రూట్‌మెంట్ బాధ్యత చేపడితే ప్రభుత్వానికి మనం అందించే సహాయం వల్ల మన ఎడల బ్రిటిష్ రాజ్యానికి విశ్వాసం జనిస్తుంది, మనం కూడా ఇప్పటి కంటే అధికశక్తి సంపన్నుల మవుతామనీ, అలా మీ కోరిక కూడా ఖచ్చితంగా నెరవేరుతుందనీ ఆయనతో నేనన్నాను.'

మొదటి ప్రపంచ యుద్ధం కాలంలోనే లెనిన్ 'సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ' అనే ప్రపంచ ప్రామాణికమైన విశ్లేషణాత్మక గ్రంథం రాశాడు. సామ్రాజ్యవాద స్థాయికి చేరిన పెట్టుబడిదారీ విధానం వెనుకబడిన దేశాలలో తన దోపిడీ ఎన్ని రూపాలలో విస్తరించుకుంటూ పోతుందో, 'పెట్టుబడిదారీ విధానం బలం – బలహీనత కూడా సామ్రాజ్యవాద రూపంలో ఎలా కేంద్రీకరించబడి ఉంటుందో లెనిన్ చెప్పాడు'. సామ్రాజ్యవాదం బలహీనమైన స్థావరాలపై ప్రజా విప్లవం ద్వారా దాడులు చేసి, దాని ఆయువు పట్టులను తెగనరకాలని లెనిన్ బోధిస్తే, సరిగ్గా తద్విరుద్ధంగా గాంధీ బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని దాని అత్యంత బలహీన కాలంలో భారతదేశం అనే బలహీన స్థావరంలో సంరక్షించే కర్తవ్యం చేపట్టాడు.

సిద్ధాంతపరంగా లెనిన్ గాంధీలు!

ఇక సైద్ధాంతికంగా ప్రాపంచిక చింతన, సామాజిక అవగాహనల పరంగా చూస్తే లెనిన్ నాటికీ, నేటికీ ప్రపంచ మేధో సంపన్నులలో ఒకనిగా భాసిస్తూ ఉంటాడు. అదే గాంధీ ఒక ప్రముఖ తార్కికవాదిగా కనిపిస్తాడు. ఆధునిక విజ్ఞాన శాస్త్రాల నుండి ఎదిగిన హేతువాద చింతన ఎడ ఒక భయస్తునిలా కనిపిస్తాడు. మతం పట్ల, గతం పట్ల భక్తి ప్రపత్తులతో గాంధీ మిగిలిపోతాడు.

యథాతథ వాదానికి అనగా విప్లవాత్మక మార్పులు లేకుండా చిట్టిపొట్టి సంస్కరణలకు గాంధీ ప్రతీకగా నిలబడ్డాడు. నిజానికి ప్రతి చారిత్రక కాలంలోనూ చిట్టిపొట్టి సంస్కరణలు సంభవిస్తూనే వచ్చాయి. అవన్నీ ప్రజల తిరుగుబాట్లలో నుండి, ప్రతిఘటనా పోరాటాలు, నిరసన ఆందోళనల నుండి పొందిన అనేకానేక అనుభవాలకు లభించిన చిరుపంటలే! తొలి మలి ఫలితాలే!!

అవన్నీ ఒక తరహా వ్యక్తిగత ఆస్తుల సమాజానికి బదులు మరొక తరహా వ్యక్తిగత ఆస్తుల సమాజం ఆవిర్భవించడానికి లేక కొనసాగడానికి దోహదపడ్డాయి. కానీ మార్క్సిజం అలాంటిది కాదు. సమాజంలో మౌలిక మార్పులు వచ్చి శ్రమ దోపిడీ పునాదులపై కొనసాగుతున్న వ్యవస్థను విప్లవాత్మకంగా కూలదోయాలని బోధించిన సిద్ధాంతం అది. దానిని వెనుకబడిన దేశాలలో తిష్టవేసిన 'సామ్రాజ్యవాదపు పునాదులను మొదలుకంటా తెగ నరకడానికి వలస, అర్ధవలస దేశాలలో', 'జరుగవలసిన జాతుల విముక్తి పోరాటాలకు సిద్ధాంతపరమైన, ఆచరణ సంబంధమైన అన్వయాన్ని ఇచ్చినవాడు లెనిన్.' సామ్రాజ్యవాదంతో విప్లవాత్మక తెగతెంపులు లేకుండా ఒక రాజీతో కానీ లేక వారి దళారీల పెట్టుబడితో సర్దుబాటు చేసుకునే విధంగా గానీ పీడిత ప్రజల పోరాటాలను నీరు కార్చుకుంటూ, పక్కదారి పట్టిస్తూ పాత వ్యవస్థనే కొత్త రూపాలలో బతకనిస్తూ, దోపిడీ అసమానతల వ్యవస్థను మరిన్ని దశాబ్దాలు, శతాబ్దాలు కొనసాగడానికి తాత్విక రాజకీయ పునాదులు నిర్మించి వెళ్లినవాడు గాంధీ. లెనినిజాన్ని అర్థం చేసుకోనివారు, దానిని పలచన చేయాలని ఉద్దేశపూర్వకంగా ప్రయత్నించేవారు ఉన్నారు. వారికి గాంధీయిజం ఒక అవకాశవాద ఆయుధం.

(రచయిత జనసాహితి నాయకులు) వీ

కొలంబియాలో ప్రజాందోళనలు

***స్థానిక వనరులను అమెరికన్ సామ్రాజ్యవాదులకు కట్టబెడుతున్న కొలంబియా పాలకులు ప్రజల ఆకాంక్షలను నేరవేర్చకుండా తీవ్ర అణచివేతకు గురిచేస్తున్నారని అంటున్నారు* ఎ. నర్సింహారెడ్డి**

కొలంబియా అధ్యక్షుడు మితవాది ఇవాన్ డ్యూక్ మార్క్వెజ్ 2018 ఆగస్టు 7న అధికారం చేపట్టిన నాటి నుండి సామ్రాజ్యవాద అమెరికా దన్నుతో నిరంకుశ పాలన కొనసాగిస్తూ, ప్రపంచీకరణ ఆర్థిక విధానాలను అమలుచేస్తూ, ప్రజావ్యతిరేకతను మిలిటరీ సహాయంతో అణచివేస్తున్నారు. గడచిన మూడు సంవత్సరాలుగా డ్యూక్ విధానాలకు వ్యతిరేకంగా కొలంబియా ప్రజా ఉద్యమాలతో అట్టుడుకుతోంది. కొవిడ్-19 విజృంభణ వల్ల ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది. కరోనా వైరస్ వ్యాప్తిని నియంత్రించడంలో పూర్తిగా డ్యూక్ ప్రభుత్వం విఫలమైంది. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకునేందుకు ఏప్రిల్ 15న 6.4 బిలియన్ డాలర్ల (640 లక్షల డాలర్లకు) అంటే 28 ట్రిలియన్ పెసోలు (కొలంబియా కరెన్సీని పేసో అంటారు) అదనంగా పన్నుల ద్వారా వసూలు చేయాలని కాంగ్రెస్‌కు ప్రతిపాదించారు. వ్యాట్ ద్వారా 7.3, వ్యక్తుల నుండి 17, వ్యాపార వర్గాల నుండి 3.7 ట్రిలియన్ పెసోలు ప్రభుత్వ ఖజానాకు అదనంగా వస్తుందని అంచనా. ఈ పన్నుల పెంపు ప్రతిపాదన పేదలకు మరింత భారం కానుంది. పన్నుల పెంపు వల్ల సామాన్యులు నిత్యం వాడుకునే పాలు, కాఫీ, చక్కెర, ఆహార పదార్థాల ధరలు పెరుగుతాయి. చమురు పరిశ్రమ యజమానులకు, గనుల తవ్వకం పరిశ్రమ యాజమాన్యాలకు లాభాలు సాధించిపెడుతుంది.

ఇవాన్ డ్యూక్ ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన పన్నుల పెంపుకు, ఆరోగ్య సంరక్షణ నిధులకోత, ప్రభుత్వ అవినీతికి వ్యతిరేకంగా ఏప్రిల్ 28 నుంచి ప్రజా నిరసనలు సార్వత్రిక సమ్మె ప్రారంభమయ్యాయి. గత సంవత్సరం కొవిడ్-19 బాధితుల సహాయార్థం 2020 ఏప్రిల్‌లో సార్వత్రిక ప్రాథమిక ఆదాయ సామాజిక కార్యక్రమం 'ఇంగ్రేసో సాలిడారియో' స్థాపించబడింది. తక్కువ ఆదాయం గల కుటుంబం ఒక్కంటికి 43 యుఎస్ డాలర్ల చొప్పున 2020 ఏప్రిల్ నుండి చెల్లిస్తోంది. ఇతర లాటిన్ అమెరికా దేశాలతో పోలిస్తే ఇంగ్రేసో సాలిడారియో అందించే కవరేజ్ చాల తక్కువ. ఈ పథకానికి 50 లక్షల మంది అర్హులు కాగా 30 లక్షల మందికే వర్తింప చేశారు. కరోనా సమయంలో పేదరిక నిర్మూలనకు సమర్థవంతమైన ప్రణాళికను రూపొందించలేకపోయింది. ఆదాయ అసమానతలను నివారించలేకపోయింది. కరోనా వల్ల కొలంబియా ఆర్థిక పరిస్థితి కుదేలయింది. ద్రవ్యలోటు జాతీయ స్థూల ఉత్పత్తిలో 7.8 శాతానికి పెరిగింది. ఆ దేశ రుణాలు జిడిపిలో 64.8 శాతానికి చేరాయి. మరోవైపు నిరుద్యోగం ఒక సంవత్సర కాలంలోనే 10 శాతం నుండి 15.7 శాతానికి పెరిగింది. పేదరికం 35.7 శాతం నుంచి 46 శాతానికి పెరిగింది.

ప్రజా ఆందోళనలకు కొన్ని తరాల నేపథ్యం

కొలంబియా ప్రజల్లో నేటి అశాంతికి సుదీర్ఘమైన చరిత్ర ఉంది. 1499లో కొలంబియాను స్పెయిన్ స్వాధీనం చేసుకుంది. స్పెయిన్ వలసవాదులు, ఆఫ్రికన్ బానిసల మధ్య ఏర్పడిన మిశ్రమం, ఇతర యూరోపియనుల రాక వల్ల కొలంబియాలో 85 వేర్వేరు జాతుల వైవిధ్యం ఉంది. కొలంబియన్‌లను చర్మం రంగు, సామాజిక స్థితి ఆధారంగా వివిధ జాతులుగా గుర్తిస్తారు. జనాభాలో అత్యధికులు యూరోపియన్ శ్వేతజాతి, ఆఫ్రో కొలంబియన్‌లు మైనార్టీగా ఉంటారు. స్పెయిన్ ఆక్రమణకు ముందు అమెరిండియన్లకు చెందిన వివిధ తెగలు కొలంబియాలో నివసించాయి. ఈ గిరిజన తెగలు చెప్పుకోదగ్గ కుమ్మరి పనులు, అభరణాలు తయారుచేసే పనులు చేసేవారు. కొలంబియా పురావస్తు సంపదను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. స్పెయిన్ విజేతలతో స్థానిక జాతుల మధ్య జరిగిన పరస్పర సంలీనం వల్ల మెస్టిజో జాతి ఏర్పాటుకు దారితీసింది. వీరి వృత్తి వ్యవసాయం, ఇవాళ కొలంబియా మొత్తం జనాభాలో మెస్టిజో జాతి జనాభా 53.5 శాతం, యూరోపియన్ శ్వేత జాతీయుల జనాభా 30.7 శాతం. ఆఫ్రో కొలంబియన్ జాతి జనాభా 10.4 శాతం. ఇక స్థానికులైన అమెరిండియన్ గిరిజన జనాభా 3.4 శాతం మాత్రమే ఉన్నందున తమ హక్కులను పొందలేకపోతున్నారు.

1810 జూలై 20న కొలంబియా వలస నుంచి స్వాతంత్రం పొందింది. 1885లో కొలంబియా రిపబ్లిక్‌గా ఏర్పడింది. కొలంబియాను దక్షిణ అమెరికాకు ప్రవేశ ద్వారం అని కూడ అంటారు. శతాబ్దాలుగా వలస యుద్ధాలు, అంతర్యుద్ధాలు, సైనిక జుంటా పాలన వల్ల ప్రజా జీవితాలు దుర్భరంగా మారాయి. ఆర్థిక సాంఘిక అంతరాలు, ఆధిపత్యం, వివక్ష, అణచివేత, పీడన నేటికి కొనసాగుతున్నాయి. తీవ్ర జాతి వైవిధ్యం నేపథ్యంలో, కొలంబియాలోని మైనారిటీ సమూహాలు ఆర్థిక సామాజిక సమస్యలను అనుభవిస్తున్నాయి. దీంతో కొలంబియన్ సమాజంలో శ్వేతజాతి ఆధిపత్యం కొనసాగుతోందని చెప్పవచ్చు. కొలంబియాలోని ఇతర జాతుల సమూహాల కంటే అధిక జీవన ప్రమాణాలు కలిగిన మెస్టిజోస్ మెజారిటీ జాతి సమూహానికి చెంది ఉంది. ప్రపంచీకరణ ఆర్థిక విధానాల అమలు ద్వారా లబ్ధి పొందిన జాతిగా కన్పిస్తోంది. మితవాద ప్రభుత్వానికి ఈ జాతి పునాదిగా ఉంది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక సంస్కరణల పర్యావసానంగా దేశంలోని ముగ్గురి సంపన్నుల వద్ద జిడిపిలో పది శాతం కంటే ఎక్కువ సంపద పోగుపడింది. దేశంలో 20 శాతం మంది దేశ సంపదలో 60 శాతం పొందగా మిగిలిన 80 శాతానికి 40 శాతం సంపద దక్కుతుంది. అందువల్లనే లాటిన్ అమెరికా దేశాలలో కొలంబియాలో పేదరికం రేటు ఎక్కువగా ఉందని ఐ.రా.స నివేదిక వెల్లడించింది. బహుళ జాతుల దేశంలో జాతి సమూహాల మధ్య ఒకవైపు ఆర్థిక అంతరాలు మరోవైపు ఉద్రిక్తతలు పెరుగుతూనే ఉన్నాయి.

ఈ నేపథ్యంలో సాంఘిక, ఆర్థిక అంతరాలు అంతం కావాలని, దేశీయ వనరులు దేశ ప్రజలకే చెందాలని, స్త్రీ పురుషుల మధ్య సమాత్వం రావాలని, స్థానిక మైనారిటీ జాతులకు స్వేచ్ఛ ఉండాలని సామ్రాజ్యవాదుల దోపిడీకి ముగింపు పలుకాలన్నది ఆ దేశ ప్రజల చిరకాల ఆకాంక్ష. ఈ ఆకాంక్షల నేపథ్యంలోనే 1960 దశకంలో కొలంబియాలో సాయుధ గెరిల్లా పోరాటం ప్రారంభమైంది. ఈ సాయుధ పోరాటానికి నేషనల్ లిబరేషన్ ఆర్మీ (ఇఎల్ఎన్), రివల్యూషనరీ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఆఫ్ కొలంబియా (ఎఫ్ఎఆర్‌సి) సారథ్యం వహించాయి. పోరాటం 2016 వరకు సాగింది. ఈ ఉద్యమంలో 40,787 మంది గెరిల్లాలు, 1,77,307 మంది పౌరులు మరణించారు. 2016 జూన్‌లో సాయుధ గెరిల్లాలకు ప్రభుత్వానికి మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. అయితే ఒప్పందంలోని అంశాలను అమలు చేయడంలో ఇవాన్ డ్యూక్ ప్రభుత్వం మాట తప్పింది. కొలంబియా మితవాద డ్యూక్ ప్రభుత్వానికి ఇప్పుడు అమెరికా ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది.

కొలంబియాలో దీర్ఘకాలిక సాయుధ పోరాటం ఫలితంగా అనేకమంది పోరాట యోధులు, ఆఫ్రో కొలంబియన్లు, స్థానిక జాతులు ఎలాంటి జీవనాధారాలు లేని స్థితిలో ఇప్పటికీ వారు భూమి కొరకు ప్రభుత్వంతో పోరాడుతున్నారు. 5 కోట్ల జనాభా ఉన్న దేశంలో 2.4 కోట్ల మంది కడు పేదరికంలో జీవిస్తున్నారు. 2016 ప్రభుత్వానికి విప్లవకారులకు మధ్య కుదిరిన శాంతి ఒప్పందంలో గ్రామీణ ప్రజల్లో అసమానతలు, సామాజిక అభివృద్ధిని పరిష్కరించే హామీలు ఉన్నాయి. మితవాద ఇవాన్ డ్యూక్ శాంతి ఒప్పందాన్ని అటుకెక్కించాడు. 2015 ఎఫ్ఎఆర్‌సి కాల్పుల విరమణ తరువాత 2018 నుంచి ప్రజలపై ప్రభుత్వ హింస మళ్లీ పెరిగింది. పారామిలిటరీ చేతిలో పౌరులు తీవ్రమైన వేదింపులకు గురవుతున్నారు. మానవ హక్కుల రక్షకులు, పాత్రికేయులు, స్వదేశీ, ఆఫ్రో–కొలంబియన్ నాయకులు, సామాజిక కార్యకర్తలు 904 మంది హత్యలకు గురయ్యారు, మరెందరో హింసను ఎదుర్కొంటున్నారు. మరోవైపు దేశాధ్యక్షుడు ఇవాన్ డ్యూక్ పేదలకు సంబంధించిన అనేక పథకాలకు నిధులు తగ్గించాడు. మెజారిటీ ప్రజల ఉనికిని గుర్తించ నిరాకరించాడు. వారి సంరక్షణ బాధ్యతను విస్మరించాడు. ఫలితంగా మెజారిటీ ప్రజల్లో అభద్రత, అశాంతి, ఆక్రోశం పెరిగింది.

2019 సెప్టెంబర్‌లో కొలంబియా అధ్యక్షుడు ఇవాన్ డ్యూక్ 'రివల్యూషనరీ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఆఫ్ కొలంబియా' (ఎఫ్ఎఆర్‌సి) పై సైనిక చర్యలు ప్రకటించాడు. కొలంబియా ప్రభుత్వ శాంతి ఒడంబడికను ఉల్లంఘించినందుకు, ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ ఎఫ్ఎఆర్‌సి నాయకుడు లూసియానో మారిస్ తిరిగి సాయుధ పోరాటాన్ని ప్రారంభిస్తున్నట్లు 2019, అక్టోబర్ 29న ప్రకటించారు. శాంతి ఒడంబడికలో పేర్కొన్న అసమానతల నివారణ, భూపంపిణీ, ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవడానికి బదులు అసమ్మతిని అణచివేయడానికి డ్యూక్ ప్రభుత్వం పూనుకుంది. ప్రజలకు మరోమార్గం లేక కొలంబియా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక ఆర్థిక, సామాజిక విధానాలను నిరసిస్తూ 2019 నవంబర్ 21న ఆ దేశ రాజధాని బోగోటాలో భారీ ప్రదర్శన చేశారు. ప్రభుత్వంలో మార్పు రాలేదు. కరోనా బీభత్సం ఉన్నా లెక్కచేయకుండా 2020 నవంబర్ 25న భారీ ప్రదర్శన బోగోటోలో అధ్యక్షుడు ఇవాన్ డ్యూక్ ఇంటి ముందు కర్ఫ్యూ ఆంక్షలు అధిగమిస్తూ వేలాది మంది ప్రదర్శన నిర్వహించారు. పోలీసు కాల్పుల్లో ముగ్గురు ఆందోళనకారులు మృతి చెందారు. దేశవ్యాప్తంగా పది లక్షల మంది కార్మికులు, విద్యార్థులు, అధ్యాపకులు నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. అభ్యుదయ వాదులు, సామాజిక నాయకుల ఊచకోతలు ప్రజల్లో ఆగ్రహాన్ని పెంచాయి. మొత్తంగా శాంతి ప్రక్రియను విస్మరించి ప్రజలను అణగదొక్కడానికి డ్యూక్ ప్రభుత్వం పూనుకుందన్న అభిప్రాయం ప్రజల్లో ఏర్పడింది.

పన్నుల పెంపు ప్రతిపాదనపై ప్రజాగ్రహం

ఫిబ్రవరి నుంచి కరోనా సెకండ్ వేవ్ తీవ్రతరం కావడం, ప్రభుత్వ ఖజానాకు గండి పడడంతో ద్రవ్యలోటు తగ్గించడానికి అధ్యక్షుడు ఇవాన్ డ్యూక్ ఏప్రిల్ 15న పన్నులు పెంచాలని నిర్ణయించడం ప్రజా ఆందోళనకు తక్షణ కారణమైంది. అయితే, 2022లో అధ్యక్ష ఎన్నికలు జరుగనున్నందున పన్నుల పెంపును కాంగ్రెస్ ఆమోదించే అవకాశాలు లేవు. ఇవాన్ డ్యూక్ ప్రభుత్వం అమలు చేస్తున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక సంస్కరణలకు, నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా జాతీయ ఉద్యమ కమిటీ, జాతీయ కార్మిక సంఘాల మండలి పిలుపుతో ఏప్రిల్ 28 నుంచి దేశవ్యాప్త కార్మిక సమ్మె ప్రారంభమైంది. పన్నుల పెంపు, ఆరోగ్య సంస్కరణలను వ్యతిరేకిస్తూ, కనీస వేతన స్థాయిలో అందరికి సార్వత్రిక ప్రాథమిక ఆదాయం కల్పించాలని, చిన్న వ్యాపారులకు అదనపు మద్దతు, పర్యావరణాన్ని నాశనం చేసే, భూమిని, నీటిని, గాలిని కలుషితం చేసే, ఆరోగ్యానికి హాని చేసే మోన్‌సాంటో కంపెనీ ఉత్పత్తి క్రిమి సంహారకమైన గ్లైపోసెట్ ఆధారిత హెర్బిసైడ్లను చల్లడాన్ని నిషేధించాలన్న డిమాండ్లతో ప్రధాన నగరాలైన బోగోటా, కాలి, మెడెల్లిన్, పెరిరాలలో సమ్మె ప్రారంభమైంది.

ఈ సమ్మె వందకు పైగా ఉన్న మున్సిపాలిటీల్లో కూడ సమ్మె విజయవంతమైంది. లక్షలాది మంది వీధుల్లోకి వచ్చి కవాతులు, నిరసనలు, రహదారుల దిగ్బంధం చేశారు. ఉద్యమ ఉధృతిని గమనించిన అధ్యక్షుడు ఇవాన్ డ్యూక్ పెంచిన పన్నుల ప్రతిపాదనను మే 2న ఉపసంహరించుకున్నాడు. ఆ మరుసటి రోజు దేశ ఆర్థిక మంత్రి అల్బెర్టో కరాస్క్విల్లా రాజీనామా చేశాడు, అయినా ప్రజలు వీధుల్లో గుంపులుగా నిరసనలు తెలియజేస్తూనే ఉన్నారు. సమానత్వం, విద్య, ఆరోగ్యం వంటి డిమాండ్లతో పాటు కార్పొరేట్ల అవినీతిపై, ప్రపంచీకరణ అనుకూల ఆర్థిక విధానాలను ఉపసంహరించుకోవాలని, మహిళల పట్ల అనుచితంగా వ్యవహరించిన పారామిలిటరీ, పోలీసులపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లతో కార్మిక సమ్మె, ప్రజా ఆందోళన ఇప్పటికీ కొనసాగుతుంది.

కార్మిక సమ్మె సందర్భంగా మే 5న బంద్ పిలుపు ఇవ్వడంతో ఎక్కడికక్కడ ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. నిరసన ప్రదర్శనల్లో కార్మికులకు తోడు మహిళలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, వ్యాపార వాణిజ్య వర్గాలు వేలాదిగా పాల్గొన్నారు. ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించినప్పటికీ ఏమాత్రం లెక్క చేయకుండా దేశవ్యాప్త బంద్‌కు దిగారు. ఈ సందర్భంగా ఆందోళనకారులపై అల్లర్ల నిరోధక పోలీస్‌లు (ఎస్మాద్) క్రూరమైన నిర్బంధకాండకు దిగారు. ఈ దాడులను కొలంబియా సామాజిక, పౌర సంస్థలు తీవ్రంగా ఖండించాయి. పోలీసుల క్రూరత్వ చర్యలకు స్వస్తి పలుకాలని, ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సంస్థలు గొంతెత్తాయి. దేశవ్యాప్తంగా, చాలాచోట్ల సాయుధ పోలీసులు ప్రదర్శనకారులను అడ్డుకున్నారు. కొన్ని చోట్ల కాల్పులు జరిగాయి. నిరసనల సందర్భంగా దాదాపు 2000 చోట్ల దాడులు జరిగాయని ఓంబుడ్స్‌మన్ కార్యాలయం తెలిపింది. ఈ ప్రదర్శనల్లో ఇప్పటివరకు 58 మంది చనిపోయారని అటార్నీ జనరల్ కార్యాలయం తెలిపింది. ఈ ఘటనల్లో 100 మందికి పైగా

చనిపోయినట్లు, 100 మంది కళ్లు పోయాయని, వేలాది మందికి గాయాలయ్యాయని, పదుల సంఖ్యలో యువకులు కన్పించడం లేదని పౌర హక్కుల సంఘాలు తెలిపాయి. పెరీరాలో జరిగిన దాడిలో గుర్తుతెలియని దుండగులు ముగ్గురు యువకులను తీవ్రంగా గాయపరిచారు. శాంతియుతంగా ప్రదర్శన చేస్తుండగా జరిపిన ఈ దాడిలో యూనివర్సిటీ విద్యార్థి లూకాస్ విల్లాకు 8 కత్తిపోట్లు తగిలాయి.

తరాలుగా కొనసాగుతున్న అంతరాలు, ప్రభుత్వ నేతల అవినీతి, సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల దోపిడీకి చరమగీతం పాడాలన్నది ఉద్యమకారుల సంకల్పంగా ఉంది. రాజధాని బోగోటాలో, దేశంలో మూడవ పెద్ద నగరమైన కాలిలో ఆందోళనకారులు రహదారులను దిగ్బంధం చేశారు. ప్రభుత్వ వాహనాలను తగులబెట్టారు. పెట్రోల్ బంకులను దహనం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు నిప్పు పెట్టారు. నిరసనకారులు ప్రభుత్వం ప్రతిష్టించిన విజేతల విగ్రహాలను కూల్చి వేశారు. బరాన్క్విల్లా పట్టణం ఉత్తర భాగాన ఉన్న క్రిష్టోఫర్ కొల్‌బస్ విగ్రహాన్ని కూల్చి వేశారు. పోలీసులకు నిరసనకారులకు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కొందరు మరణించగా పలువురు గాయపడ్డారు. పౌర భవనాలు, పోలీసు స్టేషన్లు ఉద్యమకారుల ఆగ్రహానికి ఆహుతి అయ్యాయి. వ్యాపారాలు ఆగిపోయాయి. ప్రభుత్వ పాలన స్థంభించింది. నగరాలు చెత్తతో నిండి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. కాలి నగరానికి తూర్పున ఉన్న ప్యూర్టో రెలెనా కూడలిని నిరసనకారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి 'ప్యూర్టో రెసిస్టెన్సియా' అని పేరు పెట్టారు. చుట్టూ భోగి మంటలు, ర్యాప్ మ్యూజిక్ బ్లేరింగ్‌తో, పోలీసుల ఘర్షణలో గాయపడిన వారి గౌరవార్థం డ్యాన్స్‌తో పాటు కొవ్వొత్తులు వెలిగించారు. "మేము ఇక్కడ ఉన్నాం, ఎందుకంటే మేము అవినీతితో, అసమానతలతో, పేదనతో, వివక్షతో అలిసిపోయాం, విసిగిపోయాం" అని వృద్ధ మహిళలు ఉక్రోశంతో చెబుతున్నారు.

ఇవాన్ డ్యూక్ నియంతృత్వ పాలనతో ప్రజలు విసిగిపోయారని మానవ హక్కుల సంస్థ టెంబ్లోర్స్ పేర్కొంది. దేశవ్యాప్తంగా 963 మందిని నిర్బంధించారని, వందకు పైగా లైంగిక వేదింపుల కేసులు నమోదయ్యాయని ఈ సంస్థ పేర్కొంది. దేశంలోని ప్రస్తుత పరిస్థితులపై ఇవల్ స్పెక్టేడర్ పత్రిక తన సంపాదకీయంలో స్పందిస్తూ... దేశం ప్రత్యేక పరిస్థితుల్లో జీవిస్తోందన్న విషయం డ్యూక్ ప్రభుత్వం అర్థం చేసుకోలేకపోతోంది. దీని పరిష్కారానికి సాంప్రదాయ రాజకీయ ఒప్పందాలకు మించి ప్రతిస్పందన అవసరమని పేర్కొంది. కొలంబియాలో అధ్యక్షుడి రాజీనామా కోరుతూ వేలాది మంది వీధుల్లో ఆందోళనలు చేస్తున్నందున ప్రస్తుత సంక్షోభంతో ప్రభావితమైన వారికి ప్రభుత్వ మద్దతు అవసరం. అదే సమయంలో ఇవాన్ డ్యూక్ ప్రభుత్వం చేపట్టిన పోలీస్ సంస్కరణలు, ఆరోగ్య రంగంలో సంస్కరణలను, పన్నుల పెంపుదలను రద్దు చేయాల్సిన అవసరం ఉందని ఆ పత్రిక సంపాదకీయం పేర్కొంది. హింసను విడనాడాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చినా ఆందోళనకారులపై డ్యూక్ ప్రభుత్వం దాడులు కొనసాగిస్తోంది. భౌతిక దాడులతో పాటు పెద్దయెత్తున జన సమీకరణ కాకుండా ఉండేందుకు ఇంటర్నెట్, విద్యుత్ కోతలు పెడుతూ నిరంకుశంగా వ్యవహరిస్తోంది.

ఉద్యమంలో అగ్రభాగాన మహిళలు

ఇవాన్ డ్యూక్ నిరంకుశ పాలనకు, అవినీతికి వ్యతిరేకంగా కొనసాగుతున్న నిరసనలలో మహిళలు అగ్రభాగాన నిలువడం ఆసక్తికరమైన అంశం. దేశంలోని పలు నగరాల్లో మహిళలపై లైంగిక హింస, వివక్షకు వ్యతిరేకంగా పెద్ద సంఖ్యలో నిరసనలు తెలిపారు. ఈ ఉద్యమంలో భద్రతా దళాలు, ఎస్మాద్ పోలీసులు మహిళలను ఉద్యమానికి దూరం చేయడానికి లైంగిక హింసను ఉద్యమ అణచివేతకు సాధనంగా వాడుకుంటున్నారు. ఇప్పటివరకు భద్రతా దళాలు తమను లైంగిక హింసకు గురిచేసినట్లు 53 మంది ఫిర్యాదు చేశారు. మహిళలపై హింసాత్మక చర్యలకు పూనుకోవడం ద్వారా భయపెట్టి నిరసనలు ఆపలేరని స్త్రీవాద సంస్థ డైరెక్టర్ లిండా స్పష్టం చేసింది. మహిళల్లో చోటు చేసుకున్న తీవ్ర వ్యతిరేకతను అరికట్టేందుకు ప్రభుత్వం బలవంతంగా ప్రయత్నిస్తోందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఇవాన్ డ్యూక్ ప్రభుత్వ భద్రతా దళాలు 132 మందిపై లైంగిక దాడులకు పాల్పడినట్లు పేదల హక్కుల పరిరక్షణ కమిటీ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. వీటిలో 110 లైంగిక హింస కేసులుండగా, 23 అత్యాచార కేసులున్నాయి. మొత్తంగా మూడు మాసాల ఉద్యమంలో నలుగురు మహిళలు మృతి చెందగా 40 మందికి తీవ్ర గాయాలయ్యాయి. అయినా మార్పు కోసం పోరాడడానికి గతంలో కంటే ఎక్కువ నిశ్చయంతో ఉన్నామని మహిళా సంఘాలు, ప్రదర్శనకారులు అంటున్నారు. మే 10న 173 మహిళ సంఘాలు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో తరాలుగా కొనసాగుతున్న పురుషాధిక్యత, పోలీసుల లైంగిక వేదింపులు, అంతమయ్యేవరకు, మహిళలకు సామాజిక న్యాయం అందేవరకు ఈ ఉద్యమం ఆగదని తెలిపాయి. సమాజంలో ఆర్థిక సాంఘిక అంతరాలు తగ్గి, అందరికి విద్య, ఆరోగ్యం, ఉపాధి అందినప్పుడే సమాజంలో ప్రశాంతత నెలకొంటుందని స్పష్టం చేశాయి. అందుకు సామ్రాజ్యవాద కార్పొరేట్ల అనుకూల ప్రభుత్వాన్ని కూల్చాలని ప్రజలకు పిలుపు నిచ్చాయి.

అల్లర్ల నిరోధక పోలీసులతో వాగ్వివాదం చేస్తూ తమ నిరసనను అసంతృప్తిని తెలియజేస్తున్న నిరసనకారులను రక్షించడానికి 10 మంది వృద్ధ తల్లులు, తమ స్నేహితులు నిరసనకారులకు, పోలీసుల మధ్యలో అడ్డుగా నిలబడుతున్నారు. ప్రతిదినం తల్లులు పోర్టల్ డి లాస్ అమెరికాస్కు వెలుతారు. కాలి పట్టణంలో ఈ సెంటర్ ఉద్యమ కేంద్రం. దీనిని నిరసనకారులు ఇప్పుడు పోర్టల్ డి లా రెసిస్టెన్సియాగా పేరు మార్చారు. దానిని మానవత జోన్ అంటున్నారు. నిరసనకారులు తమ చిన్న పిల్లల కోసం ఆటలు, పాటలు, నృత్యాలు నిర్వహిస్తారు. సూప్ తయారు చేసి పిల్లలకు వడ్డిస్తున్నారు. ఇదంతా పండుగ వాతావరణాన్ని తలపిస్తుంది. నిరసనకారులపై పోలీసులు దాడిచేయకుండా రక్షణగా తల్లులు ఉంటారు. "మేం దాడి చేయం, పోలీసులు మాపై దాడి చేసేవరకు వేచి ఉంటాం" అని లా ప్లాకా అనే మహిళ పేర్కొంది. యువ నిరసనకారులకు ఏమి జరుగకుండా వారితో కలిసి మేం ముందు భాగాగ నిలబడతాం అని ఆమె అంటుంది.

ముగింపు

ఏప్రిల్ 28 నుండి దేశవ్యాప్త సమ్మె, నిరసన ప్రదర్శనలు కొలంబియాను స్థంభింప చేశాయి. ప్రజలు మొదట ప్రతిపాదిత పన్ను పెంపుకు వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చారు. ఉద్యమ తీవ్రతను గమనించిన అధ్యక్షుడు 5వ రోజు మే 2న వివాదాస్పదమైన పన్నుల పెంపు

సోషలిస్టు క్యూబాను కూలదోసే ప్రయత్నం

సోషలిస్టు క్యూబాను లొంగదీసుకోవాలని అమెరికా ఆ దేశంపై అమలుచేస్తున్న ఆంక్షలు, దాడుల్లో భాగమే కొద్దిమందిని రెచ్చగొట్టి ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే ప్రయత్నమని అంటున్నారు **డా. కొల్లా రాజమోహన్**

క్యూబాలో కొంతమంది ప్రజలు ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు చేశారు. ఈ ప్రదర్శనలలో ఒక వ్యక్తి మరణించినట్లు, కనీసం వందమందిని అరెస్టు చేసినట్లుగా వార్తలు వస్తున్నాయి. క్యూబాలో కమ్యూనిస్టు నియంతృత్వాన్నుండి విముక్తి కావాలని ప్రదర్శనకారులు కోరుతున్నారు. పోలీసు కార్లను ధ్వంసంచేసి షాపులను లూటీ చేసినట్లుగా కూడా వార్తలొచ్చాయి. నిరసన ప్రదర్శనలు జరిగిన మరో రోజే వారికి మద్దతును అమెరికా ప్రభుత్వం ప్రకటనిచ్చింది. క్యూబాలో ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరిస్తున్నారనడానికి ఈ నిరసనలు ఒక నిదర్శనమని బైడెన్ ప్రభుత్వం వ్యాఖ్యానించింది. క్యూబా ప్రభుత్వమే ఈ అశాంతికి కారణమని ఆరోపించింది. అమెరికా ప్రభుత్వ ప్రకటనను క్యూబా విదేశాంగ మంత్రి రోడ్రిగజ్ సవాలుచేశారు. 'నిన్నటివరకూ క్యూబాలో ఎలాంటి అశాంతి లేదు. కానీ కొంతకాలంగా అమలవుతూవస్తున్న కమ్యూనికేషన్ ఆపరేషన్ వల్లనే ఈ కల్లోలం అశాంతి తలెత్తాయి' అని ప్రకటించారు.

క్యూబా ప్రభుత్వ అధ్యక్షుడు డియాజ్ కానెల్ శాన్ ఆంటోనియా డీ బావోస్ ప్రాంత పర్యటన సందర్భంగా అమెరికా ప్రేరేపిత గ్రూపులు ఈ ప్రదర్శనలు చేశాయని, అమెరికా ఆంక్షలవలన తలెత్తిన అశాంతిగా కానెల్ వ్యాఖ్యానించారు. ఆహార కొరత, కరంటు కోత ప్రజల ఆగ్రహానికి కారణమని కూడా పాశ్చాత్య మీడియా ప్రచారంలో పెట్టింది.

క్యూబా ప్రభుత్వ పతనాన్ని కోరుతున్న అమెరికా నాయకులకు ఈ ప్రదర్శనలు మంచి అవకాశంగా వుంది. ఫ్లారిడా పదవ జిల్లా డెమోక్రటిక్ పార్టీ నేత వాల్ డెమింగ్స్ 'క్యూబా ప్రజలు నియంతృత్వానికి, పేదరికానికి వ్యతిరేకంగా స్వేచ్ఛా స్వాతంత్రాల కోసం చేసే పోరాటానికి అమెరికా ప్రభుత్వం క్యూబాలో వెంటనే జోక్యం చేసుకోవాలని' డిమాండ్ చేసారు. ఒక ప్రభుత్వంపై విధించగలిగిన కఠినమైన ఆర్థిక ఆంక్షలన్నిటినీ అమెరికా ప్రభుత్వం విధించింది. ఇక మిగిలింది మిలిటరీ జోక్యమే. ఇదివరకు 1961లో ఒకసారి ప్రత్యక్షంగా సైనికులను క్యూబా దేశంలో దింపి భంగపడింది. 'బే ఆఫ్ ఫిగ్స్'గా పేరుపొందిన క్యూబా పై సైనిక జోక్యంతో అధ్యక్షుడు కెనడీ అంతులేని ఆపఖ్యాతిని మూటకట్టుకున్నాడు. తాజాగా ఆఫ్ఘనిస్థాన్‌లో ఇరవై సంవత్సరాల యుద్ధాన్ని కొనసాగించలేక, బైడెన్ ప్రభుత్వం తన లక్ష్యాలను వదులుకుని సేనలను ఉపసంహరించుకోక తప్పలేదు. 1968లో, వియత్నాం యుద్ధంలో 5 లక్షల అమెరికా సైన్యం చవిచూచిన పరాజయాలను, యుద్ధ వ్యతిరేక అమెరికా ప్రజల పోరాటాల చరిత్రను, ఇరాక్‌లో సద్దాం హుస్సేన్ దారుణ హత్యను ప్రజలింకా మరచిపోలేదు. మిలిటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ కార్పొరేట్ కంపెనీల కోసం చేస్తున్న యుద్ధాలను అమెరికా ప్రజలు అనుమతించే పరిస్థితి లేదు. గత అరవై ఏళ్లకుపైగా అమెరికా అత్యంత కఠినమైన రీతిలో క్యూబాపై ఆంక్షలను విధించి అమలుపరుస్తూవుంది. 60 సంవత్సరాల సుదీర్ఘ ఆంక్షలవలన క్యూబా ఆర్థిక ప్రగతి

ప్రతిపాదనను ఉపసంహరించుకోగా, నిరసనకారులు ఇప్పుడు అందరికి ఉచిత ఆరోగ్యం, విద్య, సబ్సిడీపై ఆహారపదార్థాలు, పోలీసు సంస్కరణలు కోరుతున్నారు. ప్రత్యేకించి మహిళలు పురుషాధిక్యత, వివక్ష అంతం కావాలని డిమాండు చేస్తున్నారు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాలు రద్దు చేసుకొని సామాజిక న్యాయం అందరికి అందించాలని ముక్త కంఠంతో నినదిస్తున్నారు. కొలంబియా స్వాతంత్ర దినమైన జూలై 20 ఒక భారీ ప్రదర్శనకు జాతీయ ఉద్యమ కమిటీ సన్నాహాలు చేస్తుంది. అదే సమయంలో పారా మిలిటరీ, అల్లర్ల నిరోధక పోలీసులు (ఎస్మాద్) ప్రజలపై తీవ్ర నిర్బంధాన్ని, హింసను ప్రయోగిస్తున్నారు. ఈ పరిస్థితిని గమనిస్తే ఆందోళన ఇప్పట్లో సద్దుమణిగేటట్లు కన్పించడం లేదు. మార్పు కోసం ప్రజలు ధృడ సంకల్పంతో ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా ప్రజా ఉద్యమానికి ప్రభుత్వం తలవంచక తప్పదన్నది చరిత్ర చెప్పిన సత్యం. మొత్తంగా ఈ ఉద్యమం సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను వ్యతిరేకించేదిగా కనిపిస్తోంది.

ప్రపంచ వ్యాపితంగా పలుదేశాల్లో ఈ తరహా ఉద్యమాలే కొనసాగుతున్నాయి. పేదరికం, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరిగిపోతుంది. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రజల కొనుగోలు శక్తి క్షీణిస్తున్నది. ఫలితంగా కార్మికులు, కూలీలు, రైతులు, మధ్యతరగతి ప్రజల తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారు. సామ్రాజ్య, అర్ధఫాసిస్టు ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ల అనుకూల పాలన సాగిస్తున్నాయి. నేడు పలు దేశాల్లో రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, అణగారిన ప్రజలు నూతన పోరు బాటన ఉద్యమిస్తున్నారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం, అంతరాలు లేని సమాజం కోసం ఉవ్వెత్తున ఎగిసిపడిన కెరటంలా సాగుతున్న ఈ ఉద్యమాలు పాలకులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఇటీవలి కాలంలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు విస్ఫోటాల్ల రగులుతూ ప్రభుత్వాల కంటికి కునుకు రానీయకుండా చేస్తున్నాయి. చిలే, పెరూ దేశాల్లో జరిగినట్లుగానే కొలంబియా ప్రజా ఉద్యమం ఐక్యంగా ఉధృతంగా దృఢ సంకల్పంతో సాగుతోంది. ఈ ఉద్యమానికి ప్రపంచ ప్రజల మద్దతు అందించాల్సి ఉంది.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు, రాజనీతి శాస్త్ర విద్యార్థి) వీ

నిలిచిపోయింది. అయినా మానవాభివృద్ధి సూచికలో, పర్యావరణ పరిరక్షణలో ముందుంది.

సామాజిక న్యాయం అమలుపరుస్తున్న దేశంగా ప్రజల మన్నన పొందింది. విద్య, వైద్యం, సామాజిక భద్రత, సమానత్వం అమలులో ఖ్యాతి పొందింది. సామాజిక విప్లవంలో ప్రజలను భాగస్వామ్యం చేయటంవలన కాస్ట్రో, చేగువేరా అందించిన సోషలిస్టు చైతన్యంతో కష్టాలను నిబ్బరంగా ఎదుర్కొంటున్నారు. క్యూబా ప్రజల ప్రియతమ నాయకుడు క్యాస్ట్రో పై 634 సార్లు అమెరికా గూడచారి యంత్రాంగం హత్య చేయడానికి ప్రయత్నాలు చేసింది. అయినా క్యూబా ప్రభుత్వం తన చుట్టూ ఉన్న సామ్రాజ్యవాదం నుంచి పొంచివున్న ప్రమాదాన్ని అత్యంత ప్రతిభావంతంగా, పట్టుదల, నిరంతర కృషితో అన్ని రంగాలలో ఎదుర్కొంటూ పురోగతిని సాధిస్తున్నారు. విప్లవ ప్రభావం ఎంత తీవ్రంగావుంటే పాత వ్యవస్థ పునరుద్ధరణ అంత కష్టమవుతుంది అనేది వాస్తవం. 2014లో చేసిన క్యూబా పర్యటనలో మేము ఎక్కడా వ్యాపారాన్ని ప్రోత్సహించే ప్రకటన బోర్డులను చూడలేదు. టీకాలు వేయించుకోమనీ, తల్లులను పాలివ్వమనీ పెద్ద పెద్ద బోర్డులు కనపడతాయి. ఒక బోర్డులో 'ప్రపంచ వ్యాప్తంగా ప్రతిరోజూ సుమారు 20 కోట్ల మంది చిన్నారులు వీధుల్లో నిద్రిస్తారు. వారిలో క్యూబన్లు ఒక్కరు కూడా లేరు' ఈ మాటలు 1996లో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో క్యూబా ఉపాధ్యక్షుడు ఉపన్యాసం నుండి రాశారు. మరోచోట విప్లవం గురించి, కాస్ట్రో 'సోషలిజం లేదా మరణం' అనే మాటలున్న బోర్డులున్నాయి. ప్రతి అవకాశాన్నీ ప్రజలను చైతన్యపరచటానికి ఉపయోగిస్తున్న సంస్కృతి నుండి వినియోగ సంస్కృతిలోకి మార్చాలని అమెరికా ప్రజలను రెచ్చగొడుతున్నది.

అమెరికా ఆంక్షలే పేదరికానికి కారణం

ఆంక్షల ఫలితంగా ప్రజలు కష్టాలపాలయి ప్రభుత్వం పై తిరగ పడాలనేదే అమెరికా కోరిక. క్యూబా ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే లక్ష్యంతో ఆంక్షలను పెంచుతూ వున్నారు. క్యూబన్ ప్రజలపై అనూహ్యమైన రీతిలో భారాలు విధించారు. కరోనా సమయంలో కూడ ఈ ఆంక్షలను మరింత కఠినంగా అమలుపరుస్తున్నారు. ట్రంప్ ప్రభుత్వం అదనంగా విధించిన 243 ఆంక్షలను జో బైడన్ ప్రభుత్వం కొనసాగిస్తూనేవున్నది. ఇతర దేశాల స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమాధికారాన్ని గౌరవిస్తానని ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాన్ని బైడన్ మరిచాడు. కోవిడ్ కాలంలో తన నిర్లక్ష్యం వలన లక్షలాది మంది ప్రజల మరణానికి కారణమైనందున బ్రెజిల్ అధ్యక్షుడు బోల్సనారో సుప్రీంకోర్టు విచారణను ఎదుర్కొంటున్నాడు. అమెజాన్ అడవులను కార్పొరేట్లకు అనుకూలంగా నాశనం చేసి ప్రజాగ్రహాన్ని చవిచూస్తున్నాడు. అతను కూడా క్యూబా వ్యతిరేక ప్రదర్శనకారులకు సంఘీభావం తెలిపి తన నైజాన్ని నిరూపించుకున్నాడు. క్యూబాలో ఆంక్షలవలన కష్టాలు పడుతున్న ప్రజలను రెచ్చగొట్టి సోషలిస్టు ప్రభుత్వాన్ని కూలదోయపూనుకున్నారు. అదనంగా విధించిన ఆంక్షల ఫలితంగా ప్రధాన ఆదాయవనరైన చక్కెర ఎగుమతులు దెబ్బతిన్నాయి. అమెరికా ఆంక్షలతో పాటుగా కరోనా తోడవడంతో టూరిజం వలన వచ్చే ఆదాయం పూర్తిగా పడిపోయింది. అత్యంత అమానవీయరీతిలో ఆహార పదార్థాలను, ప్రాణాధార మందులను కూడా దిగుమతి చేసుకోనివ్వడంలేదు. వ్యాక్సిన్ల తయారీకి అవసరమైన ముడిపదార్థాలను కూడా కొనుక్కోనివ్వడంలేదు. అయినా, అమెరికా కంపెనీలు ఫైజర్, మోడర్నా వ్యాక్సిన్లకు దీటుగా, పోటీగా స్వంతంగా అయిదు రకాల వ్యాక్సిన్లను క్యూబా అభివృద్ధి చేసింది. లాటిన్ అమెరికా, ఆఫ్రికా ప్రజలకు, కావాలంటే అమెరికాకు కూడా వ్యాక్సిన్లను ఇస్తామన్నారు. కోవిడ్ సమయంలో 23 దేశాలకు డాక్టర్లను, నర్సులను పంపి ప్రపంచ ప్రజలకు అండగా నిలిచింది.

ఒక చిన్నదేశంపై ప్రపంచంలోనే అత్యంత బలవంతమైన అమెరికా తన శక్తినంతా ఉపయోగించి క్యూబా ప్రభుత్వాన్ని కూలదోయాలని చూస్తున్నది. జూన్ 23న ఐక్యరాజ్య సమితి సర్వ సభ్య సమావేశాలలో క్యూబా పై ఆంక్షలను ఎత్తివేయాలని 184 దేశాలు తీర్మానించాయి. 1992 నుండీ ఐక్యరాజ్య సమితిలో ఆంక్షలను ఎత్తివేయామని మెజారిటీ దేశాలు తీర్మానాలు చేస్తూనేవున్నాయి. అమెరికా ప్రభుత్వం లెక్కచేయడంలేదు. 2020లో ఆర్థిక దిగ్బంధనం వల్ల 9.1 మిలియన్ డాలర్లను క్యూబా నష్టపోయిందని, కరోనా వైరస్ లాగానే ఆంక్షలు, దిగ్బంధనాలు ఊపిరి పీల్చుకోకుండాచేసి హతమార్చాలనే కుట్రలో అమెరికా ఉందని క్యూబా విదేశాంగ మంత్రి రోడ్రిగజ్ స్పష్టం చేశారు.

కేవలం కోటికి పైగా జనాభా ఉన్న క్యూబాకు 90 మైళ్ల దూరంలో ఉన్న అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం కేంద్రంగా చేసుకుని అసమ్మతిని రెచ్చగొడుతున్నారు. ప్రభుత్వం పట్ల వ్యతిరేకతను రెచ్చగొడుతూ, మరొక పక్క బూటకపు వార్తలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. అందుకు పావులుగా క్యూబా దేశం నుండి పారిపోయివచ్చిన వారిని వాడుకుంటున్నారు. వారి ద్వారా క్యూబా లోవున్న ప్రజలను, వారి బంధువులను, స్నేహితులను లోబరచుకునే ప్రయత్నం చేస్తున్నారు. అసమ్మతి వాదులకు ధన సహాయం, సామాజిక మాధ్యమాలకు అవసరమయిన సాంకేతిక సహాయాన్నిస్తున్నారు. పాశ్చత్య మీడియాతో కలిసి రకరకాల కథనాలను ప్రచారం చేస్తున్నారు.

క్యూబాలో సార్వభౌమత్వం కలిగిన ఒక దేశ అంతరంగిక వ్యవహారాలలో బయటి దేశాల జోక్యం లేదా విచ్ఛిన్నకర చర్యలను ప్రోత్సహించడం అంటే క్యూబాను అస్థిరపరచడమేనని, ఇది తమకు ఎంతమాత్రమూ ఆమోదయోగ్యంకాదని రష్యా ప్రకటించింది. క్యూబాలో ఇతర దేశాల జోక్యందారీ విధానాలను తాము గట్టిగా వ్యతిరేకిస్తున్నామని మెక్సికో అధ్యక్షుడు ఆండ్రెస్ హెచ్చరించారు. క్యూబా ప్రభుత్వానికి, ప్రజలకు లాటిన్ అమెరికా ప్రజలు, సంస్థలు, సంఘాలు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. అమెరికా ఆంక్షలను ఎదుర్కొంటున్న మరొక లాటిన్ అమెరికా దేశం వెనిజులా క్యూబాలో అమెరికా జోక్యాన్ని సహించమని వెనిజులా అధ్యక్షుడు మదురో హెచ్చరించారు. ప్రపంచ మానవాళికి వ్యతిరేకంగా సాగే అత్యాచారాలకు, విద్వేష చర్యలకు, అధర్మ యుద్ధాలకు కారణమైన అమెరికాకు క్యూబాలో హక్కుల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. క్యూబా ప్రజల పేదరికానికి కారణమైన అమెరికా ఆంక్షలను వెంటనే రద్దు చేయాలని, క్యూబా ప్రభుత్వాన్ని కూలదోసె ప్రయత్నాలను ఆపాలని ప్రపంచ ప్రజలందరం ముక్త కంఠంతో కోరదాం.

(రచయిత భారత-చైనా మిత్రమండలి, ఆంధ్రప్రదేశ్, మాజీ అధ్యక్షులు) వీ

నూతన విద్యా విధానానికి నిరసనగా ధర్నా

పేద విద్యార్థులకు నష్టం కలిగించే నూతన విద్యా విధానం అమలుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీచేసిన జిఓ 172ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విజయనగరంలో విద్యార్థుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. బొబ్బిలి పట్టణంలోని జయప్రకాశ్ మున్సిపల్ పాఠశాల వద్ద సిఐటియు అధ్వర్యంలో జూలై 2న నిరసన తెలిపారు. నూతన విద్యా విధానాన్ని దేశంలో ఎక్కడా అమలుచేయకుండా ఆంధ్రప్రదేశ్‌లో అమలుచేయాలనుకోవడం పేదలకు విద్యను దూరం చేయడమేనని విమర్శించారు.

ప్రజా సంఘాలపై నిషేధం తొలగింపు

తెలంగాణ ప్రజా భద్రతా చట్టం 1992 ప్రకారం 16 ప్రజా సంఘాలపై ఏడాదిపాటు నిషేధం విధిస్తూ ప్రభుత్వం జిఓ నెం.73ని జారీచేసింది. మూడు నెలల తర్వాత నిషేధం ఎత్తివేస్తున్నట్లు జూన్ 23న జారీచేసిన గెజిట్‌ను ప్రభుత్వం జూలై 6న వెల్లడించింది. ప్రభుత్వం చట్ట వ్యతిరేకంగా నిషేధం విధించిందని అమరుల బంధుమిత్రుల సంఘం హైకోర్టులో జిఓ నెం. 73ను రద్దు చేయాలని పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌పై 4 వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ లోగానే ప్రభుత్వం నిషేధాన్ని ఎత్తివేసింది. సాంకేతిక కారణాలతో మాత్రమే నిషేధాన్ని ఎత్తివేసినట్లు రాష్ట్ర డిజిపి మీడియాకు వెల్లడించారు.

పన్నుల పెంపును వ్యతిరేకిస్తూ నిరసనలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెంచిన ఆస్తి పన్ను, యూజర్ ఛార్జీలను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ పట్టణ పౌర సమాఖ్య ఆధ్వర్యంలో జూలై 2న రాష్ట్రంలోని పలు చోట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ సంస్కరణల పేరుతో ఆస్తి పన్ను, చెత్త పన్ను విధించే జిఓ నంబర్ 196, 197, 198లను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చెత్తపై పన్ను సిగ్గుచేటంటూ పట్టణ పౌర సంక్షేమ సంఘం, సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నగర, మున్సిపల్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టారు. ఆస్తి పన్ను పెంపు, చెత్తపై పన్నును వ్యతిరేకిస్తూ కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రొ. జయశంకర్ స్మారక సదస్సు

ప్రొ. జయశంకర్ 10వ స్మారక సదస్సును తెలంగాణ విదావంతుల వేదిక ఆన్‌లైన్ జూమ్‌లో జూలై 3న నిర్వహించింది. ప్రధాన వక్తగా రామచంద్రగుహ పాల్గొన్నారు. ఇప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. 1990లోకి వచ్చేసరికి కుల, మత రాజకీయాలు తీవ్రమయ్యాయన్నారు. సంపద పెరగకుండా ఆర్థిక, సామాజిక భద్రత ఇవ్వలేమని, ఈ దేశాన్ని హిందు రిపబ్లిక్‌గా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. రాజ్యాంగ సంస్థలను తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. సమైఖ్య స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. అంతర్జాతీయంగా కూడా దేశ ప్రతిష్ట మసకబారుతోందన్నారు.

ప్రజా సంఘాలకు స్వేచ్ఛనివ్వాలి

ప్రభుత్వం 16 ప్రజా సంఘాలపై నిషేధం ఎత్తివేసిన సందర్భంగా విప్లవ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్రొ. హరగోపాల్ ఫోన్ ఇన్‌లో మాట్లాడారు. ప్రజా సంఘాలపై నిషేధం ఎత్తివేయడం మాత్రమే సరిపోదని, రాజ్యాంగ విలువలకు లోబడి ప్రజా సంఘ కార్యకర్తలను పనిచేయనివ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాలను మావోయిస్టు పార్టీ అనుబంధ సంఘాలుగా తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీఓల్లో ప్రస్తావించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. టిఆర్ఎస్ రాజకీయాలను అనుసరించడం ఒక్కటే రాజకీయ స్వేచ్ఛకాదన్నారు.

ఉద్యోగాల్లోకి తీసుకోవాలని స్టాఫ్ నర్సుల ఆందోళన

ఔట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సుల డిఎంఇ కార్యాలయ ముట్టడి ఆందోళనను పోలీసులు అడ్డుకోవడంతో ఘర్షణకు దారితీసింది. కరోనా తీవ్రంగా ఉన్న కాలంలో ప్రాణాలను లెక్కచేయకుండా సేవలందించాం. అర్ధాంతరంగా మమ్మల్ని ఉద్యోగం నుండి తొలగించి తీవ్ర అన్యాయం చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1600 మందిని వీధుల్లోకి నెట్టారని ఆగ్రహిస్తూ స్టాఫ్ నర్సులు ఆందోళనకు దిగారు. జూలై 9న హైదరాబాద్‌లోని నాంపల్లిలో గల గాంధీభవన్ నుంచి కోఠిలోని డిఎంఇ కార్యాలయాన్ని ముట్టడించేందుకు వెళుతుండగా పోలీసులు అడ్డుకోవడంతో తోపులాటలో కొందరికి గాయలయ్యాయి. పోలీసులు నర్సులను బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు.

కోకాపేట, ఖానామెట్ భూముల వేలం పై నిరసనలు

కోకాపేట, ఖానామెట్‌లోని ప్రభుత్వ భూముల వేలంపై స్టే ఇవ్వడానికి తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. జిల్లాల్లో వెయ్యి ఎకరాలకు తగ్గకుండా ల్యాండ్ బ్యాంకులు ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై విచారణ చేపడతామంది. తమకు కేటాయించిన ఇంటి స్థలాలు చూపించేవరకు హెచ్ఎండిఏ వేలం పాటలు ఆపాలని డిమాండ్ చేస్తూ ఖానాపూర్ వాసులు జూలై 14న కోకాపేట భూముల వద్ద ఆందోళనకు దిగారు.

పోడు రైతులపై దాడులు

హరితహారం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ఫారెస్టు అధికారులు ఆదివాసులపై దాడులుచేస్తున్నారు. అనేక దశాబ్దాలుగా పోడుగొట్టి తమ జీవనాన్ని సాగిస్తున్న పోడు రైతులపై దాడులకు పాల్పడుతూ పోలీసులు ఏజెన్సీ గ్రామాల్లో తీవ్ర భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. అందులో భాగంగానే జూలై 18న మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని పందిపంపుల గ్రామంలో న్యూడెమోక్రసీ పార్టీ నాయకుడి పోలీసులు అక్రమంగా అరెస్టు చేస్తుండగా ప్రజలు అడ్డుకున్నారు. పందిపంపుల, కొత్తూరు గిరిజనులు సాగుచేసుకొంటున్న భూములలో ఫారెస్టు అధికారులు, పోలీసులు కలిసి మొక్కలు నాటుతున్నారు. రెండు గ్రామాల నుండి ప్రజలను బయటకు వెళ్లనీయకుండా పోలీసులు దిగ్బంధనం చేసి భూములలో మొక్కలు పెట్టడానికి కూలీలను తీసుకువెళ్తుండగా పందిపంపులలో ప్రజలు అడ్డుకున్నారు.

నిరుద్యోగుల నిర్బంధం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన జాబ్‌లెస్ కాలెండర్‌ను రద్దుచేసి జాబ్‌లు ఉన్న కాలెండర్‌ను విడుదల చేయాలన్న నిరుద్యోగులపై అణచివేత ప్రయోగించింది. ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ పోరాట సమితి జూలై 19న నిర్వహించిన 'చలో తాడేపల్లి' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. విజయవాడ, గుంటూర్‌ల నుండి తాడేపల్లికి దారితీసే అన్ని రోడ్లలోనూ పోలీసులు మోహరించి విద్యార్థులను అదుపుతోకి తీసుకున్నారు. జూలై 18 నుంచే ఆ ప్రాంతంలో పోలీసులు 144 సెక్షన్ విధించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2,35,794 పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. రెండు రోజుల ముందే విద్యార్థి, యువజన నాయకులను అక్రమ అరెస్టులు, గృహనిర్బంధం చేసింది. వీ

ఘాజీపూర్‌లో రైతులపై రాళ్ల దాడి

ఢిల్లీ సరిహద్దులోని ఘాజీపూర్‌లో ఏడు నెలలుగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై బిజెపి, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు జూన్ 30న రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఢిల్లీ–ఉత్తరప్రదేశ్ సరిహద్దు ఘాజీపూర్ వద్ద ఢిల్లీ–మీరట్ ఎక్స్‌ప్రెస్‌వే పై ఉన్న రైతుల పోరాట శిబిరంపై జూన్ 30 మధ్యాహ్నం ప్రాంతంలో బిజెపి జెండాలు పట్టుకొని గుంపుగా వచ్చి అరుపులు, కేకలతో దాడి చేశారు. వీరిని అడ్డుకునేందుకు రైతులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. బిజెపి, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు గూండాల్లా రెచ్చిపోయి రైతుల పోరాటానికి మద్దతు తెలపడానికి వచ్చిన పార్టీల నాయకుల కార్లు, ఇతర వాహనాలను రాడ్లతో కొట్టి ధ్వంసంచేశారు. ఈ దాడిలో రైతులు గాయపడ్డారు. రైతులు ప్రతిదాడికి దిగడంతో పారిపోయారు.

జైలు నుంచి విడుదలైన అఖిల్ గొగోయ్

పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) వ్యతిరేక ఉద్యమకారుడు, ఎంఎల్ఏ అఖిల్ గొగోయ్‌పై నమోదైన రెండో కేసులోని అభియోగాలను కూడా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ప్రత్యేక కోర్టు జులై 1న కొట్టేస్తూ నిర్దోషిగా ప్రకటించింది. సిఎఎకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో అఖిల్ గొగోయ్ పాల్గొన్నారు. అసోంలో జరిగిన సిఎఎ వ్యతిరేక ఆందోళనల సందర్భంగా గొగోయ్ హింసను రెచ్చగొట్టారని, ఆయనకు మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలతో పోలీసులు ఐపిసి, చట్ట విరుద్ధ కార్యకలాపాల చట్టం(యుఎపిఎ)లోని పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. విడుదలయిన గొగోయ్ రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం యుఎపిఎ, ఎన్ఐఎలను దుర్వినియోగం చేస్తోందన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారని 'రిపోర్టర్స్ విత్‌ఔట్ బార్డర్స్ (ఆర్ఎస్ఎఫ్)' అనే అంతర్జాతీయ సంస్థ ఆరోపించింది. మీడియా అండతో సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారని పేర్కొంది. పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న నేతల పేర్లతో ఆర్ఎస్ఎఫ్ ఓ జాబితాను రూపొందించింది. ప్రపంచవ్యాప్తంగా 37 మంది దేశాధినేతలు/ప్రభుత్వాధినేతలు ఉన్నారు. మోదీతో పాటు పాకిస్థాన్ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్, సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్, మయన్మార్ మిలటరీ అధ్యక్షుడు మిన్ అంగ్ లయాంగ్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ తదితరులు ఈ జాబితాలో ఉన్నారు. ఇందులో ఇద్దరు మహిళలు (బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, హాంకాంగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కేరీ లామ్) కూడా ఉన్నారు. పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న నేతల జాబితాను ఈ సంస్థ ప్రచురించడం 2018 తర్వాత ఇదే తొలిసారి. 2001లో మొదటిసారిగా ప్రచురించారు. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో భారత్ 142వ స్థానంలో ఉంది.

42 శాతం కేంద్ర కేబినెట్ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్ర ప్రభుత్వంలోని కేబినెట్ మంత్రుల్లో 42 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రాఫార్మ్స్ (ఎడిఆర్) జులై 10న వెల్లడించింది. కేంద్ర కేబినెట్ విస్తరణలో భాగంగా మంత్రుల సంఖ్యను మోడీ 78కి పెంచారు. విస్తరణకు ముందు క్రిమినల్ కేసులున్న మంత్రులు 39 శాతం. ఎన్నికల సంఘానికి మంత్రులు సమర్పించిన అఫిడవిట్ల ప్రకారం ప్రస్తుత మంత్రుల్లో 24 (31 శాతం) మంది తమపై హత్య, హత్యాయత్నం, దొంగతనం వంటి సీరియస్ కేసులు ఉన్నట్లు తెలిపారు.

ఐటి కేసులన్నీ ఉపసంహరించాలన్న కేంద్రం

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) చట్టంలో రద్దుచేసిన సెక్షన్ 66ఏ కింద నమోదైన కేసులన్నింటినీ వెంటనే ఉపసంహరించాలని రాష్ట్ర ప్రభుత్వాలు, పోలీసు ఛీఫ్‌లకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఈ సెక్షన్ కింద కేసులు నమోదు చేయడాన్ని కూడ నిలిపివేయాలంది. ఈ సెక్షన్‌ను రద్దు చేసినప్పటికీ కేసులు నమోదవడంపై సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. దీంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన, రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టిన వారిని పోలీసులు అరెస్టు చేసేందుకు వీలుకల్పించిన సెక్షన్ 66ఏ దుర్వినియోగానికి గురవుతోందంటూ 2015 మార్చ్ 24నే సుప్రీంకోర్టు ఈ చట్టాన్ని రద్దుచేసింది.

రైతులపై రాజద్రోహం కేసు

మూడు వ్యవసాయ చట్టాల రద్దు కోసం పోరాడుతున్న రైతులపై హర్యానాలో రాజద్రోహం కేసు నమోదు చేశారు. జులై 11న హర్యానా రైతులు సిర్సాలో అధికార నేతల వాహనాలను అడ్డుకొని నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని నిరసన వ్యక్తంచేశారు. దాంతో పోలీసులు ప్రభుత్వ అధికార వాహనాన్ని అడ్డుకుని దాడికి ప్రయత్నించారని.. ఆరోపిస్తూ రైతు నేతలు హరిచరణ్ సింగ్, ప్రహ్లాద్ సింగ్‌తో పాటు 100 మంది అన్నదాతలపై దేశ ద్రోహం కేసు నమోదు చేశారు. రైతు వ్యతిరేక బిజెపి ప్రభుత్వ సూచనల మేరకు.. రైతులు, రైతు నాయకులపై పోలీసులు చేసిన తప్పుడు, దేశద్రోహ ఆరోపణలను సంయుక్త కిసాన్ మోర్చా, విపక్షాలు తీవ్రంగా ఖండించాయి. రాజద్రోహం సెక్షన్‌పై సుప్రీం కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ రాజద్రోహం సెక్షన్ అవసరమా అని సుప్రీం కోర్టు ప్రశ్నించగా హర్యానాలో రైతులపై రాజద్రోహం కేసు నమోదు చేశారు.

అసోం అసెంబ్లీలో 'పశు సంరక్షణ బిల్లు'

పశు మాంసం అమ్మకాన్ని నిర్ణీత ప్రదేశాలకు మాత్రమే పరిమితం చేస్తూ రూపొందించిన 'పశు సంరక్షణ బిల్లు'ను అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ జులై 13న అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు చట్టమయితే పశు మాంసం తినని సామాజిక వర్గాలు ఉన్న ప్రాంతాల్లో, ఆలయాలు, సత్రాలు, ఇతరత్రా మతపరమైన ప్రదేశాలకు చుట్టుపక్కల ఐదు కిలోమీటర్ల దూరంలో ఆ మాంసం విక్రయం పై నిషేధం ఉంది.

దేశద్రోహ చట్టంపై విచారణ చేపడతామన్న సుప్రీం కోర్టు

దేశద్రోహ చట్టం చెల్లుబాటును ప్రశ్నిస్తూ మాజీ సైనికాధికారి దాఖలు చేసిన తాజా వ్యాజ్యంపై విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం జులై 14న ఈ విషయం తెలిపింది. వ్యాజ్యం ప్రతిని అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్‌కు పంపించాల్సిందిగా ధర్మాసనం పిటిషనర్‌ను ఆదేశించింది. సైన్యంలో మేజర్ జనరల్‌గా పనిచేసి రిటైరైన ఎస్‌టి ఒంబట్కెరె ఈ వ్యాజ్యం వేశారు. ప్రాథమిక హక్కయిన వాక్ స్వాతంత్ర్యంపై ఈ చట్టం తీవ్ర దుష్ప్రభావం చూపిస్తుందని, భావప్రకటనా స్వేచ్ఛపై నిర్హేతుకమైన ఆంక్షలు విధిస్తుందని పిటిషనర్ పేర్కొన్నారు. దేశద్రోహ నేరానికి సబంధించి ఐపిసిలోని 124–ఏ సెక్షన్ పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, దాన్ని కొట్టివేయాలని కోరారు.

పెగాసస్‌తో దేశ పౌరులపైనే నిఘా

దేశ పౌరులపైనే నిఘా పెట్టిన బిజెపి ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రముఖ హ్యాకింగ్ సంస్థ ఎన్ఎస్ఓ నుంచి కొనుగోలు చేసిన 'పెగాసస్' అనే స్పైవేర్ సాయంతో భారత్‌లోని కేంద్ర మంత్రులు, ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, ప్రభుత్వా అధికారులు, హక్కుల నేతలకు చెందిన దాదాపు 300 మంది ఫోన్లపై ప్రభుత్వం హ్యాక్ చేసినట్లు పారిస్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిజం నాన్ ప్రాఫిట్ ఫోర్‌బిడెన్ స్టోరీస్, అంతర్జాతీయ మానవ హక్కుల గ్రూపు అమ్నెస్టీ ఇంటర్నేషనల్ సంయుక్తంగా నిర్వహించిన దర్యాప్తులో వెల్లడైంది. ప్రపంచ వ్యాప్తంగా 50 వేలకు పైగా ఫోన్లు స్పైవేర్ నిఘా నీడలో ఉన్నట్లు బయటపడింది. వీ

ఫిలిప్పీన్స్‌లో సైనిక విమానం కూలి 45 మంది మృతి

ఫిలిప్పీన్స్‌కు చెందిన సైనిక విమానం జూలై 4న కుప్పకూలడంతో 45 మంది మృతిచెందారు. మంటల్లో చిక్కుకున్న విమానం నుంచి మరో 49 మంది బతికి బయటపడ్డారు. మృతిచెందిన వారిలో 42 మంది సైనికులు, ముగ్గురు పౌరులు ఉన్నారు. విమానం కిందికి దిగుతున్న సమయంలో ఈ ఘటన జరిగింది. విమానం ఆ ప్రావిన్స్‌లోని జోలో విమానాశ్రయంలో దిగాల్సి ఉండగా, పక్కనున్న కొబ్బరి తోటలో కుప్పకూలింది. తోటలో ఉన్న ఏడుగురు గాయపడగా ఆ తరువాత ముగ్గురు మృతిచెందారు. ప్రమాదాన్ని గమనించి కొందరు సైనికులు కిందికి దూకి ప్రాణాలు కాపాడుకున్నారని స్థానికులు తెలిపారన్నారు. మొదట తోక భాగానికి నిప్పంటుకొని ఆ తరువాత మిగిలిన భాగానికి మంటలు అంటుకొని పేలిపోయింది.

దక్షిణాఫ్రికా అల్లర్లలో 72 మంది మృతి

దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు జాకోబ్ జూమా అరెస్టుకు నిరసనగా అల్లర్లు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంలోనే జనం దుకాణాల్లో చోరీలకు పాల్పడడంతో భారీ తొక్కిసలాట జరిగి జూలై 14 నాటికి మృతిచెందిన వారి సంఖ్య 72కి చేరింది. ఈ పరిస్థితిని అదుపుచేయడానికి పోలీసులు నిరసనకారులపై రబ్బరు తూటాలు ప్రయోగించారు. 1200 మందిని అదుపులోకి తీసుకున్నారు. గౌంటెంగ్, వాజులా-నాటల్ ప్రావిన్‌ల్లో వేలాది మంది చోరీలకు పాల్పడ్డారు. ఆహార దుకాణాలు, విద్యుత్తు పరికరాలు, మద్యం, దుస్తుల దుకాణాల్లో దొంగతనాలు జరిగాయి. గౌటెంగ్‌లో 45 మరణాలపై, వాజులూ-నాటల్‌లో 27 మరణాలపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. 2009-2018 మధ్య అధ్యక్షుడిగా ఉన్న కాలంలో జూమా భారీ స్థాయిలో అవినీతికి పాల్పడ్డాడనే ఆరోపణలున్నాయి. దర్యాప్తులో కోర్టు ఆదేశాలను ధిక్కరించడంతో జూమాకు న్యాయస్థానం 15 నెలల జైలు శిక్ష విధించింది. జూలై 8న ఆయనను జైలుకు తరలించారు.

నేపాల్ ప్రధానిగా దేవ్‌బా

నేపాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేర్ బహదూర్ దేవ్‌బా దేశ ప్రధానిగా జూలై 13న ప్రమాణస్వీకారం చేశారు. ప్రధాని కె.పి. శర్మ ఓలి స్థానంలో దేవ్‌బాను ప్రధానిగా నియమించాలంటూ నేపాల్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చోలేంద్ర షంషేర్ రాణా ఆధ్వర్యంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం జూలై 12న తీర్పునిచ్చింది. గత ప్రధాని ఓలి, అధ్యక్షురాలు విద్యాదేవి భండారీ ఒక్కటై పార్లమెంట్‌ను, దిగువసభను రద్దుచేయడాన్ని సుప్రీం కోర్టు తప్పుపట్టింది. నేపాల్ పార్లమెంట్ దిగువసభల్లో జూలై 18న జరిగిన విశ్వాస పరీక్షలో ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా నెగ్గారు. ఆయనకు అనుకూలంగా 165 మంది ఎంపిలు ఓటేయగా, 83 మంది వ్యతిరేకించారు.

మయన్మార్‌లో సైన్యం కాల్పుల్లో 25 మంది మృతి

మయన్మార్‌లో సైనిక ప్రభుత్వం హింస పెట్రేగిపోయింది. జూలై 4న మయన్మార్ పరిధిలోని దెపాయిన్ గ్రామంపై సైన్యం దాడిచేసింది. స్థానికులు, సాయుధులుగా ఉన్న గ్రామాలపై విచక్షణారహితంగా సైన్యం జరిపిన కాల్పుల్లో 25 మంది మరణించారు.

బ్రెజిల్ అధ్యక్షుడికి వ్యతిరేకంగా నిరసనలు

అధ్యక్షుడు జైర్ బొల్సొనారోకు వ్యతరేకంగా బ్రెజిల్‌లో ప్రజలు నిరసన ప్రదర్శనలు కొనసాగుస్తున్నారు. కొవాగ్జిన్ వాక్సిన్ల ఒప్పందంలో అవినీతి ఆరోపణలకు సంబంధించిన కేసులో బొల్సొనారోను విచారించడానికి ఆదేశ సుప్రీం కోర్టు అనుమతించిన నేపథ్యంలో అధ్యక్షుడికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా నిరసనలు తీవ్రమయ్యాయి. అధ్యక్షుడిని అభిశంసించాలంటూ 40కి పైగా నగరాల్లో వేల సంఖ్యలో ప్రజలు నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు.

బ్రసెల్స్‌లో వలసదారుల నిరాహార దీక్ష

బెల్జియంలోని బ్రసెల్స్‌లో కొన్ని ఏళ్ల క్రితం వచ్చి స్థిరపడిన వలసదారులు తమకు చట్టబద్ధమైన గుర్తింపునిచ్చి ఉపాధి కల్పించడంతో పాటు ప్రభుత్వ సేవలు అందాలని డిమాండ్ చేస్తూ 400 మందికి పైగా 55 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. కరోనా కారణంగా ఉద్యోగాలు కోల్పోయి తమ జీవనోపాధి ప్రమాదంలో పడిందని, తమకు ఏ దిక్కులేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వలస కార్మికుల్లో ఉత్తర, దక్షిణాఫ్రికా దేశాల నుంచి వచ్చిన వారు అధిక సంఖ్యలో ఉన్నారు. వియుబి యూనివర్సిటీ క్యాంపస్ ప్రాంగణంలో ప్రారంభించిన నిరాహారదీక్షల్లో మొదట ఆహారం, తరువాత వైద్యాన్ని నిరాకరించిన ఆందోళనకారులు ఇప్పుడు నీరు తాగేందుకు నిరాకరిస్తున్నారని దీంతో వారి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వారికి మద్దతు తెలుపుతున్న యుఎస్‌పిఆర్ తెలిపింది.

సిరియా అధ్యక్షుడుగా అసద్

సిరియా అధ్యక్షుడు బషర్ అసద్ జూలై 17న ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన పదవికాలం ఏడేళ్లు ఉంటుంది. మేలో జరిగిన ఎన్నికలను చట్టవిరుద్ధమైనవిగా పశ్చిమ దేశాలు, ప్రతిపక్షాలు విమర్శించాయి. 2000 సంవత్సరం నుండి అధికారంలో ఉన్న అసద్ తిరిగి విజయం సాధించడంపై ఎవరికీ సందేహాలు లేవు. గత పదేళ్ల నుండి యుద్ధంతో ఛిద్రమవుతున్న దేశం, ముదురుతున్న ఆర్థిక సంక్షోభం సవాళ్లుగా మారాయి. 80 శాతానికి పైగా ప్రజలు దుర్భర దారిద్ర్యంతో బతుకుతున్నారని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది.

తాష్కెంట్ భేటీ

ఆఫ్ఘనిస్తాన్ పరిణామాలు దాని పొరుగు దేశాలను కలవరపెడుతున్నాయి. తాష్కెంట్‌లో జూలై 15,16న జరిగిన ప్రాంతీయ సమావేశం దీనిపైనే కేంద్రీకరించింది. దక్షిణ, మధ్య ఆసియాలో అనుసంధానత గురించి చర్చించేందుకు ఏర్పాటైన ఈ సమావేశపు ఎజెండాను పక్కన పెట్టి తాలిబాన్ల ప్రభావం పైనే దృష్టి పెట్టాయి. తాలిబాన్ సాయుధ దళాలు ఇరాన్, పాకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, తజకిస్తాన్‌లతో గల కీలక సరిహద్దులను స్వాధీనం చేసుకున్నప్పుడు ఆఫ్ఘన్ ప్రభుత్వ దళాలు వాటిని ప్రతిఘటించలేకపోయాయి. వెయ్యి మందికి పైగా ఆఫ్ఘన్ సైనికులు తజకిస్తాన్‌లోకి పారిపోయారు. తమ చర్యలు కార్యకలాపాల వల్ల ఎవరు భయపడనక్కర లేదంటూ ఆఫ్ఘన్ పొరుగు దేశాలకు తాలిబాన్లు హామీ ఇచ్చారు. ఆఫ్ఘన్ సమస్యకు శాంతియుత పరిష్కారాన్ని కనుగొనేందుకు అనువైన వాతావరణం కల్పించాలని సమావేశానంతరం తుర్కుమెనిస్తాన్ విదేశాంగ శాఖ మంత్రి పేర్కొన్నారు. వీ


శ్రీశ్రీ 60

శ్రీశ్రీ సన్మాన సంచిక

ఫిబ్రవరి 1, 1970 విశాఖపట్నం

మలి కూర్పు : సింగంపల్లి అశోక్‌కుమార్

శ్రీశ్రీ సాహిత్యనిధి ప్రచురణ



1/4 క్రౌన్

పేజీలు: 140

వెల: రు. 200

శ్రీశ్రీ 70



మహాకవి శ్రీశ్రీ అభినందన సంచిక

70వ జన్మదిన మహోత్సవాలు, కాకినాడ

మలి కూర్పు : సింగంపల్లి అశోక్‌కుమార్

శ్రీశ్రీ సాహిత్యనిధి ప్రచురణ

పై రెండు ప్రతులకు: శ్రీశ్రీ సాహిత్యనిధి
305, ప్రగతి టవర్స్, వీరయ్య స్ట్రీట్, మారుతీనగర్,
విజయవాడ – 520004,
ఫోన్ : 0866-6617375, 9246277375

1/4 క్రౌన్

పేజీలు : 92

వెల రు. : 150

శ్రీశ్రీ సాహిత్యనిధి ప్రచురణగా శ్రీశ్రీ గురించి వంద పుస్తకాలు ఇప్పటికే వెలువడ్డాయి. ఇప్పుడు రెండో వంద పుస్తకాల ప్రణాళిక సిద్ధమైంది. వివరాలకు ప్రచురణ కర్తలను సంప్రదించండి.


Advt.

తెలంగాణ దళిత కథలు

సంపాదకులు : సంగిశెట్టి శ్రీనివాస్ - గుడిపల్లి నిరంజన్

సింగిడి, తెలంగాణ రచయితల సంఘం,

పూలె - అంబేద్కర్ అధ్యయన వేదిక ప్రచురణ



ప్రతులకు: **సంగిశెట్టి శ్రీనివాస్**
ఫ్లాట్ నెం. 212, నందనవనం అపార్ట్‌మెంట్,
అత్తాపూర్, మెహదీపట్నం, హైదరాబాద్ – 500048,
ఫోన్ : 9849220321

వెల: 499

పేజీలు : 704

Advt.

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 237 - August 2021 ● **ISSN 2231-6892**
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/07/2021 ● Postal Regn. No. HD/1100/2020-22

Date of Posting : 29th, 30th

వీక్షణంను ఆదుకోండి

నాలుగు కాలాలు నిలబడేందుకు సహాయం అందించండి

వీక్షణం రాజకీయార్థిక సామాజిక మాసపత్రిక పందొమ్మిది సంవత్సరాలుగా తెలుగు సమాజానికి చేస్తున్న సేవ మీకు తెలుసు. విద్యావంతులలో, బుద్ధిజీవులలో, సామాజిక కార్యకర్తలలో ఈ పత్రికకు ఉన్న పేరు ప్రఖ్యాతులు, విశ్వసనీయత, వారి మేధో, ఆలోచనా అవసరాలకు ఈ పత్రిక ఎంతగానో ఉపయోగపడడం మీరు చూస్తూనే ఉన్నారు. అయితే ఇంతటి ఆదరాభిమానాలు సంపాదించుకున్నప్పటికీ వీక్షణం ఆర్థిక పరిస్థితి ఎన్నడూ ఈ విశేష జనాదరణకు తగినట్టుగా లేదు. వీక్షణం పాఠకులకు, అభిమానులకు, ఉపయోగించుకునేవారికి వీక్షణంకు సహాయం చేసేంత ఆర్థిక స్తోమత లేదు. ఎందరో తమకు తోచిన, చేయగలిగిన సహాయం చేస్తున్నప్పటికీ, అది సరిపోవడం లేదు. వ్యవసాయాదాయం తప్ప మరే ఆదాయవనరూ లేని డెబ్బై సంవత్సరాలు దాటిన వృద్ధ దంపతులు, రోజుకూలీ చేసుకునే శ్రామికులు, ఎనబయవ పడిలో పెన్షన్ మీద మాత్రమే బతుకుతున్న రిటైర్డ్ ప్రభుత్వోద్యోగులు వంటి వారెందరో ఇబ్బందులు పడుతూ కూడా వీక్షణంకు విరాళం ఇవ్వడానికి చేస్తున్న ప్రయత్నాలు చూసి ఆ ఆదరాభిమానాలకు మా కళ్లు చెమరుస్తున్నాయి. అటువంటి వందలాది మంది చేస్తున్న చిన్న చిన్న సహాయాలే వీక్షణం ఎప్పటికప్పుడు ఆగిపోకుండా కాపాడుతున్నాయి. సాలీనా ఐదు లక్షల రూపాయల లోటుతో, ఎప్పటికప్పుడు అప్పు చేస్తూ, ఏడాదికొకసారి దాతల దగ్గరికి వెళ్లి ఆ అప్పు తీర్చే మార్గాలు వెతుకుతూ వీక్షణం నడుపుతూ వస్తున్నాం. ఇలా దినదిన గండంగా ఎన్నాళ్లు బండి లాగగలమో తెలియదు. చందాలు, విరాళాలతో పాటు సొంత ప్రచురణల అమ్మకాలు, ఇతర ప్రచురణల అమ్మకాలపై కమిషన్లతో బండి నడుస్తూ ఉండేది. గోరుచుట్టుపై రోకటిపోటు లాగ కొవిడ్ లాక్‌డౌన్ మొదలైనప్పటి నుంచీ చందాల పునరుద్ధరణ ఆగిపోయింది. కొత్త చందాలు రావడం తగ్గిపోయింది. పుస్తకాల అమ్మకాలు దాదాపుగా ఆగిపోయాయి. విరాళాల ధార ఎండాకాలపు వాగులాగ పల్చబడుతున్నది. అందువల్ల మరొకసారి అభిమానులకూ, పాఠకులకూ, దాతలకూ సవినయ విజ్ఞప్తి చేయక తప్పడం లేదు. ఇప్పుడున్న స్థితి యథాతథంగా కొనసాగితే వీక్షణంను ఇంక ఎక్కువ కాలం నడపడం సాధ్యం కాదు. పందొమ్మిది సంవత్సరాలుగా దృఢంగా ప్రజల పక్షాన నిలిచిన అతి తక్కువ పత్రికలలో వీక్షణం ఒకటి. దేశంలోనూ, రెండు తెలుగు రాష్ట్రాలలోనూ పెరిగిపోతున్న ఆధిపత్య సంస్కృతిలో, ప్రశ్నించే గొంతులను, ప్రజా స్వరాలను మూసివేయడానికి జరుగుతున్న ప్రయత్నాలలో వీక్షణంను కాపాడుకోవలసిన బాధ్యత ప్రజలదే. ప్రతి చందాదారూ కనీసం మరొక చందాదారును చేర్పించండి. మీకు తోచినంత, మీరు ఇవ్వగలిగినంత విరాళం ఇవ్వండి. మిత్రుల దగ్గర విరాళాలు సేకరించి పంపండి.

If undelivered please return to:
VEEKSHANAM
Mytri Residency, 3-6-394, St. No. 3,
Himayatnagar, Hyderabad - 500 029.
Phone: 73307 95849

To:
Mr./Mrs.________________________
____
____
____

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at NAVYA PRINTERS, 2-3-655/C/16/B, Durga Nagar, Amberpet, Hyderabad -500013 (New Declaration filed) for Charitha Impressions (as per RNI records) and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao